ఈనాడు

విజయవాడ 7-5-2025 బుధవారం సిటీ సంపుటి 51 . సంచిక 267 | THE LARGEST CIRCULATED TELUGU DAILY | రూ. 6-50 పేజీలు 14 | www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

OPERATION SINDOOR

ఫ్లాష్.. ఫ్లాష్..

ఆపరేషన్ సిందూర్

పాకిస్థాన్, పీవోకేల్లోని ఉగ్ర శిబిరాలపై మెరుపు దాడి

● మొత్తం 9 స్థావరాలపై విరుచుకుపడ్డ భారత్



దిల్లీ: పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా భారత్ మంగళవారం అర్ధరాత్రి దాటాక ఆపరేషన్ సిందూర్ పేరుతో విరుచుకుపడింది. అర్ధరాత్రి 1.40 గంటల తర్వాత భారత సైన్యం పాక్, పీవోకేలోని స్థావరాలపై నిప్పులు కురిపించింది. భారత్‌పై దాడికి ప్రణాళికలు రచించిన ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా ఈ దాడులు చేసినట్లు సైన్యం రాత్రి 1.44 గంటలకు ప్రకటన విడుదల చేసింది. మొత్తం 9 ప్రాంతాల్లోని స్థావరాలపై దాడి చేసినట్లు వెల్లడించింది.

"రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగేందుకు ఏమాత్రం అవకాశమివ్వని విధంగా మేం కేవలం ఉగ్రశిబిరాలపైనే దాడి చేశాం. పాకిస్థాన్ సైనిక మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోలేదు" అని భారత సైన్యం ప్రకటనలో స్పష్టం చేసింది. పూర్తి కచ్చితత్వంతో ఉగ్ర స్థావరాలను టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. దాడులకు సంబంధించి పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని రక్షణశాఖ తెలిపింది. మరోవైపు పాకిస్థాన్ సైతం దాడులను ధ్రువీకరించింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్, కోట్లీ తదితర ప్రాంతాల్లో దాడులు జరిగినట్లు తెలుస్తోంది. "సమయం, సందర్భం చూసుకుని భారత్ దాడులకు కచ్చితంగా బదులిస్తాం. వదిలిపెట్టేది లేదు" అని పాకిస్థాన్ పేర్కొంది. దాడుల ఘటనలకు సంబంధించి వీడియోలు సోషల్ మీడియాలో ప్రత్యక్షం అయ్యాయి. దాడుల అనంతరం సరిహద్దుల్లోని రాజౌరీ, పూంఛ్ సెక్టార్లలో పాకిస్థాన్ కాల్పులు ప్రారంభించగా, భారత సైన్యం దీటుగా తిప్పికొడుతున్నట్లు సైనిక వర్గాలు తెలిపాయి.

గాలికి ఏడేళ్ల జైలు

గనుల అక్రమ తవ్వకాల కేసులో జనార్దన్‌రెడ్డికి శిక్ష



శ్రీనివాసరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మెఫజ్ అలీఖాన్‌లకూ..

గతంలో జైలులో ఉన్న కాలం శిక్షలో మినహాయింపు

ఓఎంసీ కేసులో తీర్పు వెలువరించిన సీబీఐ కోర్టు

ఈనాడు, హైదరాబాద్: అనంతపురం జిల్లా ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో ఎట్టకేలకు నిందితులకు శిక్ష పడింది. ఈ కేసులో నిందితులైన బి.వి.శ్రీనివాసరెడ్డి, గాలి జనార్దన్‌రెడ్డి, గనుల శాఖ మాజీ డైరెక్టర్ వి.డి.రాజగోపాల్, గాలి వ్యక్తిగత సహాయకుడు మెఫజ్ అలీఖాన్‌లకు ఏడేళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ హైదరాబాద్ సీబీఐ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. ఓఎంసీ కంపెనీకి రూ.రెండు లక్షలు జరిమానా విధించింది. సీబీఐ నమోదు చేసిన ఓఎంసీ కేసులో సుదీర్ఘ విచారణ చేపట్టిన న్యాయమూర్తి టి.రఘురాం మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రధాన నిందితులైన బి.వి.శ్రీనివాసరెడ్డి, గాలి జనార్దన్‌రెడ్డి, వి.డి.రాజగోపాల్, మెఫజ్ అలీఖాన్‌లకు ఒక్కొక్కరికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల చొప్పున జరిమానా విధించారు. ప్రభుత్వ ఉద్యోగి అయిన రాజగోపాల్‌కు 4 ఏళ్ల జైలు శిక్ష, అదనంగా రూ.2 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. ఓఎంపీసీఎల్‌కు రూ.2 లక్షలు జరిమానా విధించారు. వేర్వేరు సెక్షన్ల కింద వేర్వేరుగా ఏడేళ్లు శిక్షలు పడినప్పటికీ ఏకకాలంలో శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. ఇప్పటికే జైలులో అనుభవించిన శిక్షను మినహాయింపునిచ్చారు.

సీబీఐకి కేసు చేరిందిలా

2009లో ఓఎంసీ అక్రమ మైనింగ్‌పై దర్యాప్తు కోరుతూ రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేయగా, కేంద్రం అనుమతించింది. (మిగతా 6లో)

చంచల్‌గూడ జైలుకు..

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: ఓబుళాపురం మైనింగ్ కేసులో హైదరాబాద్‌లోని నాంపల్లి సీబీఐ న్యాయస్థానం శిక్ష ఖరారు చేయడంతో గనుల నేరగాడు గాలి జనార్దన్‌రెడ్డి, అతడి సహచరులను మంగళవారం రాత్రి పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ కేసులో గాలితో పాటు అతడి బావమరిది శ్రీనివాసరెడ్డి, గనుల శాఖ అప్పటి సంచాలకుడు రాజగోపాల్, గాలి సహాయకుడు మెఫజ్ అలీఖాన్‌లను జైలుకు తీసుకొచ్చారు. మొదటిరోజు కావడంతో సాధారణ ఖైదీలతో కలిపి ఉంచినట్లు అధికారులు తెలిపారు. నిబంధనల ప్రకారం బుధవారం నుంచి వారిని శిక్ష అనుభవించే ఖైదీలుగా పరిగణిస్తారు. ఇదే కేసులో 2011లో గాలి, అతడి అనుచరులు చంచల్‌గూడ జైల్లోనే రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు.




సీజేఐ జస్టిస్ ఖన్నా జీపీఎఫ్‌లో రూ.1.77 కోట్లు

ఫిక్స్‌డ్ డిపాజిట్లలో రూ.55.75 లక్షలు..

జస్టిస్ బి.ఆర్.గవాయ్‌కు మహారాష్ట్రలో వ్యవసాయ భూములు

సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో జడ్జీల ఆస్తుల వివరాలు



దిల్లీ: న్యాయవ్యవస్థలో పారదర్శకతను పెంపొందించే చర్యల్లో భాగంగా.. జడ్జీల ఆస్తుల వివరాలను సుప్రీంకోర్టు వెల్లడించింది. న్యాయమూర్తులు స్వయంగా అందజేసిన ఆస్తుల వివరాలను సర్వోన్నత న్యాయస్థానం తన వెబ్‌సైట్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచింది. సుప్రీంకోర్టులో మొత్తం 33 మంది న్యాయమూర్తులు ఉండగా 21 మంది జడ్జీలు తమ ఆస్తుల వివరాలను వెల్లడించారు.

■ భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నాకు రూ.55.75 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్, రూ.14,000 విలువైన షేర్లు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)లో రూ.1.06 కోట్లు, జనరల్ (మిగతా 6లో)



దేవాదాయ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

మరో 15 ఆలయాల్లో... పరిమితి లేని అన్నప్రసాదం

- బాలాజీ ఆలయ నిర్మాణ నిధి, సీజీఎఫ్‌తో... అన్ని నియోజకవర్గాల్లో దేవాలయాల పనులు
- భూముల వాణిజ్య లీజులకు సమగ్ర విధానం తీసుకురండి
- 137 ఖాళీలను భర్తీ చేయండి
- దేవాదాయ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో ఏడు ప్రధాన ఆలయాలైన శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, విజయవాడ దుర్గమ్మ, ద్వారకాతిరుమల, అన్నవరం, సింహాచలంలో మాత్రమే వచ్చిన భక్తులందరికీ నిత్యం అన్నప్రసాదం అమలు జరుగుతోంది. ఇతర ఆలయాల్లో పరిమిత సంఖ్యలో భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరో 15 ప్రధాన, ముఖ్య ఆలయాల్లోనూ పరిమితిలేని అన్నప్రసాదం అమలు చేయాలి. తిరుమల వెంగమాంబ అన్నప్రసాదం తరహాలో ప్రమాణాలు పాటించాలి. రుచి, నాణ్యత, పరిశుభ్రత ఉండేలా చూడాలి. ఆయా ఆలయాల ప్రసాదాల విశిష్టత కొనసాగేలా చూడాలి. నాణ్యత పరీక్షలను ఎప్పటికప్పుడు నిర్వహించండి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఆ శాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. అన్ని నియోజకవర్గాల్లో కొత్త ఆలయాల నిర్మాణానికి... తితిదే ఏర్పాటు చేస్తున్న 'బాలాజీ ఆలయ నిర్మాణ నిధి' నుంచి సహాయం తీసుకోవాలన్నారు. (మిగతా 6లో)

మద్యం కుంభకోణంలో... నిందితుడిగా ధనుంజయరెడ్డి

- నాడు సీఎంవో కార్యదర్శిగా బాధ్యతల నిర్వహణ
- జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి.. భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ కూడా
- వరుసగా ఏ31, ఏ32, ఏ33గా చేర్చిన సిట్
- ఏసీబీ న్యాయస్థానంలో మెమో దాఖలు



ధనుంజయరెడ్డి | కృష్ణమోహన్‌రెడ్డి | గోవిందప్ప

ఈనాడు - అమరావతి

వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. నాటి సీఎంవో కార్యదర్శి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను ఈ కేసులో నిందితులుగా సిట్ చేర్చింది. విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో సిట్ అధికారులు ఈ మేరకు మంగళవారం మెమో దాఖలు చేశారు. ఇప్పటివరకూ 30 మందిని ఈ కేసులో నిందితులుగా చేర్చారు. తాజాగా సమర్పించిన మెమోలో ధనుంజయరెడ్డిని ఏ31గా, కృష్ణమోహన్‌రెడ్డిని ఏ32గా, గోవిందప్ప బాలాజీని ఏ33గా పేర్కొన్నారు. ముడుపుల వసూళ్లకు వీలుగా మద్యం విధానాన్ని సిద్ధం చేయాలనే కుట్రకు రూపకల్పన, ముడుపుల వసూళ్ల నెట్‌వర్క్ నిర్వహణలో అప్పటి ప్రభుత్వ పెద్దల తరఫున కీలక పాత్ర పోషించిన ప్రధాన నిందితుడు(ఏ1) రాజ్ కసిరెడ్డి, వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఆ పార్టీ మాజీ నేత వి.విజయసాయిరెడ్డి తదితరులతో కలిసి ఈ ముగ్గురూ కుంభకోణంలో అన్ని స్థాయుల్లోనూ భాగస్వాములయ్యారని, మద్యం సిండికేట్‌లో వీరిదీ ప్రధాన పాత్రేనని సిట్ ఇప్పటికే గుర్తించింది. ఇప్పటివరకూ అరెస్టైన నలుగురు నిందితుల రిమాండు రిపోర్టుల్లోనూ.. కుంభకోణంలో ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీల ప్రమేయం గురించి సిట్ స్పష్టంగా వెల్లడించింది. ఈ ముగ్గురూ సాక్షులను, కేసు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో వారిని నిందితులుగా చేర్చింది.

వీరి ద్వారానే జగన్‌కు ముడుపులు

అత్యధికంగా ఆర్డర్లు కట్టబెట్టిన మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి రాజ్ కసిరెడ్డి బృందం ప్రతి నెలా రూ.50-60 కోట్ల మేర ముడుపులు వసూలు చేసి... కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ ద్వారా నాటి సీఎం జగన్‌కు చేర్చేవారని.. ఇప్పటికే సిట్ దర్యాప్తులో గుర్తించింది. అప్పట్లో సీఎంవోలో కార్యదర్శిగా పనిచేసిన ఐఏఎస్ అధికారి.. ధనుంజయరెడ్డి కూడా ఈ మద్యం సిండికేట్‌లో భాగస్వామేనని సిట్ తేల్చింది. ముడుపులతో అతనికీ సంబంధాలున్నట్లు గుర్తించింది. రిమాండు (మిగతా 6లో)



నేటి నుంచే బియ్యం కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

మార్పులు, చేర్పులకూ అవకాశం

సచివాలయాల్లో దరఖాస్తు చేయొచ్చు

వచ్చే వారం నుంచి వాట్సప్‌లోనూ అందుబాటులోకి

జూన్‌లో క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ బియ్యం కార్డుల పంపిణీ

పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

లోపలి పేజీలో

లా వర్సిటీకి 55 ఎకరాలు

- రాజధానిలో కేటాయింపు
- క్వాంటమ్ వ్యాలీకి 50 ఎకరాలు
- బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో వైద్య కళాశాల
- మొత్తం ఏడు సంస్థలకు 113.96 ఎకరాలు కేటాయింపు
- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయాలు



ఈనాడు - అమరావతి

రాజధాని అమరావతిలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 55 ఎకరాలు కేటాయించింది. రాజధానిలో భూ కేటాయింపులపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం మంగళవారం సచివాలయంలో జరిగింది. లా యూనివర్సిటీ సహా ఏడు సంస్థలకు మొత్తం 113.96 ఎకరాల భూమి కేటాయిస్తూ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టుకు 50 ఎకరాలు కేటాయించింది. నందమూరి బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌తో పాటు, వైద్య కళాశాలను ఏర్పాటు చేసేందుకు ముందుకురావడంతో గతంలో ఇచ్చిన 15 ఎకరాలకు అదనంగా మరో ఆరు ఎకరాలు ఇచ్చింది. ఆదాయపుపన్ను శాఖ కార్యాలయ నిర్మాణానికి 0.78 ఎకరాలు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి 0.78 ఎకరాలు, కోస్టల్ (మిగతా 6లో)

సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో దశకు అనుమతి

■ రాజధానిలో సీడ్ యాక్సెస్ రోడ్డు (ఇ3) రెండో దశలో భాగంగా ప్రకాశం బ్యారేజీ నుంచి మణిపాల్ ఆసుపత్రి వరకు 3.5 కి.మీ. మేర నిర్మాణానికి టెండర్లు పిలిచేందుకు అథారిటీ పచ్చజెండా ఊపింది. ఈ 3.5 కి.మీ. మార్గంలో 1.5 కి.మీ. మేర ఎలివేటెడ్ రోడ్డు ఉంటుంది.

■ ఇ-15 రహదారిని జాతీయ రహదారితో అనుసంధానించేందుకు 3.98 కి.మీ. నిర్మాణానికి రూ.70 కోట్లతో పిలిచిన టెండర్లకు ఆమోదం తెలిపింది.

■ ఇ-13 రహదారిని జాతీయ రహదారితో అనుసంధానించేందుకు 4.10 కి.మీ. నిర్మాణానికి రూ.384.78 కోట్లతో పిలిచిన టెండర్లకు ఆమోదం తెలిపింది.

భూమన చెప్పేవి నీతులు... చేసినవి కబ్జాలు!



- తిరుపతి మంగళంలో 7.30 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ
- తిరుచానూరులో ఇనాం, నది భూమి 9 ఎకరాలు
- వాటి విలువ రూ.150 కోట్ల పైమాటే
- ప్రభుత్వానికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక
- విచారణకు ఆదేశించిన మంత్రి సత్యప్రసాద్

ఈనాడు, అమరావతి: రెండు సార్లు తితిదే బోర్డు ఛైర్మన్‌గా, రెండు సార్లు తిరుపతి ఎమ్మెల్యేగా, ఓసారి తుడా ఛైర్మన్‌గా పనిచేసిన భూమన కరుణాకరరెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకొని అనేక అరాచకాలు, అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుపతి ఎమ్మెల్యేగా, తితిదే బోర్డు ఛైర్మన్‌గా ఏకకాలంలో జోడు పదవులు నిర్వహించినప్పుడు... ప్రభుత్వ భూముల్ని, నదీ పరీవాహక ప్రాంతాన్నీ భూమన కబ్జా చేసేశారన్న ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తులో విస్తుగొలిపే విషయాలు బయటకు వచ్చాయి. తిరుపతిలో 16.30 ఎకరాల ప్రభుత్వ, ఇనాం భూముల్ని, స్వర్ణముఖి పరీవాహక ప్రాంతాన్ని ఆక్రమించినట్టు విజిలెన్స్ నిగ్గు తేల్చింది. 3.07 ఎకరాల ప్రైవేటు భూమినీ కబ్జా చేసినట్టు పేర్కొంది. ఆ భూముల బహిరంగ మార్కెట్ విలువ రూ.150 కోట్లకుపైనే ఉంటుందని అనధికారిక అంచనా. విజిలెన్స్ నివేదిక ఆధారంగా రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విచారణకు ఆదేశించారు.

■ తిరుపతి అర్బన్ మండలంలోని మంగళం గ్రామం పరిధిలో (మిగతా 2లో)

గ్యాప్ 1 ప్రధాన డ్యాం ఆకృతులకు సూత్రప్రాయ ఆమోదం

పోలవరంపై విదేశీ నిపుణుల బృందంతో చర్చల్లో నిర్ణయం

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టులో గ్యాప్ 1 ప్రధాన డ్యాం నిర్మాణానికి ఆకృతులను విదేశీ నిపుణుల బృందం సూత్రప్రాయంగా ఆమోదించింది. పోలవరంలో మంగళవారం రెండోరోజు విదేశీ నిపుణుల బృందంతో ప్రాజెక్టు నిర్మాణంపై చర్చలు సాగాయి. ప్రధాన డ్యాములో జి డ్రాఫ్ట్ హిల్, జి హిల్, డి కొండలను అనుసంధానించే క్రమంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంలో సూచనలు చేశారు. కొండల పైభాగాన్ని తొలగించి కాంక్రీటుతో క్రేటింగులు చేసి డ్యాంను వాటికి అనుసంధానించడంలో ఎలాంటి ఇబ్బందులూ రావడం... లీకేజీకి తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విదేశీ నిపుణులు సూచించారు. గ్యాప్ 2 ప్రధాన డ్యాం ఆకృతులపై బుధవారం చర్చించనున్నారు. విదేశీ నిపుణులు డేవిడ్ బి.పాల్, రిచర్డ్ డొన్నెల్లీ, డగ్లస్ హించ్‌బెర్గర్, బ్రియాన్ పాల్, డి.సిస్కో, పోలవరం ప్రాజెక్టు అథారిటీ సభ్య కార్యదర్శి రఘురామ్, కేంద్ర జలసంఘం నిపుణులు సరబ్‌జీత్ సింగ్ భక్షి, రాకేశ్ టోకస్, అశ్వనీకుమార్ వర్మ, గౌరవ్ తివారీ, హేమంత్ గౌతమ్, సీఎస్ఎంఆర్ఎస్ శాస్త్రవేత్తలు మనీష్‌గుప్తా, లలిత్‌కుమార్ సోలంకి, ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, చీఫ్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి పాల్గొన్నారు.

గడువు కన్నా ముందే... పోలవరం పూర్తికి సహకరించండి: రామానాయుడు



పోలవరం ప్రాజెక్టు క్యాంపు కార్యాలయంలో విదేశీ నిపుణులకు వరి కంకుల దండలు వేసి సత్కరించిన మంత్రి రామానాయుడు. చిత్రంలో కేంద్ర జలసంఘం ప్రతినిధులు తదితరులు

ఈనాడు, అమరావతి-న్యూస్‌టుడే, పోలవరం: 'పోలవరం ప్రాజెక్టును ఎంత త్వరగా పూర్తి చేయగలిగితే అంత మేలు. ప్రధాన డ్యాంల నిర్మాణానికి ఆకృతులను త్వరగా ఆమోదిస్తే లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయడం సాధ్యమవుతుంది' అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన మంగళవారం పోలవరంలో విదేశీ నిపుణుల బృందాన్ని కలిశారు. '2027 నాటికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. అందువల్ల లక్ష్యం కన్నా ముందే నిర్మాణం పూర్తయ్యేలా సహకరించాలి' అని చెప్పారు. విదేశీ నిపుణుల బృందం నుంచి అనేక సాంకేతిక వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలవరానికి సీఎం చంద్రబాబు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ప్రాజెక్టును సందర్శించడంతో పాటు పది నెలల్లో మూడుసార్లు ప్రాజెక్టు వద్దకు వచ్చి పనుల తీరును పర్యవేక్షించారని వారికి వివరించారు. ఈ సందర్భంగా విదేశీ నిపుణులను, కేంద్ర జల సంఘం ప్రతినిధులను మంత్రి సన్మానించారు. ప్రాజెక్టులో బట్రస్ డ్యాం, గ్యాప్-2 డయాఫ్రం వాల్ పనులను రామానాయుడు పరిశీలించారు.

జవాబు పత్రాలు తెరవకుండానే మార్కులు వేసేశారు

- అనామకులతో మార్కుల నమోదు ప్రక్రియ
- హాయ్‌ల్యాండ్‌లో మాన్యువల్ మూల్యాంకనం చేసినట్లు మొక్కుబడి తంతు
- సూత్రధారి క్యామ్‌సైన్ మీడియా డైరెక్టర్ పమిడికాల్వ మధుసూదన్
- అరెస్టు చేసిన పోలీసులు



మధుసూదన్

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనం కుంభకోణం కేసులో కీలకంగా వ్యవహరించిన పమిడికాల్వ మధుసూదన్ (ధాత్రి మధు)ను పోలీసులు మంగళవారం హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. బుధవారం కోర్టులో హాజరుపరుస్తారు. ఈ కేసులో ఏ2గా ఉన్న క్యామ్‌సైన్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌కు మధుసూదన్ డైరెక్టర్. ఏపీపీఎస్సీ అప్పటి కార్యదర్శి, సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు ఆదేశాల మేరకు మూల్యాంకనంలో భారీ అక్రమాలకు క్యామ్‌సైన్ తెరతీసిందని, హాయ్‌ల్యాండ్ వేదికగా మాన్యువల్ మూల్యాంకనం చేపట్టలేదని పోలీసుల దర్యాప్తులో తేలింది. కానీ మూల్యాంకనం చేసినట్లుగా నమ్మించేందుకు అర్హత లేని వ్యక్తులు, అనామకులు, గృహిణులను తాత్కాలికంగా నియమించుకుని నాటకం నడిపించింది. వారిని పోలీసులు తాజాగా విచారించగా తాము జవాబు పత్రాలను కనీసం తెరిచి చూడలేదని, క్యామ్‌సైన్ యాజమాన్యం చెప్పిన మార్కులను మాత్రమే వాటిపై నమోదు చేశామని వెల్లడించారు.

గ్రూప్-1 జవాబుపత్రాలనే సంగతే వారికి తెలియదు

హాయ్‌ల్యాండ్‌లో మాన్యువల్ మూల్యాంకనం పేరిట జరిగిన తంతుకు హాజరైన గృహిణుల్లో కొందరు చంటి పిల్లల తల్లులూ ఉన్నారు. సగటున ఒక్కొక్కరికి రూ.15 వేల వరకు చెల్లించారు. గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనం పేరిట జరుగుతున్న తంతులో తాము పాల్గొంటున్నామని, తాము నమోదు చేస్తున్న మార్కులు అనేక మంది జీవితాల్ని తలకిందులు చేస్తాయనే విషయం చాలా మందికి తెలియదు. మార్కులు నమోదు చేస్తే డబ్బులిస్తారని ఒకరి ద్వారా మరొకరు తెలుసుకుని అక్కడికి వెళ్లామని, తమకేమీ తెలియదని వీరు పోలీసు విచారణలో చెప్పారు. వీరు దాదాపు 66 మంది ఉండటంతో నిందితుల జాబితాలో చేర్చాలా లేదా సాక్షులుగా పరిగణించాలా అని పోలీసు ఉన్నతాధికారులు యోచిస్తున్నారు.

◆ అప్పట్లో ఈ ప్రక్రియలో పాల్గొన్న వారిని తమ సంస్థ ఉద్యోగులుగా క్యామ్‌సైన్ చూపించింది. వీరి వివరాలను దర్యాప్తు అధికారులు పరిశీలించగా.. అందులో చాలా మంది నిరుద్యోగులు, గృహిణులని తేలింది. వీరందర్నీ హాయ్‌ల్యాండ్‌లో కూర్చోబెట్టి.. అంతకు ముందు నిబంధనలకు విరుద్ధంగా జరిగిన డిజిటల్ మూల్యాంకనంలో వచ్చిన మార్కులనే మరోసారి ఓఎంఆర్ షీట్లలో నమోదు చేయించినట్లు తేలింది. దీని కోసం మొత్తంగా క్యామ్‌సైన్ రూ.8 లక్షలు చెల్లించింది.

మధుసూదన్‌ను విచారిస్తే కీలక వివరాలు

హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్-10 పంచవటి కాలనీలోని క్యామ్‌సైన్ మీడియా కార్యాలయంలో సోదాలు నిర్వహించిన దర్యాప్తు అధికారులు.. మధుసూదన్‌ను సుదీర్ఘంగా విచారించారు. ఈ కుంభకోణంలో ఆయన ప్రమేయంపై కీలక సమాచారం రాబట్టారు. విచారణ ముగిసిన అనంతరం మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఏపీపీఎస్సీ అప్పటి కార్యదర్శి, సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు.. గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాల మాన్యువల్ మూల్యాంకనం బాధ్యతల్ని క్యామ్‌సైన్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్‌కు కట్టబెట్టారు. అందుకోసం ఆ సంస్థకు రూ.1.14 కోట్లు చెల్లించారు. 2021 డిసెంబరులో జవాబు పత్రాల్ని హాయ్‌ల్యాండ్‌కు తరలించిన క్యామ్‌సైన్ సంస్థ 2022 ఫిబ్రవరి వరకూ వాటిని తన ఆధీనంలోనే ఉంచుకుంది. అయితే అంతకు ముందు జరిగిన డిజిటల్ మూల్యాంకనంలో వచ్చిన మార్కులనే మాన్యువల్ మూల్యాంకనం పేరిట హాయ్‌ల్యాండ్‌లో వేశారనే ఆరోపణలున్నాయి. మధుసూదన్‌ను అరెస్టు చేసి, కస్టడీలో విచారిస్తే ఇందులో ఏం జరిగిందనేది వెలుగు చూడనుంది.

ఉత్తరాంధ్ర జిల్లాలకు వర్ష సూచన

ఈనాడు, విశాఖపట్నం: కొన్ని ప్రాంతాల్లో వర్షాలు, మరికొన్ని చోట్ల ఎండలతో రాష్ట్రంలో భిన్న వాతావరణం కొనసాగుతోంది. మరో 3 రోజులు ఇలాంటి పరిస్థితులే ఉంటాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, గంగవరం మండలాల్లో బుధవారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వానలు పడొచ్చని పేర్కొంది. బుధవారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 నుంచి 43 డిగ్రీల మధ్యలో నమోదవుతాయని అంచనా వేస్తోంది. మంగళవారం రాత్రి 7 గంటల వరకు సాగినవరం (ప్రకాశం జిల్లా)లో 46.5 మిల్లీమీటర్లు, పుత్తూరు (తిరుపతి)లో 40, మార్కాపురం (ప్రకాశం)లో 36.75 మి.మీ. వర్షపాతం కురిసింది. తంబళ్లపల్లె (చిత్తూరు)లో 42.4, రేణిగుంట (తిరుపతి), దొర్నిపాడు (నంద్యాల)లో 42.1, ఒంటిమిట్ట (వైఎస్సార్)లో 41.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పది, ఇంటర్‌లో ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు

ఈనాడు, అమరావతి: ఇటీవల విడుదలైన పది, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నగదు బహుమతులు అందించి ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాంఘిక సంక్షేమ గురుకులాలు, వసతిగృహాలు, గిరిజన సంక్షేమ గురుకులాలు, గిరిజన సంక్షేమ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల నుంచి ఆయా విభాగాల వారీగా రాష్ట్రస్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించనున్నారు. మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.20 వేలు, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.15 వేలు, మూడో స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10 వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. విజయవాడలో బుధవారం నిర్వహించే కార్యక్రమంలో ఆయా శాఖల మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, గుమ్మిడి సంధ్యారాణి నగదు ప్రోత్సాహకాలు అందించనున్నారు. మొత్తంగా ఆయా విభాగాల నుంచి 315 మంది విద్యార్థులను ఎంపిక చేశారు.


థర్డ్ పార్టీకి మూల్యాంకన బాధ్యతలు రాజ్యాంగ విరుద్ధం

- న్యాయపరమైన చిక్కులు తలెత్తే ప్రమాదం
- నాటి కార్యదర్శి పీఎస్ఆర్‌కు సభ్యుడు సోనీవుడ్ లేఖ

ఈనాడు- అమరావతి: గ్రూప్-1 జవాబుపత్రాల మూల్యాంకన బాధ్యతలను థర్డ్ పార్టీకి అప్పగించడం రాజ్యాంగ విరుద్ధమవుతుందని కమిషన్ సభ్యుడు సోనీవుడ్ లేఖ రాసినప్పటికీ ఏపీపీఎస్సీ అప్పటి కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా మూల్యాంకన బాధ్యతలను ఓ ప్రైవేట్ సంస్థ (క్యామ్‌సైన్)కు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్న సమయంలోనే కార్యదర్శి పీఎస్ఆర్‌ను ఉద్దేశిస్తూ సభ్యుడు సోనీవుడ్ 2021 డిసెంబరు 14న రాసిన లేఖ తాజాగా బయటపడింది. 'హైకోర్టు ఆదేశాలను గౌరవిస్తూ సంప్రదాయ మూల్యాంకనం జరగాలి. తప్పనిసరి పరిస్థితుల్లో థర్డ్ పార్టీ సేవలు అవసరమైతే అవి కనీస స్థాయిలోనే ఉండాలి. హద్దులు, పరిమితులు విధించాలి. లేదంటే న్యాయపరమైన చిక్కులు తలెత్తే ప్రమాదం ఉంది. హైకోర్టు ఆదేశాల మేరకు కార్యదర్శి కార్యాలయం చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నా' అని సోనీవుడ్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఆ లేఖ ప్రతిని ప్రభుత్వానికీ పంపారు. హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో మూల్యాంకనం గురించి కానీ, అక్కడ ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారన్న విషయం కానీ కార్యదర్శి తమకెప్పుడూ చెప్పలేదని, పూర్తిగా చీకట్లో ఉంచారని పలువురు సభ్యులు ఇప్పుడు చెబుతున్నారు.

'హాయ్‌ల్యాండ్' ఎంపికలోనూ క్యామ్‌సైన్ సలహాలు!

హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో జవాబుపత్రాలను మూల్యాంకనం చేయించాలన్న నిర్ణయం పీఎస్ఆర్‌దే. ఈ విషయంలో ఆయన క్యామ్‌సైన్ సంస్థ సలహాలు, సూచనలు తీసుకున్నారు. కమిషన్ ఆమోదం తెలిపిన జాబితాలోని ప్రొఫెసర్లకు మాత్రమే జవాబుపత్రాల మూల్యాంకన విధులు అప్పగించాలి. ఇతరులను భాగస్వాములను చేయకూడదు. దీనికి భిన్నంగా హాయ్‌ల్యాండ్ వ్యవహారం నడిచింది. క్యామ్‌సైన్ సంస్థకు పీఎస్ఆర్ అప్పగించిన బాధ్యతల్లో మాత్రం కమిషన్ అందజేసే జాబితా నుంచే ప్రొఫెసర్లను ఎంపిక చేసి, మూల్యాంకనంలో భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. కానీ ఆ సంస్థ తన ఉద్యోగులు, కొందరు స్థానికులతో ఓఎంఆర్ షీట్లపై మార్కులు వేయించింది. వీరికే చీఫ్ ఎగ్జామినర్, స్క్రూటినైజర్, ఇతర హోదాలు కట్టబెట్టింది. అసలు మా దగ్గర ఉద్యోగులు లేరని, విజయవాడలో ముగ్గురు మాత్రమే పనిచేస్తున్నారని క్యామ్‌సైన్ నిర్వాహకులు తొలుత పోలీసుల విచారణలో బుకాయించారు. ఓఎంఆర్ షీట్లపై మార్కులు వేసిన వారికి రూ.5 వేలు, రూ.10 వేలు, రూ.15 వేల చొప్పున చెల్లించారని పోలీసులు గట్టిగా ప్రశ్నించగా క్యామ్‌సైన్ అధికారులు మౌనం దాల్చారు. ఈ వ్యవహారంలో మరో ఇద్దరి ప్రమేయంపైనా పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు.



Sonywood. N
MEMBER
Andhra Pradesh Public Service Commission
New H.O.Ds Building, 2nd Floor, Opp. Indira Gandhi Municipal Complex, Near RTO Office, M.G. Road, VIJAYAWADA - 520 010

Date 14th Dec 2021

To
The secretary
APPSC

Respected Sir,

Refer to the judgement given by the honourable High Court with respect to the APPSC examination evaluation to do manual evaluation of answer sheets in "conventional mode", within three months.

I would like to appreciate the bold decision by the Secretary's office to change the evaluation system, decreasing human intervention, saving staff resources and increasing transparency. Also, the way you have fought the legal complications arising out of this decision and supporting the APPSC.

As a member I have agreed to abide with the honourable High Court decision of manual evaluation. However, my concern is with regards to the involvement of the third party and its role in the evaluation.

In the light of the honourable High Court's observations with the role of the third party as unconstitutional, I would suggest the following

a) The role of the third party to be completely avoided/ the role of third party be minimised to mitigate any further legal complications.

b) The scope and parameters of the third party to be defined completely before the evaluation process is intimated to the HHC.

Finally, as a member of the commission I strongly trust that the Secretary's office will make the Commission proud by completing the evaluation process in line with the honourable High Court's directives successfully.

Thanking you

N.Sonywood

సోనీవుడ్ రాసిన లేఖ

సరిపోలిన చేతిరాతలు

ఓఎంఆర్ షీట్లపై మార్కులు వేసిన వారిలో పలువురి చేతి రాతలు సంబంధిత వ్యక్తుల చేతిరాతలతో సరిపోయినట్లు పోలీసు విచారణలో తేలింది. మార్కులు నమోదు చేసిన వారు విచారణకు హాజరై.. ఇంత జరుగుతోందని తమకు తెలియదని వివరణ ఇస్తున్నారు. మరోవైపు పోలీసులు ఏపీపీఎస్సీ కార్యాలయంలో మంగళవారం కూడా రికార్డులను పరిశీలించారు.

మద్యం కేసు నిందితులకు రిమాండ్ పొడిగింపు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో అరెస్టై విజయవాడలోని జైలులో రిమాండ్‌లో ఉన్న నిందితులకు కోర్టు రిమాండ్ పొడిగించింది. గత నెలలో అరెస్టు అయిన రాజ్ కెసిరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చాణక్య, దిలీప్‌ల రిమాండ్ మంగళవారంతో ముగియనున్న నేపథ్యంలో వీరిని విజయవాడలోని ఏసీబీ కోర్టులో పోలీసులు హాజరుపర్చారు. వీరికి న్యాయాధికారి భాస్కరరావు.. ఈ నెల 20వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు. అనంతరం వీరిని కారాగారానికి తరలించారు.

నేడు సన్నద్ధత సైరన్

దిల్లీ: సరిహద్దు ఉద్రిక్తత వేళ ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొనేలా ప్రజల్ని సన్నద్ధం చేయడానికి కేంద్ర ప్రభుత్వం బుధవారం చేపట్టిన కసరత్తు (మాక్ డ్రిల్)కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూడొందల పైచిలుకు 'సివిల్ డిఫెన్స్ జిల్లా'ల్లో సైరన్లు మోగనున్నాయి. అణు ఇంధన కర్మాగారాలు, సైనిక స్థావరాలు, చమురుశుద్ధి కర్మాగారాలు, విద్యుదుత్పత్తికి వాడే జలాశయాలు వంటివాటిని యుద్ధ సమయంలో ఎలా కాపాడుకోవాలనేదానిపై క్షేత్రస్థాయిలో సన్నద్ధత తీసుకురానున్నారు. దీనిలో ప్రజల్ని ఎలా భాగస్వాముల్ని చేయాలనేదానిపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నేతృత్వంలో మంగళవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో సమగ్రంగా చర్చించారు. వివిధ విభాగాల అధికారులకు దీనిలో మార్గనిర్దేశం చేశారు. విద్యార్థులు, ప్రభుత్వ/ ప్రైవేటు సంస్థల ఉద్యోగులు, ఆసుపత్రుల సిబ్బంది, రైల్వే, మెట్రో అధికారులు, పోలీసులు, పారామిలిటరీ బలాలు, రక్షణ బలగాలు దీనిలో పాల్గొనేలా సూచనలు జారీ అయ్యాయి. పరిపాలనపరమైన జిల్లాలు, సివిల్ డిఫెన్స్ జిల్లాలు వేర్వేరు. కంటోన్మెంట్, చమురుశుద్ధి కర్మాగారం లేదా అణుఇంధన కర్మాగారం ఉన్న ఒక్కో ప్రాంతాన్ని సివిల్ డిఫెన్స్ జిల్లాలుగా పరిగణిస్తారు. మాక్‌డ్రిల్ నిర్వహించే ప్రాంతాలను మూడు కేటగిరీలుగా విభజించారు. మొదటిదానిలో దిల్లీ, ముంబయి, సూరత్, వడోదర, చెన్నై, కల్పకం, నరోరా వంటివి ఉన్నాయి. రెండో విభాగంలో హైదరాబాద్, విశాఖపట్నం సహా 201 జిల్లాలు ఉన్నాయి. మూడో విభాగంలో 45 జిల్లాలు ఉన్నాయి. గగనతల దాడులపై హెచ్చరించడం, అప్పటికప్పుడు బ్లాకౌట్ చేసే తీరును వివరించడం, ముఖ్యమైన వ్యవస్థల్ని శత్రువు కంటపడనీయకుండా చేయడం వంటివి మాక్‌డ్రిల్‌లో ఉంటాయి. 1971 తర్వాత ఈ స్థాయిలో సన్నద్ధత ఇదే తొలిసారి. దాదాపు ఆరు లక్షల మంది వాలంటీర్లు దీనిలో పాలుపంచుకుంటారు. చాలా రాష్ట్రాల్లో సాయంత్రం 4 గంటలకు ఇది మొదలవుతుంది.



నేడు మాక్ డ్రిల్ నిర్వహించనున్న నేపథ్యంలో బిహార్ రాజధాని పట్నా విమానాశ్రయంలో మంగళవారం ప్రయాణికుల లగేజీని జాగిలంతో తనిఖీ చేస్తున్న భద్రతా సిబ్బంది

గర్జించనున్న రఫేల్, సుఖోయ్, జాగ్వార్‌లు

పాకిస్థాన్‌తో ఉన్న సరిహద్దు వెంబడి పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లో భారత వాయుసేన బుధ, గురువారాల్లో భారీ సైనిక విన్యాసాన్ని నిర్వహించనుంది. రఫేల్, సుఖోయ్-30 ఎంకేఐ, మిగ్-29, మిరాజ్-2000, తేజస్, జాగ్వార్ విమానాలు దీనిలో గర్జించనున్నాయని రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు వివిధ వర్గాలను అప్రమత్తం చేసే 'నోటమ్' జారీ చేసింది. గాలిలో, నేలపై శత్రు లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఎలా ఛేదించేదీ ప్రదర్శిస్తారు. దాదాపు ఐదున్నర గంటలపాటు ఇవి కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం. సరిహద్దు విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలు పూర్తిగా నిలిపివేయనున్నారు.

◆ ప్రధాని మోదీతో జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ సమావేశమయ్యారు. వీరి మధ్య భేటీ జరగడం 48 గంటల్లో ఇది రెండోసారి.

పంజాబ్‌లో ఉగ్ర కుట్ర భగ్నం భారీగా ఆయుధాల స్వాధీనం

చండీగఢ్: పంజాబ్‌లో విధ్వంసం సృష్టించడానికి ఉగ్రవాదులు పన్నిన కుట్రను భద్రత బలగాలు భగ్నం చేశాయి. రాకెట్లతో ప్రయోగించే గ్రనేడ్‌లు, బాంబులు, పి-86 చేతి గ్రనేడ్లు వంటివి ఎస్‌బీఎస్ నగర్ జిల్లాలో స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భద్రతా బలగాలు సోదాలు చేపడుతున్న క్రమంలో ఇవి బయటపడ్డాయి. ఉగ్రవాదుల వైర్‌లెస్ కమ్యూనికేషన్ హార్డ్‌వేర్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. పంజాబ్‌లో స్లీపర్ సెల్స్‌ను పునరుద్ధరించడానికి పాకిస్థాన్ నిఘా సంస్థతో సంబంధం ఉన్న ఉగ్రవాద సంస్థలు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు గుర్తించామని డీజీపీ తెలిపారు.

పోరాడండి.. వనరులిస్తాం: అమెరికా

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేసే పోరాటానికి అండగా ఉంటామని అమెరికా మరోసారి హామీ ఇచ్చింది. అగ్రరాజ్య ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ ఈ విషయం వెల్లడించారు. "ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ బలంగా నిలబడాలి. అందుకోసం న్యూదిల్లీ చేసే అన్ని ప్రయత్నాలకు మేం మద్దతు అందిస్తాం. ఇరుదేశాల మధ్య సంబంధాల్లో ఇది కూడా భాగమే. భారత్‌తో బంధం ఎంత ముఖ్యమో ట్రంప్ యంత్రాంగం అర్థం చేసుకుంది. ఉగ్రవాదం నుంచి ఎదురయ్యే ముప్పు ఎలాంటిదో మాకు తెలుసు" అని వివరించారు.

బుల్లెట్ ప్రూఫ్ జాకెట్‌తో అనుమానాస్పద వ్యక్తి

ఉగ్రదాడి జరిగిన బైసరన్ లోయ సమీపంలో ఓ వ్యక్తి తూటారక్షక కవచం (బుల్లెట్ ప్రూఫ్ జాకెట్) ధరించి, అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో భద్రతా బలగాలు అతడిని అదుపులోకి తీసుకున్నాయి. విచారణలో పొంతన లేని సమాధానాలు ఇవ్వడం, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పకపోవడంతో అతడిని పోలీసులకు అప్పగించాయి. పూంఛ్ జిల్లాలో పాక్ చొరబాటుదారుడిని అరెస్టు చేశారు.



వినడంలో మీరు మెరుగవ్వాలంటే..

ఎలా చదవాలో, ఎలా రాయాలో మనమంతా నేర్చుకుంటున్నాం. కానీ ఎలా వినాలి అనేది మాత్రం నేర్చుకోవడం లేదు. ఇతరులు చెప్పేది వినడంలో మెరుగవ్వాలంటే మీరు ప్రధానంగా ఈ మూడు సూత్రాలను పాటించండి.

✦ అవతలి వ్యక్తి మాట్లాడటం పూర్తికాకముందే మీ స్పందన తెలిపేందుకు ప్రణాళికలు వేసుకోకండి.

✦ ఇతరులు మాట్లాడుతున్నప్పుడు కేవలం వారి మాటలనే కాకుండా, భావోద్వేగాలనూ అర్థం చేసుకోండి.

✦ మీ స్పందన తెలియజేయడానికి ముందు కాస్త నెమ్మదించి, ఆలోచించండి.

– డేనియెల్ పింక్, రచయిత

భూమన చెప్పేవి నీతులు... చేసినవి కబ్జాలు!

(మొదటి పేజీ తరువాయి)

తిమ్మినాయుడిపాలెం బైపాస్ రోడ్డుకు దగ్గర్లో 7.30 ఎకరాల ప్రభుత్వ భూమిని భూమన కబ్జా చేసినట్లు విచారణలో తేలింది. సర్వే నం.47లో మొత్తం 12.91 ఎకరాలుండగా... దాన్ని 5 సబ్ డివిజన్లు చేశారు.

◆ అడంగల్ కాపీ, విలేజ్ స్కెచ్ తదితర రికార్డుల ప్రకారం సర్వే నం.47లోని భూమిని 'అనాధీనం'గా పేర్కొన్నారు. దానిలో 47-1, 47-2 సర్వే నంబర్లలోని 7.30 ఎకరాలను తిరుపతి ఎమ్మెల్యేగా ఉండగా భూమన ఆక్రమించారని విజిలెన్స్ గుర్తించింది. ఇందులో 5 ఎకరాల్ని మొదట ఆక్రమించి తుడా నిధులతో 80 అడుగుల రహదారి నిర్మాణం తలపెట్టారని తెలిపింది. దాన్ని సర్వే నం.47 వరకు మాత్రమే వేశారని పేర్కొంది. దారి నిర్మించాక మరో 2.30 ఎకరాల్ని ఆక్రమించినట్లు పేర్కొంది.

◆ సర్వే నం.47-2లోని మరో 3.07 ఎకరాల ప్రైవేటు భూమినీ యజమానుల్ని బెదిరించి కబ్జా చేశారని విజిలెన్స్ పేర్కొంది. ప్రస్తుతం సర్వే నం.47లో మొత్తం 10.37 ఎకరాలు భూమన కబ్జాలో ఉన్నట్టు తెలిపింది.

◆ బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం భూమన కబ్జా చేసిన ప్రభుత్వ, ప్రైవేటు భూముల విలువ రూ.100 కోట్ల పైమాటే.

నది భూముల్నీ చెరబట్టారు..!

తిరుపతి రూరల్ మండలంలోని తిరుచానూరు పరిధిలో సర్వే నంబరు 472, 473లలో(ఇనాం, స్వర్ణముఖి పరీవాహక) భూముల్ని భూమన కుటుంబం చెరబట్టినట్టు శాటిలైట్ పాత చిత్రాలు, రెవెన్యూ రికార్డుల ఆధారంగా విజిలెన్స్ నిర్ధారించింది.

◆ రెవెన్యూ రికార్డుల ప్రకారం తిరుచానూరులోని 472, 473, 474 సర్వే నంబర్లలో భూమన కరుణాకరరెడ్డి భార్య జె.రేవతి, కుమారుడు బి.అభినయ్‌ల పేర్ల మీద 15.36 ఎకరాల భూమి ఉంది.

◆ కానీ, అవే సర్వే నంబర్లలో ప్రస్తుతం భూమన కుటుంబానికి 24.36 ఎకరాల్లో మామిడి తోట ఉందని, దాని చుట్టూ ప్రహరీ నిర్మించారని విజిలెన్స్ విభాగం గుర్తించింది. అంటే.. అదనంగా 9 ఎకరాల ఇనాం భూముల్ని, నదీ పరీవాహక ప్రాంతాన్ని ఆక్రమించారని దర్యాప్తులో భాగంగా స్థానికులు చెప్పినట్టు తెలిపింది. శాటిలైట్ పాత చిత్రాలూ ఆక్రమణను నిర్ధారిస్తున్నట్లు విజిలెన్స్ తెలిపింది.

◆ నదీ పరీవాహకంలోకి చొచ్చుకెళ్లి ప్రహరీ నిర్మించే క్రమంలో అక్కడ భూమిని మెరక చేసేందుకు లక్షల టన్నుల గ్రావెల్, మట్టి తీసుకొచ్చినట్టు తేలింది.

◆ భూమన కుటుంబం ఆక్రమణలోని ఈ 9 ఎకరాల భూమి సుమారు రూ.54 కోట్లు ఉంటుందని అంచనా.

విజిలెన్స్ సిఫారసులు..

మంగళం గ్రామం పరిధిలో ఆక్రమించిన 7.30 ఎకరాల ప్రభుత్వ భూమిని పోలీసుల సహకారంతో స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వానికి విజిలెన్స్ విభాగం సిఫారసు చేసింది.

◆ భూమన ఆక్రమణల్ని నిగ్గుతేల్చేందుకు రెవెన్యూ, జలవనరులశాఖ అధికారులతో సర్వే చేయించాలి.

◆ నదిని పూడ్చేందుకు ఎంత పరిమాణంలో మట్టి, గ్రావెల్ తెచ్చారో సర్వే చేసి.. సీనరేజీ ఛార్జీలు వసూలు చేయాలని సూచించింది.

గ్రహం అనుగ్రహం

7–5–2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; వసంత రుతువు, వైశాఖ మాసం, శుక్లపక్షం

దశమి: మ. 12-38 తదుపరి ఏకాదశి

పుబ్బ: రా. 8-21 తదుపరి ఉత్తర

వర్జ్యం: తె. 4-06 నుంచి

అమృత ఘడియలు: మ. 1-35 నుంచి 3-16 వరకు

దుర్ముహూర్తం: మ. 11-30 నుంచి 12-21 వరకు

రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు

సూర్యోదయం: ఉ.5.35; సూర్యాస్తమయం: సా.6.17

వాసవీజయంతి

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కడప	41.0	28.0
తిరుపతి	40.7	27.6
కర్నూలు	40.4	28.8
అనంతపురం	40.2	27.0
నెల్లూరు	39.6	27.8
తాడేపల్లిగూడెం	38.7	28.1
రాజమహేంద్రవరం	38.5	26.0
విజయవాడ	37.8	27.2
విశాఖపట్నం	37.6	27.2
హైదరాబాద్	37.4	22.5
గుంటూరు	37.0	28.0
విజయనగరం	37.0	26.0
ఒంగోలు	36.7	28.4
హనుమకొండ	36.0	14.5
నరసాపురం	35.0	24.6
శ్రీకాకుళం	34.0	27.0

కోర్టు మాట వినకపోతే జైలుకెళ్లండి

- తహసీల్దార్‌గా పని చేయడానికి అంగీకరించకపోతే శిక్ష తప్పదు
- డిప్యూటీ కలెక్టర్ తాతా మోహన్‌రావుపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- గుంటూరు జిల్లా అడవితక్కెళ్లపాడులో పేదల గుడిసెలు కూల్చేసిన కేసు..



ఈనాడు, దిల్లీ: ఏపీ హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా 2013 డిసెంబర్ 6, 2014 జనవరి 8వ తేదీల్లో గుంటూరు జిల్లాలోని అడవితక్కెళ్లపాడు గ్రామంలో గుడిసెలు కూల్చివేసిన కేసులో కోర్టు ధిక్కరణ కేసు ఎదుర్కొంటున్న ప్రస్తుత డిప్యూటీ కలెక్టర్ తాతా మోహన్‌రావుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు విధించిన రెండు నెలల జైలు శిక్షకు బదులు స్థాయి తగ్గించుకుని తహసీల్దార్‌గా పని చేయడానికి అండర్‌టేకింగ్ ఇవ్వాలని ధర్మాసనం చేసిన సూచనకు మొగ్గు చూపకపోవడం పట్ల జస్టిస్ బి.ఆర్.గవాయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మోహన్‌రావు దాఖలు చేసిన ఎస్‌ఎల్‌పీపై మంగళవారం జస్టిస్ ఏజీ మసీహ్‌తో కలిసి విచారించిన ఆయన. . పిటిషనర్ తమ మాట వినకపోతే శిక్షించకుండా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. 'తహసీల్దార్ స్థాయిలో పని చేయడానికి అంగీకరిస్తూ అండర్‌టేకింగ్ లెటర్ సమర్పించాలన్న కోర్టు సూచనను పరిగణనలోకి తీసుకోకపోవడం.. కోర్టు ఉత్తర్వుల పట్ల ఆయన వైఖరిని స్పష్టం చేస్తోంది. మేం ఆయన కెరీర్‌ను కాపాడాలనుకున్నాం. ఆయన దాన్ని తిరస్కరిస్తే మేమేం చేయలేం. దీన్ని బట్టి ఇదివరకు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల విషయంలో ఆయన ఎలా వ్యవహరించి ఉంటారో స్పష్టమవుతోంది' అని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు.

80 మంది పోలీసులతో వెళ్లి ఇళ్లు కూల్చినప్పుడు దేవుడు గుర్తురాలేదా?

కోర్టుకు హాజరైన పిటిషనర్ తన విషయంలో ఉదారత చూపాలని ధర్మాసనానికి విన్నవించారు. అందుకు జస్టిస్ గవాయ్ స్పందిస్తూ 'మీరు 80 మంది పోలీసులను తీసుకెళ్లి ఇళ్లను కూల్చినప్పుడు దేవుడు గుర్తుకురాలేదా? ఇప్పటికైనా మీ పిల్లల గురించి ఆలోచించుకోండి. జైలుకెళ్లకుండా మిమ్మల్ని రక్షించడానికి ప్రయత్నిస్తున్నాం. ఒకవేళ వెళ్లాలనుకుంటే వెళ్లి రెండు నెలలు అక్కడ ఉండండి. అప్పుడు మీ ఉద్యోగం కూడా పోతుంది. మీరు ఒక అడుగు తగ్గి (తహసీల్దార్ పోస్టులో) పనిచేయడానికి సిద్ధమైతే చెప్పండి. ఇదే మీకిస్తున్న చివరి అవకాశం. ఇందులో శిక్ష నుంచి తప్పించుకోలేరు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకూ గుడిసెల జోలికి వెళ్లొద్దని హైకోర్టు చెప్పాక కూడా ఇలా చేయడం ఏ మాత్రం సమంజసం కాదు. ఎంతటివారయినా చట్టం కంటే గొప్ప కాదు. హైకోర్టు ఉత్తర్వుల పట్ల ఇలా ధిక్కారపూర్వకంగా వ్యవహరించినందుకు మిమ్మల్ని శిక్షించకుండా వదిలిపెట్టం' అని జస్టిస్ గవాయ్ స్పష్టం చేశారు.

మొండిగా వ్యవహరిస్తే.. మళ్లీ ఉద్యోగంలోకి రానివ్వం

'మేం ఆయన్ను జైలుకు పంపాలనుకోవడం లేదు, ఒకవేళ ఆయన ఇలాగే మొండిగా ఉంటే మేమేం చేయలేం.. మా సూచనపై పిటిషనర్‌కు నచ్చజెప్పడానికి సీనియర్ న్యాయవాది దేవాశిష్ భరూకాకు పది నిమిషాల సమయం ఇస్తున్నాం' అంటూ గవాయ్ విచారణను పది నిమిషాలు వాయిదా వేశారు. విచారణ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా కోర్టు సూచనను పిటిషనర్ అంగీకరించకపోవడం పట్ల జస్టిస్ గవాయ్ మండిపడ్డారు. 'ఇకపై ఆయనకు ఉద్యోగమిచ్చే సాహసం చేయకుండా మేం కఠినమైన అబ్జర్వేషన్లు పాస్ చేస్తాం. ప్రొటోకాల్ డైరెక్టర్‌గా పని చేస్తున్నందుకు తాను ప్రభుత్వానికి దగ్గరగా ఉన్నాననుకుంటున్నారేమో! మేం ఇంత కఠినంగా ఇదివరకెప్పుడూ లేం. ఆయన తలబిరుసుతనం చాలా చెబుతోంది. ఇలాగే మొండిగా ఉంటే మేం ఆయన్ను డిస్మిస్ చేయడమే కాకుండా భవిష్యత్తులో ఎప్పుడూ మళ్లీ ఉద్యోగంలో చేర్చుకోకుండా చూస్తాం. ఆయన గుడిసెలు కూలగొట్టి అందులో ఉన్నవారిని బయటికెళ్లగొట్టారు. మేం కూడా అలాగే ఉండాలనుకోవడం లేదు. మా సూచనను అంగీకరించకపోతే జైలుకు వెళ్లమనండి' అని స్పష్టం చేశారు. కోర్టు సూచనపై ఆలోచించుకోవడానికి మరికొంత సమయం ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరడంతో విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

ఇదీ నేపథ్యం

గుంటూరు జిల్లా సుమ్మరపేటకు సమీపంలోని అడవితక్కెళ్లపాడుకు చెందిన గ్రామస్థులు కొందరు తమ ఆధీనంలో ఉన్న స్థలాలకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని కోరుతూ 2013లో రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇళ్లు ఖాళీ చేయించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని, తమ విజ్ఞప్తులను పరిశీలించేలా వారికి ఉత్తర్వులు జారీ చేయాలని తర్వాత హైకోర్టును ఆశ్రయించారు. వారి దరఖాస్తులను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని.. ఆ స్థలాల్లో వారు నివసిస్తుంటే తహసీల్దార్‌తోపాటు, ఇతర అధికారులెవ్వరూ జోక్యం చేసుకోవద్దని 2013 సెప్టెంబర్ 13న ఏకసభ్య ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. తర్వాత గుంటూరు టౌన్ మొబైల్ లాండ్రీ యూనియన్ కూడా ఇలాంటి అంశంపైనే హైకోర్టును ఆశ్రయించింది. వారి ఆధీనంలోని స్థలాల్లో ఉన్న నిర్మాణాలను తొలగించేందుకు కూడా తహసీల్దార్ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని 2013 డిసెంబర్ 11న కోర్టు మరో ఉత్తర్వు ఇచ్చింది. ఇళ్ల పట్టాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకొనే వరకూ కొత్తగా అక్కడ నిర్మాణాలు చేపట్టవద్దని పిటిషనర్లను, ఇప్పటికే అందులో ఉన్నవాటిని తొలగించేందుకు ప్రయత్నించొద్దని అప్పటి తహసీల్దార్ మోహన్‌రావును ఆదేశించింది. కోర్టు ఇంత చెప్పినా తహసీల్దార్ 2013 డిసెంబర్ 6, 2014 జనవరి 8వ తేదీల్లో ఆ స్థలాల్లో ఉన్న గుడిసెలను తొలగించారు. జనవరి 8న అక్కడ 88 మంది పోలీసులను కూడా మోహరించారు. తహసీల్దార్ ఉద్దేశపూర్వకంగా హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారంటూ రెండు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ 2015 మార్చి 27న హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చింది. మోహన్‌రావు ఆ తీర్పును డివిజన్ బెంచ్ ముందు సవాల్ చేశారు. తాను అక్కడ బయటివారు ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను తొలగించానే తప్ప, పిటిషనర్ల గుడిసెల జోలికి పోలేదని కోర్టుకు విన్నవించారు. అయితేఅందుకు ఆధారాలను చూపలేకపోయారంటూ హైకోర్టు డివిజన్ బెంచ్ ఆ పిటిషన్లను కొట్టేస్తూ ఫిబ్రవరి 19న తీర్పు వెలువరించింది. దాన్ని సవాల్ చేస్తూ మోహన్‌రావు సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై జస్టిస్ బి.ఆర్.గవాయ్ ధర్మాసనం విచారణ జరుపుతోంది.

రేపు శ్రీసిటీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్‌కు శంకుస్థాపన

- రూ.5,001 కోట్ల పెట్టుబడులు
- కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: రాయలసీమలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ గృహోపకరణాల తయారీ ప్రాజెక్టు నిర్మాణానికి మంత్రి లోకేశ్ ఈ నెల 8న భూమిపూజ చేస్తారని ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. శ్రీసిటీలో ఏర్పాటు చేసే పరిశ్రమ ద్వారా రాబోయే ఆరేళ్లలో రూ.5,001 కోట్ల పెట్టుబడులను సంస్థ పెడుతుందని పేర్కొంది. 'రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలు, సీమ ప్రాంతాన్ని ఎలక్ట్రానిక్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చేస్తున్న కృషి, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు తీసుకుంటున్న చర్యల గురించి ఎల్‌జీ కంపెనీ ప్రతినిధులకు మంత్రి వివరించారు. 'ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, ఏసీలతో పాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను రాష్ట్రంలో ఏర్పాటు చేసే యూనిట్‌లో సంస్థ తయారు చేస్తుంది. ఈ సంస్థ ద్వారా రాబోయే ఆరేళ్లలో సుమారు రెండు వేల మందికి ఉపాధి లభిస్తుంది. రూ.839 కోట్లతో మరో ఐదు అనుబంధ యూనిట్లు ఇక్కడ రాబోతున్నాయి. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యానికి అనుగుణంగా పెట్టుబడులను ఆకర్షించాలన్నదే లక్ష్యం. ఇందులో భాగంగా గత 11 నెలల్లో రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు.. 5 లక్షల మందికి ఉపాధి కల్పించేందుకు ఒప్పందాలు కుదిరాయి. ఇప్పటికే ఆర్సెలార్ మిత్తల్, బీపీసీఎల్, టీసీఎస్, ఎన్‌టీపీసీ, టాటా పవర్, రిలయన్స్ సీబీజీ ప్లాంట్లు పెట్టేందుకు దిగ్గజ సంస్థలు ముందుకు వచ్చాయి' అని ప్రభుత్వం తెలిపింది.

పోలవరం- బనకచర్లకు త్వరితగతిన అనుమతులు తీసుకోవాలి: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: పోలవరం-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు త్వరితగతిన పర్యావరణ అనుమతులు సాధించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. గోదావరి వరద జలాలను రాయలసీమకు మళ్లించేలా ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు కసరత్తు జరుగుతున్న విషయం తెలిసిందే. ఆ ఏర్పాట్లపై జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేందుకు ఏయే అనుమతులు కావాలో అవి పొందేందుకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని ఆయన అధికారులకు సూచించారు.



కార్యాచరణ లేకపోతే.. అవి లక్ష్యాలు కావు!

జీవితంలో లక్ష్యాలు ఉంటే సరిపోదు. వాటిని సాధించేందుకు కార్యాచరణకు దిగాలి. లేకపోతే లక్ష్యాలు కేవలం కోరికలుగా మిగిలిపోతాయి. మీ పెద్ద పెద్ద కలలను చిన్న చిన్న లక్ష్యాలుగా విభజించుకొని.. ప్రతిరోజూ వాటి కోసం శ్రమిస్తూ ఉండండి.

– అనుష్కాసోహం బత్వాల్, వ్యాపారవేత్త

8 నుంచి కేఎల్ వర్సిటీ ప్రవేశాలకు కౌన్సెలింగ్


తాడేపల్లి, న్యూస్‌టుడే: కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 8 నుంచి 11 వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆ వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ జె.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన కేఎల్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలో 30 వేల లోపు ర్యాంకులు వచ్చిన వారు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ కేటగిరీల కింద ఇంటర్‌లో 60 శాతం కన్నా ఎక్కువ మార్కులు వచ్చిన వారు, స్పోర్ట్స్, ఎన్‌సీసీ, సాంస్కృతికం, ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద ప్రవేశాలు పొందేవారు, ఓపెన్ కేటగిరిలో ఇంటర్‌లో 80 శాతంపైగా మార్కులు పొందిన విద్యార్థులు 8వ తేదీ జరిగే కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని సూచించారు. కేఎల్ ఇంజినీరింగ్ ప్రవేశపరీక్షలో 30 వేలకు పైగా ర్యాంకులు వచ్చిన వారు, ఓపెన్ కేటగిరీ కింద ఇంటర్, జేఈఈలలో మెరిట్ మార్కులు వచ్చిన విద్యార్థులు 9, 10, 11 తేదీల్లో నిర్వహించే కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని చెప్పారు. మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లూ అందిస్తున్నట్లు కౌన్సెలింగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ సుమన్, యూనివర్సిటీ ఎంహెచ్‌ఎస్ విభాగం డీన్ కిషోర్‌బాబు తెలిపారు.

ప్రజాపనుల్లో అక్రమాల మేతలు

పనిమంతుడు పందిరేస్తే కుక్కతోక తగిలి కూలిపోయిందట! అవినీతి సొమ్మును తినమరిగిన అధికార యంత్రాంగం అండదండలతో కొంతమంది గుత్తేదారులు చేయిస్తున్న పలు పనులూ ఇలాగే అఘోరిస్తున్నాయి. జనం సొమ్ముతో వారు చేపడుతున్న నిర్మాణాలెన్నో నాలుగు నాళ్లకే పేకమేడలవుతున్నాయి. నాణ్యతా విలువల సంగతి దేవుడెరుగు, కనీస భద్రత ప్రమాణాలనూ పాటించకుండా పనిచేస్తున్న కాంట్రాక్టర్లు, అదంతా వేడుక చూస్తూ కూర్చుంటున్న సర్కారీ సిబ్బంది మూలంగా సామాన్యుల ప్రాణాలు పోతున్నాయి. ఇటీవల సింహాచల పుణ్యక్షేత్రంలో సంభవించిన పెనువిషాదానికీ వ్యవస్థాగత పాతకాలే కారణం. వాననీటి ప్రవాహ మార్గంలో అడ్డంగా నిర్మాణం మొదలుపెట్టడమే ఒక అపరాధం. ఆ పాపం చాలదన్నట్లు, పునాది లేకుండా గోడ కట్టేశారు. గుత్తేదారు, అధికారుల నేరపూరిత నిర్లక్ష్యానికి ఏడుగురు భక్తులు కడతేరిపోయారు. ఈ ఘోరానికి బాధ్యులైన వారిపై కొరడా ఝుళిపించిన ఏపీ సర్కారు- కాంట్రాక్టర్‌తో పాటు ఇద్దరు ఇంజినీర్లపై క్రిమినల్ చర్యలకూ ఆదేశాలిచ్చింది. భవిష్యత్తులో మరెక్కడా ఇటువంటి దారుణాలు జరగకుండా కూటమి ప్రభుత్వం సదా అప్రమత్తంగా వ్యవహరించాలి!

మన దేశంలో ప్రజా పనులన్నింటా లోపాలే. ప్రణాళికల నుంచి పర్యవేక్షణ వరకు ప్రతిదశలోనూ వైఫల్యాలే. సాధారణ మురుగుకాల్వలు మొదలు భారీ సాగునీటి ప్రాజెక్టుల దాకా ఏవీ ఇందుకు అతీతం కాకపోవడమే దురదృష్టకరం. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో లోపభూయిష్టమైన విధానాలను అనుసరించారని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణులు మొన్నామధ్య తేల్చిచెప్పారు. థర్డ్‌పార్టీ ఆడిట్ నిబంధనను సైతం అమలు చేయలేదనీ వారు గుర్తించారు. నాణ్యత కొరవడిన పనులు, వాటిని పట్టించుకోని అధికారులు... వెరసి, కొన్నాళ్ల క్రితం నాగార్జునసాగర్ ఎడమకాల్వకు గండిపడింది. దానివల్ల ఆధునికీకరణకోసం వెచ్చించిన కోట్లాది రూపాయలు మట్టిపాలు కావడమే కాదు- వందల ఎకరాల్లో పంటనష్టం సంభవించింది. ఏపీలో జగన్ జమానాలో 'నాడు-నేడు' కింద పలు పాఠశాలల్లో పరమ నాసిగా పనులు చేశారు. పేదలకు కట్టిస్తామన్న ఇళ్లనూ అలాగే పాడుపెట్టారు. రహదారుల నిర్మాణంలోనైతే గుత్తేదారుల చేతివాటానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యక్ష సాక్ష్యాలెన్నో కనపడతాయి. వాహనదారులకు అవి నిత్యం నరకం చూపిస్తూ, యాక్సిడెంట్లకు కారణమవుతూ పచ్చని కుటుంబాల్లో శోకాగ్నులను రగుల్చుతున్నాయి!

అవినీతి వ్యవస్థాగతమైన భారతావనిలో ప్రజాపనుల్లో అక్రమాలు అన్ని రాష్ట్రాలకూ విస్తరించాయి. రూ.777 కోట్లతో దిల్లీలో నిర్మించిన ప్రగతిమైదాన్ సొరంగ మార్గం ప్రజల వినియోగానికి ప్రమాదకరంగా ఉన్నట్లు అధికార యంత్రాంగమే ఆందోళన వ్యక్తంచేసింది. ఆమధ్య బిహార్‌లో పదుల కొద్దీ వంతెనలు వరసగా కుప్పకూలడం యావద్దేశాన్నీ విస్మయపరిచింది. ఇందుకు బాధ్యులుగా గుర్తించిన అధికారులను సస్పెండ్ చేశారు కానీ, ప్రజాగ్రహం చల్లారగానే వారిని మళ్లీ విధుల్లోకి తీసుకున్నారంటూ సుప్రీంకోర్టు ఇటీవల బిహార్ సర్కారుపై మండిపడింది. లంచావతారాలపై ప్రేమానురాగాలు ప్రదర్శించే ప్రభుత్వాల పెడపోకడే ప్రజాధనాన్ని దొంగల పాల్జేస్తోంది. నిర్మాణ పనుల్లో అధ్వాన చరిత్ర కలిగిన గుత్తేదారులకూ సులువుగా కొత్త కాంట్రాక్టులు లభిస్తున్నాయన్న పార్లమెంటరీ స్థాయీసంఘం తాజా పరిశీలన- టెండర్ల ప్రక్రియను ప్రక్షాళించాల్సిన అవసరాన్ని వెల్లడిస్తోంది. పనుల కేటాయింపులో పారదర్శకత, నిరంతర పర్యవేక్షణ, అవినీతిపరులపై కఠిన చర్యలకు ప్రభుత్వాలు సంసిద్ధం కావాలి. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ మౌలిక సదుపాయాలను భ్రష్టుపట్టించే వారిని ఉపేక్షిస్తే- ప్రగతి బాటలో దేశ పురోగమనమే పడకేస్తుంది!



మనం ఒక రంగాన్ని ఎంచుకుని కృషిచేయడం మొదలెట్టాక మిగతావన్నీ అనవసరమైనవనీ వాటి గురించి ఆలోచించడమూ దండగేననీ అనుకుంటాం. ఈ తరహా పెద్దల మనస్తత్వాన్నే మనం పిల్లల మీద కూడా రుద్దుతున్నాం. అన్నీ తెలుసుకోవాలనుకునే వాళ్ల ఉత్సాహం మీద నీళ్లు చల్లుతున్నాం.

– రవీంద్రనాథ్ ఠాగోర్

కాన్హో పాత్రా

కొందరి చరిత్రలు వింటుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఇది కదా భగవంతుడి మీద నిజమైన ప్రేమ... అనిపిస్తుంది. అప్రయత్నంగానే చేతులు జోడిస్తాం. అలాంటి చరిత్రే కాన్హోపాత్రాది.

కాన్హోపాత్రా పదిహేనో శతాబ్దపు మరాఠీ కవయిత్రి. విలాసవంతమైన జీవితాన్ని తృణప్రాయంగా వదులుకున్న ధీర. విఠలుడే సర్వస్వంగా భావించి అభంగాలతో ఆరాధించి జీవితాన్ని పునీతం చేసుకున్న మహాభక్తురాలు. ఆమె మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లా మంగళవేడ్‌లో జన్మించింది. అవి స్త్రీని ఒక వస్తువులా చూసే, ముఖ్యంగా 'ఫలానా ఆమె నా ఇలాకా' అని చెప్పుకోవడం హోదాకు చిహ్నంగా భావించే రోజులు. మంగళవేడ్‌లో అత్యంత ధనవంతురాలైన వేశ్య శ్యామా. పట్టణ ప్రముఖుడైన సదాశివ మలగుజర్ ఆమెను సొంతం చేసుకున్నాడు. ఆ శ్యామా కుమార్తె కాన్హోబాయి. ఆమెను చూసినవారు ఏ గంధర్వకన్యో శాప కారణంగా భూమిమీద జన్మించింది అనుకునేవారు.



అంతర్యామి

కుటుంబ నేపథ్యానికి అనుగుణంగా కూతురికి నృత్యగానాలు నేర్పించింది శ్యామా. కాన్హోపాత్రా కోసం ఎంతోమంది శ్యామాకు ధనం ఆశచూపేవారు. సదాశివ మలగుజర్ సైతం ఆమె పట్ల ఆసక్తి కనబరచగా నీ కోరిక సరికాదని నచ్చచెప్పింది శ్యామా. మలగుజర్ వినలేదు. చివరికి శ్యామాకి అంగీకరించక తప్పలేదు. కానీ కాన్హో కలలు మరోలా ఉన్నాయి. భక్తిభావం మెండుగా కల ఆమెకు విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తే లేదు. విఠలుణ్ని నమ్ముకుంటే ఏ చింతా ఉండదనుకుంది. పనిమనిషి సాయంతో ఇంటినుంచి బయటపడి పండరీపురం చేరుకుంది. ఆ పాండురంగడి ముగ్ధమోహనరూపం చూసి మైమరచిపోయింది. ఆయననే తన భర్తగా భావించింది. ఆలయాన్ని శుభ్రం చేస్తూ, పాండురంగణ్ని నృత్యగానాలతో ఆరాధించేది. ఈ సంగతి తెలుసుకున్న మలగుజర్ బీదర్ నవాబుకు కాన్హోపాత్రా అందచందాలు వర్ణించి చెప్పి రెచ్చగొట్టాడు. నవాబు ఆజ్ఞతో సైనికులు కాన్హోపాత్రాని తీసుకెళ్లడానికి వస్తారు. స్వామిని ప్రార్థించి వస్తానని చెప్పి ఆలయంలోకి వెళ్లి తలుపులు మూసుకున్న కాన్హోపాత్రా పాండురంగడి పాదాలమీద వాలిపోయింది. మనసా వాచా కర్మణా తననే నమ్మిన భక్తురాలిని తనలో ఐక్యం చేసుకున్నాడు రంగడు.

కాన్హోబాయి లెక్కకు మిక్కిలి అభంగాలు ఆలపించినట్లు చరిత్ర చెబుతోంది. ముప్పై మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఆమె విఠలుడి పట్ల తన ప్రేమను వ్యక్తంచేయడమే కాక, ఆనాటి సమాజంలో స్త్రీలూ, నిమ్నవర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాల్నీ ప్రస్తావించింది. 'నా మనఃప్రాణాలన్నీ నీకే అంకితం. ఈ లౌకిక సంసార బాధల మధ్య కాలిపోతున్న నన్ను నీ పాదాలు చల్లటి నీరులా సేద దీరుస్తున్నాయి..' అని విఠలుడికి చెబుతుంది. 'సర్వసుఖాలకు మూలం ఆ విఠలుడే, ఆయన స్మరణ మనసును అహంకారరహితం చేస్తుంది. అందుకే సదా ఆ విఠలుడి స్మరణలోనే ఉండు...' అంటూ తనకు తాను చెప్పుకొంటుంది. భక్తిమార్గంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా పట్టించుకోకుండా ముందుకు సాగాలన్న సందేశం ఇస్తుంది కాన్హోబాయి తన అభంగాల ద్వారా.

– మావూరు విజయలక్ష్మి

ఏదైనా రాజ్యాంగం పరిధిలోనే!

తమిళనాడులో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికీ, గవర్నర్‌కూ మధ్య ఏర్పడిన వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. గవర్నర్లకు స్వతంత్ర అధికారాలేమీ లేవనీ, రాజ్యాంగం ప్రకారం మంత్రిమండలి సలహాలకు అనుగుణంగా బిల్లులను గవర్నర్ నిర్ణీత కాలవ్యవధిలో ఆమోదించాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దాంతో దేశంలో గవర్నర్ల పాత్ర మరోమారు చర్చనీయాంశమైంది.

తమిళనాడు శాసనసభ 2020-23 మధ్య కాలంలో మొత్తం 12 బిల్లులను గవర్నర్ ఆమోదానికి పంపగా, ఆయన వాటిని తొక్కిపట్టి ఉంచారు. దీన్ని సవాలు చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం 32వ రాజ్యాంగ అధికరణ కింద సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. దాంతో గవర్నర్ రెండు బిల్లులను రాష్ట్రపతి ఆమోదం కోసం పంపి, మిగిలిన వాటిని ఎలాంటి వ్యాఖ్యా చేయకుండానే తిప్పిపంపారు. ఆ తరవాత వాటిలో మార్పుచేర్పులేమీ చేయకుండా శాసనసభ యథాతథంగా ఆమోదించి మళ్లీ గవర్నర్‌కు పంపింది. కానీ, ఆయన వాటిని రాష్ట్రపతి ఆమోదం కోసం పంపుతానని పెండింగులో పెట్టారు. తన చర్యకు కారణాలను మాత్రం వెల్లడించలేదు. చట్టాలు, శాసనబద్ధమైన ఏ నిర్ణయానికైనా కారణాలే ప్రధానం. తమిళనాడు మాదిరిగా కేరళలోనూ గవర్నర్‌కూ శాసనసభకూ మధ్య వివాదం నడుస్తోంది. గవర్నర్లు రాజ్యాంగవిరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదు రావడం ఇదే మొదటిసారి కాదు. రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధింపునకు గవర్నర్లు పలుమార్లు 356వ రాజ్యాంగ అధికరణను దుర్వినియోగం చేశారు. ఆ తీరును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టు వరస తీర్పులు వెలువరించింది.





మొదటి నుంచీ ఇదే తీరు

గవర్నర్ చర్యను న్యాయస్థానాలు తప్పు పట్టిన సందర్భాలు గతంలోనూ అనేకం ఉన్నాయి. ప్రస్తుతం పాలక ఎన్డీయే భాగస్వాములుగా ఉన్న రాజకీయ పార్టీలు సైతం తమపై గవర్నర్లు వివక్షతో అన్యాయంగా వ్యవహరించారని గతంలో గళమెత్తాయి. కోర్టు గుమ్మం తొక్కాయి. అసలు దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచే గవర్నర్లు వివాదాస్పద పాత్ర పోషిస్తూ వచ్చారు. 1937లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు గవర్నర్లు ఎక్కడికక్కడ చిక్కులు సృష్టిస్తూ వచ్చారు. అందుకే గవర్నర్ పదవులను రద్దు చేయాలని రాజ్యాంగ నిర్మాణ సభ చర్చల్లో హెచ్.వి.కామత్ వంటి నాయకులు డిమాండ్ చేశారు. చివరికి రాష్ట్ర ప్రభుత్వానికి మార్గదర్శకత్వం, సలహాలూ సూచనలు ఇచ్చే పెద్దమనిషి పాత్రను గవర్నర్ పోషించాలనే అభిప్రాయం నెగ్గింది. రాష్ట్రాల్లో విచ్ఛిన్నకర ధోరణులు వ్యక్తమైనప్పుడు, వాటికి అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ప్రతినిధిగా గవర్నర్ అవసరమని మరికొందరు అభిప్రాయపడ్డారు. ప్రజాభీష్టానికి ప్రతిరూపమైన పార్లమెంటు, శాసనసభలను కాదనే అధికారం రాష్ట్రపతి, గవర్నర్లకు లేదని రాజ్యాంగం స్పష్టం చేసింది. అసలు వారికి సొంత విచక్షణాధికారం ఉండదని తేల్చింది. అయినాసరే, గవర్నర్లు తమ పరిధి దాటి వ్యవహరించిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

శాసించే అధికారం ఉందా?

రాజ్యాంగ కోర్టుల న్యాయమూర్తులు చట్టసభలు చేసిన చట్టాలను సమీక్షిస్తారు. వాటికి భాష్యాలు చెబుతారు. 200, 201వ రాజ్యాంగ అధికరణలకు చెప్పాల్సిన భాష్యం ఏంటనే దానిమీదే తమిళనాడులో ప్రస్తుత వివాదం ఏర్పడింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడానికి 1952 నుంచి 18 రాజ్యాంగ ధర్మాసనాలు ఇచ్చిన తీర్పులను ప్రస్తావించింది. ప్రప్రథమ పాలనా సంస్కరణల కమిషన్, రాజమన్నార్ కమిటీ, సర్కారియా, పూంఛీ కమిషన్ల నివేదికలనూ పరిగణనలోకి తీసుకుని అత్యంత సమగ్రమైన తీర్పును వెలువరించింది. 200, 201 అధికరణల ప్రకారం శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ తన సూచనలను తెలుపుతూ వాటిని పునఃపరిశీలించాలని అసెంబ్లీకి తిప్పిపంపవచ్చు. లేదా రాష్ట్రపతి పరిశీలనకు నివేదించాలి. 163వ అధికరణ ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్ పదవులు అలంకారప్రాయమైనవి మాత్రమే. తమ నిర్ణయాలను చట్టసభలు అమలుచేసి తీరాలని శాసించే అధికారం వారికి లేదు.

రాష్ట్రపతి, గవర్నర్లు తమ దగ్గరికి వచ్చిన బిల్లులను మూడు నెలల్లో ఆమోదించాలి లేదా తిప్పిపంపాలని చెప్పే అధికారం సుప్రీంకోర్టుకు లేదని కొందరు వాదిస్తున్నారు. కానీ, రాజ్యాంగ నిర్మాణ సభలో ఈ గడువును ఆరు వారాలకు పరిమితం చేయాలనే ప్రతిపాదన వచ్చింది. అయితే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇది మరీ తక్కువ గడువని పేర్కొన్నారు. దాంతో ద్రవ్య బిల్లులను 'సాధ్యమైనంత త్వరగా' ఆమోదించాలని 111, 200వ అధికరణల్లో నిర్దేశించారు. 'సాధ్యమైనంత త్వరగా' అంటే మూడు నెలలని సుప్రీం భాష్యం చెప్పింది. ఏదిఏమైనా పార్లమెంటు చేసిన బిల్లులపై రాష్ట్రపతి 'సాధ్యమైనంత త్వరగా' తన నిర్ణయాన్ని తెలపాల్సి ఉండగా, గవర్నర్లు నెలల తరబడి శాసనసభ బిల్లులను ఎలా తొక్కిపట్టగలరనేది కీలక ప్రశ్న!

డిజిటల్ పంథాలో సత్వర ఆమోదం

సుప్రీంకోర్టు రాష్ట్రపతికి మాండమస్ ఉత్తర్వును జారీ చేయకూడదనే వాదన ఒకటి ముందుకొచ్చింది. దీన్ని అంగీకరించడమంటే రాజ్యాంగానికి రాష్ట్రపతి అతీతులనే వాదనను అంగీకరించడమే అవుతుంది. మన దేశంలో రాజ్యాంగానికీ, చట్టానికీ ఎవరూ అతీతులు కారు. కారణాలు చెప్పకుండా బిల్లులకు ఆమోదాన్ని నిలిపి ఉంచే అధికారాన్ని రాజ్యాంగం రాష్ట్రపతి, గవర్నర్లకు ఇవ్వలేదు. వారు మంత్రివర్గం నుంచి వివరణలు మాత్రమే కోరగలరు. రాష్ట్రాల నుంచి వచ్చే బిల్లులపై రాష్ట్రపతి మూడు నెలల్లోగా తన అభిప్రాయాన్ని వెల్లడించడానికి అన్ని ఏర్పాట్లూ చేయాలని 2016 ఫిబ్రవరిలో వివిధ ప్రభుత్వ విభాగాలకు కేంద్రం ఉత్తర్వులు పంపింది. ఈ ఉత్తర్వును సుప్రీం తీర్పులో ప్రత్యేకంగా ప్రస్తావించారు. అయినాసరే, మూడు నెలల వ్యవధిని గవర్నర్లు ఉల్లంఘించడం సరికాదు. చరమ సంధ్యలో ఉన్న రాజకీయ నాయకులకు వానప్రస్థ ఆశ్రమంగా గవర్నర్ పదవి ఉపయోగపడుతోందనే వాదనను తప్పుపట్టలేం. బిల్లుల సత్వర ఆమోదానికి ఆస్ట్రేలియా మాదిరిగా డిజిటల్ పంథాను అనుసరించడం ఉత్తమం. అక్కడ బిల్లుల ఆమోదానికి అనుసరిస్తున్న విధివిధానాలు రాజ్యాంగానికి అనుగుణంగా ఉన్నాయని న్యాయాధికారులు ఎప్పటికప్పుడు ధ్రువీకరించే పద్ధతి అమలవుతోంది. భారత్‌లో కేంద్ర స్థాయిలో అటార్నీ జనరల్‌కు, రాష్ట్రస్థాయిలో అడ్వొకేట్ జనరల్‌కూ ఈ బాధ్యతలను అప్పగించవచ్చు.



డాక్టర్ ఎస్.అనంత్

న్యాయవాది, ఆర్థిక సామాజిక విశ్లేషకులు



ఉత్సాహంగా... ఉల్లాసంగా...

'పెద్దవాళ్లవడం అంటే ఓ పర్వతాన్ని ఎక్కుతున్నట్లు.. ఒక్కో అడుగూ వేస్తుంటే కాస్త ఆయాసం పెరుగుతుంది కానీ అక్కడి నుంచి కనిపించే దృశ్యం మాత్రం అద్భుతంగా ఉంటుంది...' అనేవారు అలనాటి నటీమణి ఇంగ్రిడ్ బెర్గ్‌మన్. వయసు అనుభవాల్ని పెంచుతుంది. అనుభవాలు మానసిక పరిణతిని తెస్తాయి. అందుకే వార్ధక్యం వ్యర్థజీవితం కాదు, తరవాత తరానికి మార్గదర్శకం... కళ్లెదురుగా కనిపించే జీవిత పాఠం.

బాల్యంలో ముద్దు పలుకులు, చిలిపిచేష్టలు ముచ్చటగొలిపితే కౌమారంలో చురుకుదనం, తెలివి అందర్నీ ఆకర్షిస్తాయి. యవ్వనంలో వృత్తి ఉద్యోగాలు, సంసారం బాధ్యతల్లో మునిగి తేలుస్తాయి. వృద్ధాప్యం ఒక్కసారిగా అన్నింటినుంచి విశ్రాంతినిస్తుంది. శరీరం బిగువు సడలి శక్తి సన్నగిల్లుతుంది. రోగాలు రొష్టులు దాన్ని మరింత బలహీనపరుస్తాయి. ఇదంతా సహజ పరిణామం. అయితే 'ఏజింగ్ గ్రేస్‌ఫుల్లీ' అన్న కళ తెలిసినవారే ఆ మార్పులకు తగినట్లుగా స్పందిస్తారు. వార్ధక్యం వరమా శాపమా అన్నది ఆ స్పందనపైనే ఆధారపడి ఉంటుంది.

వృద్ధాప్యంలో పిల్లల ప్రేమాభిమానాలను కోరుకోవడం సహజం. తమతో కాసేపు గడపాలని, కబుర్లు చెప్పి ఆనందం కలిగించాలని ఆశపడతారు. వారి రుగ్మతలను పోగొట్టే గొప్ప ఔషధం పలకరింపే. అది లభిస్తే పొంగిపోతారు. లోపిస్తే కుంగిపోతారు. పిల్లలు వారి కుటుంబ వ్యవహారాల్లో పెద్దలుగా తమను గౌరవించి సంప్రదించాలని, సలహాలు స్వీకరించాలని ఆరాటపడతారు. అది వాళ్ల హక్కు. అనుభవంతో రాటుదేలిన పెద్దలు... వివేకానికి, విచక్షణకు, ఆలోచనకు స్పష్టమైన చిరునామాలు. వారి సామర్థ్యాల్ని ఉపయోగించుకోవాలి. కొందరు పెద్దలు తమ శక్తిని తాము గుర్తించలేరు. వయసైపోయింది కాబట్టి ఏమీ చేయలేమనుకుంటారు. ఎన్నో యుద్ధాల్లో విజయం సాధించి పెట్టిన ఒక ఏనుగు ముసలిదైపోయింది. ఒకరోజు నీటికోసం నదికి వెళ్లి బురదలో కూరుకుపోయింది. బయటికి రాలేక బాధతో ఘీంకరిస్తోంది. వార్త విన్న ఆ దేశ రాజు వచ్చి దాన్ని బయటికి తీయించాలని ఎన్నో విధాలుగా ప్రయత్నించి విఫలమయ్యాడు. తెలివైన మంత్రి ఓ సలహా ఇచ్చాడు. వెంటనే రాజు అక్కడ యుద్ధ వాతావరణం కల్పించి భేరీలు, నగారాలు మోగేలా చేశాడు. అది వినగానే ఏనుగుకు ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. శక్తులన్నీ కూడదీసుకుని గట్టిగా ప్రయత్నించి బురద నుంచి బయటపడింది. బలహీనులమని చతికిలపడేవారికి ఈ కథ చక్కని పాఠం.

వృద్ధులు స్తబ్ధతను విడనాడాలి. నడక, ధ్యానం, యోగాభ్యాసంతో ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలి. పుస్తకపఠనం లాంటి అలవాట్లను కొనసాగించాలి. ఏ పార్కుకో వెళ్తూ మిత్రులను పెంచుకోవాలి. సంగీత సాహిత్య నృత్య కార్యక్రమాలను ఆస్వాదించాలి. ఆసక్తికరమైన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనే వారి ఆయుష్షు పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. అలా చురుకైన జీవితం గడిపేవారు వృద్ధుల్లా కనపడరు. స్ఫూర్తినిచ్చే పెద్దల్లా మాత్రమే కనిపిస్తారు. ఎంత కాలం బతికామన్నది కాదు, ఎలా బతికామన్నది ముఖ్యం... అనేది అందుకే మరి!

– శ్రీదత్త

ప్రజారోగ్యానికి పొగ

శిలాజ ఇంధనాలను విచ్చలవిడిగా మండించడం వల్ల నైట్రోజన్ ఆక్సైడ్ భారీగా వాతావరణంలోకి విడుదలవుతోంది. దానివల్ల మన ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఎక్కువ కాలం నైట్రోజన్ ఆక్సైడ్ ప్రభావానికి గురైన వాళ్లలో తీవ్ర శ్వాస సంబంధ సమస్యలు తలెత్తుతాయి. ఆమ్ల వర్షాలకూ నైట్రోజన్ ఆక్సైడే కారణం. దానివల్ల నీటి నాణ్యత దెబ్బతింటుంది. మరో తీవ్ర వాయు కాలుష్య కారకమైన ఓజోన్ పంజా విసరడానికీ అది తోడ్పడుతుంది. 2022లో ప్రపంచవ్యాప్తంగా ఆయా రంగాల నుంచి ఎంత మొత్తంలో నైట్రోజన్ ఆక్సైడ్ విడుదల అయ్యిందంటే... (కోట్ల టన్నుల్లో)




■	రవాణా రంగం	3.39
■	విద్యుదుత్పత్తి	2.59
■	అంతర్జాతీయ నౌకాయానం	1.84
■	పరిశ్రమలు	1.64
■	వ్యవసాయం	0.87
■	భవన నిర్మాణం	0.43
■	వ్యర్థాలు	0.24
■	అంతర్జాతీయ విమానయానం	0.18
■	స్వదేశ విమానయానం	0.12

(ఆధారం: కమ్యూనిటీ ఎమిషన్స్ డేటా సిస్టమ్ విశ్లేషణ-2024)

నిద్రా నిద్రా! నువ్వెంత దూరం?

రాసక్రీడల్లో మునిగి తేలేవాళ్లకు, 'నిద్ర పట్టదన్న మాట నిజమే. అయితే, ఇప్పుడు రాజకీయాల్లో తలమునకలు అయ్యేవాళ్లకూ ఆ పరిస్థితి దాపురించింది. మొన్నామధ్య కేరళ రాజధాని తిరువనంతపురంలో కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు శశిథరూర్ తనతో వేదిక పంచుకోవడం వల్ల కొందరికి నిద్ర పట్టదేమోనని 'చేయి'ఎత్తి మరీ ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. దాంతో, కాంగ్రెస్ నాయకులకు పార్టీ ఫిరాయింపుల బుర్ర తొలిచి విన్నది హరాయించుకోలేక పోతున్నారు. శశిథరూర్ విమానాశ్రయానికి వెళ్లి మరీ మోదీకి స్వాగతం పలకడాన్ని వారు అస్సలు జీర్ణించుకోలేక పోతున్నారు. నిజానికి, నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 'కంటికి నిద్ర వచ్చునె.. తనంతటివాడు కల్గినన్' అన్న శ్రీనాథుడి పద్యాన్ని ఆరున్నొక్కరాగంలో కాంగ్రెస్ నాయకులు ఆలపిస్తూ విలపిస్తూనే ఉన్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఇతర అంశాల్లో ప్రధానిని బాధ్యుణ్ని చేయడానికి తాము నిద్రలేని రాత్రులు గడుపుతామని ఇప్పటికే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ప్రతినబూనారు. మొత్తం మీద వాళ్లకు నిద్రను దూరంచేసిన క్రెడిట్ ప్రధానికే దక్కింది. ఇంతటితో వ్యవహారం ఆగిందా అంటే- అబ్బే, లేనే లేదు!

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి సానుకూలంగా 'అర్థ'వంతంగా స్పందించడమే కాకుండా, దాని పునఃప్రారంభ కార్యక్రమాలకు ఇటీవల నరేంద్ర మోదీ స్వయంగా వచ్చారు. దాంతో, ఇంతకు ముందు మూడు రాజధానులని పగటి కలలు కన్న వాళ్లకు ఎన్ని నిద్ర మాత్రలు వేసుకున్నా నిద్రపట్టిన పాపాన పోవడంలేదు. 'అమరావతి ఒక అధునాతన శక్తి. ఇంద్రలోక రాజధాని అమరావతి... ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి. స్వర్ణాంధ్ర స్వప్నానికి అమరావతి శక్తిని సమకూరిస్తే, వికసిత భారత్‌కు స్వర్ణాంధ్ర బలమవుతుంది' అని ప్రధానమంత్రే అంటుంటే ఏపీ ప్రజలు ఆనంద బాష్పాలతో గుండెల మీద చేయివేసుకుని హాయిగా నిద్రపోయారు. మరో పక్క అమరావతి పొడ గిట్టని వాళ్లకు పట్టరాని దుఃఖం వల్ల నిద్ర కరవైంది. స్థానిక రైతుల ఉసురు తగలడమే ఇందుకు కారణమని కొందరికి కొండంత నమ్మకం. ఈ విశ్వాసాల సంగతి అలా ఉంచితే, నిద్ర పట్టక పోవడానికి ఇతరేతర దారుణ కారణాలున్నాయి. ఒక పక్క గతంలో తాము అధికార గర్వంతో చేసిన పాపాలకు ఎప్పుడు ఏ శిక్షలు పడతాయోనని జైళ్లు గుర్తొచ్చి, గుండెల్లో రైళ్లు, విమానాలు పరిగెడుతూ నిద్రపట్టక అవస్థలు పడుతున్నవారిని ఏ దిక్కూ ఆదుకోవడం లేదు. తాము అధికారంలో ఉన్నప్పుడు చేసిన పాపాలను మరచిపోయి, మైమరచిపోయి గుర్రుపెట్టి నిద్రపోవడానికి సరికొత్త నిద్ర మాత్రల పరిశ్రమను అభివృద్ధి చేయాలేమో మరి!



ఇంతకీ 'నిద్ర పట్టనీయని' చరిత్రకు తెలుగునాట ఆద్యుడెవరు? ఇంకెవరు.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే! కొన్ని దశాబ్దాల క్రితమే 'నేను నిద్ర పోను, నిద్ర పోనివ్వను' అని ఆయన శపథం చేశారు. ఇప్పటికీ ఆ పథంలోనే ఉన్నారు. అయితే తనకు నిద్ర పట్టకుండా చేసే మొనగాడు ఎక్కడా లేనే లేడని కుంభకర్ణుడు విర్రవీగితే విర్రవీగవచ్చు గాక, జనాన్ని పట్టి పీడించిన కుంభకోణకర్ణులకు, నోటితో చెప్పలేని అత్యాచారాలను, హత్యాచారాలను చేజేతులా చేసిన, చేయించిన పరమ దుర్మార్గులకు కాస్త కునుకు పట్టేలా చేయగలవారు అవనీతలమంతా వెదకినా దొరకరు గాక దొరకరు!

పూర్వ జన్మలో చేసిన పాపాలు ఈ జన్మలో జబ్బుల రూపంలో పీడిస్తాయని ఓ శ్లోకం ఉంది. ఆ శ్లోక రహస్యం ఏమైనా, పూర్వం పదవిలో ఉన్నప్పుడు చేసిన పాతకాలు తాము పవర్ పోగొట్టుకున్న తరవాత నిద్రపట్టకుండా చేస్తాయన్నది తాజా రాజకీయ శోక రహస్యం. నిద్రపట్టడం అనేది ప్రాంతీయ, జాతీయ సమస్య మాత్రమే కాదు అంతర్జాతీయ సమస్య కూడా. పహల్గాం దాడి అనంతరం భారతదేశం ఎలాంటి ప్రతీకారం తీర్చుకుంటుందనేది పాకిస్థాన్‌కు అంతుపట్టని, నిద్ర పట్టని సమస్య. 'ఎవరి నిద్రకు ఎవరు బాధ్యులు.. ఓ మహాత్మా ఓ మహర్షీ' అంటే, వారివారి గురించి చిత్రగుప్తుని చిట్టాలు తిరగేస్తే గానీ చెప్పలేమన్నది తిరుగులేని చిత్రమైన నిజం.

– శంకర నారాయణ

ఎందుకో తెలిసిందా?

హాయ్! బుజ్జీ



ఒక అడవిలో రకరకాల జంతువులు జీవించేవి. సాయంత్రం కాగానే.. గుహలూ పొదల్లోంచి బయటికి వచ్చి పిల్ల జంతువులన్నీ చక్కగా ఆడుకునేవి. ఎప్పటిలాగే ఒకరోజు జింకపిల్ల చెంగుచెంగున గెంతులేస్తోంది. దాన్ని చూసిన పులిపిల్ల వాళ్లమ్మ దగ్గరికి వెళ్లి.. 'అమ్మా! నాకూ ఆ జింకపిల్లలా గెంతులు వేయాలనుంది' అంది. 'మనం గెంతులు వేయకూడదు తల్లీ. పరిగెత్తడం మన లక్షణం. నీ ఆలోచన మానుకో' అంది తల్లి పులి. 'లేదమ్మా! దాని గెంతులు భలేగా నచ్చాయి. నేనూ అలా గెంతుతాను' అంది పులిపిల్ల. 'చెప్పింది వింటే నీకే మంచిది.. లేకపోతే ఇబ్బంది పడతావు' అంది వాళ్లమ్మ.


అయినా సరే వినకుండా జింకపిల్ల దగ్గరికి పరిగెత్తిందది. అక్కడికి వెళ్లి.. 'నాకూ నీలా గెంతులు వేయడం నేర్పించవూ!' అని అడిగింది. 'నాకు నేర్పడం రాదు! మా అమ్మనీ, మిగతా వాటినీ చూసి నేర్చుకున్నాను. నువ్వు కూడా రోజూ నాతో పాటు గెంతడం ప్రయత్నించు.. వచ్చేస్తుంది' అని బదులిచ్చింది జింకపిల్ల. సరేనంటూ ఆనందంగా గెంతడానికి ప్రయత్నించిందది. కానీ దాని శరీర ఆకృతి వల్ల గెంతలేక కింద పడిపోయింది. దెబ్బలు తగలడంతో గట్టిగా అరిచేసింది. ఆ అరుపులు విని తల్లి పులి పరిగెత్తుకుంటూ వచ్చింది. 'అమ్మా! కాలు నొప్పిగా ఉంది. కదల్చలేకపోతున్నాను' అని ఏడుస్తూ చెప్పింది. వెంటనే ఎలుగుబంటిని పిలిపించి.. వైద్యం చేయించింది తల్లి పులి. 'నీకు అస్సలు రాని పనిని చేయాలనుకున్నావు. కొత్తవి నేర్చుకోవాలనుకోవడం తప్పేం కాదు. కానీ.. మనకు ఎప్పటికీ రానివి, స్వభావానికి విరుద్ధమైనవి.. కొన్ని ఉంటాయి. అలాంటి వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. అందుకే నీకు ముందు నుంచి చెబుతూనే ఉన్నాను' అంది తల్లి. 'అలాగేనమ్మా! ఇప్పటి నుంచి జాగ్రత్తగా ఉంటాను' బదులిచ్చింది పులిపిల్ల.

– తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర

పదవలయం

కింద ఇచ్చిన ఆధారాలతో వచ్చే పదాలను రాయండి. అన్నీ 'కొ' అక్షరంతోనే ప్రారంభమవుతాయి.

1. కుమారుడు
2. గుడిలో కొట్టే కాయ
3. కరవు, లేకపోవడం
4. బట్టలు కుట్టేటప్పుడు తీసుకునేది
5. సరస్సు లాంటిది
6. అసలు కాదు..
7. కొంచెం మరోలా
8. చెట్టుకు ఉండేవి



పనివేళల్లో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేస్తారా?

ప్రభుత్వ వైద్యులపై విచారణకు మంత్రి ఆదేశం

ఈనాడు, అమరావతి: విధుల నిర్వహణ సమయంలో రోగులను చూడకుండా.. ప్రైవేటు ఆసుపత్రిలో మరో రోగికి శస్త్రచికిత్స చేసిన ఇద్దరు ప్రభుత్వ వైద్యుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ మంగళవారం అధికారులను ఆదేశించారు. 2022లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి వైద్యులు చక్రధర్, రాకేష్ ప్రైవేటు ఆసుపత్రిలో ఓ రోగికి శస్త్ర చికిత్స చేశారు. అనంతరం కొద్దిరోజులకు ఆ రోగి ప్రాణాలు విడిచారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే రోగి మరణించాడని బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు అప్పట్లోనే ప్రాథమికంగా విచారణ జరిపారు. మానవతా దృక్పథంతో రోగికి వైద్య సేవలు అందించేందుకు ప్రయత్నించినట్లు వైద్యులు వివరణ ఇచ్చారు. దీనికి సంబంధించి వచ్చిన ఫైలుపై మంత్రి సత్యకుమార్ తీవ్రంగా స్పందిస్తూ విధుల నిర్వహణ సమయంలో వైద్యులు ప్రైవేటు ఆసుపత్రిలో ఉండడం ఏమిటని ప్రశ్నించారు.

రాష్ట్ర పండుగగా సత్యసాయి శత జయంతి వేడుకలు

ఈనాడు, అమరావతి: భగవాన్ శ్రీసత్యసాయి బాబా శత జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం మంగళవారం అన్ని శాఖలకు, జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. వేడుకలను నవంబరు 23న శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో నిర్వహించనున్నారు.

హజ్ కమిటీ ఛైర్మన్‌గా షేక్ హసన్ బాషా

ఈనాడు, అమరావతి: రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్‌గా షేక్ హసన్ బాషాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఇటీవల నిర్వహించిన హజ్ కమిటీ ఎన్నికలో షేక్ హసన్ బాషాను ఎన్నుకున్నారు.



అదృష్టం ఎవరిని వరిస్తుందంటే..!

ఇతరుల విజయాలను తక్కువచేసి మాట్లాడటం చాలామందికి అలవాటు! అదృష్టం వల్ల రాత్రికి రాత్రే వారికి ఆ విజయాలు దక్కినట్లు.. బయటి నుంచి చూసే వ్యక్తులు భావిస్తుంటారు. కానీ అది తప్పు. నేటి విజేతలు గతంలో ఎన్నో ఓటములు చవిచూసి ఉంటారు! స్వశక్తిపై వారినీ ఎన్నో సందేహాలు చుట్టుముట్టి ఉంటాయి. లెక్కలేనన్నిసార్లు ప్రయత్నించి అలసిపోయి ఉంటారు. అయినా పట్టుదలతో అన్ని అడ్డంకులనూ అధిగమించి ఉంటారు. వారి విజయాలను తేలిగ్గా చూడకండి. ఎన్ని కష్టాలు ఎదురైనా కాడి వదిలేయకుండా, నిలకడగా శ్రమించేవారినే అదృష్టం వరిస్తుందని గుర్తించండి.

– లీలా హార్మోజీ, వ్యాపారవేత్త

సెలవుల్లో సరదాగా!

టైమ్‌పాస్ చేస్తే.. ఆరోగ్యం వస్తుంది! ఎలా?



ఎగ్జామ్స్ అయిపోయిన దగ్గర్నుంచి మనకు ఒకటే బెంగ. సెలవుల్లో ఏం చేయాలి, ఏ ఆటలాడాలి, టైమ్ మొత్తం ఎలా గడపాలి అని! రకరకాల ప్లాన్లు వేసుకుంటూ హడావుడి పడిపోతాం. కానీ నిజానికి ఇంట్లో ఉంటూ హెల్దీగా టైమ్‌పాస్ చేయడం ఎంత బాగుంటుందో తెలుసా? అందుకే అసలు ఏమేం చేయొచ్చు అనే దానికోసం మీకోసం ఇక్కడ పేద్ద జాబితా ఉంది. అందులో ఏది నచ్చిందో చూస్తారా మరి!

- ఒంటికి చెమటపట్టేలా పరుగులు పెట్టించే ఫిజికల్ గేమ్స్, మెదడుకు పదును పెట్టే సృజనాత్మకత నిండిన ఆర్ట్స్, వెరైటీ ఇండోర్ గేమ్స్, చిన్న చిన్న సిల్లీ ఆటలు.. ఇలా లెక్కలేనన్ని ఉన్నాయి మనకోసం.
- సైకిల్ తొక్కడం, సరదాగా అమ్మానాన్నలతో వాకింగ్‌కు వెళ్లడం, ప్లేగ్రౌండ్ ఆటలు, ఇంట్లో పెద్దవారి సాయంతో చేసే చిన్నచిన్న వ్యాయామాలు, ఆరుబయట పరుగెత్తుతూ ఆడేవి.. ఇవన్నీ ఫిజికల్ యాక్టివిటీ అన్నమాట. మనల్ని ఆరోగ్యంగా ఉంచి ఎదగటంలో సాయం చేస్తాయివి.
- ఇక మెదడుకు పదును పెట్టే వాటిల్లో.. పుస్తకాలు చదవడం.. పేపర్, క్లే, ఇతర రకాల మెటీరియల్‌తో నచ్చిన క్రాఫ్ట్స్ చేయడం, కూర్చుని ఆడే టీ పార్టీ వంటి ఆటలు, బోర్డ్ గేమ్స్.. ఇలాంటివి ఉంటాయి. ఇవి శారీరకంగా శ్రమ అనిపించవు కానీ మైండ్‌కి బోలెడు పని పెడతాయి. అదే సమయంలో సరదాగానూ ఉంటాయి.
- ఇవికాకుండా బయటకు వెళ్లాలంటే.. బీచ్, పార్క్ వంటి సరదా ప్రదేశాలే కాదు.. మ్యూజియాలు, చారిత్రక కట్టడాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఇలా ఎన్నో ఉన్నాయి.

ఇంకా మనం కూడా కొన్ని ప్రాజెక్టులు సొంతంగా అనుకుని చేసే వీలుంటుంది. మరి ఏం చేద్దామో ఆలోచించండి!

కోటలో ఆటలు

మంచాలు, టేబుళ్లు, సోఫాలు ఏం ఉన్నా... వెంటనే ఫోర్ట్ కట్టేసుకుని 'ఇది మా ఇల్లు, కోట' అనుకుంటూ ఆడుకోవడం భలేగా ఉంటుంది కదూ! మరి ఈ ప్లే ఫోర్ట్ ఎలా కట్టాలంటే..

- కొన్ని కుర్చీలు, దుప్పట్లు, దిండ్లు తీసుకోండి. కుర్చీలపై దిండ్లను నిలబెట్టి, దుప్పట్లు చుడుతూ మూడువైపులా మూసేసి ఒకవైపు తెరిచి ఉంచండి. కష్టంగా అనిపిస్తే అమ్మానాన్నల హెల్ప్ తీసుకోండి.
- అందులో మీకు నచ్చిన ఆట వస్తువులు, పుస్తకాలు, స్నాక్స్ తీసుకెళ్లి బోలెడంతసేపు ఆడుకోండి.
- ఫ్రెండ్స్ కూడా కలిస్తే ఈ ఆట ఇంకా బాగుంటుంది!



చెప్పగలవా?

తనీష్ వాళ్ల నాన్నతో కలిసి హోటల్‌కు వెళ్లాడు. అక్కడ వెయిటర్ వారి దగ్గరకు వచ్చి 'ఏం కావాలి సార్' అని అడిగాడు. అదే సమయంలో తనీష్ వాళ్ల నాన్నను 'టైమ్ ఎంత నాన్న' అని అడిగాడు. వాళ్ల నాన్నగారు ఇద్దరికీ ఒకే సమాధానం ఇచ్చారు. ఏమిటది?



అమ్మమ్మకు సాయం చేయండి

పిల్లలూ.. మీ సెలవుల సరదా కథనాల్లో నా కళ్లజోడు ఎక్కడో పడిపోయిందర్రా. నన్ను దాని దగ్గరకు తీసుకెళ్లరూ!

నిద్రకూ ఓ లెక్కుంది!

ఉదయం ఆరింటికల్లా అలారం మోతకు హడావుడిగా నిద్రలేస్తాం. ఇప్పుడు హాలిడేస్ కదా.. హాయిగా ఎప్పుడు కావాలంటే అప్పుడు లేవొచ్చు. కానీ అది కొంతవరకే సుమా! ఎందుకంటే మన నిద్రకూ ఒక లెక్క ఉంది. ఎలా అంటే..



- మనకు కంటినిండా నిద్ర అవసరం. మధ్యమధ్యలో లేచి డిస్టర్బ్ కాకుండా.. కనీసం తొమ్మిది, పది గంటలపాటు డీప్‌స్లీప్ ఉండాలి.
- ఎటూ స్కూల్ లేదు కదా అని పొద్దున్న 10-11 గంటల వరకూ నిద్రపోవడం, రాత్రి పదకొండు దాటినా ఆడుకోవడం అంత మంచిది కాదు. దీనివల్ల మన ఆరోగ్యం దెబ్బతినడమే కాదు.. అమ్మానాన్నల పనులకు చాలా ఇబ్బంది కలుగుతుంది.
- మరీ తెల్లవారే కాకపోయినా ఎనిమిది గంటల్లోపు లేవడం వల్ల ఇంట్లోవారి పనులన్నీ చకచకా అయిపోతాయి. మనం కూడా బ్రేక్‌ఫాస్ట్ ఎగ్గొట్టి అమ్మతో తిట్లు తినకుండా ఉండొచ్చు.
- రాత్రి తొమ్మిదిలోపు నిద్రపోవడం అలవాటు చేసుకుంటే.. తర్వాత స్కూళ్లు మొదలయ్యాక మరీ కష్టపడకుండా ఉంటాం.
- మధ్యాహ్నం మరీ ఎండగా ఉండి ఆడుకునే పరిస్థితి లేకపోతే.. ఎంచక్కా ఒక చిన్న పవర్‌నాప్ వేసినా బానే ఉంటుంది.
- చివరిగా ఈ సెలవుల్లో నిద్ర ఎంత ముఖ్యమైనదో తెలుసుకోవడంతోపాటు.. మీ నిద్ర లెక్క ఏమిటో కూడా ఓ లుక్కేయండి!

నీకు తెలుసా..

గిరగిరా తిరుగుతుంది, బొంగరం కాదు. పరుగులు తీస్తుంది, బండి కాదు. ఏమిటది?





బేబీ కిట్ల పంపిణీ పునరుద్ధరణ!

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవించే తల్లులకు లబ్ధి

ఈనాడు, అమరావతి: ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పు చేసుకునే తల్లులకు ఇచ్చే బేబీ కిట్ల పథకం అమలును తిరిగి ప్రారంభించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కొక్క బేబీ కిట్‌కు రూ.1,410 ఖర్చవుతుందని వైద్య ఆరోగ్య శాఖ మంగళవారం ప్రకటించింది. వైకాపా పాలనకు ముందు తెదేపా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలుచేసింది. 2016 జులై 1న ప్రారంభించిన 'ఎన్టీఆర్ బేబీ కిట్' కింద ప్రభుత్వాసుపత్రుల్లో జన్మించే ప్రతి శిశువు కోసం రూ.699 విలువైన వస్తువులను ఉచితంగా అందజేసింది. నిరుపేద కుటుంబాలకు ఈ కిట్లు బాగా ఉపయోగపడ్డాయి. పునరుద్ధరించడం వల్ల ఏటా 4 లక్షల మంది తల్లులకు ప్రయోజనం కలగనుంది.

పేరు మార్చి మరీ పథకం అమలు నిలిపివేత: నవజాత శిశువు సంరక్షణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికల మేరకు తెదేపా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'బేబీ కిట్' పథకం అమలును వైకాపా ప్రభుత్వం అప్పట్లో ఉన్నట్టుండి నిలిపేసింది. అధికారంలోకి రాగానే వైఎస్సార్ బేబీ కిట్‌గా పేరు మార్చింది. నిధుల మంజూరుకు ఆర్థికశాఖ కొర్రీలు చూపుతోందంటూ 2021 నుంచి కిట్ల పంపిణీని నిలిపేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పథకం తిరిగి ప్రారంభించేందుకు పంపిన ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదించారని వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కార్యాలయం వెల్లడించింది. ఈ బేబీ కిట్‌లో 11 వస్తువులు ఉంటాయి. దోమతెర, బేబీ బెడ్, వాటర్‌ప్రూఫ్ కాట్, బేబీ డ్రెస్, వాషబుల్ న్యాప్‌కిన్స్, టవల్, పౌడర్, షాంపూ, ఆయిల్, సబ్బు, సోప్‌బాక్స్, రాటిల్‌టాయ్ ఉంటాయి. ఈ పథకం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది.

రాజధానికి భూ సమీకరణపై గ్రామసభ నేడు

అమరావతి, న్యూస్‌టుడే: రాజధాని అవసరాల కోసం రెండో విడత భూ సమీకరణలో భాగంగా బుధవారం పల్నాడు జిల్లా అమరావతి మండలం కర్లపూడిలో గ్రామసభ నిర్వహించనున్నారు. రెండో విడతలో భాగంగా వైకుంఠపురం, యండ్రాయి, పెదమద్దూరు, కర్లపూడి గ్రామాల్లో భూ సమీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, రైతుల భూములు 9,617 ఎకరాలు సమీకరించనున్నారు. ఇప్పటికే వైకుంఠపురం, యండ్రాయి, పెదమద్దూరు గ్రామాల్లో సభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. తాజాగా కర్లపూడిలో నిర్వహించే సభలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో పాటు అధికారులు పాల్గొని రైతుల అభిప్రాయాలు తెలుసుకోనున్నారు. రాజధాని రైల్వేస్టేషన్ కర్లపూడి పరిధిలో ఏర్పాటు కానుంది. దానికి సంబంధించిన రైల్వేలైన్ కోసమే 232.94 ఎకరాల భూమి అవసరమవుతుందని అంచనా వేశారు.

సుజనా చౌదరికి హైదరాబాద్‌లో శస్త్రచికిత్స

లండన్ పర్యటనలో జారిపడటంతో కుడిచేయికి గాయం

హైదరాబాద్ (బేగంపేట), న్యూస్‌టుడే: విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరికి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో మంగళవారం శస్త్రచికిత్స జరిగింది. లండన్ పర్యటనలో ప్రమాదవశాత్తు ఆయన జారిపడటంతో కుడిచేయి ఫ్రాక్చర్ అయింది. ఆయన్ను అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చి బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆ ఆసుపత్రి ఎండీ, చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డా.ఎ.వి.గురవారెడ్డి నేతృత్వంలో నలుగురు వైద్యులు నాలుగు గంటల పాటు సుజనా చౌదరికి శస్త్రచికిత్స చేశారు. జారి కింద పడిపోవడంతో ఆయన షోల్డర్ హ్యూమరస్‌లో ఫ్రాక్చర్ అయిందని, విరిగిన ఎముకను యథాస్థానానికి చేర్చి ప్లేట్లు అమర్చి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని గురవారెడ్డి తెలిపారు. నెల నుంచి రెండు నెలల పాటు ఆయనకు ఫిజియోథెరపీ అవసరమవుతుందని పేర్కొన్నారు.

11 నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ హాల్‌టికెట్లు

ఈనాడు, హైదరాబాద్: దేశంలోని ఐఐటీల్లో..ఇంజినీరింగ్‌లో చేరేందుకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్-2025కి సంబంధించి ఈ నెల 11వ తేదీ నుంచి హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచుతామని ఐఐటీ కాన్పూర్ తెలిపింది. ఈ నెల 18వ తేదీన పరీక్ష జరగనుంది. దేశవ్యాప్తంగా 222 నగరాలు, పట్టణాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జేఈఈ మెయిన్‌లో కనీస మార్కులు సాధించిన 2.50 లక్షల మందికి అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు అర్హత కల్పించారు. వారిలో ఏటా పరీక్ష రాసేవారి సంఖ్య 1.60 లక్షలకు మించడం లేదు.

గాలికి ఏడేళ్ల జైలు

(మొదటి పేజీ తరువాయి)

అభియోగ పత్రాలు దాఖలు చేసింది. 2009లో నమోదైన కేసులో కోర్టు కేసులు, డిశ్చార్జి పిటిషన్లు, హైకోర్టులో క్వాష్ పిటిషన్లతో అడుగడుగునా జాప్యం జరుగుతూ వచ్చింది. సుప్రీం కోర్టు ఈ కేసు విచారణను పర్యవేక్షిస్తూ గడువు పొడిగిస్తూ వచ్చింది. చివరికి ఈ నెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని గడువు విధించడంతో గత నెల 28న వాదనలు ముగించిన సీబీఐ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. 4 అభియోగ పత్రాల్లోనూ కలిపి సీబీఐ 9 మందిని నిందితులుగా చేర్చింది. విచారణ దశలోనే లింగారెడ్డి మృతి చెందగా, శ్రీలక్ష్మిని కేసు నుంచి డిశ్చార్జి చేస్తూ 2022 నవంబరులో తీర్పు వెలువరించింది. మిగిలినవారిలో నలుగురికి జైలు శిక్ష విధించగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది.

అక్రమ మైనింగ్‌కే పరిమితం

కేంద్రం నోటిఫికేషన్ ప్రకారం సరిహద్దుల వివాదం, అక్రమ మైనింగ్‌పై దర్యాప్తు చేయడానికి సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అనంతపురం సరిహద్దుల్లో బళ్లారి రిజర్వుడు ఫారెస్ట్‌లో ఓఎంసీ, బళ్లారి ఐరన్ ఓర్ ప్రైవేట్ లిమిటెడ్‌ల అక్రమ మైనింగ్‌తోపాటు రెండు రాష్ట్రాల సరిహద్దు వివాదంపై దర్యాప్తు చేయడానికి కేసు నమోదు చేసింది. సీబీఐ దర్యాప్తు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 467ను సవాలు చేస్తూ ఓఎంసీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా 2010 డిసెంబరులో సింగిల్ జడ్జి సీబీఐ దర్యాప్తును రద్దు చేశారు. తరువాత సీబీఐ దాఖలు చేసిన అప్పీలుపై విచారించిన ధర్మాసనం 2010 డిసెంబరులో సింగిల్ జడ్జి ఉత్తర్వులను నిలిపివేసింది. అయితే అక్రమ మైనింగ్‌కే దర్యాప్తును పరిమితం చేసింది. సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన కమిటీ సరిహద్దుల వివాదాన్ని తేల్చేదాకా దాని జోలికి వెళ్లరాదని పేర్కొంది. ఈ ఉత్తర్వుల ప్రకారం అక్రమ మైనింగ్‌పై దర్యాప్తు పూర్తి చేసింది.

ఆలయం కూల్చివేత

లీజు ప్రాంతానికి సమీపంలో ఉన్న సుంకులమ్మ ఆలయాన్ని ఓఎంసీ ధ్వంసం చేసింది. అక్రమ మైనింగ్‌కు అడ్డుగా ఉందన్న కారణంగా ఆలయాన్ని కూల్చివేసింది. ఆలయం ఉన్న ప్రాంతంలో నాణ్యమైన ఖనిజం ఉన్నందున స్థానికుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఆలయం కూల్చివేయడంతోపాటు అక్కడ అసలు గుడే లేదని నిందితులు బొంకారు.

నిర్దోషిగా సబితా ఇంద్రారెడ్డి

ఓఎంసీ కేసులో ఎ8, ఎ9లుగా ఉన్న మాజీ ఐఏఎస్ కృపానందం, మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డిని నిర్దోషులుగా పేర్కొంటూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. వీరిపై ఆరోపణలకు సంబంధించి సరైన ఆధారాలు లేవని పేర్కొన్నారు. మంత్రిగా విధులు నిర్వహించిన సబితా ఇంద్రారెడ్డిపై ఆరోపణలు రుజువు చేయడానికి ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొంది. వాస్తవంగా సీబీఐ మొదటి అభియోగ పత్రం దాఖలు చేసినపుడు సబితా ఇంద్రారెడ్డిని సాక్షిగా పేర్కొంది. అయితే 2014లో మంత్రి పాత్ర ఉందంటూ సబితతోపాటు కృపానందాన్ని నిందితులుగా చేర్చుతూ అభియోగ పత్రం దాఖలు చేసింది. ఏపీఎండీసీకి రిజర్వు చేసిన 25 హెక్టార్లను కూడా ఓఎంసీకి కట్టబెట్టాలని రాజగోపాల్, శ్రీలక్ష్మిలు ప్రయత్నించగా మంత్రిగా తాను అంగీకరించలేదని వాంగ్మూలం ఇచ్చారు. అంతేగాకుండా లీజుల మంజూరు నిమిత్తం జీవోలో జారీకి తన ముందుంచిన ఫైలులో 'క్యాప్టివ్ మైనింగ్ అని ఉందని, తరువాత జీవో వెలువడ్డాక అది లేదని తెలిపారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న సీబీఐ కోర్టు ఆమెను నిర్దోషిగా పేర్కొంది.

యావజ్జీవం ఎందుకు వేయకూడదో చెప్పండి

శిక్షపై ఏమైనా చెప్పుకోవాల్సి ఉంటే చెప్పాలంటూ సీబీఐ కోర్టు జడ్జి నిందితులను విడివిడిగా ప్రశ్నించారు. అయితే నిందితులు తామెలాంటి తప్పు చేయలేదని మొదలుపెడుతుండటంతో కేసు పూర్వాపరాల్లోకి వెళ్లరాదని జడ్జి స్పష్టంచేశారు. అలాంటివన్నీ అప్పీలులో చెప్పుకోవాలన్నారు. మీపై నేరం రుజువైందని దీని ప్రకారం యావజ్జీవ శిక్ష ఎందుకు వేయకూడదో చెప్పాలన్నారు. నిందితుల వయసు, నేర తీవ్రత, లభించిన ఆధారాల నేపథ్యంలో ఈ శిక్షలు సబబని న్యాయమూర్తి చెప్పారు.

నా కుమారుడి పెళ్లి ఉంది సార్

– బి.వి.శ్రీనివాసరెడ్డి

'ఓబుళాపురం మైనింగ్ కేసులో నేను ఎలాంటి తప్పూ చేయలేదు. సీబీఐ



ఓబుళాపురం గని తవ్వకాలు

అధికారులు మోపిన అభియోగాలు వర్తించవు. ఇప్పటికే మూడున్నరేళ్లకు పైగా జైలులో ఉన్నాను. ఈనెల 18న కుమారుడి పెళ్లి ఉంది. కనీసం అప్పటివరకు అయినా శిక్ష నుంచి మినహాయింపునిచ్చి బయట ఉండటానికి అనుమతించండి'.

విడుదల చేస్తే దైవ కార్యక్రమాలు చేసుకుంటా..

– గాలి జనార్దనరెడ్డి

'నన్ను విడుదల చేస్తే ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతాను. పేద కుటుంబంలో పుట్టిన నేను 21 ఏళ్లప్పుడే ఫైనాన్స్ కంపెనీ పెట్టాను. ఏపీ, కర్ణాటక, తమిళనాడులలో 1,500 మందికి ఉద్యోగ అవకాశం కల్పిస్తూ 300 కోట్ల మేర వ్యాపారాలు చేసేవాడిని. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం పనిచేసిన ఏకైక కంపెనీ మాది. 4,500 మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా మా కంపెనీ ద్వారా ఉపాధి పొందారు. ఈ కంపెనీలో నుంచి రూ.4 కోట్లతో ఓఎంసీ కంపెనీ ఏర్పాటు చేశాను. ఈ కంపెనీ పెట్టాక ఫైనాన్స్ కంపెనీని మూసివేసి ప్రజల సొమ్ము రూ.300 కోట్లు తిరిగి చెల్లించాను. ఉద్యోగులందరినీ మధ్యంతరంగా తీసేసినందుకు పరిహారం కూడా ఇచ్చాను. మైనింగ్ వ్యవహారాన్ని కంపెనీ చూసుకునేది. ఇందులో నా పాత్ర లేదు. ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదు. 50 వేలమందికి సామూహిక వివాహాలు జరిపించాను. వృద్ధాశ్రమం, గోశాల నిర్వహిస్తున్నాను. ఈ కేసు వల్ల బళ్లారిలో ప్రవేశం లేకుండాపోయింది. గంగావతి నుంచి ఎమ్మెల్యేగా గెలిచాను. మనస్సాక్షిగా చెబుతున్నా ఏ తప్పూ చేయలేదు. 3 సంవత్సరాల 4 నెలల 18 రోజులు జైలులో గడిపాను. ఈ కేసు నుంచి విడుదలైతే దైవ కార్యక్రమాలు చేసుకుంటాను'.

నేనూ ప్రభుత్వ ఉద్యోగినే

– వి.డి.రాజగోపాల్

'నేనూ ప్రభుత్వ ఉద్యోగినే. పబ్లిక్ సర్వెంట్‌గా ఉన్న ఒకరిపై హైకోర్టు కేసు కొట్టివేసింది. మరో ఇద్దరిపై ఈరోజు ఈ కోర్టు కేసు కొట్టివేసింది. పబ్లిక్ సర్వెంట్‌గా నాపైనా కేసు కొట్టివేయాలి. నా భార్య చనిపోయింది. 70 ఏళ్లు వచ్చాయి. 15 నెలలు జైలులో ఉన్నాను. 34 ఏళ్ల సర్వీసులో ఒక్క ఫిర్యాదు లేకుండా విధులు నిర్వహించాను'

కుటుంబానికి నేనే దిక్కు

– మెఫజ్ అలీఖాన్

'వృద్ధులైన తల్లిదండ్రులున్నారు. నలుగురు పిల్లలున్నారు. కుటుంబానికి దిక్కు నేనే. వారి బాగోగులను చూసుకోవాల్సిన బాధ్యత ఉంది. అంతేగాకుండా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాను. ఇప్పటికే రెండున్నరేళ్లు జైలులో ఉన్నాను'

సీబీఐ కోర్టులో డ్రామా

సాయంత్రం 3 ప్రాంతంలో సీబీఐ కోర్టు తీర్పు వెలువరించినప్పటికీ నిందితులందరూ రాత్రి పొద్దుపోయేదాకా కోర్టులోనే ఉండిపోయారు. నేరం రుజువైందని శిక్షలపై ఏమైనా చెప్పాలనుకుంటే చెప్పాలంటూ వారి అభిప్రాయాలను తీసుకున్న న్యాయమూర్తి అనంతరం తీర్పు ప్రతిని సిద్ధం చేసి, నిందితులను జైలుకు పంపడానికి వారెంట్ జారీ చేశారు. అయితే తీర్పు ప్రతిని అందజేయాలంటూ నిందితులు పట్టుబట్టారు. రాత్రి 8.45 గంటల వరకు అక్కడే ఉన్నారు. తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో అప్పీలు దాఖలు చేసుకుంటామని అందువల్ల ప్రతి కావాలంటూ గాలి జనార్దనరెడ్డి తరఫు న్యాయవాది గుమ్మకొండ శ్రీనివాసరెడ్డి కోరారు. అయితే కాపీ సిద్ధం కాలేదని న్యాయమూర్తి చెప్పడంతో నిందితులను జైలుకు తరలించారు. సీబీఐ తరఫున న్యాయవాది ఇందర్‌జీత్ సంతోషి వాదనలు వినిపించగా సీబీఐ అధికారి విష్ణు మజ్జి సహకరించారు.

నిందితుల పాత్ర.. పడిన శిక్షలు ఇవి

ఎ1 బి.వి.శ్రీనివాసరెడ్డి



ఓఎంసీపీఎల్‌లో గాలి సోదరులు పదవీ విరమణ చేయడంతో బి.వి.శ్రీనివాసరెడ్డి 2003 మార్చి 1న డైరెక్టర్‌గా చేరాడు. తరువాత ఎండీగా నియమితులై కంపెనీ కార్యకలాపాలను నిర్వహించాడు. కుట్రలో భాగంగా ప్రభుత్వాన్ని మోసం చేయడానికి జియో ఎన్విరాన్‌మెంటల్ ల్యాబ్స్ నుంచి 2006 మేలో సవరించిన మైనింగ్ అనుమతులు పొందగా, దాన్ని ఐబీఎం ఆమోదించింది. ముడి ఇనుము నాణ్యతకు సంబంధించి 2006 జనవరిలో శాంపిల్స్ సేకరించినట్లు పేర్కొన్నాడు. అయితే బి.వి.శ్రీనివాసరెడ్డి చేతిరాతతో సమర్పించిన సమాచారం ఆధారంగా పరీక్ష నివేదికలను రూపొందించి ఇచ్చినట్లు జియో ఎన్విరాన్‌మెంటల్ ల్యాబ్స్ సాక్ష్యమిచ్చింది. బి.శ్రీనివాసరెడ్డి ఒత్తిడి మేరకు ముడి ఇనుము నాణ్యతను పెంచి నివేదిక ఇచ్చినట్లు తెలిపింది. వాణిజ్య అవసరాలకు ఉపయోగపడదని తెలిసీ మోసపూరితంగా తప్పుడు పత్రాలు సృష్టించి కుట్రను కొనసాగించారు.

★ ఐపీసీ 120బి రెడ్ విత్ 420 – ఏడేళ్లు –రూ.10 వేలు

★ ఐపీసీ రెడ్ విత్ 409 ఏడేళ్ల చొప్పున జైలు, రూ.10 వేలు


మేనేజింగ్ డైరెక్టర్ ఓఎంసీపీఎల్ ఎ2 గాలి జనార్దనరెడ్డి

కంపెనీకి లీజులు పొందడంలో గాలి కీలక పాత్ర పోషించాడు. అప్పటి సీఎంతో సాన్నిహిత్యం ఉండటంతో ఫైళ్లను చకచకా కదిలేలా ఏర్పాట్లు చేశారు. లీజులు పొందడానికి, ఇతర కంపెనీల దరఖాస్తులను పక్కన పెట్టడానికి తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించాడు. మైనింగ్ ప్లాన్ సమర్పించడంలో బి.వి.శ్రీనివాసరెడ్డితో కలిసి గాలి తప్పుడు పత్రాలు సృష్టించి వాటిని అధికారులకు సమర్పించి మైనింగ్ ప్లాన్‌కు ఆమోదం పొందాడు. ఈ తప్పుడు పత్రాల ద్వారా పర్యావరణ శాఖ అనుమతులు పొందాడు. పర్యావరణ శాఖ అనుమతులు మంజూరు చేసేలా బెంగళూరు రీజినల్ కంట్రోలర్ ఆఫ్ మైన్స్‌ను, అటవీ శాఖ అధికారులను ప్రభావితం చేసి మోసపూరితంగా క్లియరెన్స్ సర్టిఫికెట్లు పొందాడు.

★ ఐపీసీ 120బి రెడ్ విత్ 420 – ఏడేళ్లు –రూ.10 వేలు

★ ఐపీసీ రెడ్ విత్ 409 ఏడేళ్ల చొప్పున జైలు, రూ.10 వేలు

ఎ3 వాల్మీకి దాసరి రాజగోపాల్ (వి.డి.రాజగోపాల్)



గనుల శాఖ డైరెక్టర్‌గా మైనింగ్ ప్లాన్‌ను ఆమోదిస్తూ ఓఎంసీపీఎల్‌కు లీజులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఈ కంపెనీకి లీజులు మంజూరు చేయడానికి ఇతర కంపెనీల దరఖాస్తులను తొక్కిపెట్టారు. అంతేగాకుండా మరో కంపెనీకి అవకాశం లేకుండా ఏపీఎండీసీ తరఫున 25 హెక్టార్ల లీజు కోసం దరఖాస్తు చేశారు. రాజగోపాల్ బావమరిది కూడా ఓఎంసీలో డైరెక్టర్‌గా ఉండటంతో రాజగోపాల్ దగ్గరుండి అన్నీ చక్కబెట్టారు. అటవీ శాఖ అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేశారు. ఒక విధంగా చెప్పాలంటే ఓఎంసీపీఎల్‌కు లీజులు దక్కడంలో కీలక పాత్ర రాజగోపాల్‌దే.

★ ఐపీసీ 120బి రెడ్ విత్ 420 – ఏడేళ్లు –రూ.10 వేలు

★ ఐపీసీ రెడ్ విత్ 409 ఏడేళ్ల చొప్పున జైలు, రూ.10 వేలు

★ 13(2) రెడ్‌విత్ 13(1)(డి) కింద 4 ఏళ్ల జైలు రూ.2 వేల జరిమానా

ఎ4 ఓబుళాపురం మైనింగ్ కంపెనీ

ఓబుళాపురం మైనింగ్ కంపెనీ 2001 అక్టోబరు 29న బెంగళూరు ఆర్వోసీలో దినేష్ సింఘి, స్నేహలతా సింఘి, శోభా కొఠారి, కె.నాగభూషణం, జి.రామ్మోహన్‌రెడ్డి అతని సోదరులు జి.రవీంద్రనాథ్‌రెడ్డి, జి.ప్రసాద్‌రెడ్డిలు డైరెక్టర్లుగా ఏర్పాటైంది. ఓబుళాపురం గ్రామంలో సర్వే. నం.1/పిలో 25.98 హెక్టార్లకు తనకున్న లీజును రామ్మోహన్‌రెడ్డి ఓఎంసీపీఎల్‌కు బదలాయించారు. అనంతరం స్నేహలతా సింఘి, శోభా కొఠారి, కె.నాగభూషణంల వాటాలను గాలి జనార్దన్‌రెడ్డి, అతడి భార్య లక్ష్మి, సోదరుడు కరుణాకర్‌రెడ్డి, బి.శ్రీరాములు, గాలి మామ డి.పరమేశ్వర్‌రెడ్డిలకు విక్రయించారు. 2002 ఏప్రిల్ కంపెనీ గాలి చేతికొచ్చింది. 2003లో బి.వి.శ్రీనివాసరెడ్డి డైరెక్టర్‌గా చేరారు. 2005 గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న వి.డి.రాజగోపాల్ బావమరిది డైరెక్టర్‌గా చేరినప్పటికీ 2007లో రాజీనామా చేశారు. అనంతరం లీజులు పొంది అక్రమ మైనింగ్‌కు పాల్పడింది.

★ ఐపీసీ 120బి రెడ్ విత్ 420 – ఏడేళ్లు –రూ.10 వేలు

★ ఐపీసీ రెడ్ విత్ 409 ఏడేళ్ల చొప్పున జైలు, రూ.10 వేలు

ఎ7 మెఫజ్ అలీఖాన్



గాలి వ్యక్తిగత సహాయకుడైన మెఫజ్ అలీఖాన్ అక్రమ మైనింగ్ ద్వారా వచ్చిన సొమ్మును మళ్లించేవాడు. ఇతర మైనింగ్ యజమానులను బెదిరించి వారి ఖనిజాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేయడంలో ఇతడే కీలకం. ముంబయి కేంద్రంగా ఉన్న ఓ కంపెనీ నుంచి మెఫజ్ అలీఖాన్‌కు రూ.5 కోట్లు రాగా భూమి కొనుగోలుకు ప్రయత్నించాడు. ఓఎంసీ ఖాతా నుంచి అలీఖాన్ ఖాతాకు భారీ ఎత్తున సొమ్ము వచ్చి చేరింది.

★ ఐపీసీ 120బి రెడ్ విత్ 420 – ఏడేళ్లు –రూ.10 వేలు

★ ఐపీసీ రెడ్ విత్ 409 ఏడేళ్ల చొప్పున జైలు, రూ.10 వేలు

లా వర్సిటీకి 55 ఎకరాలు

(మొదటి పేజీ తరువాయి)

బ్యాంక్‌కు 0.40 ఎకరాల చొప్పున కేటాయించింది. ఐఆర్‌సీటీసీ హోటల్ నిర్మాణానికి మరో ఎకరం మంజూరు చేసింది. 2014-19 మధ్య భూములు పొందిన 22 సంస్థలకు కేటాయింపులు రద్దు చేస్తూ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. రాజధానిలో ఇప్పటి వరకు 71 సంస్థలకు 1,050 ఎకరాలను కేటాయించినట్లు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ విలేకరుల సమావేశంలో తెలిపారు.

ఎకరం రూ.50 లక్షల చొప్పున లా యూనివర్సిటీకి భూమి

బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్ఎల్ఎస్‌యూఐ), గోవాలోని ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐయూఎల్ఈఆర్) తరహాలో అమరావతిలో లా యూనివర్సిటీ ఏర్పాటుకు బీసీఐ ముందుకు వచ్చింది. గత ఏడాది ఆగస్టు 17న బీసీఐ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అమరావతిలో లా యూనివర్సిటీ ఏర్పాటుకు స్థలం ఇవ్వాలని కోరారు. లా యూనివర్సిటీకి ఎకరం రూ.50 లక్షల చొప్పున ప్రభుత్వం భూమి కేటాయించింది. బసవతారకం ఇన్‌స్టిట్యూట్‌కు కూడా ఎకరం రూ.50 లక్షల చొప్పున భూమి కేటాయించింది. క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టు ఏర్పాటు కోసం ఐటీ శాఖకు 50 ఎకరాలను ఉచితంగా ఇస్తోంది.

భూ కేటాయింపులు రద్దు చేసిన సంస్థలు ఇవే!

రాజధానిలో 22 ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు గతంలో ఇచ్చిన 99.61 ఎకరాలను మంత్రివర్గ ఉపసంఘం రద్దు చేసింది. గతంలో విడిగా కేటాయింపులు పొందిన రాష్ట్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాలను కూడా సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయ భవనాల టవర్లలోనే ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో వాటికి కేటాయింపులను ప్రభుత్వం రద్దు చేసింది. కొన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలు.. వాటి కార్యాలయాలను సీపీడబ్ల్యూడీ నిర్మించే కేంద్ర ప్రభుత్వ విభాగాల కార్యాలయాల సముదాయంలోనే ఏర్పాటు చేసుకోనున్నాయి. ఇండియన్ నేవీ, ఐఎండీ వంటి సంస్థలు తమకు రాజధానిలో కేటాయింపులు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరాయి. భూ కేటాయింపులు రద్దు చేసిన 22 సంస్థల్లో.. ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ, రాష్ట్ర పోలీసు శాఖ నిఘా విభాగం, ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు, ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్, ఏపీ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ అండ్ సర్వీసెస్, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురల్ ఫార్మింగ్, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, భారత నౌకాదళం, భారత వాతావరణ విభాగం (ఐఎండీ), ద ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆల్టర్నేట్ డిస్ప్యూట్ రిజల్యూషన్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, రెయిల్‌టెల్ కార్పొరేషన్, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, హడ్కో ప్రాంతీయ కార్యాలయం, కన్వెన్షన్ సెంటర్, యంగ్‌మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్, క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, వరుణ్ హాస్పిటాలిటీ సంస్థ ప్రతిపాదించిన అమరావతి కన్వెన్షన్ సెంటర్, అమరావతి మెరీనా డెవలపర్, ఫార్చ్యూన్ మురళి రిసార్ట్ హోటల్ డెవలపర్, రీటెయిల్ కమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్ (రివర్‌బే గ్రూప్), కేంద్రీయ విద్యాలయ-1లు ఉన్నాయి.

వివిధ టెండర్లకు అథారిటీ ఆమోదముద్ర

సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన సీఆర్‌డీఏ 47వ సమావేశంలో రాజధానిలో వివిధ పనుల టెండర్లకు ఆమోదముద్ర వేశారు. వాటిలో ముఖ్యమైనవి

- గెజిటెడ్ అధికారుల నివాస గృహాల టవర్లను పూర్తి చేసేందుకు- రూ.514.41 కోట్లు
- గెజిటెడ్ అధికారుల నివాసాలకు బయట మౌలిక వసతులు- రూ.194.73 కోట్లు
- నాన్‌గెజిటెడ్ అధికారుల నివాస గృహాలకు సంబంధించిన 9 టవర్లు- రూ.506.67 కోట్లు
- నాన్ గెజిటెడ్ అధికారులకు సంబంధించి మరో 12 టవర్లు- రూ.517.10 కోట్లు
- 190 ఎంఎల్‌డీ సామర్థ్యం గల నీటి శుద్ధి కేంద్రం- రూ.560.57 కోట్లు
- 15 ఓవర్‌హెడ్ ట్యాంకులు- రూ.494.86 కోట్లు

మరో 15 ఆలయాల్లో... అందరికీ అన్నప్రసాదం

(మొదటి పేజీ తరువాయి)

పాత ఆలయాల పునరుద్ధరణ పనులకు దేవాదాయ శాఖలోని సర్వ శ్రేయో నిధి(సీజీఎఫ్)ని వినియోగించాలన్నారు. ఈ విషయంలో దేవాదాయ శాఖ, తితిదే సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రధాన, ముఖ్య ఆలయాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాస్టర్‌ప్లాన్‌లు సిద్ధం చేయాలని, అవి ఆగమశాస్త్రానికి అనుగుణంగా ఉండాలని ఆదేశించారు. 'శ్రీశైలం క్షేత్రాన్ని తిరుమల స్థాయిలో అభివృద్ధి చేసే వీలుంది. అక్కడ పరిమితంగా ఉన్న దేవాదాయ శాఖ భూములను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలి' అని సీఎం సూచించారు.

సమగ్ర విధానం తేవాలి

'దేవాలయాల భూములు ఆక్రమణలకు గురికాకుండా చూసి, వాణిజ్య సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు వీలుగా కమిటీ వేసి సమగ్ర విధానం తీసుకురావాలి. వచ్చే ఆదాయాన్ని ఆయా ఆలయాల అభివృద్ధికి వినియోగించాలి. భూములను హోటళ్లకు లీజుకు ఇచ్చినప్పుడు.. శాకాహారం మాత్రమే ఉండేలా అనుమతించాలి. అన్ని ఆలయాల ఆదాయాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఆస్తుల వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో ఉంచాలి. ఆలయాలపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం రూ.50 వేలకుపైగా వార్షికాదాయం ఉన్న దేవాలయాల్లోనే సీసీ కెమెరాలు ఉన్నాయి. మరో 24,538 ఆలయాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి. కమిటీలు ఏర్పాటుచేసి, ప్రతి చోటా నిత్యం ధూపదీప నైవేద్యాలు ఉండేలా చూడాలి' అని సీఎం ఆదేశించారు.

ఖాళీల భర్తీకి పచ్చజెండా

'డిప్యూటీ కమిషనర్ పోస్టులు 6, సహాయ కమిషనర్ పోస్టులు 5, గ్రేడ్-1 ఈవో పోస్టులు 6, గ్రేడ్-3 ఈవో పోస్టులు 104, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 16... కలిపి 137 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో భర్తీ చేయాలి. ఈ ప్రక్రియ త్వరగా పూర్తికావాలి. ఆలయాల్లో 200 వరకు వైదిక సిబ్బంది పోస్టుల ఖాళీలను అర్హులైన వారితో భర్తీ చేయాలి' అని చంద్రబాబు ఆదేశించారు.

175 ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు

రాష్ట్రంలో 175 ఆలయాల్లో ఆన్‌లైన్ దర్శనం, సేవలు, వసతి, ఈ-హుండీ వంటివి అమలు చేస్తున్నామని సీఎంకు అధికారులు వివరించారు. రూ.7 కోట్ల కంటే ఎక్కువ వార్షికాదాయం ఉన్న 22 ఆలయాల్లో వాట్సప్ గవర్నెన్స్ తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆలయాల్లో పరిశుభ్రత పాటించేలా కేంద్రీకృత పారిశుద్ధ్య నిర్వహణ టెండర్లు పిలిచామని తెలిపారు. కృష్ణా, గోదావరి నదుల వద్ద హారతులను ప్రతినిత్యం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రమంతటా నోటిఫైడ్ ఆలయాల ద్వారా ఏటా రూ.1,300 కోట్లకుపైగా ఆదాయం వస్తోందని, ఇందులో ఏడు ప్రధాన క్షేత్రాల నుంచే రూ.850 కోట్లు సమకూరుతున్నట్లు చెప్పారు. సర్వ శ్రేయో నిధి(సీజీఎఫ్) కింద వివిధ ఆలయాల్లో రూ.111 కోట్లతో 48 పనులు సాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కార్యదర్శి వాడరేవు వినయ్‌చంద్, కమిషనర్ రామచంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పరిమితి లేని(అన్ లిమిటెడ్) అన్నప్రసాదం అమలు చేయనున్న ఆలయాలివీ..

- శ్రీకాకుళం జిల్లాలో అరసవల్లి ఆలయం
- విశాఖపట్నంలో కనకమహాలక్ష్మి అమ్మవారు
- కాకినాడ జిల్లా తుని వద్ద లోవలో ఉన్న తలుపులమ్మ అమ్మవారు
- కోనసీమ జిల్లాలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి
- ఎన్టీఆర్ జిల్లాలో పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారు
- కృష్ణాజిల్లాలో మోపిదేవి సుబ్రమణ్యేశ్వరస్వామి
- గుంటూరు జిల్లా పెదకాకాని మల్లేశ్వరస్వామి
- నెల్లూరు జిల్లాలో పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి, మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి
- కర్నూలు జిల్లాలో ఉరుకుంద ఈరన్నస్వామి
- నంద్యాల జిల్లాలో మహానందీశ్వరస్వామి, రంగాపురం మద్దిలేటి నరసింహస్వామి
- అనంతపురం జిల్లాలో కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి
- శ్రీసత్యసాయి జిల్లాలో కదిరి ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి
- చిత్తూరు జిల్లాలో బోయకొండ గంగమ్మ ఆలయం

సుప్రీం న్యాయమూర్తుల ఆస్తుల వెల్లడి

(మొదటి పేజీ తరువాయి)

ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్)లో రూ.1.77 కోట్లు, రూ.29,625 వార్షిక ప్రీమియం చెల్లిస్తోన్న ఎల్ఐసీ మనీ బ్యాక్ పాలసీ ఉన్నాయి. స్థిర ఆస్తులు...దక్షిణ దిల్లీలో ఫ్లాట్, కామన్వెల్త్ గేమ్స్ విలేజ్‌లో 2,446 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఫ్లాట్, గురుగ్రామ్‌లోని సిస్పోల్ విహార్‌లో నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో 56శాతం వాటా, హిమాచల్‌ప్రదేశ్‌లోని డల్హౌసీలో ఇల్లు, భూమిలో వాటాలున్నాయి. చరాస్తుల్లో 250 గ్రాముల బంగారం, 2 కిలోల వెండి, మారుతి స్విఫ్ట్ కారు ఉన్నాయి. ఈ నెల 13న జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ విరమణ చేయనున్న విషయం తెలిసిందే.

- తదుపరి సీజేఐగా ఈ నెల 14న బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బి.ఆర్.గవాయ్‌కి బ్యాంకులో రూ.19.63 లక్షల నగదు, రూ.5.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, మహారాష్ట్రలోని అమరావతిలో తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఇల్లు, ముంబయిలోని బాంద్రా, దిల్లీలోని డిఫెన్స్ కాలనీల్లో అపార్ట్‌మెంట్‌లు, అమరావతి, నాగ్‌పుర్‌లలో వ్యవసాయ భూములు ఉన్నాయి. ఆయన సతీమణి వద్ద రూ.29.70 లక్షల విలువైన ఆభరణాలు, రూ.61,320 నగదు డిపాజిట్ ఉన్నాయి.
- ఈ ఏడాది నవంబరులో సీజేఐగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్న జస్టిస్ సూర్యకాంత్‌కు చండీగఢ్‌లో ఒక ఇల్లు, పంచకులలో 13 ఎకరాల వ్యవసాయ భూమి, గురుగ్రామ్‌లో 300 గజాల ఇంటి స్థలం, రూ.4.11 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, 100 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు విలువైన గడియారాలు ఉన్నాయి.
- ఈ నెల 24న పదవీ విరమణ చేయనున్న జస్టిస్ అభయ్ ఎస్.ఓక్‌కు ఠాణేలో ఒక ఫ్లాట్, అవిభాజ్య భూమిలో వాటా, రూ.21.76 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్, పొదుపు ఖాతాలో రూ.9.10 లక్షలు ఉన్నాయి.
- జస్టిస్ విక్రమ్‌నాథ్‌కు నొయిడాలో రెండు పడకల ఫ్లాట్, ప్రయాగ్‌రాజ్‌లో బంగ్లా, వ్యవసాయ భూమి, రూ.1.5 కోట్ల విలువైన వివిధ పెట్టుబడులున్నాయి.
- జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌కు రూ.120 కోట్లకు పైగా పెట్టుబడులు, దిల్లీలోని సఫ్దర్‌జంగ్ డెవలప్‌మెంట్ ఏరియా, గుల్‌మోహర్ పార్క్‌లో పలు ఆస్తులు, తమిళనాడులోని కోయంబత్తూరులో ఒక అపార్ట్‌మెంట్ ఉన్నాయి. 2010-11 నుంచి 2024-25 వరకు ఉన్న రూ.91.47 కోట్లకు పైగా ఆదాయపు పన్ను వివరాలను ఆయన ప్రకటించారు.
- హైకోర్టు న్యాయమూర్తుల పదవులకు ఎంత మందిని సుప్రీం కొలీజియం సిఫార్సు చేసింది, ఎన్ని ఆమోదం పొందాయి, ఇంకా ఎంత మంది పేర్లు కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి...తదితర వివరాలను కూడా సర్వోన్నత న్యాయస్థానం వెబ్‌సైట్ ద్వారా బహిర్గతం చేసింది.

క్షీర ధేనువు!

రోజుకు 20 లీటర్ల పాలతో ఒంగోలు ఆవు రికార్డు



మంగళవారం ఉదయం 11.52 కిలోల బరువు తూగిన పాలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో రైతు వేగుళ్ల మురళీకృష్ణకు చెందిన ఒంగోలు ఆవు ఒక్కరోజులో 21.19 కిలోల (20.56 లీటర్లు) పాలు ఇచ్చి సరికొత్త రికార్డు సాధించినట్లు కేంద్రీయ పశు నమోదు పథకం ప్రతినిధి డి.రాజేశ్వరరావు తెలిపారు. పథకంలో భాగంగా కేంద్రం ఏర్పాటు చేసిన యాప్‌లో... ఉదయం, సాయంత్రం పాల దిగుబడి వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు. ఆవు సోమవారం వరకు రోజుకు 18 కిలోల పాలు ఇచ్చేదని చెప్పారు. మంగళవారం 21.19 కిలోల (ఉదయం 11.52, సాయంత్రం 9.67) పాలు ఇచ్చిందని వివరించారు. ఐదేళ్ల వయసు గల గోవు 2023లో తాడేపల్లిగూడెంలో నిర్వహించిన దేశీయ ఆవు పాల పోటీలో పూటకు 7.17 కిలోలు ఇచ్చి ప్రథమ బహుమతి సాధించిందన్నారు. పోషక విలువల దాణా ఇవ్వడంతో ఈ దిగుబడి సాధ్యమైందని పశువైద్య ఉన్నతాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

– న్యూస్‌టుడే, మండపేట

మద్యం కుంభకోణంలో... నిందితుడిగా ధనుంజయరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

రిపోర్టుల్లో వీరి ప్రస్తావన రావటంతోనే ఈ ముగ్గురూ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ వారికి ఎలాంటి ఉపశమనమూ లభించలేదు. సిట్ విచారణకు సహకరించకుండా ఈ ముగ్గురూ ప్రస్తుతం పరారీలో ఉన్నారు.

సీఎంవోలో అపరిమిత అధికారాలు...

విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డిది ఉమ్మడి కడప జిల్లా. గతంలో వై.ఎస్.రాజశేఖరరెడ్డి కోటరీలో కీలకంగా ఉండేవారు. 2019లో జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే... సీఎంవో కార్యదర్శిగా ధనుంజయరెడ్డిని నియమించారు. అది మొదలు ఐదేళ్ల పాటు అపరిమితమైన అధికారాలు చెలాయించారు. జగన్ తరఫున అనేక వ్యవహారాలు చక్కబెట్టారు. మద్యం కుంభకోణంలో ఇతని పాత్రపై సిట్ ఇప్పటికే ఆధారాలు సేకరించింది.

భారతి సిమెంట్స్‌లో ఆర్థిక వ్యవహారాలు చూసేది బాలాజీయే

గోవిందప్ప బాలాజీది చిత్తూరు జిల్లా వి.కోట. జగన్ సతీమణి భారతి డైరెక్టర్‌గా ఉన్న భారతి సిమెంట్స్‌లో ఆయన 2010 ఏప్రిల్ 30 నుంచి పూర్తికాలపు డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆ సంస్థ ఆర్థిక వ్యవహారాలు, కొనుగోళ్లు, ఐటీ కార్యకలాపాల బాధ్యతలన్నీ ఆయనే చూస్తారు. ఛార్టెర్డ్ ఎకౌంటెంట్ అయిన ఆయన ముడుపుల సొమ్మును రూటింగ్ చేసి వేర్వేరు సంస్థల్లోకి మళ్లించటంలో మాస్టర్‌మైండ్‌గా వ్యవహరించారని సిట్ గుర్తించింది. ఆయనను విచారించటం ద్వారా ఎవరి ఆదేశాల మేరకు, ఎవరికి లబ్ధి కలిగించేందుకు ఇలా చేశారనేది తేలనుంది.

జగన్‌కు నమ్మిన బంటు కృష్ణమోహన్‌రెడ్డి..

కృష్ణమోహన్‌రెడ్డి... జగన్‌కు, అతని కుటుంబానికి అత్యంత నమ్మకమైన బంటు. గతంలో ఆర్డీవోగా పనిచేసిన ఆయన వీఆర్ఎస్ తీసుకుని జగన్ వద్ద ఓఎస్డీగా చేరారు. జగన్ జైల్లో ఉన్నప్పుడు ఆయన తల్లి విజయమ్మ వద్ద ఓఎస్డీగా పనిచేశారు. నిత్యం జగన్ వెన్నంటే ఉంటూ ఆయన తరఫున ఆర్థిక, సొంత వ్యవహారాలన్నీ చక్కబెడుతుంటారు. వివేకా హత్య కేసులో సీబీఐ గతంలో ఈయన్ను విచారించింది.

గర్జించిన మేఘం

→ విరిగిపడిన చెట్లు, విద్యుత్తు స్తంభాలు
→ మిగిలిన కాస్త పంటలకూ నష్టం

ఈనాడు డిజిటల్, అమరావతి, మచిలీపట్నం

ఉమ్మడి కృష్ణా జిల్లాలో వరుణుడు విలయ తాండవం చేస్తున్నాడు. పిడుగులు, భీకర గాలులతో భారీ చెట్లు, విద్యుత్తు స్తంభాలు, రేకుల షెడ్లు, బోర్డులు విరిగిపడ్డాయి. గెలల మీద ఉన్న అరటి, అరకొరగా మిగిలిన మామిడి, కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న, వరి పంటలు నేలపాలయ్యాయి. ఆరబోసుకున్న వరి, మొక్కజొన్న, పసుపు తడిసిపోయాయి. వరుసగా కురుస్తున్న అకాల వర్షాలు రైతు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. వడ్డీలకు తీసుకొచ్చి.. కష్టపడి పండించిన రైతులకు వరుసపెట్టి కురుస్తున్న గాలివానలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ★ విజయవాడతో పాటు తిరువూరు, చందర్లపాడు, గంపలగూడెం, ఎ.కొండూరు తదితర మండలాల్లో ఈదురుగాలులు, పిడుగులతో వాన కురిసింది. పొలాల్లో పిడుగులు పడి చెట్లు దగ్ధమయ్యాయి. రోడ్లకు అడ్డంగా చెట్లు, విద్యుత్తు స్తంభాలు విరిగిపడడంతో ట్రాఫిక్, విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. పాకలు, రేకుల షెడ్లలో ఉండే ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ★ ఎ.కొండూరు మండలం గోపాలపురంలో ఈదురుగాలలకు ఇబ్రహీంపట్నం-జగల్పూర్ జాతీయ రహదారిపై భారీ వృక్షం విరిగిపడడంతో ఇరువైపులా వాహనాలు బారులుదీరాయి. ★ చందర్లపాడు మండలం తోటరావులపాడులోని ఓ ఆలయంలో ధ్వజస్తంభం విరిగిపడింది.


పిడుగుపాటుకు కాలిపోతున్న తాటిచెట్టు


విజయవాడ ఆటోనగర్ వద్ద..


బెంజిసర్కిల్ వద్ద రహదారిపై నీరు

ఈలప్రోలు పొలాల్లో..

కొండపల్లి: ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం ఈలప్రోలు గ్రామంలోని కొత్తూరు మస్తానరావు పొలాల్లో మంగళవారం రాత్రి పిడుగు పడి ఓ తాటి చెట్టు దగ్ధమైంది. ఆ సమయంలో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. పరిసరాల్లో గడ్డివాములు ఉండటంతో రైతులు ఆందోళన చెందారు. వాటికి ఎటువంటి మంటలు వ్యాపించక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకొన్నారు. ఈ క్రమంలో మంటలు ఉవ్వెత్తున లేచి పడటాన్ని స్థానికులు తమ చరవాణుల్లో చిత్రీకరించి వైరల్ చేశారు.

అకస్మాత్తుగా గాలులు.. ప్రజల అవస్థలు

చందర్లపాడు, న్యూస్‌టుడే: మంగళవారం సాయంత్రం అకస్మాత్తుగా వీచిన భారీ గాలులు అపార నష్టాన్ని మిగిల్చాయి. ముప్పాళ్ల-చందర్లపాడు, చందర్లపాడు-కొడవటికల్లు గ్రామాల మధ్య రహదారి వెంట భారీ చెట్లు పడిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లటంతో ఎస్సై దుర్గా ఉమామహేశ్వరరావు పొక్లెయిన్‌తో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను తొలగించారు. తోటరావులపాడులోని విఘ్నేశ్వరాలయంలో ధ్వజ స్తంభం నేలవాలింది. కొద్దిపాటి వర్షం కురవడంతో పొలాల్లో ఆరబోసిన మిర్చి, పసుపుకొమ్ములు, మొక్కజొన్నలు తడవకుండా కాపాడుకోవడానికి అన్నదాతలు ఇబ్బందులు పడ్డారు.


విద్యుత్తు తీగలపై పడిన తాటిచెట్టును తొలగిస్తున్న పొక్లెయిన్

వస్తువుల తరలింపుపై విచారణ

భవానీపురం: హరిత బరం పార్కు, హోటల్, భవానీ ద్వీపంలో తరలించిన సామగ్రిపై ఉన్నతాధికారులు విచారణ ఆదేశించారు. 'తుక్కుగా మెక్కేశారు' శీర్షికతో ఈ నెల 6న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పర్యాటక శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఇంజినీరింగ్ విభాగం నుంచి ప్రాథమిక వివరణ అడిగి తెలుసుకున్నారు. అలాగే డీవీఎం చైతన్య, హోటల్ బాధ్యుడు శ్రీనివాసును ప్రధాన కార్యాలయానికి పిలిపించి విచారించారు. పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలంటూ అధికారులను ఆదేశాలు జారీ చేశారు.

తెరవెనుక పెద్దలు.. తన్నుకుపోతున్న గద్దలు!

➤ రూ.200 కోట్ల భూమిపై.. ఇంత నిర్లక్ష్యమా?
➤ దేవాదాయ శాఖ ల్యాండ్ సెక్షన్‌లో మూలుగుతున్న దస్త్రం

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరంలోనే అత్యంత ఖరీదైన కేదారేశ్వరపేటలోని లోటస్‌ల్యాండ్ మార్క్ ప్రాంతంలో 11.54 ఎకరాల దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం భూములు ఆక్రమణకు గురయ్యాయి. పక్కాగా ఆధారాలతో సహా దీనిని గుర్తించారు. అయినా చర్యలు తీసుకోకుండా అధికారులు నెలల తరబడి కాలయాపన చేస్తున్నారు. రూ.200 కోట్ల విలువైన ఈ భూములను ఇప్పటికీ నివేదిక స్థలంగా మార్చేసి అమ్ముతున్నారు.



వివాదం ఏదిలా..: వీటిపై గత వైకాపా ప్రభుత్వ హయాంలో 2023 డిసెంబరు 7న విజయవాడకు చెందిన కృష్ణారావు అనే సామాజిక కార్యకర్త పక్కా ఆధారాలతో గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత అప్పటి కలెక్టర్ నుంచి జేసీ, నగరపాలక సంస్థ కమిషనర్, దుర్గగుడి అధికారులు అందరి దగ్గరికీ ఈ దస్త్రం చేరింది. విచారణ జరిపించారు. ఇదెలా జరిగిందో తేల్చాలంటూ ఓ బృందాన్ని నియమించారు. అంతా చేసినా ఇప్పటికీ.. 22ఎ1సి నిషేధిత జాబితాలో ఈ భూములను చేర్చలేదు. తెరవెనుక పెద్దలు చాలా మందే ఉండి వ్యవహారం నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. విజయవాడ దుర్గగుడికి చెందిన రూ.200 కోట్ల భూముల ఆక్రమణ వెనుక ఉన్నా అధికారుల్లో చలనం లేదు. ప్రస్తుతం ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలంటే డోర్ నంబర్లతో సహా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, రిజిస్ట్రార్ ఐజీకి దేవాదాయశాఖ నుంచి నివేదిక ఇవ్వాలి. కేదారేశ్వరపేటలోని ఈ భూముల విలువ ప్రస్తుతం గజం రూ.లక్ష పైనే పలుకుతున్నాయి. ఇంత విలువైన పాత సర్వే నంబరు 118(ఆర్ఎస్ నంబరు 112)లోని 11.54 ఎకరాల భూమి దుర్గగుడికి చెందినది దర్జాగా కబ్జా చేశారు. ఈ విషయం చాలా ఏళ్లుగా ఎవరికీ తెలియకుండా మాయ చేశారు. తీరా విషయం బయటపడి విచారణ చేశాక.. ఆక్రమణలు వాస్తవమేనని తేలడంతో 2024 అక్టోబరులో దేవాదాయశాఖ చట్టం 30/87లోని సెక్షన్ 43(10) రిజిస్టరులో అధికారికంగా వీటిని చేర్చారు. అనంతరం డోర్ నంబర్లు అస్తవ్యస్తంగా ఉన్నాయంటూ, కేవలం ప్లాట్ నంబరు, ఇంటి పన్ను కట్టినప్పుడు నగరపాలక సంస్థ ఇచ్చే నంబర్లతో రిజిస్ట్రేషన్లశాఖకు దేవాదాయశాఖ నుంచి నివేదిక ఇచ్చి నిషేధిత జాబితాలో పెట్టమంటూ కోరారు. కానీ రిజిస్ట్రార్ కార్యాలయం దీనికి అంగీకరించలేదు. డోర్ నంబర్లు కచ్చితంగా కావాలి, అవి ఉంటేనే వాటిని నిషేధిత జాబితాలో పెట్టగలమంటూ 2024 డిసెంబరులో సబ్‌రిజిస్ట్రార్ వెనక్కి రాశారు.

డోర్ నంబర్ల జాబితా జనవరిలోనే వచ్చినా..

దేవాదాయశాఖ నుంచి నగరపాలక సంస్థకు డోర్ నంబర్లు కావాలంటూ లేఖ రాశారు. గత జనవరిలో ఈ జాబితా మొత్తం నగరపాలిక నుంచి ఇచ్చారు. కానీ గత నాలుగు నెలలుగా ఈ డోర్ నంబర్ల జాబితా దేవాదాయశాఖ భూవిభాగంలో మూలుగుతోంది. దీనిలో చాలా మంది పెద్దలు ఉండటంతో కావాలనే కాలయాపన చేస్తున్నారనే విమర్శలున్నాయి. 127 మంది ప్రస్తుతం ఈ ఆక్రమణ భూముల్లో పాగా వేశారు. వీరిలో కొందరు పెద్దనవాళ్లు, ఆక్రమణదారులు అందరూ ఉన్నారు.

విద్యుత్తు వాహనాల నిర్వహణపై శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ సిటీ): పర్యావరణ పరిరక్షణకు ముందుకు వస్తున్న వినియోగదారులు... తాము వాడే విద్యుత్తు వాహనాలు, సౌర, వాయు విద్యుత్తు శక్తితో పని చేసే పరికరాలపై అవగాహన పెంచుకోవాలని ప్రొఫెసర్ పి.సి.రెడ్డి అన్నారు. మొగల్రాజపురం జనశిక్షణ సంస్థాన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ... ఆయా వాహనాల సాంకేతికతపై వినియోగదారులకు కనీస అవగాహన ఉండడం లేదన్నారు. ఫలితంగా మరమ్మతులకు అత్యధికంగా ఖర్చవుతోందని వివరించారు. జనశిక్షణ సంస్థాన్‌లో ఈ నెల 8 నుంచి 10 వరకు విద్యుత్తు(ఈవీ) వాహనాలు, సౌర ప్యానల్స్ వాయు టర్బయిన్ల సాంకేతికత, పరికరాలకు మరమ్మతులు, సర్వీసింగ్ తదితర అంశాలపై కార్యశాల నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ పూర్ణిమ మాట్లాడుతూ.. నిపుణులు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

డబుల్ డెక్కర్ వంతెనకు త్వరలో డీపీఆర్

సలహా సంస్థల నుంచి బిడ్ల ఆహ్వానం

ఈనాడు, అమరావతి



విజయవాడ మెట్రో రైలుకు సంబంధించి మరో కీలక అడుగు పడింది. చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై రద్దీగా ఉండే ప్రాంతంలో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ తయారీకి సలహా సంస్థల నుంచి ఆర్ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్)ను ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ ఎంఆర్‌సీఎల్) పిలిచింది. ఎన్‌హెచ్ఏఐతో కలిపి మెట్రో రైలు కార్పొరేషన్ నిర్మించనుంది. ఈ నెల 14వ తేదీ 3గంటల వరకు బిడ్లు దాఖలు చేసేందుకు గడువు ఇచ్చింది. అదే రోజు సాయంత్రం 3.30 గంటలకు బిడ్లు తెరవనున్నారు. విజయవాడ మెట్రో మొదటి దశను 38.40 కి.మీ నిడివితో ఏపీ ఎంఆర్‌సీఎల్ చేపట్టనుంది. ఇప్పటికే దీనికి సంబంధించి ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపించింది. మొదటి కారిడార్‌ను గన్నవరం నుంచి పీఎన్‌బీఎస్ వరకు, రెండో కారిడర్‌ను పెనమలూరు నుంచి పీఎన్‌బీఎస్ వరకు నిర్మిస్తారు.
✪ విజయవాడ నగరంలో రద్దీని తట్టుకునేలా మహానాడు కూడలి నుంచి నిడమానూరు వరకు జాతీయ రహదారుల సంస్థ భారీ పైవంతెనను నిర్మించనుంది. ఇదే మార్గంలో రామవరప్పాడు నుంచి నిడమానూరు వరకు మెట్రో రైలు వెళ్లనుంది. రెండు వంతెనలు వేర్వేరుగా నిర్మించడం వల్ల అదనపు భారం పడనుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఉమ్మడిగా 4.7 కి.మీ. పొడవున డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించాలని నిర్ణయించారు. కింద వాహనాలు వెళ్తాయి. పైన మెట్రో రైళ్ల రాకపోకలు సాగుతుంటాయి. ఈ దూరానికి అయ్యే వ్యయాన్ని ఎన్‌హెచ్ఏఐ, ఏపీఎంఆర్‌సీఎల్ భరించనున్నాయి. దీని డీపీఆర్ తయారీ బాధ్యతను మెట్రో రైలు కార్పొరేషన్‌కు వచ్చింది. ఎంపికైన సలహా సంస్థ డీపీఆర్ తయారు చేయాల్సి ఉంది.

జనరల్ కన్సల్టెంట్ కోసం రూ.205 కోట్లతో..

మెట్రో రైలుకు సంబంధించి ప్రక్రియ త్వరలో వేగం పుంజుకోనుంది. ఈ నేపథ్యంలో ఏపీ ఎంఆర్‌సీఎల్ కార్యకలాపాలు, పలు అవసరాల కోసం జనరల్ కన్సల్టెంట్ ఎంపిక కోసం టెండరు పిలిచింది. ఎంపికైన సలహా సంస్థ సేవలు నాలుగేళ్ల పాటు అందించాల్సి ఉంటుంది. రూ.205 కోట్లతో బిడ్లు పిలిచారు. ప్రతిష్ఠాత్మక, అనుభవం ఉన్న మెట్రో రైలు సలహా సంస్థలు బిడ్లు దాఖలు చేసేందుకు ఈ నెల 16వ తేదీ సాయంత్రం 3గంటల వరకు అవకాశమిచ్చారు. అదే రోజు 3.30 గంటలకు సాంకేతిక బిడ్లను తెరవనున్నారు. ప్రీబిడ్ సమావేశాన్ని 12న నిర్వహించనున్నారు.

దుర్గగుడికి పూర్తిస్థాయి ఈవో



ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రెండో అతిపెద్ద దేవాలయమైన శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవోగా డిప్యూటీ కలెక్టర్ **వీకే శీనానాయక్‌ను** నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్‌బోర్డు మెంబర్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న శీనానాయక్‌ను మాతృశాఖ రెవెన్యూకు బదిలీ చేసి అక్కడి నుంచి దుర్గగుడి ఈవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. 2017లో డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా, కావలి ఆర్డీవోగా గతంలో పని చేశారు. ప్రస్తుతం దుర్గగుడిలో అభివృద్ధి పనులు జరుగుతున్న తరుణంలో పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించి నూతన ఈవోగా శీనానాయక్‌ను నియమించింది. జనవరి 1 నుంచి దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఇప్పటి వరకు దుర్గగుడి ఈవోగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజా ప్రభుత్వ ఆదేశాలతో శీనానాయక్ త్వరలో బాధ్యతలు చేపడతారని విశ్వసనీయ సమాచారం.

అర్జీలంటే కాగితాలు కాదు.. ప్రజల జీవితాలు



మాట్లాడుతున్న గ్రీవెన్స్ అధికారి చిన్నారావు. పక్కనే కలెక్టర్ లక్ష్మీశ, జ్యోతి, పోసిబాబు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజలు సమర్పించే అర్జీలు కాగితం ముక్కలుగా భావించొద్దు. . అందులోని అక్షరాలు, పదాలు అర్జీదారుని ఆవేదనను తెలియజేస్తాయి. వీటిలో ప్రజల జీవితాలు, ఉద్వేగాలు, ఆవేదనలు ఉంటాయన్న విషయాన్ని గ్రహించాలి. సమస్యలు పరిష్కరించాలన్న తపన అధికారుల్లో ఉండాలి.. ఇందుకు సహనం అవసరమని సీఎంవో పీజీఆర్ఎస్ సెల్ చీఫ్ గ్రీవెన్స్ అధికారి సి.హెచ్.చిన్నారావు ఉద్బోధించారు. నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ అధికారులకు జిల్లా స్థాయి సామర్థ్య నిర్మాణ శిక్షణ కార్యశాలను మంగళవారం నిర్వహించారు. పీజీఆర్ఎస్ ద్వారా వినతులు స్వీకరించింది మొదలు, నిర్దేశిత గడువులో పూర్తి చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించే వరకు వివిధ దశల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవహరించాల్సిన తీరుపై పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. సమస్య పరిష్కార సామర్థ్యం అనేది పాలనపై ప్రజల్లో విశ్వాసం పెంచుతుందన్నారు. కింది స్థాయిలో పరిష్కారానికి వీల్లేని వాటిని సరైన విధంగా పైస్థాయికి పంపాల్సి ఉంటుందన్నారు. మరోవైపు అర్జీదారునికి తెలుగులో స్పష్టమైన వివరణతో ఎండార్స్‌మెంటు ఇవ్వాలని సూచించారు. ప్రతి శాఖకు మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీగా ఒకరికి బాధ్యతలు అప్పగించినట్టు పేర్కొన్నారు. అర్జీని కింది స్థాయి అధికారికి అప్పగించకుండా గ్రీవెన్స్ రెడ్రసల్ అధికారే అర్జీదారునితో ఫోన్‌లో లేదా నేరుగా కలిసి మాట్లాడి, సమస్యను సావధానంగా వినాలన్నారు. సున్నిత అంశాల్లో నేరుగా కలిసి మాట్లాడడం మంచిదన్నారు. సమర్థమంతమైన పరిష్కారం అనేది ప్రజలకు, ప్రభుత్వానికే కాకుండా అధికారి వ్యక్తిగత, వృత్తిగత వృద్ధికి దోహద పడుతుందన్నారు. కలెక్టర్ జి.లక్ష్మీశ నేతృత్వంలో విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో గ్రామ/వార్డు సచివాలయాల ప్రత్యేక జిల్లా అధికారిణి జి.జ్యోతి, కేఆర్సీ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో లీజు టెండరింగ్

కొలిక్కి రాని కమిటీ సంప్రదింపులు

ఈనాడు, అమరావతి

పీఎన్‌బీఎస్‌లో హోటల్, డార్మిటరీ లీజు టెండర్లలో గుత్తేదారులు కూటమి కట్టడంతో వ్యవహారం ఇప్పట్లో తేలేలా కనిపించడం లేదు. దీనిని కొలిక్కి తెచ్చేందుకు ఏర్పాటు చేసిన కమిటీ ఇంకా సంప్రదింపులు సాగిస్తూనే ఉంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల నుంచి హోటల్ ఖాళీగా ఉంది. దీని వల్ల ఆర్టీసీ ఆదాయానికి గండి పడింది. ఇంకా ఆలస్యం చేస్తే ఆర్థికంగా మరింత నష్టం జరిగే అవకాశం ఉంది. మార్చి 28తో ఇదే స్థలంలో ఉన్న హోటల్, డార్మిటరీ, ద్విచక్ర వాహన పార్కింగ్ లీజు గడువు ముగిసింది.
☛ దీనికి అదే నెల 13న ఐదేళ్ల కాలానికి టెండర్లు పిలిచారు. విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే ఉండడంతో రద్దీగా ఉంటుందని దాదాపు 15 వరకు బిడ్లు దాఖలు చేశారు. మొత్తం 31,700 చ.అడుగుల విస్తీర్ణం గల దీనికి ప్రకాశం జిల్లాకు చెందిన వ్యక్తి అత్యధికంగా రూ.54లక్షలు కోట్ చేసి ఎల్1గా నిలిచారు. 9 నెలల డిపాజిట్ కట్టాల్సిన సమయంలో వైదొలగడంతో ఈ వ్యవహారం మలుపులు తిరుగుతోంది. ఓ గుత్తేదారు తనకు రూ.కోటి ఇస్తే పోటీ నుంచి తప్పుకుంటానని బేరసారాలు సాగించినట్లు తెలిసింది. ఇటీవలి వరకు ఈ హోటల్ నడిపిన వ్యక్తి కూడా బిడ్ వేసినట్లు సమాచారం. ఒక వేళ కమిటీ ప్రయత్నాలు ఫలించక టెండర్లు రద్దు చేసి మళ్లీ పిలవాల్సి వస్తే.. ప్రక్రియ పూర్తి అయ్యేందుకు మరో నాలుగైదు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. దీని వల్ల సంస్థకు భారీగా నష్టం వాటిల్లుతుంది.


బస్టాండ్ ప్రధాన ద్వారం వద్ద లీజుకు ఇవ్వనున్న హోటల్

వైకాపా హయాంలో టెండర్లు లేకుండానే..

2010లో బీఓటీ పద్ధతిలో ఈ స్థలాన్ని ఆర్టీసీ అధికారులు నెలకు రూ.2లక్షలకు లీజుకు ఇచ్చారు. ఇది 2020లో ముగిసింది. తిరిగి టెండర్లు పిలవకుండా నడుపుతున్న వ్యక్తికే కట్టబెట్టడంలో వైకాపా నేతలు చక్రం తిప్పినట్లు తెలిసింది. మళ్లీ టెండర్లు పిలిస్తే ఎక్కువ ధర పలుకుతుందని, కొందరు వైకాపా నేతలను ప్రసన్నం చేసుకుని తిరిగి తనకే దక్కేలా చూడడంలో అతను సఫలమయ్యాడు. కేవలం నామమాత్రపు పెంపుతో రూ.4లక్షలకు పాత వ్యక్తికే ఐదేళ్లకు రెన్యువల్ చేశారు. నెలకు దాదాపు 7లక్షల వరకు వ్యాపారం జరిగేందుకు అవకాశం ఉన్న ఈ హోటల్, డార్మిటరీని తక్కువ ధరకే కట్టబెట్టడంలో వైకాపాలోని ఇద్దరు నేతలు కీలకపాత్ర పోషించినట్లు తెలిసింది. తిరిగి ఇప్పుడు కూడా టెండర్లు పిలవకుండా నామమాత్రపు ధరకే దక్కించుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: విద్యా హక్కు చట్టం ప్రకారం.. జిల్లాలోని అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి పేద విద్యార్థులకు 25 శాతం ప్రవేశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డీఈవో సుబ్బారావు తెలిపారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 19వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. జిల్లాలోని 490 ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు గుర్తింపు పొందాయని, అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆకాశ వీధిలో.. పేదింటి సుమాలు

విమాన ప్రయాణం కల్పించిన ప్రభుత్వవిప్ తంగిరాల సౌమ్య

న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం

పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన పేదింటి విద్యార్థులకు విమానంలో ప్రయాణించే అవకాశం కల్పించడంతో వారిలో సంతోషం వెల్లివిరిసింది. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య వినూత్నంగా ఆలోచించి చదువులో రాణిస్తున్న పేదవిద్యార్థుల కలలకు రెక్కలు తొడిగారు. 'విమానం' సినిమా చూసి విద్యార్థుల్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అభినందనలు, సత్కారాలతో సరిపెట్టకుండా నియోజకవర్గస్థాయిలో ఎక్కువ మార్కులు సాధించిన ఆరుగురు జడ్పీ పాఠశాలల విద్యార్థులతోపాటు ఆమె గన్నవరం విమానాశ్రమం నుంచి హైదరాబాద్‌కు విమానంలో ప్రయాణించడం వారికి మరపురాని అనుభూతి కలిగించింది. వారి విమాన ప్రయాణం మరింతమంది విద్యార్థులకు ప్రేరణ కల్పిస్తోంది. విమానంలో ప్రయాణించిన ఆరుగురు విద్యార్థుల లక్ష్యాలు, అనుభూతులు వారి మాటల్లోనే..



విమానాశ్రయంలో విద్యార్థులతో ఎమ్మెల్యే

సంతోషంగా ఉంది



నాన్న హనుమంతరావు చిరు వ్యాపారి. అమ్మ ఉమామహేశ్వరి అంగన్‌వాడీ కార్యకర్త. ప్రభుత్వ విప్ సౌమ్య విమాన ప్రయాణం చేయించడం చాలా సంతోషంగా ఉంది. భవిష్యత్తులో ఉపాధ్యాయ వృత్తిలో చేరడమే నా లక్ష్యం.
- నందికట్ల కుందన వెంకట నాగశ్రీసాయి (587), కంచికచర్ల

విమానం.. ఊహించలేదు



నేను, అన్నయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకున్నాం. అన్న నియోజకవర్గంలో టాపర్‌గా నిలవగా నేను రెండో స్థానం సాధించాను. జీవితంలో విమానంలో ప్రయాణిస్తానని అనుకోలేదు. చాలా ఆనందంగా ఉంది. బ్యాంకు ఉద్యోగిగా స్థిరపడాలనేది నా ఆకాంక్ష.
- నందికట్ల కుందన వెంకట నాగశ్రీ(584), కంచికచర్ల

కల నెరవేరింది



మా సొంతూరు జగ్గయ్యపేట మండలం అన్నవరం. చందర్లపాడు మండలం ముప్పాళ్ల ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలలో చదివాను. తల్లిదండ్రులు యలమందయ్య, మంజుభార్గవి వ్యవసాయ పనులు చేస్తారు. విమాన కల నెరవేరింది. నా ధ్యేయం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.
- సీహెచ్. యశస్విని(583), ముప్పాళ్ల

ఐఏఎస్ అవ్వాలనుకుంటున్నా..



తల్లిదండ్రులు ప్రసాద్, శివమ్మ వ్యవసాయ కూలీలు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో కష్టపడి చదవడంతో ఎక్కువ మార్కులు వచ్చాయి. విమాన ప్రయాణం ఊహించలేదు. భవిష్యత్తులో ఐఏఎస్ కావాలనేది నా లక్ష్యం.
- పెసరమల్లి అనూష(577), తోటరావులపాడు

మరచిపోని అనుభూతి



తల్లిదండ్రులు నాగబ్రహ్మారెడ్డి, కరుణ వ్యవసాయ పనులు చేస్తుంటారు. విమాన ప్రయాణం జీవితాంతం గుర్తుండిపోతుంది. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రాణిస్తాను.
- గూడూరు గణేష్‌రెడ్డి (573), అల్లూరు

నాన్న లేని లోటు అమ్మ తీర్చింది



మాది కొణతాలపల్లి. వెల్లంకి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివాను. తండ్రి శ్రీనివాసరావు ఏడాది కిందట మృతి చెందారు. అమ్మ పద్మావతి కూలికెళ్తుంది. విమాన ప్రయాణం బాగుంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా.- సిరివేరు నవ్య(570), కొణతాలపల్లి

మళ్లీ ధాన్యం సేకరణ లక్ష్యం పెంపు ప్రతిపాదన

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో రబీ ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచాలని అధికారులు మరోసారి ప్రతిపాదించారు. తొలుత 10,000 మెట్రిక్ టన్నులే లక్ష్యంగా ఉంది. రైతుల విజ్ఞప్తుల మేరకు 50,000లకు పెంచారు. లక్ష్యం పూర్తి కావడంతో మరో 10,000 టన్నులు పెంచారు. ఇదీ పూర్తి కావొస్తుండడంతో పెంపునకు మరోసారి ప్రతిపాదించారు.

59,115 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు: జిల్లాలో 60,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా ఉండగా, మంగళవారం నాటికి 4,931 మంది రైతుల నుంచి రూ.130.09 కోట్ల విలువ చేసే 59,115.200 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సతీష్ తెలిపారు. రైతులకు రూ.122.22 కోట్ల మేర చెల్లించారు. అధికంగా తిరువూరు డివిజను పరిధిలో 26,376.280 టన్నులు, విజయవాడ 24,046.280, నందిగామలో 8,692.640.. వెరసి 59,115.200 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు. రైతు సేవా కేంద్రాలకు ఇప్పటి వరకు 17,14,059 గోనె సంచులు సమకూర్చామన్నారు. రైతులకు సమస్యలు ఎదురైతే విజయవాడలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 77020 03571కు తెలియజేయాలని ఆయన సూచించారు.

మెచ్చిన చోట.. నచ్చిన ఆట..!

సెలవుల్లో ఆడేయండి..!

ఎన్టీఆర్ జిల్లాలో విరివిగా శిక్షణ శిబిరాలు




విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే



చిన్నారులూ.. ఆడుకోవడానికి ఇదే సమయం. వేసవి సెలవుల సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకునే సదావకాశం. మీ అభిరుచికి తగినట్లుగా.. నచ్చిన ఆటపాటల్లో నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడానికి రకరకాల వేదికలు ఉన్నాయి. చరవాణులకు దూరంగా.. శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదం చేసేలా పలు రకాల శిక్షణ కార్యక్రమాలు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాయి. తల్లిదండ్రులు సైతం తమ తమ పిల్లలకు ఆటలను పరిచయం చేయండి. చిన్నారుల మానసిక వికాసానికి సరైన నిర్ణయం తీసుకోండి. ప్రభుత్వం నామమాత్రపు ఫీజుతో శిక్షణ ఇస్తోంది.

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో ఉదయం 6–9, సాయంత్రం 5–7 గంటల మధ్య శిక్షణ ఇస్తున్నారు.

వేదిక	శిక్షణనిచ్చే అంశాలు
ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియం, మహాత్మాగాంధీ రోడ్డు. 	అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, ఫుట్‌బాల్ జూడో, కబడ్డీ, నెట్‌బాల్, సాఫ్ట్ టెన్నిస్, తైక్వాండో, టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్.
రైల్వే స్టేడియం	అథ్లెటిక్స్, కబడ్డీ,
ఎంబీపీ స్టేడియం, అజిత్‌సింగ్‌నగర్	అథ్లెటిక్స్, హాకీ
ఆంధ్రా లయోలా కళాశాల	అథ్లెటిక్స్
ఓల్గా ఆర్చరీ అకాడమీ, మహానాడు రోడ్డు, గుణదల	ఆర్చరీ
కేబీసీ జడ్పీహెచ్ స్కూల్, పటమట	బాస్కెట్‌బాల్, నెట్‌బాల్
డీఆర్ఆర్ఎంసీ ఇండోర్ స్టేడియం	బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్
సీహెచ్ఆర్‌కే ఇండోర్ స్టేడియం, పటమట.	బ్యాడ్మింటన్
కేవీకే, కృష్ణలంక	బాక్సింగ్, యోగా
ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్, కొత్తపేట	బాక్సింగ్, రెజ్లింగ్
జడ్పీహెచ్ స్కూల్, నిడమానూరు.	ఫుట్‌బాల్
రైల్వే మైదానం, గుంటుపల్లి	ఫుట్‌బాల్
జడ్పీహెచ్ స్కూల్, నున్న.	హ్యాండ్‌బాల్, హాకీ
వైఎస్సార్ జక్కంపూడి కాలనీ	జూడో
శుభోదయ హైస్కూల్, అజిత్‌సింగ్‌నగర్.	జూడో
కేఆర్‌వీఆర్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ క్లబ్, కండ్రిక	జూడో
సత్యనారాయణపురం రైల్వే కాలనీ మైదానం.	కబడ్డీ
జడ్పీహెచ్ స్కూల్, అంబాపురం	కబడ్డీ
జడ్పీహెచ్ స్కూల్, తిరువూరు	కబడ్డీ
కేవీకే, జగ్గయ్యపేట	పవర్ లిఫ్టింగ్
ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాధానగర్	సాఫ్ట్‌బాల్
పాయకాపురం	సాఫ్ట్‌బాల్
జడ్పీహెచ్ స్కూల్ (అల్లూరు, జి.కొండూరు, కొండపల్లి, వీరులపాడు)	వాలీబాల్
తిరువూరు	వెయిట్ లిఫ్టింగ్
పున్నమి ఘాట్, భవానీపురం	వాటర్ స్పోర్ట్స్
చిట్టినగర్	ఉష (మార్షల్ ఆర్ట్స్)
స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ క్లబ్, భవానీపురం	బాక్సింగ్





నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో..

వేదిక	శిక్షణనిచ్చే అంశాలు	సమయం గంటల్లో
గాంధీనగర్ సర్ విజ్జి ఈత కొలను	ఈత	ఉ. 7-10 సా. 4-7
కేఎల్ రావు ఈత కొలను	ఈత	ఉ. 7-9, సా. 5-7
గురునానక్ కాలనీ ఈత కొలను	ఈత	ఉ. 7-9, సా. 5-6.
డీఆర్ఆర్ఎంసీ ఇండోర్ స్టేడియం, మహాత్మాగాంధీ రోడ్డు	రోలర్ స్కేటింగ్ (5-9 సంవత్సరాల్లోపు) బ్యాడ్మింటన్	ఉ. 5.30-7 సా. 5-6 ఉ. 9.30-11, సా. 4.30-7.30
జీవీఎస్ శాస్త్రి పార్కు, సత్యనారాయణపురం	రోలర్ స్కేటింగ్ (5-9 సంవత్సరాల్లోపు)	ఉ. 5.30-7 సా. 5-6.
రోజ్ గార్డెన్స్, భవానీపురం	రోలర్ స్కేటింగ్ (5-9 సంవత్సరాల్లోపు)	ఉ. 5.30-7 సా. 5-6.
సీహెచ్ఆర్‌కే ఇండోర్ స్టేడియం, పటమట 	బ్యాడ్మింటన్ యోగా	ఉ. 9.30-11, సా. 4.30-7.30 ఉ. 7.30-9 సా. 5-6.30

అన్న సంతర్పణ సమితి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా..

వేదిక	శిక్షణనిచ్చే అంశాలు	సమయం గంటల్లో
విజయ నర్సింగ్ కళాశాల, దుర్గాపురం 	డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్, క్రాఫ్ట్ వర్క్, క్లే వర్క్, స్పోకెన్ ఇంగ్లిష్, తైక్వాండో, వెస్ట్రన్, ఫోక్, దాండియా, జానపద నృత్యం.	ఉ. 8.30-10. ఉ. 10-11 ఉ. 11-12.30 

లక్ష్యం.. నూరు శాతం ఉత్తీర్ణత

'పది' తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

పదో తరగతి పరీక్ష తప్పిన విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. వారంతా కొద్దిరోజుల్లో జరగబోయే సప్లిమెంటరీ పరీక్ష రాసి ఉత్తీర్ణులయ్యేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఫలితాలు మెరుగు పడేందుకు కృషి చేస్తున్నారు.

159 పాఠశాలల్లో.. జిల్లాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షకు ప్రభుత్వ పాఠశాలల నుంచి 11,524 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో 8748 మంది ఉత్తీర్ణులయ్యారు. 2,777 మంది తప్పారు. జిల్లా విద్యాశాఖ నూరు శాతం ఫలితాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాది డిసెంబరు నుంచి మార్చి 15 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించింది. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు. అందుకే జిల్లా విద్యాశాఖాధికారి పాస్ కాని విద్యార్థులందరూ ఈనెల 19 నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో విజయం సాధించాలని లక్ష్యాన్ని పెట్టుకున్నారు. జిల్లాలోని 159 పాఠశాలల్లో రోజూ ఉదయం 8 నుంచి 11:45 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకుంటున్నారు. ముఖ్యమైన అంశాలు చదివిస్తున్నారు. వారాంతపు పరీక్షలు నిర్వహించి వచ్చిన మార్కుల ఆధారంగా లోపాలను అధిగమించేలా చూస్తున్నారు. బృంద చర్చలు నిర్వహించి, సందేహాలు నివృత్తి చేస్తున్నారు.



మూలపాడు జడ్పీఉన్నత పాఠశాలలోని ప్రత్యేక తరగతిలో పాఠ్యాంశాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం

పది పరీక్ష తప్పిన వారంతా ఉత్తీర్ణులు కావాలనేది లక్ష్యం. ప్రణాళిక రూపొందించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి కూడా తరగతులు నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. సమయం తక్కువగా ఉన్నందున ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

\- యూవీ సుబ్బారావు, జిల్లా విద్యాశాఖాధికారి



త్వరలో పర్యాటక ప్యాకేజీలు

పాయకాపురం, న్యూస్‌టుడే : జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో పర్యాటకులకు మధురానుభూతి కలిగేలా రూపొందించిన ప్రత్యేక ప్యాకేజీలు త్వరలో అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ జి.లక్ష్మీశ వెల్లడించారు. నగరంలోని కలెక్టరేట్‌లో పర్యాటకశాఖ అధికారులు, టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెన్సీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 1-4 రోజుల పర్యాటక ప్యాకేజీలు, సందర్శకులకు అందుబాటులో ఉన్న ప్రాంతాలపై సమీక్షించారు. పర్యాటకులను ఆకర్షించే సౌకర్యాలు, సంపదలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కనకదుర్గమ్మ ఆలయం, కొండపల్లి ఖిల్లా, పవిత్ర సంగమం, భవానీ ద్వీపం, డా. బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం, ఉండవల్లి గుహలు, మంగళగిరి ఎకో పార్కు, వంటి 27 దర్శనీయ ప్రాంతాలను ప్యాకేజీలో చేర్చామన్నారు. హోటళ్లు, ట్రావెల్ ఏజెన్సీ సంఘాలతో చర్చించి ప్రణాళిక రూపొందించాల్సిన ఆవశ్యకత ఉందని అధికారులను సూచించారు. మెరుగైన ఆతిథ్యం, సేవలపై ఆపరేటర్లు, డ్రైవర్లకు శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. గైడ్లుగా స్థిరపడేందుకు 50 మంది యువతకు శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. అమరావతికి గేట్‌వే విజయవాడ అని, నగరానికి గౌరవం పెరిగేలా, జిల్లాకు మంచిపేరు తీసుకురావడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ జిల్లా అధికారి ఎ.శిల్ప, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో తరుణ్ కాకాని, టూర్స్ అండ్ ట్రావెల్స్ ఏజెన్సీల సంఘం సభ్యుడు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



పర్యాటక శాఖ అధికారులు, సంఘం సభ్యులతో సమావేశమైన కలెక్టర్ లక్ష్మీశ

జిల్లా ఖ్యాతి పెంచండి

పాయకాపురం, న్యూస్‌టుడే : జిల్లా ఖ్యాతి పెంచడంలో మీడియా సంస్థలు, సామాజిక మాధ్యమాల ప్రతినిధులు భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో సామాజిక మాధ్యమ ఛానళ్ల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక ప్రపంచంలో సామాజిక మాధ్యమాలు అన్ని రంగాల్లోనూ ముఖ్య భూమిక పోషిస్తున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో జిల్లా అభివృద్ధికి దోహదం చేసే కథనాలను ప్రజలకు అందించాలని కోరారు. 2024-25 జిల్లా తలసరి ఆదాయం రూ.2.52 లక్షలుగా ఉందని, 2047 నాటికి రూ.55 లక్షలకు చేరుకోవాలని లక్ష్యం నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. దీనిని సాధించాలంటే.. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందని చెప్పారు. జిల్లా స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో సేవారంగం వాటా 2024-25లో దాదాపు 68శాతంగా ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో సేవారంగంలో పర్యాటకం మరింత అభివృద్ధికి అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. పీ4 కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు.. సంపన్నుల మంచి మనసుతో పేద కుటుంబాలను, బంగారు కుటుంబాలు-మార్గదర్శులను ఒకే వేదికపైకి తీసుకువచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సామాజిక మాధ్యమాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

తెదేపా సానుభూతిపరుడి మృతి

వైకాపా వర్గీయుల ఘర్షణతో తీవ్ర మనస్తాపం ★ బంధువుల నిరసన

చందర్లపాడు, న్యూస్‌టుడే: ఊళ్లో జరిగే భోజనాలకు పిలవలేదనే కక్షతో వైకాపా సానుభూతిపరుడి కుటుంబ సభ్యులు తెదేపా సానుభూతిపరుడి ఇంటిపై వెళ్లి ఘర్షణకు దిగడంతో మనస్తాపం చెందిన తెదేపా సానుభూతిపరుడు మరణించిన సంఘటన ముప్పాళ్లలో మంగళవారం చోటుచేసుకుంది అని ఎస్సై దుర్గా ఉమామహేశ్వరరావు తెలిపారు. పొలిమేర గురవయ్య(42) గ్రామంలో శుభకార్యక్రమాల నిర్వహించినపుడు కుటుంబ తరపున నగదు తీసుకొని వారు ఇచ్చిన జాబితా ప్రకారం బంధువులకు చెప్పి భోజనాలకు పిలుస్తుంటారు. తమను ఎందుకు పిల్చిలేదని వైకాపా సానుభూతిపరుడైన బంబురాజు పోతురాజు ఆగ్రహం వ్యక్తం చేసి సోమవారం రాత్రి పోతురాజు, అతని భార్య జానమ్మ, కుమారుడు వార్డు సభ్యుడైన సురేంద్ర గురవయ్య ఇంటికి వెళ్లి గొడవకు దిగారు. దీంతో మనస్తాపానికి గురైన గురవయ్య ఆందోళన చెంది గుండెపోటుతో తెల్లవారుజామున మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహంతో మృతదేహాన్ని పోతురాజు ఇంటి ముందు ఉంచి గురవయ్య మరణానికి కారణమైనవారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. పోలీసులు ఆందోళనకారులకు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు. భార్య చిన్నమ్మాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



పోతురాజు ఇంటి ముందు ఆందోళన

జాతీయ సమ్మె జయప్రదానికి పిలుపు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : లేబర్‌కోడ్ రద్దు, నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని తదితర డిమాండ్లతో ఈ నెల 20న తలపెట్టిన జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో రైతు, కార్మిక సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలకు మద్దతు ధర కల్పించడంతో పాటు రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలు రద్దు చేయాలని, కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలని కోరారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్‌ల అమలుతో కార్మికుల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని చెప్పారు. రైతు సంఘం నాయకులు కె.వి.వి.ప్రసాద్, వై.కేశవరావు మాట్లాడుతూ.. ఇండో అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌ను తిరస్కరించాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి, రోజు వారీ కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఆలోచనను విరమించుకోవాలని, నెట్, చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూల చట్టాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చుండూరు రంగారెడ్డి, పోలారి, ఎం.సూర్యనారాయణ, డి.హరినాథ్, ఎం.వెంకటరెడ్డి, యు.రీబాబు, పోతురాజు, మేకల ప్రసాద్, పగడాల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో శోభనాద్రీశ్వరరావు, ఉమామహేశ్వరరావు, ప్రసాద్, కేశవరావు తదితరులు

సిటీ ఆర్డినరీ కొత్త బస్సు



బస్సును పరిశీలిస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

విజయవాడ బస్‌స్టేషన్, విద్యాధరపురం, న్యూస్‌టుడే: విజయవాడ విద్యాధరపురం ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా తయారు చేసిన కొత్త సిటీ ఆర్డినరీ బస్సును ఆర్టీసీ ఎండీ పరిశీలన కోసం మంగళవారం ఆర్టీసీ హౌస్ ప్రధాన కార్యాలయం వద్దకు తీసుకువచ్చారు. సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు బస్సును క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇదే విధంగా రాష్ట్రంలోని మిగిలిన జోన్ల పరిధిలో గల వర్క్‌షాప్‌లలో బస్‌బాడీలకు కావాల్సిన వనరులు, సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అనంతరం బస్సు నిర్మాణంలో భాగస్వాములైన ఉద్యోగులను, సిబ్బందిని, సూపర్‌వైజర్లను వర్క్స్ మేనేజర్లను అభినందించారు. సంస్థ ఈడీలు జీవీ రవివర్మ, ఎ.అప్పలరాజు, జి. విజయరత్నం ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణాధికారి ఎంవై దానం చీఫ్ మెకానికల్ ఇంజినీర్ నాగేశ్వరరావు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

శాసన సభ్యుడు సుజనా చౌదరి క్షేమం

భవానీపురం: విజయవాడ పశ్చిమ శాసన సభ్యుడు సుజనాచౌదరి క్షేమంగా ఉన్నారని, ప్రజలెవ్వరూ ఆందోళన చెందవద్దని కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. లండన్‌లో సుజనా చౌదరి స్వల్ప ప్రమాదానికి గురయ్యారని, భుజానికి గాయమైందని వెల్లడించారు. హైదరాబాద్ చేరుకున్న ఆయనకు ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స తీసుకున్నారని తెలిపారు. సర్జరీ చేయడంతో విశ్రాంతి తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -144 రిటైల్ ధర 166 చికెన్ విత్ స్కిన్ - 241, చికెన్ స్కిన్‌లెస్ - 274.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 150, 159, 170 చికెన్ విత్ స్కిన్ - 290 చికెన్ స్కిన్‌లెస్ - 300.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 500 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.83/-.

ధర వరలు

వంకాయలు-22, టమాటా-15, బెండ-18, పచ్చిమిర్చి-24, కాకర-32, బీర-28/34, క్యాలీ ఫ్లవర్-20/25, క్యాబేజి-14, క్యారెట్-28, దొండ-16, బంగాళదుంప-27, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-28, దోస-18, సొర-10/8, పొట్ల-20/25, అరటికాయ-6/5, చామదుంప-40, అల్లం-50, మునగ-5/4, ఆకు కూరలు (కట్ట)-3, కంద-78, బీట్ రూట్-26, కీరదోస-36, బీన్స్-66/80, క్యాప్సికమ్-56, నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

మాటలతో మాయ చేసి.. మైత్రీ యాప్‌తో ముంచేసి

ఒకసారి పెట్టుబడి.. జీవితాంతం ఆదాయమని మోసం

పటమట, రామవరప్పాడు, న్యూస్‌టుడే

'మాది తమిళనాడులో పెద్ద మార్కెటింగ్ కంపెనీ. మా కంపెనీకి చెందిన మైత్రీ యాప్‌లో ఒకసారి పెట్టుబడి పెడితే జీవితాంతం లాభం వస్తుంది' అని సంస్థ ప్రతినిధులు నమ్మబలికారు. డబ్బులు కట్టించుకొని... రెండు నెలలు నగదు చెల్లించి తరువాత ఎగనామం పెట్టిన ఘటన ఎనికేపాడులో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. ఎనికేపాడు శివాలయం వీధిలో జిన్నా మార్కెటింగ్ యాప్ పేరుతో కార్యాలయం ఉంది. మైత్రీ యాప్‌లో ఒకసారి రూ.1.22 లక్షలు పెట్టుబడి పెడితే.. రోజుకు రూ.480 చొప్పున జీవితాంతం వస్తుందని ఆ సంస్థ ప్రతినిధులు నమ్మబలికారు. 2024లో కొంత మంది పెట్టుబడి పెట్టారు. వారికి రోజుకు రూ.480 చొప్పున చెల్లించారు. రెండు నెలలు చెల్లించిన తర్వాత పెట్టుబడిదారులు.. ఇంకా ఎవరినైనా చేర్పిస్తే... రోజూ చెల్లించే రూ.480తో పాటు కమీషన్‌గా మరో రూ.200 చెల్లిస్తామని, ఒక్కొక్కరు ఏడుగురిని చేర్పించవచ్చని చెప్పారు. ఫలితంగా కొందరు తమకు తెలిసిన వ్యక్తులతో పెట్టుబడి పెట్టించారు. తర్వాత రెండు నెలల పాటు నగదు సక్రమంగా చెల్లించారు. అనంతరం ఎన్నికల కోడ్ వచ్చిందని, తమ సంస్థపై ఈడీ దాడులు జరిగాయని త్వరలో నగదు వేస్తామని చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో యాప్‌ని ఆపేశారు. బాధితులు ఎనికేపాడులోని కార్యాలయానికి వెళ్లగా... అక్కడ ఉద్యోగులు లేరు. చివరికి సోమవారం ముగ్గురు బాధితులు పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వీడియో చూస్తేనే డబ్బులు..

యాప్‌లో పెట్టుబడి పెట్టిన తర్వాత రోజూ వారు పంపిన వీడియోలు యూట్యూబ్‌లో చూసి, దానికి సంబంధించిన ప్రశ్నలకు యాప్‌లో సమాధానాలు ఇస్తేనే డబ్బులు ఇచ్చేవారు. అలా రోజుకి 30 వీడియోలకు పైగా పెట్టుబడిదారులు చూసేవారు. వచ్చిన నగదు యాప్‌లో వాలెట్‌కు అనుసంధానం అయ్యేది. ఆ నగదు నెలలో ఒకసారి మాత్రమే తమ బ్యాంకు ఖాతాకు బదిలీ చేసుకునే అవకాశం ఉండేది. యాప్‌లో వందల మంది పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తుంది. కమీషన్ కోసం కక్కుర్తి పడి తెలిసిన వారిని చేర్పిస్తే అసలుకే మోసం వచ్చిందంటూ లబోదిబోమంటున్నారు. గత నెలలో గుణదల స్టేషన్‌లో 25 మంది, సోమవారం పటమట స్టేషన్‌లో ముగ్గురు ఫిర్యాదులు చేశారు. సంస్థ ఉద్యోగుల ఫోన్లు స్విచ్ఛాఫ్ వస్తున్నాయని, కార్యాలయంలో ఎవరు లేరని, బ్యాంకు ఖాతా వివరాల ఆధారంగా సమాచారం సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు పటమట పోలీసులు తెలిపారు.

జాతీయ పోటీల్లో ప్రతిభ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : మైలవరం మండలం కనిమెర్ల ప్రాథమిక పాఠశాల చిన్నారులు ఆంగ్ల (ఇంగ్లిషు) వర్డ్ పవర్‌లో చక్కని ప్రతిభకనబరిచి జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచారు. వీరిని నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశ మంగళవారం అభినందించి, బహుమతులు అందజేశారు. ముంబయిలో గత నెల 23న జాతీయ స్థాయి ఆంగ్ల వర్డ్ పవర్ పోటీలు నిర్వహించారు. ఇందులో కనిమెర్ల పాఠశాలకు చెందిన నాలుగో తరగతి విద్యార్థి రేవంత్ ప్రథమ స్థానం, రెండో తరగతి విద్యార్థిని సింధు ప్రియ ద్వితీయ స్థానాలు గెలుపొందారు. 2 నుంచి 5 తరగతుల వరకు నాలుగు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయిని విజయలక్ష్మిని కలెక్టర్ సత్కరించి, అభినందించారు. డీఈవో యు.వి. సుబ్బారావు, సమగ్ర శిక్షా ఏపీసీ జి.మహేశ్వరరావు, ఏఎంవో అశోక్‌బాబు పాల్గొన్నారు.



రేవంత్, సింధు ప్రియతో కలెక్టర్ లక్ష్మీశ, సుబ్బారావు, మహేశ్వరరావు

అనధికార వెండర్లను ప్రోత్సహిస్తే చర్యలు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: రైల్వేస్టేషన్‌లో అనధికారికంగా ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, అటువంటి వారిని ప్రోత్సహిస్తే క్యాంటీన్లు, స్టాళ్ల టెండర్ల రద్దుకు కూడా వెనుకాడబోమని రైల్వే విజిలెన్స్ అధికారులు స్పష్టం చేశారు. మంగళవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్‌తో కలిసి అన్ని ప్లాట్‌ఫారాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. వెండర్ల గుర్తింపు కార్డులు, స్టాళ్ల లైసెన్స్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా ఆహార పదార్థాలు విక్రయిస్తున్న పలువురు వెండర్లను గుర్తించి జరిమానాలు విధించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఆర్పీఎఫ్ పోలీసులు కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.4.65 లక్షలు జరిమానా వసూలు చేశారు. ఎస్‌డీజీఎం, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమీషనర్లను దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు. ప్రయాణికులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రయాణికుల ఫిర్యాదులపై అన్ని విభాగాల అధికారులు తక్షణమే స్పందించాలని జీఎం ఆదేశించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సమష్టిగా పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: అన్ని విభాగాలు సమష్టిగా పనిచేస్తేనే విశ్వవిద్యాలయం మెరుగైన ఫలితాలు సాధిస్తుందని విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ అన్నారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం పరిపాలన, ఆర్థిక, అకడమిక్, పరీక్షల విభాగాల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయా విభాగాలన్నీ పారదర్శకంగా పని చేయాలని, విశ్వవిద్యాలయ ప్రతిష్ఠ పెంచాలని వీసీ సూచించారు. ఉద్యోగులంతా నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని అన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి, విభాగాధిపతులు, జాయింట్ రిజిస్ట్రార్లు, డిప్యూటీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ చంద్రశేఖర్ తదితరులు

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? ఎగువ నుంచి వచ్చిన వర్షపు నీరు, వ్యర్థాలు కొండపల్లి కొత్త బి.కాలనీ వద్ద ఉన్న కాలువలో పేరుకున్నాయి. దీంతో ఇబ్బందిగా ఉంటుంది. **- వెంకటేశ్వరరావు, స్థానికుడు**

✔ వర్షపు నీరు వల్ల అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి తలెత్తింది. ప్రాధాన్యత క్రమంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నాం. **- పవన్, పారిశుద్ధ్య మేస్త్రీ**

స్పందనకు వందనం

★ ఇబ్రహీంపట్నం నిమ్రా కళాశాల జాతీయ రహదారిపై కంకర పడటంతో ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను జాతీయ రహదారి గుత్తేదారు సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వారు స్పందించి ఆ ప్రాంతంలోని కంకరను తొలగించారు.



తిరువూరులో చెత్త తొలగిస్తున్న కార్మికులు

★ పట్టణంలోని 13వ వార్డులో రహదారుల వెంట చెత్త పేరుకుందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగాకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. కార్మికులతో వాటిని తొలగింపజేశారు.

★ స్థానిక 4వ వార్డులోని రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు పెరిగాయని స్థానికులు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు.

★ స్థానిక 6వ వార్డులోని వాటర్ ట్యాంకు రోడ్డులో మురుగు కాల్వలో తొలగించిన వ్యర్థాలు అలానే ఉన్నాయని స్థానికులు చేసిన ఫిర్యాదును సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. కార్మికులతో తొలగింపజేశారు.

- న్యూస్‌టుడే, తిరువూరు, కొండపల్లి

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



చిన్నారితో మాట్లాడుతున్న తహసీల్దార్ సుశీలాదేవి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మద్దులపర్వ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, రేషన్ దుకాణాలను, ముచ్చనపల్లి సమీపంలోని పెట్రోల్ బంక్‌ను తహసీల్దార్ జె.సుశీలాదేవి మంగళవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని సరకులు, మౌలిక వసతులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్ఐ జి.పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, వీఆర్వో నీలయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు..

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని శ్రీరాంపురం, ముచ్చనపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో టి.కె.వి.రమణ మంగళవారం తనిఖీ చేశారు. కూలీల హాజరు పరిశీలించారు. మండలంలోని గ్రామాల్లో 5,400 మంది ఉపాధి హామీ పనులకు హాజరైనట్లు ఏపీవో వెంకటేశ్వరరావు తెలిపారు.

రుణ లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి వినతి

కొండపల్లి, న్యూస్‌టుడే : మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందే లబ్ధిదారుల సమస్యలను పరిగణలోకి తీసుకొని వాటిని పరిష్కరించాలని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఫైజాన్ కోరారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) ఫర్జానా బేగంను తెదేపా మైనార్టీ నాయకులు విజయవాడ పటమట కార్యాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా నాయకులు అఫ్సర్, హాఫీజ్ రెహమాన్, మాబూబ్, ఫర్హాన్ ఆమెను సత్కరించారు.



మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీని సత్కరిస్తున్న మైనార్టీ నాయకులు

కొత్త పాఠ్య పుస్తకాలు వచ్చాయ్..!

న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

రానున్న విద్యా సంవత్సరంలో పాఠశాలల పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' పేరిట కిట్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ మేరకు మైలవరం నియోజకవర్గంలోని మండల స్టాకు పాయింట్లకు జిల్లా కమిటీ పాఠ్య పుస్తకాలను సరఫరా చేశారు. దీంతో మండల విద్యా శాఖకు చెందిన సిబ్బంది వీటిని స్కూల్స్‌కు పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. కమిటీల నేతృత్వంలో పంపిణీ సజావుగా సాగేలా ఏర్పాట్లు చేసింది. గతేడాది విద్యాకానుక కిట్లు సకాలంలో అందక విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. పంపిణీలో సైతం గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది.

❖ పర్యవేక్షిస్తూ..

నియోజకవర్గంలో మొత్తం 164 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 23 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరికి మిత్ర కిట్లు అందజేయనున్నారు. ఇందులో పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బెల్ట్, బూట్లు ఉంటాయి. వీటికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీలో సమగ్ర శిక్షా ఏపీసీ అధ్యక్షుడిగా ఉంటారు. సీఎంవో కన్వీనర్‌గా, జీసీడీవో, ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఏఎల్ఎస్వోలు సభ్యులుగా వ్యవహరిస్తారు. వీరు జిల్లా కేంద్రంలో, మండల స్థాయిలో నిల్వ పాయింట్లు గుర్తించి పర్యవేక్షిస్తారు. దస్త్రాలు నిర్వహిస్తూ రోజువారీ నివేదికలు పంపిస్తారు.



స్టాక్ పాయింట్‌లో సరిచూస్తున్న విద్యా శాఖ సిబ్బంది

❖ మండల స్థాయిలో..

మండల స్థాయి కమిటీలో ఎంఈవో- 2 అధ్యక్షుడిగా ఉంటారు. ఎంఈవో- 1, మండల ఇంజినీరు, ఎంఐఎస్ సమన్వయకర్త లేదా డేటా ఎంట్రీ ఆపరేటర్, సీఎంఆర్టీతో సహా మరో ముగ్గురు సభ్యులుంటారు. కిట్లను మండల స్టాక్ పాయింట్‌కు చేర్చి సరిచూసుకొని రసీదులు ఇవ్వడం. యాప్‌లో అప్‌లోడు చేయడం, పాఠశాలకు చేర్చడం రోజువారీ నివేదికలు సేకరించడం, దస్త్రాల నిర్వహణ వీరి బాధ్యత. పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయుడు ఛైర్మన్‌గా ఉంటారు. సంబంధిత తరగతి ఉపాధ్యాయుడు, సచివాలయ విద్యా సహాయకుడు, మహిళ పోలీసు, తల్లిదండ్రుల కమిటీ నుంచి ఇద్దరు ప్రతినిధులు సభ్యులుగా వ్యవహరిస్తారు. వీరు విద్యార్థులకు కిట్లను పంపిణీ చేయడం, నివేదికలు అందించడం లాంటివి చేస్తారు.

❖ ఏర్పాట్లు పూర్తి చేశాం

ప్రస్తుతం మండల స్టాక్ పాయింట్‌కు వచ్చిన పాఠ్యపుస్తకాలను సిబ్బంది సరిచూస్తున్నారు. మరో అయిదారు రోజుల్లో కిట్లలోని మిగిలినవి వస్తాయి. విద్యార్థులకు వీటిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం.

- పుష్పలత, మండల విద్యా శాఖ అధికారిణి, ఇబ్రహీంపట్నం

ముగిసిన శ్రీనివాస ఆలయ బ్రహ్మోత్సవాలు

పెనుగొలను (గంపలగూడెం), న్యూస్‌టుడే : పెనుగొలను సమీప మెట్టగుట్టలో గజలక్ష్మి సమేత శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో మూడ్రోజుల పాటు నిర్వహించిన 35వ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయ ప్రధానార్చకుడు శ్యామ్‌సుందరాచార్యుల ఆధ్వర్యంలో రుత్విక బృందం ఉత్సవాలను నిర్వహించారు. గుడి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి.వెంకట్రావు, కార్యదర్శి ఎం.నరసింహమూర్తి, కోశాధికారి నారాయణరావు తదితరులు పర్యవేక్షించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.



పవళింపు సేవలో ఉత్సవమూర్తులు

ధాన్యం కొనుగోలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సోమవారం వరకు 1146 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు విస్సన్నపేట పీడీఎస్ డీటీ శివనాగరాజు మంగళవారం తెలిపారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం

గొల్లపూడి, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం మూలపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. గొల్లపూడిలోని ఆంధ్రా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను ఆయన మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.



గాయపడిన కార్మికుడిని పరామర్శిస్తున్న మైలవరం ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని నరసాపురం, కలగర, కొర్లమంద, వేమిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ప్రమాణీకరణ సంస్థ ఛైర్మన్ శావల దేవదత్ పర్యటించారు. రైతులు పండించిన రబీ ధాన్యం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామన్నారు. తిరువూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు ప్రభుత్వ కేంద్రాల ద్వారా 26,500 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారన్నారు. నాయకులు సాంబశివరావు, పాపారావు, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, రాజా, పెదబాబు, నరసింహారావు పాల్గొన్నారు.



నరసాపురంలో ధాన్యం పరిశీలిస్తున్న దేవదత్, తెదేపా నాయకులు

అకాల వర్షం..రైతుల్లో కలవరం

గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరు నియోజకవర్గంలో మంగళవారం సాయంత్రం బలమైన ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో తిరువూరు, విస్సన్నపేట, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లోని మామిడి రైతులు ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే ఏప్రిల్ రెండో పక్షంలో రెండు విడతలుగా వీచిన గాలులకు కాయలు నేలరాలి నష్టపోయారు. నూర్పిడి చేసిన రబీ ధాన్యాన్ని కాపాడుకోవడానికి అన్నదాతలు పరదాలు తీసుకుని కల్లాల్లోకి పరుగులు తీశారు. ఎ.కొండూరు మండలం గోపాలపురం సమీప ప్రధాన రహదారిపై చెట్టు విరిగి పడిపోవడంతో వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. పోలీసులు అక్కడకు చేరుకుని తగు చర్యలు తీసుకున్నారు. గంపలగూడెం మండలం మేడూరు- సత్యాలపాడు మధ్య చెట్టు విరిగి రోడ్డుపై పడింది. గంపలగూడెంలో సాయంత్రం 6గంటల నుంచి విద్యుత్తు సరఫరా కూడా నిలిచింది.



ఎ.కొండూరు మండలం గోపాలపురం వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు



రోడ్డుపై కూలిన భారీ వృక్షం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలో ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం పడింది. దీంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షానికి ధాన్యం రాశులు తడవకుండా కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మైలవరం, న్యూస్‌టుడే : మైలవరం, జి.కొండూరు మండలాల్లో ఈదురు గాలుల ప్రభావంతో మంగళవారం సాయంత్రం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. అధికారులు దాదాపు 2 గంటలకు పైగా సరఫరాను నిలిపివేశారు.

వారం రోజులుగా నిలిచిన కృష్ణా జలాలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండల ప్రజలకు వారం రోజులుగా కృష్ణా జలాల సరఫరా నిలిచినా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం మండల కార్యదర్శి పి.ఆనందరావు ఆరోపించారు. ఈ నేపథ్యంలో మండలంలోని వైఎస్సార్ నగర్ తండాలో మంగళవారం గ్రామస్థులతో కలిసి ఖాళీ బిందెలతో ఆయన నిరసన తెలిపారు. కిడ్నీ వ్యాధి బాధితులు అధికంగా ఉన్న ప్రాంతంలో కృష్ణా జలాలు సరఫరా చేయాలని కోరారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు, సీపీఎం నాయకులు

సీహెచ్‌వోల వ్యాఖ్యలపై ఆగ్రహం

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న సీహెచ్‌వోలు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏఎన్ఎంలు, సూపర్ వైజర్లు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నరసాయమ్మ, పీహెచ్ఎన్ పార్వతి, హెచ్‌వీ నళిని, ఎంపీహెచ్ఎస్ ఎ.పుట్టి, ఎంపీహెచ్ఏలు జయపాల్, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.



గంపలగూడెం పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న ఏఎన్ఎంలు, సూపర్ వైజర్లు, ఆరోగ్య సహాయకులు

దీపాలు వెలగవు.. ప్రమాదాలు ఆగవు

❖ హైవేలో సిగ్నల్స్ వ్యవస్థపై కొరవడిన పర్యవేక్షణ



మైలవరంలో రోడ్డుపై విరిగిన సిగ్నల్ లైటు స్తంభం

న్యూస్‌టుడే, మైలవరం, జి.కొండూరు

రాత్రి వేళల్లో వాహన ప్రమాదాల నియంత్రణ, చోదకులకు అవగాహన కోసం ఏర్పాటు చేసిన సిగ్నల్స్ వ్యవస్థ పక్కచూపులు చూస్తున్నాయి. వీటిపై జాతీయ రహదారుల శాఖ అధికారుల పర్యవేక్షణ లేక క్రమేపీ కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. దాదాపు రెండేళ్ల కిందట జాతీయ రహదారి- 30పై ఇబ్రహీంపట్నం నుంచి తిరువూరు వరకు ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలు, బైపాస్‌లు, కూడళ్లలో సౌర సిగ్నళ్లను ఏర్పాటు చేసి వాటి నిర్వహణ మరిచారు.

❖ క్రమేపీ పలుచోట్ల

ఇవి రాత్రి వేళల్లో పసుపు రంగులో వెలుగుతాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల నుంచి బయట పడతారనే ఆలోచనతో పెట్టారు. కానీ క్రమేపీ పలుచోట్ల లైట్లు వెలగడం లేదు. మరికొన్ని చోట్ల ఎటు చూస్తున్నాయో కూడా తెలియదు. మైలవరంలోని ఎల్‌హెచ్ఆర్ పాఠశాల కూడలిలో ఏర్పాటు చేసిన స్తంభం విరిగి పడిపోయి వారం రోజులవుతున్నా, అది రోడ్డుకు అడ్డంగా పడి ఉన్నా తొలగించడం లేదు. చెవుటూరు బైపాస్ ప్రారంభంలో ఏర్పాటు చేసిన స్తంభం వేరే దిక్కుకు తిరిగినా పట్టించుకునే వారు కరవయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని సరిచేయాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తవ్వుకో..అమ్ముకో

న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు యథేచ్ఛగా అక్రమంగా మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నా రెవెన్యూ, పోలీస్, నీటి పారుదల శాఖల సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో తవ్వుకో.. అమ్ముకో అన్నచందగా మట్టిమాఫియా చెలరేగిపోతున్నారు. ఎవరు మనల్ని అడ్డుకునేది అన్నట్లుగా జేసీబీతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రెడ్డిగూడెంలో ఓ గ్రామ స్థాయి నాయకుడు సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కొత్తచెరువులోని మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఉన్నతాధికారులు స్పందించి రెడ్డిగూడెం మండలంలో జరుగుతున్న మట్టిమాఫియా ఆగడాలకు అడ్డుకట్టా వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై రెడ్డిగూడెం వీఆర్వో ఎస్కే.జానీసాహెబ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు.



రెడ్డిగూడెం కొత్త చెరువులో జేసీబీతో మట్టి తవ్వకాలు

విద్యుత్తు ఛార్జీల పెంపు తగదు

మైలవరం, న్యూస్‌టుడే : వినియోగదారులపై పెనుభారం మోపేలా పెంచిన విద్యుత్తు ఛార్జీలను తగ్గించాలని వైకాపా నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్తు ఉప కేంద్రం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఏఈ రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమానికి కొద్దిమంది నేతలే హాజరు కాగా, సమన్వయకర్త జోగి రమేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించినా, ఆయన గైర్హాజరు కావడం గమనార్హం.

తిరువూరు, న్యూస్‌టుడే : విద్యుత్తు ధరలు తగ్గించాలని కోరుతూ మండలంలోని లక్ష్మీపురం విద్యుత్తు ఉప కేంద్రం వద్ద వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం డిస్కం ఏఈకి వినతిపత్రం అందించారు.



మైలవరంలో ఏఈకి వినతిపత్రం అందిస్తున్న వైకాపా నాయకులు



లక్ష్మీపురం విద్యుత్తు ఉప కేంద్రం వద్ద స్వామిదాసు తదితరులు

జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

గొల్లపూడి, న్యూస్‌టుడే : రైతులు పండించిన ధాన్యాన్ని జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. విజయవాడ గ్రామీణ మండలం పైడూరుపాడులో సీపీఐ నాయకులు మంగళవారం పర్యటించి అన్నదాతల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గత నెల 14న పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గ్రామానికి వచ్చి ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ కొనుగోలు చేయలేదన్నారు. ధాన్యాన్ని సంచుల్లో నింపి రోజులు గడుస్తున్నా మిల్లులకు తరలించక పోవడం దుర్మార్గమన్నారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్.కోటేశ్వరరావు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, యలమందారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పైడూరుపాడులో ధాన్యం పరిశీలిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, నాయకులు

80 లక్షల పని దినాలు కల్పించడమే లక్ష్యం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే : ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో ఈ ఏడాది శ్రామికులకు 80 లక్షల పని దినాలను కల్పించాలనే లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. గుంటుపల్లి వ్యాగన్ వర్కుషాపు యాజమాన్యం కేటాయించిన ఐదు ఎకరాల్లో రూ.30 లక్షల వ్యయంతో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన అమృత సరోవర్ పనులను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు జిల్లాలోని శ్రామికులకు 25 లక్షల పని దినాలు కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం పీడీ రాము, ఎంపీడీవో సునీతశర్మ, ఏపీవో ప్రమీల, అధికారులు సతీష్ చంద్ర, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



అమృత సరోవర్ పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

పరిసరాల పరిశుభ్రత అవసరం

తిరువూరు, న్యూస్‌టుడే : దోమల నిర్మూలనతో బోదవ్యాధిని అరికట్టవచ్చని పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి రేష్మాబేగం తెలిపారు. స్థానిక అర్బన్ పీహెచ్‌సీలో మంగళవారం బోదకాలు వ్యాధి బాధితులకు ఎంఎంపీడీ కిట్లు పంపిణీ చేశారు. ఇంట్లోకి దోమలు రాకుండా పరిసరాల పరిశుభ్రత, దోమల తెరల వినియోగం తదితర జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



బాధితులకు కిట్లు ఇస్తున్న డాక్టర్ రేష్మాబేగం, ఉద్యోగులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : స్థానిక పీహెచ్‌సీలో వైద్యురాలు భార్గవి ఎంఎండీపీ కిట్లను బాధితులకు పంపిణీ చేశారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో సత్తా

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి యోగా ఛాంపియన్‌షిప్‌లో స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను, శిక్షకుడు మాణిక్యాలరావును ప్రిన్సిపల్, ఉప ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపల్ అప్పారావు

భవనం పై నుంచి దూకి మహిళ ఆత్మహత్య

అగనంపూడి : భవనంపై నుంచి మహిళ దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన విశాఖలోని అగనంపూడి పరిధి షిర్డీసాయినగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. పుట్రేల గ్రామానికి చెందిన గుడ్ల వెంకట మురళీ కృష్ణారావు (60), కమల కుమారి (57) పదేళ్ల క్రితం అగనంపూడికి వలస వచ్చేశారు. గత నెల 19న ఆయన గుండెపోటుతో మృతి చెందడంతో స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. తిరిగి ఈ నెల 4న అగనంపూడి వచ్చేశారు. భర్త చనిపోయిన నాటి నుంచి కమలకుమారి తీవ్ర మనస్తాపానికి లోనయ్యారు. ఉదయం కుమార్తె మానస స్నానానికి వెళ్లగా అదే సమయంలో అపార్టుమెంట్‌పైకి వెళ్లిన కమలకుమారి అయిదో అంతస్తు నుంచి కిందకు దూకేసింది. ప్రవేశమార్గం గేటుపై పడడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. దువ్వాడ పోలీసులు మృతదేహాన్ని శవ పరీక్షకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కట్లేరు వాగులోకి దూసుకెళ్లిన కారు

వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని వినగడప సమీప కట్లేరు వద్ద కూలిన వంతెనను ఆనుకుని నిర్మించిన మళ్లింపు రహదారిపై మంగళవారం రాత్రి అదుపు తప్పి చిన్న కారు వాగులో దూసుకెళ్లింది. అందులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటకు వచ్చినట్లు తెలిసింది. మళ్లింపు రోడ్డు మలుపు వద్ద కారు అదుపు తప్పి జారీ వాగులోకి దూసుకెళ్లినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



ఏఆర్ కానిస్టేబుల్‌పై వేధింపుల కేసు

తిరువూరు, న్యూస్‌టుడే : ఖమ్మం పట్టణంలోని ముస్తాఫానగర్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ఎస్కే.ఇస్మాయిల్‌పై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై కేవీజీవీ.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. తిరువూరు శాంతినగర్‌కు చెందిన షాదాకున్‌తో పదేళ్ల కిందట ఇస్మాయిల్‌కు వివాహమైంది. రెండేళ్ల నుంచి తనను భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు ఆమె ఫిర్యాదు చేయడంతో సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఇస్మాయిల్ సత్తుపల్లిలో పోలీస్ జీపు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు షాదాకున్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



వైద్యురాలికి సమ్మె నోటీసు ఇస్తున్న ఆశా కార్యకర్తలు

మైలవరం, న్యూస్‌టుడే : ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెల్లో ఆశా కార్యకర్తలంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు పత్తిపాటి జ్యోతి కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలికి సమ్మె నోటీసు అందజేశారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : స్థానిక పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి జె.వెంకటేశ్వరరావు సమావేశం నిర్వహించారు. అనంతరం వైద్యురాలు భార్గవికి సమ్మె నోటీసు అందజేశారు. సుమలత, చంద్రకళ పాల్గొన్నారు.

తిరువూరు, న్యూస్‌టుడే : మండలంలోని చౌటపల్లి, రాజుగూడెం, అర్బన్ పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ పాల్గొన్నారు.



గంపలగూడెం పీహెచ్‌సీ వద్ద..

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని తాతకుంట్ల, మారేమండ గ్రామాల్లోని ఉపాధి కూలీలతో ఏపీ వ్య.కా.సం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.నాగరాజు, కె.కల్యాణ్ సమావేశమై సమ్మెకు మద్దతు కోరారు. నాయకులు పి.ఆనందరావు, జమలమ్మ, రుక్మిణి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి సుమంత్‌కు ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.కమల ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందించారు.



ఇబ్రహీంపట్నం : కమల ఆధ్వర్యంలో..



గనుల ఘజినీ పాపం పండింది

- అడ్డగోలుగా తవ్వకాలు.. అమ్మకాలు • పరిధి దాటి గనులు కొల్లగొట్టిన ఘనుడు
- పక్కవాళ్లనూ బెదిరించి తన ఖాతాలోకి • దోపిడీ విలువ రూ.4,310 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: అక్కడ అతడు చెప్పిందే వేదం. అతడిదే రాజ్యం. అదే గాలి జనార్దనరెడ్డి మాఫియా సామ్రాజ్యం. అప్పట్లో వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అండ చూసుకొని, అడ్డొచ్చిన వారిని తొక్కుకుంటూ.. అడ్డగోలుగా గనులు తవ్వుకుంటూ.. నిలువునా ఎదిగిన గాలి జనార్దనరెడ్డి పాపం పండటానికి పదిహేనేళ్లు పట్టింది. గాలి అక్రమ తవ్వకాల విలువ రూ.4,310 కోట్లని సీబీఐ లెక్కలు వేసింది. దీన్నిబట్టి ప్రకృతి సంపద దోపిడీ ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. న్యాయస్థానాలు సకాలంలో స్పందించడంతో అతడి కథ అడ్డం తిరిగింది. 'గాలి' దోపిడీ బహిర్గతమైంది. అనుమతులు మొదలు ఖనిజం తవ్వకాలు.. ఎగుమతులు.. తద్వారా ఆర్జించిన నిధుల మళ్లింపు వరకూ గాలి జనార్దనరెడ్డి సాగించిన విశృంఖలత అంతా ఇంతా కాదు.



టిప్పర్లలో ఇనుప ఖనిజం తరలిస్తూ..

తన మాటే శాసనం

కర్ణాటక సరిహద్దులోని ఇనుప గనుల్లో ఒకప్పుడు గాలి మాటే శాసనంగా చెలామణి అయింది. నచ్చిన చోట తవ్వుకునేవాడు... నచ్చిన ధరకు ఎగుమతి చేసుకునేవాడు. అనుమతి తీసుకున్న ప్రాంతం పరిధి దాటి తవ్వేవాడు. ఒక ప్రాంతంలో అనుమతులు తీసుకొని మరో ప్రాంతంలో తవ్వకాలు జరిపేవాడు. ఉదాహరణకు ఓఎంసీ లీజుకు తీసుకున్న గనుల్లో 40,367 టన్నుల ఖనిజం మాత్రమే తవ్వినట్లు సీబీఐ లెక్క తేల్చింది. కానీ 197 లక్షల టన్నుల మేర ఎగుమతులు చేసినట్లు సీబీఐ గుర్తించింది. అంటే తనకు అనుమతించిన ప్రాంతాన్ని దాటి ఇతర ప్రాంతాల్లోనూ అడ్డగోలుగా తవ్వకాలు చేపట్టడంతోపాటు ఇతర కంపెనీలను బెదిరించి వారు తవ్విన ఖనిజాన్ని కూడా తక్కువ ధరకు తన ఖాతాలో వేసుకున్నట్లు అర్థమవుతోంది. అంతెందుకు.. అసలు మైనింగ్ లీజు అనుమతి తీసుకున్న మర్నాడే గాలి వెయ్యి టన్నుల ఇనుప ఖనిజం ఎగుమతికి లైసెన్స్ తీసుకున్నాడు. అంటే పథకం ప్రకారం తనకు లీజు అనుమతి రాకముందే తవ్వకాలు జరిపాడని, అనుమతి వచ్చిన మర్నాటి నుంచే ఎగుమతులు మొదలుపెట్టాడని తెలుస్తుంది. రాజకీయ అండ చూసుకొని గాలి జనార్దనరెడ్డి చుట్టుపక్కల మైనింగ్ వ్యాపారులను బెదిరించేవాడు. వారి నుంచి ఖనిజాన్ని తానే కొనేవాడు. ఎంత ధరకు అమ్మాలో కూడా తానే నిర్ణయించేవాడని మహబూబ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ (ఎంబీటీ) భాగస్వామి మహ్మద్ ఇక్బాల్, జనరల్ మేనేజర్ జి.కృష్ణలు సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు. అప్పట్లో ఇనుప ఖనిజం ధర మార్కెట్లో టన్ను రూ.1000 నుంచి రూ.1200 ఉండగా తాము కేవలం రూ.600 నుంచి రూ.700కే విక్రయించామని, ఎదురు చెప్పే పరిస్థితి ఉండేది కాదని పేర్కొన్నారంటే గాలి ఈ ప్రాంతాన్ని ఎంతలా శాసించేవాడో అర్థం చేసుకోవచ్చు. అనేకమంది చిన్నా చితకా మైనింగ్ వ్యాపారులదీ ఇదే పరిస్థితి.

డొల్ల కంపెనీల్లోకి నిధుల మళ్లింపు

అక్రమంగా ఆర్జించిన సొమ్మును సక్రమం చేసుకునేందుకు గాలి జనార్దనరెడ్డి పెద్ద వ్యవస్థనే నెలకొల్పాడు. దేశవ్యాప్తంగా అనేక డొల్ల కంపెనీలు ఏర్పాటు చేశాడు. ఖనిజం అమ్మకాల్లో లెక్కలు తారుమారు చేశాడు. అలా వచ్చిన సొత్తును డొల్ల కంపెనీల్లోకి మళ్లించి వాటి ద్వారా ఆస్తులు కూడబెట్టుకున్నాడు. ఉదాహరణకు గాలికి చెందిన బ్రహ్మణి ఇండస్ట్రీస్ కర్ణాటక లిమిటెడ్ అనే సంస్థ ఖాతాలోకి ముంబయి, కోల్‌కతాకు చెందిన పలు బోగస్ కంపెనీల నుంచి రూ.వందల కోట్ల రూపాయలు వచ్చినట్లు సీబీఐ దర్యాప్తులో తేలింది. ఇలా నిధులు మళ్లించిన సంస్థలన్నీ గాలి స్థాపించిన బోగస్ సంస్థలేనని, వాటి ద్వారా ఖనిజం ఎగుమతుల లావాదేవీలు జరిపినట్లుగా చూపించి, తద్వారా ఆర్జించిన మొత్తాన్ని మళ్లీ తన అధికారిక సంస్థల్లోకి మళ్లించుకున్నాడని సీబీఐ తేల్చింది. ఎందుకంటే గాలికి చెందిన బ్రహ్మణి సంస్థలోకి నిధులు తరలించిన కంపెనీలే ఆయన వ్యక్తిగత సహాయకుడైన మెఫజ్ అలీఖాన్‌కు చెందిన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లోనూ పెట్టుబడులు పెట్టాయి. అంటే గాలి నిధులే ఇలా అడ్డదారుల్లో వివిధ కంపెనీలు, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లోకి చేరాయన్నమాట. మెఫజ్, అతని సన్నిహితులు రూ.25 కోట్లు వెచ్చించి బెంగళూరు విమానాశ్రయ సమీపంలో 250 ఎకరాల కొన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ మొత్తాన్ని ముంబయికి చెందిన థర్డ్ ఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సమకూర్చింది. థర్డ్ఐ ఇన్‌ఫ్రాలోకి ముంబయి, కోల్‌కతాల్లో ఉన్న పలు కంపెనీల నుంచి నిధులు వచ్చినట్లు రికార్డుల్లో ఉంది. అయితే ఈ రికార్డుల్లోని చిరునామాల ప్రకారం సీబీఐ నోటీసులు జారీ చేసినా వాటి నుంచి సమాధానం రాలేదు. అంటే ఆ కంపెనీలన్నీ కాగితాల మీదనే ఉంటాయని అర్థమవుతుంది. అక్రమ మైనింగ్ ద్వారా ఆర్జించిన సొమ్ముకు చట్టబద్ధత తీసుకొచ్చేందుకే ఇలా నిధులు మళ్లించినట్లు సీబీఐ గుర్తించింది. ఇలా గాలి ఇనుప ఖనిజం దోపిడీ విలువ రూ.4,310 కోట్లుగా సీబీఐ లెక్కగట్టింది.

గాలి కేసులో నాటి నుంచి నేటి వరకూ..

- 2009 నవంబరు 17: ఓఎంసీపై దర్యాప్తు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో
- 2009 డిసెంబరు 1: సీబీఐ దర్యాప్తునకు అనుమతిస్తూ కేంద్రం నోటిఫికేషన్
- 2009 డిసెంబరు 7: సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు
- 2011 డిసెంబరు: మొదటి అభియోగ పత్రం
- 2012 మార్చి: ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మిని నిందితురాలిగా చేర్చుతూ అదనపు అభియోగ పత్రం
- 2013 జనవరి: గాలి సన్నిహితుడు అలీఖాన్ నిందితుడిగా అనుబంధ అభియోగ పత్రం
- 2014 ఏప్రిల్: అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి నిందితురాలిగా పేర్కొంటూ అనుబంధ అభియోగ పత్రం
- 2012: విచారణ నిమిత్తం కేసును పరిగణనలోకి తీసుకున్న సీబీఐ కోర్టు
- 2011 సెప్టెంబరు 5: గాలి జనార్దన్‌రెడ్డి, బి.వి.శ్రీనివాసరెడ్డి అరెస్టు
- 2011 నవంబరు 12: రాజగోపాల్ అరెస్టు
- 2011 నవంబరు 28: శ్రీలక్ష్మి అరెస్టు
- 2012 అక్టోబరు 5: మెఫజ్ అలీఖాన్ అరెస్టు
- 2015 జనవరి 22: సుప్రీం కోర్టు బెయిలుతో గాలి విడుదల
- 2015 జనవరి 22: హైకోర్టు బెయిలుతో బి.వి. శ్రీనివాసరెడ్డి విడుదల
- 2013 జనవరి 18: సీబీఐ కోర్టు బెయిలుతో రాజగోపాల్ విడుదల
- 2013 మార్చి: శ్రీలక్ష్మికి సీబీఐ కోర్టు బెయిలు
- 2015 జనవరి 28: మెఫజ్ ఖాన్‌కు సీబీఐ కోర్టు బెయిలు
- 2022 అక్టోబరు 28: నిందితుల డిశ్చార్జి పిటిషన్లను కొట్టివేస్తూ సీబీఐ కోర్టు తీర్పు
- 2022 అక్టోబరు 28: అభియోగాల నమోదు పూర్తి

- రూ. 884.13 కోట్ల ప్రజాధనం కొల్లగట్టారంటూ అభియోగం
- సుమారు 219 మంది వరకు సాక్షులు
- 3400కు పైగా డాక్యుమెంట్లు

రాజకీయ భవిష్యత్తు 'గాలి'కి పోయినట్టేనా!

కారాగార శిక్షతో శాసనసభ్యత్వానికి ముప్పు

ఈనాడు, బెంగళూరు: ఓబుళాపురం గనుల కేసులో దోషిగా తేలిన నేపథ్యంలో కర్ణాటక మాజీ మంత్రి, గంగావతి శాసనసభ్యుడు గాలి జనార్దనరెడ్డి రాజకీయ జీవితం డోలాయమానంలో పడింది. మంగళవారం సీబీఐ నాంపల్లి కోర్టు ఆయనకు ఏడేళ్ల జైలు శిక్ష విధించటంతో ఇటీవలే రాజకీయ పునరుజ్జీవనానికి 'గాలి' చేస్తున్న ప్రయత్నానికి గండిపడినట్లయింది. ఇదే కేసులో 2011లో అరెస్టయిన గాలి జనార్దనరెడ్డి మూడేళ్ల నాలుగు నెలల పాటు కారాగారవాసం అనుభవించారు. కనీసం నాలుగేళ్లకు పైగా ఆయన మరోసారి జైలు జీవితాన్ని అనుభవించాలి. శాసనసభ్యుడిగా నెగ్గిన ఆయన ప్రజాప్రాతినిధ్య చట్టం- 1951 ప్రకారం ఆ పదవి కోల్పోవాల్సి వస్తోంది. ఆయనకు వేసిన శిక్షపై హైకోర్టులు స్టే విధిస్తే తప్ప ఆయన శాసనసభ్యుడిగా కొనసాగే అవకాశం లేదు.

రాజకీయానికి ముప్పు

గాలి జనార్దనరెడ్డి కర్ణాటకలో రాజకీయ నేతగా చక్రం తిప్పారు. 2008లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా 110 స్థానాలు గెలిచి, ఏకైక పెద్ద పార్టీగా అవతరించినా ప్రభుత్వ ఏర్పాటుకు సరిపడా బలం రాలేదు. గాలి జనార్దనరెడ్డి ఐదుగురు స్వతంత్రుల మద్దతు కూడగట్టి ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. రాష్ట్ర మంత్రిగానూ పని చేశారు. ఆ సమయంలోనే పొరుగునున్న ఏపీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డితో స్నేహ సంబంధాన్ని కొనసాగించి, ఓబుళాపురం మైనింగ్ వ్యాపారాన్ని ప్రారంభించారు. 2009లో ఆదాయ పన్నుల అధికారుల దాడులతో ఆయన అక్రమ వ్యాపార చిట్టా బయటపడింది. దీంతో రాజకీయంగా దూరమై 2011లో జైలు పాలయ్యారు. 2015 జనవరిలో బెయిల్‌పై బయటకు వచ్చారు.

సొంత పార్టీ

జైలు జీవితం తర్వాత గాలి జనార్దనరెడ్డికి భాజపా కూడా అంటీముట్టనట్లు ఉండటంతో ఆయన 2022లో కల్యాణ రాజ్య ప్రగతి పక్ష (కేఆర్‌పీపీ) పేరిట సొంతంగా పార్టీ ప్రారంభించారు. ఆపై నిర్వహించిన ఎన్నికల్లో తన భార్యతో కలిసి పోటీ చేసినా కేవలం తానొక్కడే (గంగావతి స్థానంలో) గెలిచారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో తన పార్టీని భాజపాలో విలీనం చేశారు.

జనార్దనరెడ్డికి.. జగన్ ప్రభుత్వం వత్తాసు

- ఓఎంసీలో తవ్వకాలు పునరుద్ధరించేలా వ్యూహం
- తమకు అభ్యంతరం లేదంటూ 2022లో సుప్రీంకోర్టులో అఫిడవిట్
- ఇది కుమ్మక్కేనని అప్పుడే తేల్చిన అమికస్ క్యూరీ

ఈనాడు, అమరావతి: ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) లీజుల్లో పెద్దఎత్తున ఇనుప ఖనిజాన్ని అక్రమంగా తవ్వేసి, గాలి జనార్దనరెడ్డి రూ.వేల కోట్లు కొల్లగొట్టారని తెలిసినా.. గత వైకాపా ప్రభుత్వం ఆయనకు అనుకూలంగానే వ్యవహరించింది. ఓఎంసీ లీజుల్లో తవ్వకాలు పునరుద్ధరిస్తే, తమకు ఎటువంటి అభ్యంతరం లేదంటూ 2022లో సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున, అప్పటి గనులశాఖ సంచాలకులు వీజీ వెంకటరెడ్డి ఈ అఫిడవిట్ దాఖలు చేశారు. గాలి జనార్దనరెడ్డితో కుమ్మక్కయ్యేందుకు జగన్ ప్రభుత్వం చేసిన ఈ ప్రయత్నాన్ని సుప్రీంకోర్టు నియమించిన అమికస్ క్యూరీ అప్పట్లోనే బయటపెట్టారు. దీంతో ఓఎంసీ, జగన్ ప్రభుత్వం పాచిక పారలేదు.



ఓఎంసీతో అభ్యర్థన పెట్టించి..

ఓఎంసీ లీజుల్లో ఇనుప ఖనిజం తవ్వకాలు పునరుద్ధరించేందుకు గాలి జనార్దనరెడ్డి వైకాపా ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించాయి. ఏపీ, కర్ణాటక అంతర్రాష్ట్ర సరిహద్దు వివాదం కొలిక్కి రావడంతో ఆ లీజుల్లో తవ్వకాల పునరుద్ధరణకు అవకాశం ఇవ్వాలని ఓఎంసీ సుప్రీంకోర్టుకు 2022లో విన్నవించింది. దీనిపై న్యాయస్థానం ఏపీ ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది. అంతర్రాష్ట్ర సరిహద్దు వివాదం సమసిపోవడంతో.. ఆ ప్రాంతంలో ఇనుప ఖనిజ తవ్వకాలు కొనసాగించేందుకు అవకాశం ఇవ్వాలని, ఇందుకు తమకు అభ్యంతరం లేదంటూ 2022 ఆగస్టు 13న గనులశాఖ అప్పటి సంచాలకులు వీజీ వెంకటరెడ్డి కోర్టులో అఫిడవిట్ వేశారు. అంటే గాలి ముఠా మళ్లీ అక్రమ తవ్వకాలతో దోపిడీ చేసేందుకు జగన్ ప్రభుత్వం మార్గం సుగమం చేసింది.

బయటపెట్టిన అమికస్ క్యూరీ

ఓఎంసీకి బళ్లారి రిజర్వ్ అటవీ ప్రాంతంలో అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురంలో 39.5 హెక్టార్లు, హెచ్.సిద్ధాపురం, మలపనగుడి పరిధిలో 68.5 హెక్టార్ల లీజులున్నాయి. వీటిలో 2057 వరకు తవ్వకాలకు అవకాశం ఉంది. సుప్రీంకోర్టు నుంచి అనుమతి తీసుకొని ఈ రెండు లీజుల్లో ఇనుప ఖనిజాన్ని మళ్లీ కొల్లగొట్టేందుకు చూశారు. ఓబుళాపురం ప్రాంతంలో ఇనుప ఖనిజం తవ్వకాలకు అవకాశం ఇవ్వాలంటూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లోని లోగుట్టును.. అమికస్ క్యూరీ సిద్ధార్థ చౌదరి అప్పట్లోనే బయటపెట్టారు. ఓఎంసీ, ఏపీ ప్రభుత్వం కుమ్మక్కయ్యాయని.. వీటి మధ్య అనుచిత ఒప్పందం జరిగినట్లు కనిపిస్తోందంటూ 2022 ఆగస్టు 20న సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించారు. దీంతో గాలి అక్రమాలకు చెక్ పడింది.

రూ. కోట్లు కొట్టి బెయిల్ పట్టిన గాలి

- న్యాయమూర్తికే లంచం ఎర
- లాకర్ల నిండా నోట్ల కట్టలు

ఈనాడు, హైదరాబాద్ :వ్యవస్థలను లొంగదీసుకోవడంలో ఆరితేరిన గాలి జనార్దనరెడ్డి బెయిల్ కోసం న్యాయ వ్యవస్థనూ ప్రలోభ పెట్టాడు. న్యాయమూర్తికే లంచం ఆశపెట్టాడు. అనుకున్నట్లే బెయిల్ పొందినా చట్టం చేతులు చాలా పొడవైనవి అన్నట్లు సీబీఐ రంగంలోకి దిగడంతో 'గాలి' పాపం పండింది. ఈ పాపంలో పాలుపంచుకున్న అప్పటి సీబీఐ న్యాయమూర్తి పట్టాభి రామారావుతోపాటు మరో మాజీ న్యాయమూర్తి చలపతిరావు తదితరుల అరెస్టుకు దారి తీసింది. బెయిల్ కుంభకోణంలో ఏకంగా న్యాయమూర్తులే అరెస్టు కావడం అప్పట్లో పెను సంచలనం రేపింది. గనుల అక్రమాల కేసులో 2011 సెప్టెంబరు 5న అరెస్టయిన గాలి బెయిల్‌పై బయటకు వచ్చేందుకు నానా ప్రయత్నాలు చేశాడు. అన్ని స్థాయిల్లోనూ న్యాయస్థానాలు బెయిల్ తిరస్కరించడంతో చివరకు అడ్డదారిలో ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఇందుకోసం సీబీఐ న్యాయమూర్తికే లంచం ఎర వేశాడు. రూ.5 కోట్లు ఇవ్వజూపాడు. 2012 జూన్ 11న హైదరాబాద్ సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి పట్టాభి రామారావు.. గాలికి బెయిల్ మంజూరు చేశారు. అదే సమయంలో ఓఎంసీ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ ఎస్పీ ఖాన్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. గాలి సోదరుడు సోమశేఖరరెడ్డి, సన్నిహితుడు దశరథరామిరెడ్డి హైదరాబాద్‌కు పెద్ద మొత్తంలో డబ్బు తరలించి బ్యాంకు లాకర్లలో దాచారని, మరికొంత డబ్బు బాలాజీరావు, రౌడీషీటర్ యాదగిరిరావు అనే వారి ఇళ్లలో పెట్టారని తెలిసింది. వెంటనే సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. కార్పొరేషన్ బ్యాంకులో సరైన ధ్రువపత్రాలు లేకుండానే మాజీ న్యాయమూర్తి చలపతిరావు పేరుతో ఐదు లాకర్లు ఉన్నట్లు గుర్తించారు. చలపతిరావును ప్రశ్నించగా, లాకర్లలో తానే డబ్బు పెట్టినట్లు అంగీకరించినా అవి తన ఆస్తి అమ్మిన డబ్బులని చెప్పారు. అది తప్పని దర్యాప్తులో తేలింది. లాకర్ల తాళాల గురించి అడగ్గా, జడ్జి పట్టాభి రామారావు కుమారుడు రవి వద్ద ఉన్నట్లు తెలిపారు. సీబీఐ అధికారులు వాటిని దొరకబుచ్చుకున్నారు. లాకర్లను తెరిచి రూ.1,60,20,000 స్వాధీనం చేసుకున్నారు. చలపతిరావు సోదరుడు బాలాజీరావు ఇంట్లో రూ.48,97,000, అతని బ్యాంకు లాకరు నుంచి రూ.65,19,000 స్వాధీనం చేసుకున్నారు.

రౌడీషీటర్ సహకారం

ఈ కేసులో మరో కీలక నిందితుడు రౌడీషీటర్ యాదగిరిరావును ప్రశ్నించగా సీబీఐ న్యాయమూర్తిని ప్రలోభ పెట్టేందుకు గాలి సోమశేఖరరెడ్డి, మాజీ న్యాయమూర్తి చలపతిరావుల మధ్య తాను మధ్యవర్తిత్వం చేసినట్లు యాదగిరి అంగీకరించాడు. సోమశేఖరరెడ్డి, దశరథరామిరెడ్డి, కర్ణాటకలోకి కంప్లీ ఎమ్మెల్యే సురేష్‌బాబులు ఐదారు సంచుల్లో డబ్బు తెచ్చి చలపతిరావుకు ఇచ్చినట్లు తెలిపాడు. ఈ కేసులో పట్టాభి రామారావు, చలపతిరావులతోపాటు వారితో కలిసి పని చేసిన మరో ఇద్దరు జడ్జీలు, రౌడీషీటర్ యాదగిరి, ఒక న్యాయవాది కూడా అరెస్టయ్యారు. కొసమెరుపు ఏమిటంటే డబ్బులిచ్చి బెయిల్ పొందిన గాలి జైలు నుంచి విడుదల కావడానికి సమర్పించిన ష్యూరిటీ పత్రాలను కూడా ఫోర్జరీ చేసినట్లు తర్వాత వెల్లడైంది.

ఆదాయ పన్ను అధికారుల్లా వెళ్లి... జనార్దనరెడ్డిని పట్టుకొచ్చాం

'ఈనాడు-ఈటీవీ'తో సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ



ఈనాడు, హైదరాబాద్: ఓఎంసీ కేసులో గాలి జనార్దనరెడ్డిని అరెస్టు చేసేందుకు బళ్లారి వెళ్లినప్పుడు మా గుర్తింపును మార్చుకోవాల్సి వచ్చింది. ఆదాయపన్ను శాఖ అధికారుల్లా అక్కడికి వెళ్లి ఆయన్ను పట్టుకొచ్చాం' అని సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ చెప్పారు. ఈ కేసులో నిందితులకు న్యాయస్థానం మంగళవారం శిక్ష ఖరారు చేసిన నేపథ్యంలో 'ఈనాడు-ఈటీవీ'తో ఆయన మాట్లాడారు. కేసు దర్యాప్తు తీరుతెన్నుల గురించి గుర్తు చేసుకున్నారు. 'బళ్లారి... జనార్దనరెడ్డి స్థావరం. అతడిని పట్టుకోవడానికి వచ్చినట్లు తెలిస్తే అక్కడి నుంచి వెళ్లిపోయే అవకాశం ఉంది. అందుకే రహస్యంగా వెళ్లాల్సి వచ్చింది. ఆదాయపన్ను అధికారుల్లా... ఆకస్మికంగా వెళ్లి జనార్దనరెడ్డిని పట్టుకొచ్చి న్యాయస్థానంలో హాజరుపరిచాం' అని వివరించారు. నాటి విషయాలు లక్ష్మీనారాయణ మాటల్లోనే...

దరఖాస్తు దశలోనే విచిత్రమైన వాదన

ఈ కేసులో దరఖాస్తుల ప్రక్రియ నుంచే అధికారులు ఓఎంసీకి అనుకూలంగా వ్యవహరించినట్లు దర్యాప్తులో మేం గుర్తించాం. లీజు ఇచ్చే ప్రక్రియలో మొదట దరఖాస్తు చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాల్సిందేమీ లేదు. కానీ ఇక్కడ ఒకేరోజు వచ్చిన దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకున్నారు. ఓఎంసీతోపాటు మరో కంపెనీకి కట్టబెట్టేందుకే ఇలా చేశారు.

అటవీ ప్రాంతంలోకి వెళ్లి మరీ...

వాస్తవానికి గనుల తవ్వకానికి టెండర్లు పిలవడంలో ముఖ్యమైన అంశం క్యాప్టివ్ మైనింగ్. అంటే మైనింగ్ చేసే సంస్థనే స్టీల్ కంపెనీ పెట్టాలనే నిబంధన విధించారు. నిబంధనలన్నింటినీ ఓఎంసీ తుంగలో తొక్కింది. అటవీ ప్రాంతంలోకి వెళ్లి మరీ మైనింగ్ చేపట్టింది. వీటన్నింటినీ నిర్ధారించుకునేందుకు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి... టోటల్ మైనింగ్ అనే కొత్త విధానంలో నిశితంగా పరిశీలించాం. కేసు అప్పటి దర్యాప్తు అధికారి ఖాన్, డీఐజీ వెంకటేశ్‌కు... జాయింట్ డైరెక్టర్‌గా నేను సలహాలు ఇచ్చాను. దర్యాప్తులో రికార్డుల పరిశీలన చాలా కీలకం. కృష్ణపట్నం రేవు నుంచి ఎంత సరకు తరలించారో లెక్క తేల్చాం. రూ.884 కోట్ల విలువైన అక్రమ మైనింగ్ చేశారని చివరకు నిర్ధారించాం. అందుకు సంబంధించిన ఆధారాలను కోర్టుకు సమర్పించాం.

సూపర్ ఇంపోజింగ్‌తో హద్దుల నిర్ధారణ

మేం దర్యాప్తు ఆరంభించే నాటికే అక్కడ అక్రమ మైనింగ్ చేపట్టారు. మేం వెళ్లేసరికి పెద్ద గోతులు కనిపించాయి. గోతులు తవ్వక ముందు ఎలా ఉందని మేం చూపించాల్సి వచ్చింది. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీకి వెళ్లి కెడెస్ట్రియల్ మ్యాప్‌లను సేకరించాం. ఆ శాటిలైట్ చిత్రాలకు రిజల్యూషన్ తక్కువగా ఉంది. ఎక్కువ రిజల్యూషన్ ఉన్న మ్యాప్‌లను కస్టమ్స్ డ్యూటీ చెల్లించి అమెరికా నుంచి తెప్పించాం. సూపర్ ఇంపోజింగ్ సాంకేతికత ఆధారంగా వాస్తవ మైనింగ్ హద్దులను నిర్ణయించాం. జనార్దనరెడ్డి అరెస్టు సమయంలో మేం స్వాధీనం చేసుకున్న హెలికాప్టర్, బంగారం, ఇతర ఆస్తులకు సంబంధించి ప్రస్తుతం ఈడీ కేసు నడుస్తోంది. ఈడీ కేసులోనూ త్వరలో విచారణ ప్రారంభమవుతుందని భావిస్తున్నాం.

రాజకీయ ఒత్తిళ్లు రాలేదు

ఈ కేసు దర్యాప్తు సమయంలో మాపై రాజకీయ ఒత్తిళ్లు రాలేదు. సీబీఐలో ఏ ఒక్క అధికారీ సొంత నిర్ణయం తీసుకోలేరు. ఒక అధికారి ప్రభావితమైనంత మాత్రాన కేసు నీరుగారే అవకాశం ఉండదు. కీలక కేసులన్నింటిలో సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణ ఉంటుంది కాబట్టి అధికారులు ప్రభావితమయ్యే అవకాశాలు చాలా తక్కువ.

ఓఎంసీలో ఆది నుంచి అక్రమాలే

'గాలి' కంపెనీకి లీజులు కట్టబెట్టడంలో అధికారుల కుట్ర • సీబీఐ అఫిడవిట్లలో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి బాధ్యతలు స్వీకరించాక ఆయన స్నేహితులు, సన్నిహితులకు అనుకూలంగా అధికారులు ఆఘమేఘాలపై నిర్ణయాలు తీసుకుంటూ వచ్చారు. 2001లో ఏర్పాటైన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ)ని గాలి జనార్దనరెడ్డి చేజిక్కించుకోవడం నుంచి లీజుల బదలాయింపు వరకు వ్యవహారాలను అధికారులు ఎలా చక్కబెట్టారో సీబీఐ దాఖలు చేసిన 4 అభియోగపత్రాల్లో వెల్లడించింది. సీబీఐ దర్యాప్తులో గుర్తించిన అంశాలివీ..

అనంతపురం జిల్లా డీహీరేహాళ్ మండలంలో 68.5 హెక్టార్ల లీజును ఓఎంసీ దక్కించుకోవడంలో గనులశాఖ అప్పటి డైరెక్టర్ వి.డి.రాజగోపాల్‌రెడ్డి కుటిల నీతి అమలు చేశారు. ఓఎంసీ ఈ లీజులను దక్కించుకోవడానికి అప్పట్లో అనంతపురం జిల్లా భూగర్భ గనుల శాఖ సహాయ డైరెక్టర్ (ఏడీఎంజీ)గా ఉన్న లింగారెడ్డి సహకరించారు. 93 హెక్టార్లకు నోటిఫికేషన్ జారీ చేయగా గాలి జనార్దనరెడ్డికి చెందిన ఓఎంసీతోపాటు.. కుట్రలో భాగంగా గాలి మామ ఏర్పాటు చేసిన వినాయక మైనింగ్ కంపెనీలు దరఖాస్తు చేశాయి. వీటితోపాటు మరో 23 దరఖాస్తులు వచ్చాయి. అప్పటికే ప్రాస్పెక్టింగ్ లైసెన్స్ నిమిత్తం 5 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మొదట వచ్చిన రెండు దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకున్న ఏడీఎంజీ వెంటనే మైనింగ్ ప్రాంతాన్ని సందర్శించడానికి వెళ్లారు. ఆయనతోపాటు ఓఎంసీ, వినాయక మైనింగ్ కంపెనీల రెండింటి తరఫునా గాలి జనార్దనరెడ్డి మామ పరమేశ్వర్‌రెడ్డి వెళ్లారు. మిగిలిన 23 దరఖాస్తులను పట్టించుకోకుండా ఈ రెండు కంపెనీల్లో మెరుగైన ఓఎంసీకి 68.5 హెక్టార్లు, ఏపీఎండీసీకి 25 హెక్టార్లు లీజు ఇవ్వవచ్చని ఏడీఎంజీ.. గనుల శాఖ డైరెక్టర్‌కు సిఫారసు చేశారు. 18 హెక్టార్ల లీజు నిమిత్తం ఎస్.ఆర్.మినరల్స్ దరఖాస్తు చేయడంతోపాటు అటవీశాఖ క్లియరెన్స్‌లు కూడా పొందింది. దీన్ని తప్పించడానికి ఏపీఎండీసీకి కూడా వీసీ, ఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజగోపాల్ 25 హెక్టార్లకు దరఖాస్తు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థకు ప్రాధాన్యమివ్వాలన్న లక్ష్యంతో ఎస్.ఆర్.మినరల్స్‌ను పక్కనబెట్టి.. తర్వాత ఓఎంసీకే కట్టబెట్టాలన్నది రాజగోపాల్ ఎత్తుగడ. ఈ పిటిషన్‌ను పరిష్కరించే వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని కేంద్రం సూచించినా అది తిరస్కరణకు గురికావచ్చని ఓఎంసీకి లీజు మంజూరుకు సిఫారసు చేశారు. ఈ సిఫారసులతో అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందం.. మంత్రి ఆమోదంతో తాత్కాలిక లీజులు మంజూరు చేశారు.

రాజగోపాల్ తప్పుడు సిఫార్సులతో..

తప్పుడు పత్రాలతో పొందిన మైనింగ్ ప్లాన్‌ను ఆమోదించి, గనుల శాఖ డైరెక్టర్ రాజగోపాల్ ఓఎంసీని సిఫారసు చేస్తూ పరిశ్రమల శాఖ అప్పటి కార్యదర్శి శ్రీలక్ష్మికి నోట్ పంపారు. విధివిధానాలను, నిబంధనలను పట్టించుకోకుండా శ్రీలక్ష్మి అన్ని దరఖాస్తులను తిరస్కరించి గాలి జనార్దనరెడ్డికి చెందిన ఓఎంసీకి లీజు మంజూరు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు.

జీవోలో క్యాప్టివ్ మైనింగ్ అదృశ్యం

బ్రహ్మణి స్టీల్స్ అవసరాల నిమిత్తం ఓఎంసీకి లీజు ఇవ్వాలని గాలి జనార్దనరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి రెండుసార్లు లేఖలు రాశారు. పరిశ్రమల శాఖ కార్యదర్శి శ్రీలక్ష్మి ఓఎంసీ దరఖాస్తును ఆమోదించి, నోట్ సిద్ధం చేశారు. 2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఏర్పాటయ్యే బ్రహ్మణి 10 మిలియన్ టన్నుల సామర్థ్యానికి చేరుకుంటుందని, అందువల్ల ఓఎంసీ దరఖాస్తును పరిగణనలోకి తీసుకోవాలని 2007 జూన్ 7న పేర్కొన్నారు. అదే రోజు గనుల శాఖ మంత్రి ఆమోదించడంతో జీవో కూడా జారీ చేశారు. ఇతరుల దరఖాస్తులను తిరస్కరించారు. జీవోలో 'క్యాప్టివ్ మైనింగ్' అన్న అంశాన్ని పేర్కొనకపోవడంతో ఇనుప ఖనిజాన్ని విక్రయించుకోవడానికి ఓఎంసీకి అవకాశం లభించింది.

39.5 హెక్టార్ల లీజులో అక్రమాలు

డీహీరేహాళ్ మండలం ఓబుళాపురంలో మరో 39.5 హెక్టార్ల లీజు కేటాయింపులోనూ అధికారులు గాలి అండ్ కోకు అండగా నిలిచారు. ఓఎంసీకి అనుకూలంగా ఫైళ్లు, నోట్ ఫైళ్లను సిద్ధం చేశారు. ఏడీఎంజీ 2000వ సంవత్సరంలో 483.42 ఎకరాలకు, 2004లో 263.99 ఎకరాలకు నోటిఫికేషన్లు జారీ చేయగా ఓఎంసీతోపాటు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ఏడీఎంజీ రెండుసార్లు క్షేత్ర పరిశీలన చేశాక ఓఎంసీకి అనుకూలంగా నోట్ సిద్ధం చేసి, డీఎంజీకి పంపారు. డీఎంజీ నోట్ ఆధారంగా అప్పటి రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందం ఓఎంసీకి తాత్కాలిక లీజు మంజూరు చేశారు. అనంతరం పరిశ్రమల శాఖ లేఖలతో 39.5 హెక్టార్లకు ఓఎంసీని కేంద్రం ఎంపిక చేసింది. సొంత అవసరాల కోసం ఓఎంసీ దరఖాస్తు చేసుకుందని.. ఎగుమతుల కోసం అర్జీ పెట్టాయని తదితర స్వల్ప కారణాలతో జింపెక్స్ వంటి ఇతర సంస్థల దరఖాస్తులను తిరస్కరించినట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ అప్పటి కార్యదర్శి శ్రీలక్ష్మి వివరణ ఇచ్చారు. మరికొందరిని గాలి అనుచరులు బెదిరించారు. ప్రలోభపెట్టారు. ఖనిజ రవాణాకు ఎలాంటి తనిఖీలు నిర్వహించకుండా ఓఎంసీకి పర్మిట్లు జారీ చేయాలని అప్పటి ఏడీఎంజీకి గనుల శాఖ డైరెక్టర్ హోదాలో వి.డి.రాజగోపాల్ సిఫారసు చేశారు. అక్రమ మైనింగ్ ద్వారా గాలి జనార్దనరెడ్డి రూ.వేల కోట్లు కొల్లగొట్టగా ప్రభుత్వానికి దాదాపు రూ.884 కోట్ల నష్టం వాటిల్లింది' అని సీబీఐ పేర్కొంది.

నాకు న్యాయం జరిగింది

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నాంపల్లి కోర్టు ఆవరణలో మీడియాతో మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ఓఎంసీ కేసులో తనకు న్యాయం జరిగిందని.. నిర్దోషిగా ప్రకటించినందుకు న్యాయవ్యవస్థకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు మాజీ మంత్రి, భారాస శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె నాంపల్లి కోర్టు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. "పన్నెండున్నర సంవత్సరాల క్రితం ఈ కోర్టు మెట్లను కన్నీళ్లతో ఎక్కా. ఏ తప్పూ చేయకపోయినా కేసులో ఉన్నాననే బాధ నాడు కలిగింది. తప్పకుండా న్యాయం జరుగుతుందని నమ్మా.. నేడు అదే జరిగింది. కానీ, పన్నెండున్నర సంవత్సరాల్లో ఏ ఎన్నికలు వచ్చినా నన్ను అవినీతిపరురాలని, జైలుకు వెళతానని అనేక మంది రాజకీయంగా అవమానంగా మాట్లాడారు. ఎవరు ఎన్ని మాట్లాడినా నియోజకవర్గ ప్రజలు ఆ ప్రచారాలు నమ్మకుండా నన్ను గెలిపించినందుకు కృతజ్ఞతలు. న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని న్యాయస్థానం కల్పించింది" అని సబిత పేర్కొన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in



మిస్ వరల్డ్ ఎప్పుడు ఎక్కడ ఎవరు?

ప్రపంచ సుందరి కిరీటం... ఎందరో అందాల రాణుల కల. ఈ టైటిల్ కోసం ఎన్నో దేశాలు పోటీపడుతుంటాయి. అయితే, వీటిని మొదట ప్రారంభించింది ఎవరో తెలుసా? లండన్‌కు చెందిన ఎరిక్ డాగ్లస్ మోర్లే... టెలివిజన్ హోస్ట్ అయిన ఈయన, 1951లో 'ఫెస్టివల్ ఆఫ్ బ్రిటన్' వేడుకల్లో భాగంగా స్విమ్‌సూట్ కాంటెస్ట్‌ను ఏర్పాటుచేశారట. అది మీడియాలో 'మిస్ వరల్డ్' పేరుతో బాగా పాపులర్ అయ్యింది. దాంతో ఆ పేరుని రిజిస్టర్ చేయించి... అన్ని పోటీలనూ ఈ పేరుతోనే నిర్వహించడం మొదలుపెట్టారు. ప్రారంభంలో అనేక వివాదాలు చుట్టుముట్టినా వాటన్నింటినీ దాటుకుని ఇప్పటికీ కొనసాగుతున్నాయీ పోటీలు. అలా అత్యధిక కాలంగా కొనసాగుతోన్న అతిపెద్ద ఇంటర్నేషనల్ బ్యూటీ పాజెంట్‌గా 'మిస్ వరల్డ్' నిలిచింది. ఈ పోటీల గురించి మరిన్ని ఆసక్తికర విషయాలు...

- మిస్ వరల్డ్ అవ్వాలనే ఆశయంతో... జాతీయ స్థాయిలోనే ఏటా పదిలక్షలకు పైగా అమ్మాయిలు పోటీలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. అంతేకాదు, ప్రపంచవ్యాప్తంగా ఏటా 160కంటే ఎక్కువ దేశాలే ఈ పోటీల్లో పాల్గొంటున్నాయట.
- మిస్ వరల్డ్ కార్యక్రమాన్ని మొదటిసారి 1959లో బీబీసీలో ప్రసారం చేశారు. 1960, 70ల్లో బ్రిటిష్ టెలివిజన్‌లో అత్యధిక మంది వీక్షించిన కార్యక్రమం కూడా ఇదే.
- 'బ్యూటీ విత్ ఏ పర్పస్' కార్యక్రమాన్ని జూలియా మోర్లే 1972లో ప్రారంభించింది. ఈ నినాదంతో వేల కోట్ల రూపాయల నిధులు సేకరించారు. వీటిని పిల్లలు, మహిళల చదువు, ఆరోగ్యం, మహిళా సాధికారత... వంటి అనేక రకాల కార్యక్రమాల కోసం వినియోగిస్తారు.
- ఇప్పటివరకూ అత్యధిక కాలం మిస్ వరల్డ్‌గా కొనసాగింది జమైకాకు చెందిన టోనీ-ఆన్ సింగ్. 2019లో టైటిల్ గెలుచుకున్న ఈ అందాలరాణి 2021 వరకూ కొనసాగింది. కొవిడ్-19 కారణంగా 2020 మిస్ వరల్డ్ రద్దు కావడంతో ఈ అవకాశం దక్కిందామెకు. అలానే మిస్ వరల్డ్ టైటిల్‌లో అతి కొద్ది కాలం కొనసాగింది వెస్ట్ జర్మనీకి చెందిన గబ్రీల్లా బ్రుమ్. 18ఏళ్ల ఈమె మిస్ వరల్డ్ టైటిల్ గెలుచుకున్న 18గంటలకే రిజైన్ చేసిందట. 1980నుంచి మిస్ వరల్డ్ పోటీల్లో అందంతోపాటు వ్యక్తిత్వం, తెలివితేటలను కూడా పరిగణనలోకి తీసుకోవడం మొదలుపెట్టారు.
- భారత్ ఇప్పటివరకూ ఆరు మిస్ వరల్డ్ టైటిళ్లను గెలుచుకుంది. రీతా ఫారియా పావెల్, ఐశ్వర్యరాయ్, డయానా హేడెన్, యుక్తాముఖి, ప్రియాంకచోప్రా, మానుషీ చిల్లర్.. ఈ ప్రతిష్ఠాత్మక విజయాన్ని దేశానికి అందించారు.
- మనదేశం తరపున రెండో మిస్ వరల్డ్ ఐశ్వర్యారాయ్. 1994లో ఈమె కిరీటాన్ని గెలిచింది. అదే ఏడాది, సుస్మితాసేన్ మిస్ యూనివర్స్‌గానూ నిలిచింది.
- 2000సంవత్సరంలో లారా దత్తా... మిస్ యూనివర్స్, ప్రియాంక చోప్రా... మిస్ వరల్డ్, దియా మిర్జా...మిస్ ఆసియా పసిఫిక్‌గా గెలవడంతో ఒకే ఏడాది మూడు ఇంటర్నేషనల్ బ్యూటీ పాజెంట్ టైటిళ్లు సాధించిన దేశంగా భారత్ నిలిచింది.



- ఒకే పోటీలో మిస్ వరల్డ్‌తోపాటు మరో మూడు సబ్ టైటిళ్లు కూడా గెలుచుకున్న ఏకైక మహిళ... డయానా హేడెన్. మిస్ వరల్డ్ - ఆసియా, ఓషియానియా, మిస్ ఫొటోజెనిక్ అండ్ స్పెక్టాక్యులర్ స్విమ్‌వేర్ టైటిళ్లు సాధించిందీమె.
- ఇప్పటివరకూ అత్యధిక మిస్ వరల్డ్ టైటిళ్లు గెలుచుకున్న దేశాలు భారత్, వెనెజులా. ఈ రెండూ ఆరు సార్లు చొప్పున కిరీటాన్ని దక్కించుకున్నాయి.



అద్దె చీర... అందాల కిరీటం!



అందం, దానికి తగ్గ తెలివితేటలు... ప్రపంచ సుందరి కిరీటం గెలుచుకోవాలంటే ఈ రెండూ తప్పనిసరి. అందుకే దీనిపై ఆసక్తి ఉన్నవారు నడక, నవ్వు, హావభావాలు, మాట్లాడేతీరు... ఇలా అన్నింటిపై ఏళ్లకొద్దీ శిక్షణ తీసుకుంటారు. అలాంటి దానిలో అనుకోకుండా పాల్గొనడం ఊహించగలమా? **రీతా ఫారియా** అలాగే పాల్గొన్నారు. అంతే కాదు, మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలిచిన తొలి భారతీయురాలిగానే కాదు, ఏషియన్‌గానూ నిలిచారు. పుట్టిపెరిగింది ముంబయి. అమ్మ సెలూన్ నడిపేవారు. నాన్న మినరల్ ఫ్యాక్టరీలో పనిచేసేవారు. ఆటలు, చదువు, కుట్టు, పెయింటింగ్... ఇలా అన్నింట్లోనూ రీతా ముందే. ఆమె కల డాక్టర్ అవ్వడం. చిన్నప్పట్నుంచీ ఆస్తమా ఉండేది. దాని బారినపడి ఊపిరి ఆగిపోతుందేమో అనిపించినప్పుడల్లా డాక్టర్లు కాపాడేవారు. తనని ఎన్నోసార్లు చావు అంచులనుంచి లాగేసిన ఆ రంగంలోకే అడుగుపెట్టాలనుకున్నారామె. అనుకున్నట్టుగానే సీటూ సాధించారు. 1966... అప్పుడామెకి 23 ఏళ్లు. మెడిసిన్ అయిదో ఏడాదిలో ఉన్నారు. ఒకరోజు ఆమె అక్క ఓ పేపర్ ముక్కతో వచ్చారు. 'మిస్ బాంబే పోటీలట! ప్రయత్నించరాదూ... ఇలాగైనా ఊరు దాటొచ్చు' అన్నారట. రీతాకి మాత్రం చాలా నమ్మకం... ఇది ఏమాత్రం ముందుకెళ్లదని. వాళ్లక్క వింటేనా? ఫొటోస్టూడియోకి తీసుకెళ్లి ఫొటోలు తీయించి, పోటీలకు పంపారు. ఆహ్వానం రావడమే కాదు 'మిస్ బాంబే' కిరీటం దక్కించుకున్నారు. ఆపై 'మిస్ ఇండియా' కూడా వరించింది. వెంటనే మిస్‌వరల్డ్ పోటీలకు లండన్ వెళ్లాల్సి వచ్చింది. ఇదంతా నెలలోపే జరిగింది.

దేశం దాటితే అమ్మాయి పరిస్థితేంటో అని తల్లి భయం. ఎలాగోలా ఆమెను ఒప్పిస్తే పోటీలకు ఏం వేసుకోవాలి అని సమస్య. ముందు నుంచీ సిద్ధంగా లేరు కదా! డిజైన్ చేయించుకునే అవకాశమూ లేకపోయింది. స్విమ్‌సూట్, ఎవరినో అడిగి అరువు తెచ్చుకున్న చీర, నగలతో విమానం ఎక్కేశారు. పొట్టిగా అయిన స్విమ్‌సూట్, ఏమాత్రం ఎత్తు లేని చెప్పులు చూసి, ఆర్గనైజర్లే షాకయ్యారట. ఇలాకాదనేసరికి తన దగ్గరున్న తక్కువ మొత్తంతో డిస్కౌంట్ సేల్‌లో స్విమ్‌సూట్, హీల్స్ కొనుక్కున్నారు. ఖాళీ చేతులతో తిరిగి వెళతానన్న అపనమ్మకం వెంటాడుతున్నా... ఆత్మవిశ్వాసంతో వేదిక మీదకి ఎక్కారు. ఊహించని విధంగా 'మిస్ వరల్డ్' కిరీటం గెలుచుకున్నారు. ఆమె అందం, ఆత్మవిశ్వాసానికి ముగ్ధులై ఎన్నో సినిమా ఆఫర్లు వచ్చాయి. కానీ ఆమె 'అందాల రాణి నా లక్ష్యం కాదు, కావాలంటే అందాల డాక్టరమ్మ అనిపించుకుంటా'నంటూ తిరస్కరించారు. ఏడాదిపాటు మిస్ వరల్డ్‌గా తన బాధ్యత నిర్వర్తిస్తూనే కలల కెరియర్‌లోకి తిరిగొచ్చారామె. లండన్‌లోని కింగ్స్ కాలేజ్ హాస్పిటల్‌లో చదువు పూర్తిచేశారు. అక్కడే భర్త డాక్టర్ డేవిడ్ ఆంటోనీ పావెల్‌ని కలుసుకున్నారు. తరవాత డబ్లిన్‌కి వెళ్లి, అక్కడ వైద్యురాలిగా, ప్రొఫెసర్‌గా కొనసాగారు. 'అందాల కిరీటం, స్టార్ హోదా ఆకర్షించడం సహజమే. కానీ నా మనసుకి ఏం కావాలో తెలుసు కాబట్టే, అవి నన్ను అంతగా ఆకట్టుకోలేదు' అంటారు రీతా. అన్నట్టూ తన మనవడు, మనవరాళ్లనీ వైద్యులుగానే తీర్చిదిద్దుతున్నారామె.

అతనంటే ఇష్టం... తప్పులు దొర్లుతున్నాయి!

నేను ఏడాది కిందట ఉద్యోగంలో చేరాను. నా సహోద్యోగిపై తెలియని అభిమానం, ఇష్టం. అతను నాకంటే మూడేళ్లు సీనియర్. అతనితో కలిసి వర్క్ చేస్తుంటే తెలియకుండానే తప్పులు దొర్లుతున్నాయి, వణుకుతున్నా. ఈ పరిస్థితిని అధిగమించేదెలా? – ఓ సోదరి


పనిచేసే చోట ఎవరినైనా ఇష్టపడుతోంటే ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులు వస్తుంటాయి. వాళ్లను చూసి అత్యుత్సాహ పడిపోవటం, పనిపై దృష్టి పెట్టలేకపోవటం జరుగుతుంటుంది. కానీ, ఈ భావోద్వేగాలను నియంత్రించుకోగలిగితేనే పని సాఫీగా చేయగలుగుతాం. మీరు ఉద్యోగంలో చేరీ ఎక్కువ కాలం కాలేదు. ఇప్పుడు అతని గురించి ఆలోచించి సమయం వృథా చేసుకోవద్దు. ముందు మిమ్మల్ని మీరు నిరూపించుకోండి. ప్రణాళికాబద్ధంగా ఉంటేనే ఇది సాధ్యం. కాబట్టి, ముందు రోజే మర్నాడు పూర్తి చేసుకోవాల్సిన పనుల జాబితా సిద్ధం చేసుకుని... వాటిని తప్పక పూర్తి చేయాలన్న నియమం పెట్టుకోండి. దానివల్ల మీ ఉత్పాదకత పెరుగుతుంది. మనసూ అతని వైపు మళ్లదు. కుదిరితే అతనికి దూరంగా మీ డెస్క్‌ను మార్చుకోండి. దానివల్ల ఇలాంటి పరిస్థితి ఎదురయ్యే సందర్భాలు తగ్గుతాయి.

డియర్ వసుంధర



కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

పోటీకి సాయాన్ని జోడించి!



తెలుగు నేలపై అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోన్న 72వ అందాల పోటీల గురించే ఇప్పుడు అంతా చర్చ. అది ఇందులో పాల్గొనే అందాల రాణుల గురించే కాదు... ఈ పోటీలను నిర్వహిస్తోన్న సంస్థ గురించీ, దాని వెనక ఉన్న మహిళ గురించీ కూడా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఈ పోటీలకు సృష్టికర్త అయిన దివంగత ఎరిక్ మోర్లే భార్య ఈవిడ. మిస్ వరల్డ్ లిమిటెడ్‌ని అందాల పోటీ సంస్థగా మాత్రమే కాకుండా, సామాజిక మార్పు కోసం ఒక శక్తిమంతమైన వేదికగా మార్చడంలో జూలియాది కీలకపాత్ర. లండన్‌లో జన్మించిన ఆమె టీనేజర్‌గా ఉన్నప్పుడు మోడల్‌గానూ పనిచేశారు. మిస్‌వరల్డ్ లిమిటెడ్‌ను ఏర్పాటుచేశాక సంస్థ నిర్వహణలో భర్తకు చేదోడువాదోడుగా నిలిచారు. 2000లో భర్త మరణానంతరం జూలియా ఆ సంస్థకు ఛైర్మన్ అండ్ సీఈవోగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణతో నిధులు సేకరించి అనారోగ్యం, పేదరికంతో వెనకబడిన పిల్లలకు సాయం చేస్తారు. ఇలా ఇప్పటివరకూ సేకరించిన బిలియన్ డాలర్లకు పైగా నిధుల్ని 142 దేశాల్లో వివిధ సామాజిక కార్యక్రమాలకు వినియోగించారు. జూలియా మోర్లే దాతృత్వానికి గుర్తింపుగా ఎన్నో అవార్డులూ అందుకున్నారు. ముఖ్యంగా 2022లో ఆమె బ్రిటన్ రాణి ఎలిజబెత్-2 చేతుల మీదుగా కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ (సీబీఈ)గా నియమితులయ్యారు. 85 ఏళ్ల వయసులోనూ జూలియా మోర్లే మిస్ వరల్డ్ సంస్థను ఉత్సాహంగా నడిపిస్తున్నారు. ఆమె ఎనర్జీ, డెడికేషన్ ఈ తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయనడంలో సందేహం లేదు.

ఈషా డ్రెస్సుకు... ఇరవై వేల గంటలు!



'ఫ్యాషన్ బిగ్గెస్ట్ నైట్'... మెట్‌గాలా అట్టహాసంగా మొదలైంది. దానిలో ఈసారీ మెరిశారు... అంబానీల యువరాణి, వ్యాపారవేత్త ఈషా అంబానీ పిరమాల్. భారతీయ పనితనం, పాశ్చాత్య హంగులద్దిన దుస్తులతో ఫ్యాషనిస్టుల చేత ఔరా అనిపించుకున్నారామె. నలుపు, తెలుపుల మేళవింపుతో రూపొందిన త్రీ పీస్ డ్రెస్‌ని భారతీయ డిజైనర్ అనామిక ఖన్నా రూపొందించారు. తెలుపు రంగు కోర్సెట్, బ్లాక్ ప్యాంట్, పొడవాటి కేప్‌లో లేడీ బాస్‌లా కనిపించారు ఈషా. కోర్సెట్‌పై సెమీప్రెషియస్ రాళ్లు, ముత్యాలు, బంగారు రంగు దారంతో ఎంబ్రాయిడరీ చేశారు. ఫ్లోర్ లెంత్ కేప్ కోసం చేత్తో నేసిన బనారసీ వస్త్రాన్ని ఉపయోగించారు. దీన్ని జర్దోసీ ఎంబ్రాయిడరీతో తీర్చిదిద్దారు.



ఈ డ్రెస్ ఎంబ్రాయిడరీకి డిజైనర్ అనామికకు 20 వేల గంటలు పట్టిందట! ఇక ఈ దుస్తులకు పోటీనిస్తూ హైలైట్‌గా నిలిచాయి ఈషా ధరించిన నగలు. డైమండ్ నెక్లెస్, ముత్యాలతో కూడిన బర్డ్ హెయిర్‌పిన్, బ్రూచ్, టిఫానీ అండ్ కో ఉంగరాలతో మెరిసిపోయారామె. తను వేసుకున్న రెండు లేయర్ల వజ్రాల నెక్లెస్, బ్రూచ్ తల్లి నీతా అంబానీవని చెప్పారు ఈషా. వీటికితోడు స్మోకీ ఐ మేకప్, రోజ్ బ్రౌన్ లిప్‌స్టిక్, మోడరన్ హెయిర్‌స్టైల్‌తో ఈషా రాయల్టీకి మారుపేరుగా, ఫ్యాషన్ దివాగా కనిపించారు అంటున్నారు ఫ్యాషన్ ప్రియులు.

బంగారం-వెండి



6న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,00,070	90,650	98,591
విజయవాడ	96,465	90,250	98,800
ప్రొద్దుటూరు	98,100	90,250	98,500
రాజమహేంద్రవరం	99,500	90,060	99,800
విశాఖపట్నం	98,100	90,250	99,000
తమిళనాడు	-----	91,100	1,11,000

“నేను కంపెనీలో చేరకముందు నుంచే మా పరిశోధన విభాగానికి హెడ్‌గా కవితా జోషి పనిచేసేవారు. ఇప్పటికీ ఉన్నారు. మా దగ్గర మహిళలు దీర్ఘకాలం పనిచేయడానికి ప్రధాన కారణం పనివేళలే. ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5వరకు ఉంటాయి. దీనివల్ల కుటుంబం- ఉద్యోగం మధ్య సమన్వయం సాధ్యమవుతోంది.



- నదియా చౌహాన్, జేఎండీ, పార్లే ఆగ్రో

మీకు తెలుసా

అందంగా, చూడచక్కగా కనిపించాలని కోరుకునే అమ్మాయిల శాతం ఎక్కువే. దానికి పడే పాట్లూ తక్కువేం కాదు. అయితే, ప్రెస్కాట్ డెంటిస్ట్రీ అధ్యయనం ప్రకారం... మేకప్ వేసుకునే అమ్మాయిలతో పోలిస్తే... నవ్వే అమ్మాయిలు మరింత అందంగా కనిపిస్తారట.

పరిణతి లేని పార్టనర్‌తో!



లక్ష్మికి భర్త ఇంట్లో ఉన్నంతసేపు తీవ్ర ఒత్తిడిగా ఉంటుంది. ప్రతి చిన్నదానికి తనపట్ల అతని అసహనం, నిర్లక్ష్యం ఆమెను బాధిస్తాయి. ఎలా మెలగాలో తెలియక వేదనకు గురవుతుంది. ఇలా పరిణతి లేకుండా ప్రవర్తించే పార్టనర్‌నెలా మార్చుకోవాలో నిపుణులు చెప్పుకొస్తున్నారు.

తప్పించుకుంటూ...

కుటుంబంలో ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సినప్పుడు లేదా భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించాల్సినప్పుడు జీవిత భాగస్వామితో మాట్లాడటానికి కొందరు ఆసక్తి చూపించరు. సమస్య నుంచి తప్పించుకోవడానికి, తమని తాము రక్షించుకోవడానికి ప్రయత్నిస్తారు. ఇటువంటి సమయాల్లో వాళ్లతో వాదించడం, నిందించడం సరైనది కాదు. ప్రశాంతంగా మాట్లాడి మీ ఆలోచనలను మృదువుగా చెప్పాలి. అలాగే అవతలివారి అభిప్రాయాన్నీ చెప్పమనాలి. పూర్తిగా వినాలి. దీంతో చర్చిండానికి వాళ్లలో క్రమేపీ ఆసక్తి కలుగుతుంది. కుటుంబ సమస్యల్లో తామూ భాగస్వాములమని తెలుసుకుంటారు.

నిందిస్తూ...

తమ సమస్యలకు భార్యే కారణమంటూ నిందించేవారికి భావోద్వేగపరమైన పరిపక్వత తక్కువగా ఉందని గుర్తించాలి. వీరు ఇంట్లో జరిగే ప్రతి విషయానికీ ఎదుటివారినే కారణంగా చిత్రీకరిస్తారు. ఇలాంటి సందర్భాల్లో మొదట నిశ్శబ్దంగా ఉండటం మంచిది. ఆ తర్వాత వాళ్ల ప్రవర్తన గురించి మృదువుగా చెప్పి, స్పష్టంగా వివరించాలి.

సానుభూతి లేకుండా...

భార్య ఆరోగ్యం, ఆందోళన వంటివి పట్టించుకోరు. కనీస సానుభూతి కూడా వీళ్లు ప్రదర్శించరు. అంతేకాదు, తమకు సంబంధించిన వాటిపైన మాత్రమే ఆసక్తిగా ఉంటూ... భాగస్వామిని ఒంటరిగా వదిలేస్తారు. ఇటువంటి వారితో మీ భావోద్వేగాలను మృదువుగానైనా చెప్పడానికి కృషి చేయాలి. అప్పటికీ వారిలో మార్పు రాకపోతే కౌన్సెలింగ్ ఇప్పించాలి.

మౌనంతో...

ఏ చిన్న సమస్య ఎదురైనా దానికి కారణం నువ్వే అంటూ భార్యను మౌనంతో వేధించేవాళ్లను పరిణతి లేని పార్టనర్ అంటున్నారు నిపుణులు. ఇవన్నీ భావోద్వేగ అపరిపక్వతకు సంకేతాలని చెబుతున్నారు. సమస్యను చర్చించడానికి వీళ్లు ముందుకు రారు. ఇటువంటప్పుడు ఎదురుగా కూర్చుని మాట్లాడాలి. సమస్య ఎటువంటిదైనా ప్రశాంతంగా పరిష్కరించుకోవాలి. లేదంటే వైవాహిక బంధంలో చీలికలు ఏర్పడే ప్రమాదం ఎదురవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.



ఎండల్లో... తాజాగా

వేసవి వచ్చిందంటే చాలు... ముఖమంతా జిడ్డు, చెమట... దీనివల్ల వచ్చే మొటిమలు, వాటి తాలూకు మచ్చలు యువతను అందంకోసం ఆందోళన పడేలా చేస్తాయి. ఆ చిక్కులకు చెక్ చెప్పాలంటే రోజూ కనీసం రెండు లీటర్ల నీటినైనా తాగండి. అందులో కాస్త కొత్తిమీర, నిమ్మ, పుదీన వంటివి చేర్చుకుంటూ ఉంటే డీహైడ్రేషన్ దరిచేరదు. చర్మం తేమగానూ ఉంటుంది. మరి జిడ్డు మాటేంటి అంటారా? చల్లదనాన్ని ఇచ్చే ముల్తానీ మట్టి ఇందుకు భలేగా పనిచేస్తుంది. దీనికి కాస్త గులాబీనీరు, తేనె కలిపితే చాలు. వేడుకల్లో ముఖం మెరిసిపోతుంది. వేసవిలో బయటకి వెళ్తే ఎండ దెబ్బకు ట్యాన్ సులువుగా పట్టేస్తుంది. కానీ, ఆ ప్రభావం పడకూడదంటే కొబ్బరినూనె, అలోవెరా జెల్ కలిపిన మిశ్రమాన్ని ఉదయం స్నానం చేయడానికి ముందు ఒంటికి రాయండి. ఇవి సహజ ఎస్‌పీఎఫ్‌లా పనిచేసి రక్షణ కల్పిస్తాయి. అసలే ఎండలు... జుట్టుకి నూనె పెట్టడానికి చాలామంది ఇష్టపడరు. కానీ, మీరు ఆ పనిచేయకండి. కచ్చితంగా వారంలో రెండు మూడు సార్లు అయినా కొబ్బరి, ఆలివ్‌నూనెల్ని తలకు రాయండి. వీటిల్లోని విటమిన్లు, ఇతర పోషకాలు జుట్టుని పొడిబారనివ్వవు. రోజంతా వేడి సెగలకు చల్లగా స్నానం చేయాలనిపించడం సహజమే. ఆ నీటిలో కాస్త లావెండర్ ఎసెన్షియల్ ఆయిల్‌నో, మింట్ ఆయిల్‌నో చేర్చుకోండి. ఎంచక్కా రిఫ్రెష్ అయిపోవచ్చు. ఏమంటారు?

ఇంటర్వ్యూలోనే గుర్తించండి!



మన గురించి తెలుసుకోవడానికి సంస్థలు ఇంటర్వ్యూలు పెడతాయి అనుకుంటాం కదా! మనకు ఫలానా సంస్థ అనువైనదేనా అని తెలుసుకోవడానికీ ఇది మార్గమే! ముఖ్యంగా అమ్మాయిలు రక్షణ గురించి తప్పక చూసుకోవాలి. కాబట్టి... వీటిని గమనించుకోండి.

- ఏదైనా చెబుతోంటే పూర్తిగా వినకుండా మధ్యలో ఆపేయడం, ప్రశ్నలేవైనా అడిగితే పట్టించుకోకపోవడం లేదా సమాధానం ఇవ్వకపోవడం వంటివి... అమర్యాదకు చిహ్నాలు. భవిష్యత్తులోనూ అలా ఉండదని నమ్మకమేంటి? పోనీ ఈ దశలో అలాంటివేమీ కనిపించకపోయినా సంస్థలో మహిళలు నడిపిస్తున్న విభాగాలు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకోండి. సీనియర్ విభాగాల్లో మహిళలు లేరంటే ఎదుగుల కష్టమనీ, సమానత్వం లేదనీ అర్థం.
- ఏ ప్రశ్నలు అడుగుతున్నారు? సబ్జెక్ట్స్, కెరియర్, పరిశ్రమకు సంబంధించి ఏవైనా అడగొచ్చు. అవికాకుండా ఎంతసేపూ 'రిలేషన్‌లో ఉన్నారా?' 'పిల్లలు పుడితే ఉద్యోగం మానేస్తారా?'.. . అంటూ కుటుంబానికి సంబంధించినవే అడుగుతోంటే మాత్రం ఆలోచించాలి. ఎందుకంటే ఇవి మీ భవిష్యత్తు గురించి తెలుసుకోవడానికే కాదు, మహిళలు కెరియర్‌కు అంతగా ప్రాధాన్యమివ్వరన్న వాళ్ల ఆలోచనకీ చిహ్నాలే. 'ఇది మీకు కొంచెం కష్టం', 'అబ్బాయిల పని మీవల్ల కాదు'... అంటూ మాట్లాడుతున్నా లింగ వివక్ష చూపిస్తారని అర్థం.
- అమ్మాయిలకి ఇంటి బాధ్యతలూ ఉంటాయి. రక్షణ గురించీ చూసుకోవాలి. పనివేళలు, ఇంటి నుంచి పనిచేసే వీలు, అత్యవసర సెలవులు వగైరా ఉంటాయి. వాటి గురించిన ప్రశ్నలు అడిగితే పట్టించుకోకపోయినా, వాటికి విలువ ఇవ్వకపోయినా మీ వ్యక్తిగత అవసరాలను పట్టించుకోనట్లే. ఆఫీసు అంటే రెండో ఇల్లు లాంటిదే. రోజులో ఎక్కువ సమయం గడిపేదీ అక్కడే. ఆ మాత్రం అండ కోరుకోవడం సహజమే కదా!
- మహిళలపై జోకులు, చిన్నచూపు, తరచూ ఆ సంస్థ నుంచి అమ్మాయిలు వెళ్లిపోతున్నా... అమ్మాయిలకు అక్కడ రక్షణ, విలువ లేదనే అర్థం. పని ప్రదేశంలో గౌరవం దక్కాలి. ఎదిగే అవకాశం ఉండాలి. అవి లేనప్పుడు ఎంత అవసరమైనా అక్కడ చేరకపోవడమే మేలు. తరవాత నిరాశ పడొద్దంటే ముందే గమనించుకోండి.

వృథాను తగ్గించొచ్చిలా...

కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వారానికి సరిపడా ఒకేసారి కొనుగోలు చేస్తుంటాం. అవసరమైనప్పుడు చూస్తే అవి వాడిపోయి, పాడై ఉంటాయి. అలా కాకూడదంటే...



సగం మిగిలితే...

ఉల్లి, టొమాటో, నిమ్మ లాంటి కొన్నింటిని అవసరానికి మించి వంటలో వాడలేం. కావాల్సినంత వాడి... మిగతాది పడేస్తుంటాం. దీనివల్ల నెలలో ఎంత వృథా అవుతుందో తెలుసా? డబ్బు సరేసరి.. . పర్యావరణానికీ ఇది చేటే. దీన్ని తగ్గించడానికి 'సిలికాన్ ఫ్రూట్ అండ్ వెజిటబుల్ స్టోరేజ్ కంటైనర్లు' అందుబాటులోకి వచ్చాయి. పండ్లు, కూరగాయల ఆకారాల్లోనే ఉంటాయివి. వాడగా మిగిలిన ముక్కల్ని వీటిలో పెట్టి, ఫ్రిజ్‌లో ఉంచితే సరి. మూడు వారాలైనా తాజాగా ఉంటాయి.



స్మార్ట్ కిచెన్

వడిలిపోకుండా...



కొత్తిమీర, కరివేపాకు, ఆకుకూరలు తాజాగా ఉంచడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటాం. ఎయిర్‌టైట్ కంటైనర్లు.. . జిప్ లాక్ కవర్లు లాంటివి చాలానే వాడుతుంటాం. కానీ అవేవీ వారానికి మించి నిల్వ చేయలేవు. పైగా తడి తాకినా, గాలి పోయినా పాడైపోతాయి ఇవి. అందుకే ఈ 'హెర్బ్ స్టోరేజ్ కంటైనర్ల'ని వాడి చూడండి. బాటిల్‌లా ఉండే దీని పైభాగంలో ఆకుకూరల్ని ఉంచి... కింద నీళ్లు నింపాలి. తర్వాత దీన్ని ఫ్రిజ్‌లో పెట్టేయొచ్చు. దీనివల్ల మూడు వారాల వరకూ ఆకుకూరలు తాజాగా ఉంటాయి. అయితే మూడు రోజులకోసారైనా నీళ్లు మారుస్తూ ఉండాలి.

గుర్తు చేస్తుంది...



కొన్నిసార్లు ఆహారం ఎక్కువగా వండేస్తాం. తినగా మిగిలింది ఫ్రిజ్‌లో పెట్టి, మరచిపోతుంటాం. కూరగాయల పరిస్థితీ అంతే... అవసరానికి మించి కొంటాం. పాడైతే పడేస్తాం. ఈ వృథాను అరికట్టడానికి 'ఓవై స్మార్ట్‌వేర్' ఉపయోగపడుతుంది. ఇదో ఏఐ ఆధారిత కిచెన్ గ్యాడ్జెట్. ఓవై అప్లికేషన్ ద్వారా ఫోన్‌కి అనుసంధానించాలి. బాక్స్, స్మార్ట్ ట్యాగ్‌లు జతగా వస్తాయి. మిగిలిన ఆహారం, లేదా కూరగాయల్ని బాక్సులో ఉంచాలి. స్మార్ట్ ట్యాగ్‌ని జోడించి... ఫోన్‌లోని ఓవై అప్లికేషన్లో ట్యాగ్‌ని స్కాన్ చేయాలి. తేదీ, సమయంతో సహా ప్రతిదీ దీన్లో స్టోర్ అవుతుంది. దాంతో పాడవక ముందే రిమైండర్ ఇస్తూ ఉంటుంది.



ఐపీఎల్‌లో ఈనాడు

కోల్‌కతా × చెన్నై

వేదిక: కోల్‌కతా, రా॥ 7.30

చాంపియన్


సాయి కిశోర్

ఐపీఎల్-18ను పేలవంగా ఆరంభించి.. ఉన్నట్లుండి ఫామ్‌ను అందుకుని, వరుసగా ఆరు విజయాలతో ప్రత్యర్థులకు దడ పుట్టించిన జట్టు ముంబయి ఇండియన్స్. ఎదురే లేనట్లు కనిపించిన ఆ జట్టుకు దాని సొంతగడ్డపై పెద్ద ఝలక్ ఇచ్చింది గుజరాత్ టైటాన్స్. ఓవైపు వర్షం, ఇంకోవైపు తీవ్ర ఉత్కంఠ మధ్య సాగిన మ్యాచ్‌లో గుజరాత్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 11 మ్యాచ్‌ల్లోనే ఎనిమిదో గెలుపుతో పాయింట్ల పట్టికలో బెంగళూరును వెనక్కి నెట్టి అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఆ జట్టు దాదాపుగా ప్లేఆఫ్స్ చేరినట్లే.

ముంబయికి గుజరాత్ చెక్

- 8వ విజయంతో అగ్రస్థానానికి
- పోరాడి ఓడిన హార్దిక్ సేన


గిల్

ముంబయి

గుజరాత్ టైటాన్స్ అదరగొట్టింది. వాంఖడేలో తీవ్ర ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో ఆ జట్టు.. ముంబయిని ఓడించింది. మంగళవారం వాంఖడేలో వర్ష ప్రభావిత మ్యాచ్‌లో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ఆ జట్టు తగ్గలేదు. మొదట ముంబయి 8 వికెట్లకు 155 పరుగులు చేసింది. విల్ జాక్స్ (53; 35 బంతుల్లో 5×4, 3×6), సూర్యకుమార్ (35; 24 బంతుల్లో 5×4), కార్బిన్ బోష్ (27; 22 బంతుల్లో 1×4, 2×6) రాణించారు. గుజరాత్ బౌలర్లలో సాయికిశోర్ (2/34), రషీద్ ఖాన్ (1/21), అర్షద్ ఖాన్ (1/18), సిరాజ్ (1/29) ఆకట్టుకున్నారు. అనంతరం వర్షం వల్ల రెండోసారి ఆట నిలిచే సమయానికి గుజరాత్ 18 ఓవర్లలో 132/6తో నిలిచింది. మళ్లీ ఆట మొదలయ్యాక సమీకరణం ఒక ఓవర్లో 15 పరుగులుగా మారింది. దీపక్ చాహర్ బౌలింగ్‌లో తొలి బంతికి ఫోర్ కొట్టిన తెవాతియా.. రెండో బంతికి సింగిల్ తీశాడు. మూడో బంతికి కొయెట్జీ (12) సిక్సర్ బాదేశాడు. నాలుగో బంతికి సింగిల్ వచ్చింది. అది నోబాల్. తర్వాత తెవాతియా సింగిల్ తీశాడు. 2 బంతుల్లో 1 పరుగే చేయాల్సి ఉండగా.. కొయెట్జీ అయిదో బంతికి ఔటైపోవడంతో ఉత్కంఠ నెలకొంది. కానీ అర్షద్ ఖాన్ చివరి బంతికి సింగిల్ తీసి ఉత్కంఠకు తెరదించాడు. ఈ బంతికి రనౌట్ అవకాశాన్ని ముంబయి వృథా చేసుకుంది.


బుమ్రా

వర్షం.. మలుపు.. వర్షం.. మలుపు..: 14 ఓవర్లకు 107/2తో గుజరాత్ పటిష్ఠ స్థితిలో ఉండగా వర్షం వల్ల తొలిసారి మ్యాచ్ ఆగింది. అప్పటికి శుభ్‌మన్ 38 పరుగులతో, రూథర్‌ఫర్డ్ 26 పరుగులతో క్రీజులో ఉన్నారు. 8 వికెట్లు చేతిలో ఉండగా 6 ఓవర్లలో 49 పరుగులే చేయాల్సి రావడంతో గుజరాత్ విజయం లాంఛనమే అనుకున్నారంతా. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలోనూ ఆ జట్టు ముందంజలోనే ఉంది. కానీ కాసేపు వర్షం పడ్డాక మ్యాచ్ మళ్లీ మొదలైందో మొత్తం కథ మారిపోయింది. వర్షం ఆగగానే బంతి అందుకున్న బుమ్రా.. నిప్పులు చెరిగే బంతులతో గుజరాత్‌కు చెక్ పెట్టాడు. 2 ఓవర్లలో 13 పరుగులే ఇచ్చి శుభ్‌మన్ (43; 46 బంతుల్లో 3×4, 1×6), షారుఖ్ ఖాన్ (6)లను బౌల్డ్ చేశాడు. రూథర్‌ఫర్డ్ (28; 15 బంతుల్లో 2×4, 2×6)ను బౌల్ట్ పెవిలియన్ బాట పట్టించాడు. రషీద్ ఖాన్ (2) సైతం ఎంతోసేపు నిలవలేదు. 18 ఓవర్లకు 132/6తో టైటాన్స్ ఓటమి బాటలో సాగుతున్న దశలో మ్యాచ్ మరోసారి వర్షం వల్ల ఆగింది. ఛేదన ఆరంభంలోనే సుదర్శన్ (5) ఔటైనప్పటికీ.. బట్లర్ (30; 27 బంతుల్లో 3×4, 1×6), రూథర్‌ఫర్డ్‌లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన గిల్.. జట్టును గెలుపు బాటలో నడిపించాడు. తొలిసారి వర్షం పడ్డాక గుజరాత్ అనూహ్యంగా తడబడి మ్యాచ్‌ను దూరం చేసుకునేలా కనిపించినా.. రెండోసారి వర్షం పడ్డాక విజయం ఆ జట్టునే వరించింది.

ముంబయి కట్టడి: మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ముంబయి.. ఆరంభంలో తడబడి.. ఆ తర్వాత పుంజుకుని.. ఇన్నింగ్స్ ద్వితీయార్ధంలో తీవ్రంగా ఇబ్బంది పడి ఓ మోస్తరు స్కోరుకు పరిమితమైంది. సూపర్ ఫామ్‌లో ఉన్న రికిల్టన్ (2)ను తొలి ఓవర్లోనే ఔట్ చేసి ముంబయిని గట్టి దెబ్బ తీశాడు సిరాజ్. మరో ఓపెనర్ రోహిత్ సైతం వాంఖడేలో తన ఆట చూసేందుకు వచ్చిన అభిమానులను నిరాశకు గురి చేస్తూ 7 పరుగులకే ఔటైపోయాడు. 26 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ ముంబయిని విల్ జాక్స్, సూర్యకుమార్ జోడీ ఆదుకుంది. ముఖ్యంగా జాక్స్ ఆరంభం నుంచే దాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. సూర్యకుమార్ సైతం తనదైన శైలిలో షాట్లు ఆడుతూ బౌలర్లపై ఆధిపత్యం చలాయించాడు. గుజరాత్ బౌలర్లు చక్కగా బౌలింగ్ చేసినా.. ఫీల్డింగ్ వైఫల్యం వల్ల ఆ జట్టు మూల్యం చెల్లించుకుంది. ఖాతా తెరవకముందే జీవదానం పొందిన జాక్స్‌కు 29 పరుగుల వద్ద మరో అవకాశం లభించింది. సూర్య క్యాచ్ సైతం ఒకటి చేజారింది. 97/2తో ముంబయి మెరుగైన స్థితికి చేరుకోగా.. స్పిన్నర్ సాయికిశోర్ 11వ ఓవర్లో సూర్యను ఔట్ చేసి గుజరాత్‌కు బ్రేక్ ఇచ్చాడు. ఇక్కడ్నుంచి ముంబయి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. అర్ధశతకం పూర్తి చేసిన జాక్స్‌ను రషీద్ ఔట్ చేయగా.. హార్దిక్ (1) వికెట్‌ను సైతం సాయికిశోర్ తన ఖాతాలో వేసుకున్నాడు. నమన్ ధీర్ (7) కూడా నిలవకపోవడంతో 18 ఓవర్లకు ముంబయి 7 వికెట్లు కోల్పోయి 129 పరుగులే చేసింది. అయితే చివరి 2 ఓవర్లలో బోష్ ధాటిగా ఆడడంతో ముంబయి 150 మార్కును దాటింది.

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.ర.రేట్
గుజరాత్	11	8	3	0	16	0.793
బెంగళూరు	11	8	3	0	16	0.482
పంజాబ్	11	7	3	1	15	0.376
ముంబయి	12	7	5	0	14	1.156
దిల్లీ	11	6	4	1	13	0.362
కోల్‌కతా	11	5	5	1	11	0.249
లఖ్‌నవూ	11	5	6	0	10	-0.469
హైదరాబాద్	11	3	7	1	7	-1.192
రాజస్థాన్	12	3	9	0	6	-0.718
చెన్నై	11	2	9	0	4	-1.117

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

ఆరెంజ్ క్యాప్


సూర్యకుమార్ (ముంబయి)
510 పరుగులు
ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌కు ఇచ్చే టోపీ

పర్పుల్ క్యాప్


ప్రసిద్ధ్ కృష్ణ (గుజరాత్)
20 వికెట్లు
ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌కు ఇచ్చే టోపీ

ముంబయి ఇన్నింగ్స్: రికిల్టన్ (సి) సుదర్శన్ (బి) సిరాజ్ 2; రోహిత్ (సి) ప్రసిద్ధ్ (బి) అర్షద్ 7; జాక్స్ (సి) సుదర్శన్ (బి) రషీద్ 53; సూర్యకుమార్ (సి) షారుఖ్ (బి) సాయికిశోర్ 35; తిలక్ (సి) శుభ్‌మన్ (బి) కొయెట్జీ 7; హార్దిక్ (సి) శుభ్‌మన్ (బి) సాయికిశోర్ 1; నమన్ ధీర్ (సి) శుభ్‌మన్ (బి) ప్రసిద్ధ్ 7; బోష్ రనౌట్ 27; దీపక్ చాహర్ నాటౌట్ 8; కర్ణ్ శర్మ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం:** (20 ఓవర్లలో 8 వికెట్లకు) **155; వికెట్ల పతనం:** 1-2, 2-26, 3-97, 4-103, 5-106, 6-113, 7-123, 8-150; **బౌలింగ్:** సిరాజ్ 3-0-29-1; అర్షద్ ఖాన్ 3-0-18-1; ప్రసిద్ధ్ 4-0-37-1; సాయికిశోర్ 4-0-34-2; రషీద్ ఖాన్ 4-0-21-1; కొయెట్జీ 2-0-10-1

గుజరాత్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) రికిల్టన్ (బి) బౌల్ట్ 5; గిల్ (బి) బుమ్రా 43; బట్లర్ (సి) రికిల్టన్ (బి) అశ్వని కుమార్ 30; రూథర్‌ఫర్డ్ ఎల్బీ (బి) బౌల్ట్ 28; షారుఖ్ ఖాన్ (బి) బుమ్రా 6; తెవాతియా నాటౌట్ 11; రషీద్ ఖాన్ ఎల్బీ (బి) అశ్వని కుమార్ 2; కొయెట్జీ (సి) నమన్ ధీర్ (బి) దీపక్ చాహర్ 12; అర్షద్ ఖాన్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (19 ఓవర్లలో 7 వికెట్లకు) **147; వికెట్ల పతనం:** 1-6, 2-78, 3-113, 4-115, 5-123, 6-126, 7-146; **బౌలింగ్:** దీపక్ చాహర్ 3-0-32-1; బౌల్ట్ 4-0-22-2; బుమ్రా 4-0-19-2; హార్దిక్ 1-0-18-0; కర్ణ్ శర్మ 2-0-13-0; అశ్వని కుమార్ 4-0-28-2; విల్ జాక్స్ 1-0-15-0

కెప్టెన్సీ ఒత్తిడిని భరించలేకపోయా


కోహ్లి

బెంగళూరు

ఒత్తిడి విపరీతంగా పెరిగిపోవడం వల్లే టీమ్‌ఇండియా, ఆర్సీబీ కెప్టెన్సీని వదిలేశానని విరాట్ కోహ్లి చెప్పాడు. సంతోషంగా ఉండడం కోసమే ఆ నిర్ణయం తీసుకున్నానని తెలిపాడు. 2021 టీ20 ప్రపంచ కప్ తర్వాత కోహ్లి టీమ్‌ఇండియా టీ20 సారథిగా వైదొలిగాడు. ఆ తర్వాత బెంగళూరు కెప్టెన్సీని కూడా వదిలేశాడు. ఏడాది తర్వాత టెస్టు నాయకత్వం నుంచి వైదొలిగాడు. నిరంతరం జనం దృష్టి తనమీదే ఉండడాన్ని భరించలేకపోయానని కోహ్లి చెప్పాడు. "అనేక పరిణామాలతో ఓ దశలో చాలా కష్టంగా అనిపించింది. అప్పటికి 7-8 ఏళ్లుగా భారత్‌కు నాయకత్వం వహిస్తున్నా. 9 ఏళ్లుగా బెంగళూరును నడిపిస్తున్నా. ఎప్పుడు బరిలోకి దిగినా.. బ్యాటింగ్ కోణంలో నాపై చాలా అంచనాలు ఉండేవి. 24×7 అందరి దృష్టిలో ఉంటున్నా. చాలా కష్టమనిపించింది. భరించలేకపోయా" అని 'ఆర్సీబీ బోల్డ్ డైరీస్' పోడ్‌కాస్ట్‌లో కోహ్లి వివరించాడు.

సంతోషంగా ఉండలేకపోయా


2022లో కోహ్లి నెల రోజుల సుదీర్ఘ విరామం తీసుకున్నాడు. ఆ సమయంలో బ్యాటును ముట్టుకోలేదు. నిరంతరం అందరి దృష్టి తన మీదే ఉండడాన్ని ఆస్వాదించలేని స్థితికి చేరుకున్నానని కోహ్లి చెప్పాడు. "అందుకే కెప్టెన్‌గా వైదొలిగా. సంతోషంగా ఉండాలనుకున్నా. జనం దృష్టిలో తక్కువ కాకుండా నా ఆట నేను ఆడుకోగలిగే పరిస్థితి నా జీవితంలో ఉండాలని కోరుకున్నా" అని అన్నాడు.

మూడో స్థానంలో అలా..

తన పట్టుదల.. అప్పటి కెప్టెన్ ధోని, కోచ్ కిర్‌స్టన్ అండతో నంబర్ 3 బ్యాటింగ్ స్థానాన్ని పొందగలిగానని కోహ్లి చెప్పాడు. "నా సామర్థ్యంపై వాస్తవికంగా ఆలోచించా. ఎందుకంటే అనేక మంది ఇతరులు ఆడడం చూశా. నా ఆట వాళ్ల ఆటకు దగ్గరగా కూడా లేదనిపించింది. నాకున్నదల్లా పట్టుదల మాత్రమే. నా జట్టు గెలవడానికి ఏం చేయడానికైనా సిద్ధంగా ఉన్నా. అందువల్లే ఆరంభంలో భారత్‌కు ఆడే అవకాశం నాకు దక్కింది. కిర్‌స్టన్, ధోని.. నన్ను నంబర్ 3గా చూస్తున్నామని స్పష్టం చేశారు" అని కోహ్లి అన్నాడు. తన సహజమైన ఆటను ఆడేలా వాళ్లు తనను ప్రోత్సహించారని తెలిపాడు.

నాపై బౌచర్ ప్రభావం

కోహ్లి 2008లో ఆర్సీబీలో చేరినప్పుడు డ్రెస్సింగ్‌రూమ్‌లో ద్రవిడ్, కుంబ్లే వంటి భారత దిగ్గజాలు ఉండేవాళ్లు. అయితే మార్క్ బౌచర్ తనపై ఎక్కువ ప్రభావం చూపించాడని కోహ్లి చెప్పాడు. "ఆరంభంలో నా సహచరుల్లో బౌచర్ నాపై పెద్ద ప్రభావం చూపించాడు. అతడొక్కడే.. కొంతమంది భారత ఆటగాళ్లకు సహాయం చేద్దామనే ఉద్దేశంతో కనిపించాడు. నా ఆటను చూశాడు. నాలో సామర్థ్యం ఉందని గుర్తించాడు. నా బలహీనతలేంటో చెప్పాడు. తర్వాతి స్థాయికి వెళ్లాలంటే ఏం చేయాలో చెప్పాడు. నేనేమీ అడక్కుండానే ఇదంతా చేశాడు. 'నన్ను నెట్స్‌కు తీసుకెళ్లి షార్ట్ బాల్‌పై దృష్టిపెట్టమని చెప్పాడు. బంతిని పుల్ చేయకపోతే అంతర్జాతీయ క్రికెట్లో నీకెవ్వరూ అవకాశం ఇవ్వరు' అని చెప్పాడు. ప్రాక్టీసులో టెన్నిస్ బంతులను ఎంత బలంగా విసిరాడు అంటే.. తర్వాతి స్థాయికి వెళ్లడం ఇంత కష్టంగా ఉంటుందంటే నేను వెళ్లలేననిపించింది. కానీ అతడు మాత్రం అలా వేయడం కొనసాగించాడు. క్రమంగా నేను మెరుగయ్యా. 'ఓ నాలుగేళ్లలో వ్యాఖ్యాతగా భారత్‌కు వస్తా. నువ్వు భారత్‌కు ఆడడం నేను చూడకపోతే.. నీకు నువ్వు అన్యాయం చేసుకున్నట్లే' అని బౌచర్ అన్నాడు. అతడితో సంభాషణ నాలో ఎంతో ప్రేరణ కలిగించింది" అని కోహ్లి చెప్పాడు.


గంభీర్

అప్పటి వరకు రోహిత్, కోహ్లి ఆడొచ్చు

దిల్లీ

భారత కెప్టెన్ రోహిత్‌శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి బాగా ఆడుతున్నంత కాలం జట్టులో కొనసాగొచ్చని చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. ఇంగ్లాండ్ పర్యటనకు ఈ ఇద్దరు సీనియర్ బ్యాటర్లను ఎంపిక చేయాలా? వద్దా? అని నిర్ణయించడంలో తన పాత్ర ఉండదని గంభీర్ స్పష్టంచేశాడు. ఉగ్రవాదం అంతమయ్యే వరకు ఐసీసీ టోర్నీలు సహా మరెక్కడా పాకిస్థాన్‌తో మ్యాచ్‌లు ఆడకూడదని తెలిపాడు. "జట్టును ఎంపిక చేయడం కోచ్ పని కాదు. అది సెలెక్టర్ల విధి. తుదిజట్టులో ఉండే 11 మంది ఆటగాళ్లను మాత్రమే కోచ్ ఎంపిక చేస్తాడు. నాకంటే ముందు కోచ్‌గా పనిచేసిన వాళ్లు సెలెక్టర్లు కాదు.. నేను కూడా కాదు. రోహిత్, కోహ్లి మంచి ప్రదర్శన ఇస్తున్నంత కాలం జట్టులో భాగంగా ఉండాలి. ఎప్పుడు ప్రారంభించాలి.. ఎప్పుడు ముగించాలన్నది ఆటగాళ్ల వ్యక్తిగత నిర్ణయం. ఎప్పుడు వీడ్కోలు పలకాలన్నది కోచ్, సెలెక్టర్, బీసీసీఐ సహా ఎవరూ చెప్పలేరు. సత్తాచాటుతుంటే 40 ఏళ్లేంటి.. 45 వరకు ఆడొచ్చు. ఎవరు ఆపుతారు? 2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్, కోహ్లి ఆడతారా? లేదా? అన్నది వారి వ్యక్తిగత ప్రదర్శనపై ఆధారపడి ఉంటుంది. ప్రదర్శన మాత్రమే ఎంపికకు ప్రాతిపదిక. వారిద్దరి ప్రదర్శన గురించి నేనేం చెప్పాలి? ఛాంపియన్స్ ట్రోఫీలో వారు ఎలా ఆడారో ప్రపంచమంతా చూసింది" అని అన్నాడు. పాక్‌తో క్రికెట్ సంబంధాలపై మాట్లాడుతూ.. "పూర్తిగా నిలిపేయాలన్నది నా వ్యక్తిగత అభిప్రాయం. సరిహద్దుల్లో ఉగ్రవాదం అంతమయ్యే వరకు భారత్, పాక్ మధ్య క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించొద్దు. అంతిమంగా అది ప్రభుత్వ నిర్ణయం. టీ20 ప్రపంచకప్, ఆసియా కప్ సహా ఏ టోర్నీలోనైనా పాక్‌తో ఆడాలా? లేదా? అన్నది బీసీసీఐ, ప్రభుత్వం నిర్ణయిస్తుంది. వాళ్లు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా పాటిస్తాం. దానిని రాజకీయం చేయకూడదు" అని చెప్పాడు.

భారత క్రికెట్ వాళ్ల జాగీరు కాదు..: కొందరు మాజీ క్రికెటర్లు భారత క్రికెట్‌ను వాళ్ల జాగీరు అనుకుంటున్నారని గంభీర్ విమర్శించాడు. "భారత జట్టుకు 8 నెలలుగా ప్రధాన కోచ్‌గా కొనసాగుతున్నా. ఫలితాలు రాకపోతే విమర్శలు ఎదుర్కొనేందుకు నేను సిద్ధం. ప్రజలు విమర్శించొచ్చు. కానీ కొంతమంది 25 ఏళ్లుగా కామెంటరీ బాక్సులో కూర్చొని భారత క్రికెట్‌ను తమ సొంత జాగీరు అనుకుంటున్నారు. భారత క్రికెట్ ఏ ఒక్కరి వ్యక్తిగత సొత్తు కాదు. ఇది 140 కోట్ల భారతీయుల ఆస్తి. నా శిక్షణ, కంకషన్ (2011లో ఇంగ్లాండ్ పర్యటన), ఛాంపియన్స్ ట్రోఫీలో నగదు బహుమతి పంపిణీ గురించి కొందరు ప్రశ్నలు లేవనెత్తారు. నేను నగదు బహుమతిని అందరితో సమానంగా తీసుకున్నానా లేదా అన్నది ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు. కానీ అద్దాల మేడలో ఉన్నవాళ్లు ఇతరులపై రాళ్లు విసరకూడదు" అని గంభీర్ వ్యాఖ్యానించాడు. గంభీర్ ఎవరి పేర్లను ప్రస్తావించలేదు.. కానీ సునీల్ గావస్కర్, రవిశాస్త్రిలను ఉద్దేశించి అతడు మాట్లాడినట్లుగా అర్థమవుతోంది. 2011లో సిరీస్ నుంచి వైదొలగాల్సినంత తీవ్రంగా గంభీర్ కంకషన్‌కు గురయ్యాడని అనుకోవట్లేదని గతంలో రవిశాస్త్రి అన్నాడు. గతంలో రాహుల్ ద్రవిడ్‌లానే గంభీర్ ఇతర సహాయ బృందంతో సమానంగా ప్రైజ్‌మనీ తీసుకోవాలన్నట్టుగా గావస్కర్ తన కాలమ్‌లో పేర్కొన్నాడు.

ఆ డబ్బులు కట్టండి

- హెచ్‌సీఏ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారికి హైకోర్టు ఆదేశం
- వెంకటేశ్ ప్రసాద్ నియామకం రద్దు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) పెద్దలకు మరో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. సన్‌రైజర్స్ ఫ్రాంఛైజీకి హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు బెదిరింపులు, బ్లాక్ మెయిల్ ఆరోపణలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ విచారణ కొనసాగుతుండగా.. తాజాగా హైకోర్టు అక్షింతలు వేసింది. నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేపట్టారంటూ జగన్ మోహన్‌రావు, హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి శ్రీనివాస్‌లపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక ఆగ్రహం వ్యక్తంచేశారు. హెచ్‌సీఏ క్రికెట్ ఆపరేషన్స్ అండ్ గేమ్ డెవలప్‌మెంట్ సలహాదారుగా భారత మాజీ ఆటగాడు వెంకటేశ్ ప్రసాద్ నియామకాన్ని హైకోర్టు రద్దు చేసింది. అతనితో సహా పలువురి కోచ్‌లను నియామకాల్ని రద్దు చేసిన హైకోర్టు.. వారికిచ్చిన గౌరవ వేతనాన్ని జగన్ మోహన్‌రావు, దేవరాజ్, శ్రీనివాస్ వ్యక్తిగత ఖాతాల నుంచి వసూలు చేయాలని ఆదేశించింది. హెచ్‌సీఏ నియామకాలు నిబంధనలకు విరుద్ధంగా సాగాయంటూ ఉపాధ్యక్షుడు దల్జీత్‌సింగ్, సంయుక్త కార్యదర్శి బసవరాజు, సభ్యుడు సునీల్ అగర్వాల్.. ఎపెక్స్ కమిటీలో ఐసీఏ ప్రతినిధులు స్వరూప్, రోమాసింగ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారణ చేసిన న్యాయమూర్తి ఈమేరకు తీర్పు వెలువరించారు. వెంకటేశ్ ప్రసాద్‌కు ఏడాదికి రూ.75 లక్షల జీతంతో సలహాదారుగా నియమించారు. హిమాని యాదవ్ (రూ.3 లక్షలు), మమత కనోజియా (రూ.5 లక్షలు), అర్జున్ హోస్యాలా (రూ.12 లక్షలు), సబ్యసాచి (రూ.12 లక్షలు), రాజశేఖర్ షంబాల్ (రూ.10 లక్షలు), వినీత్ సక్సేనా (30 లక్షలు), అమిత్ (రూ.17 లక్షలు) స్రవంతి నాయుడు, సువర్ణ లక్ష్మిలను వివిధ జట్లకు కోచ్, ట్రెయినర్లు, ఫిజియోలుగా ఎంపిక చేశారు. "నిరుడు జులై 30న ఎపెక్స్ కౌన్సిల్‌ను సంప్రదించకుండానే రూ.75 లక్షలతో వెంకటేశ్ ప్రసాద్‌తో హెచ్‌సీఏ ఒప్పందం కుదుర్చుకుంది. ఇది హెచ్‌సీఏ నియమావళి ఉల్లంఘనే. ఎపెక్స్ కౌన్సిల్‌ను సంప్రదించకుండా, ఆమోదం పొందకుండా చేపట్టిన నియామకాల్ని చట్టవిరుద్ధంగా అమలు చేస్తున్నారు" అని పిటిషన్‌లో పేర్కొన్నారు. హెచ్‌సీఏ పదవుల్ని అంగీకరించడంలో వెంకటేశ్ ప్రసాద్ సహా కోచ్‌ల తప్పులేదని వ్యాఖ్యానించిన న్యాయమూర్తి.. నియామకాలు నిబంధనలకు అనుగుణంగా లేవని స్పష్టంచేశారు. వారి నియామకాల్ని రద్దు చేస్తున్నట్లు తీర్పులో పేర్కొన్నారు.

ఫైనల్ బెర్తుపై భారత్ కన్ను

మహిళల ముక్కోణపు వన్డే సిరీస్ ● ఉ.10 గంటల నుంచి

కొలంబో: మహిళల ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్ ఫైనల్ బెర్తుపై కన్నేసింది. మూడు మ్యాచ్‌ల్లో రెండు గెలిచిన హర్మన్‌ప్రీత్ బృందం.. బుధవారం దక్షిణాఫ్రికాతో పోరుకు సిద్ధమైంది. వన్డే ఫార్మాట్లో వరుసగా ఎనిమిది మ్యాచ్‌లు నెగ్గి జోరు మీదున్న టీమ్‌ఇండియాకు తాజాగా శ్రీలంక షాక్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికాతో పోరులో గత మ్యాచ్ తప్పిదాలు దొర్లకూడదని భారత్ పట్టుదలగా ఉంది. లంకపై బౌలింగ్ వైఫల్యం జట్టును దెబ్బ తీసింది. కీలక సమయాల్లో వికెట్లు తీయలేక ఓటమి పాలైంది. స్నేహ్‌రాణా (11 వికెట్లు) మాత్రమే స్థిరంగా రాణిస్తోంది. ఈ సిరీస్‌లో దక్షిణాఫ్రికాపై అయిదు వికెట్లు తీసిన స్నేహ్.. మరోసారి రాణిస్తే భారత్‌కు తిరుగుండదు. లంకతో మ్యాచ్‌లో గాయపడిన పేసర్ కశ్వీ గౌతమ్ ఈ మ్యాచ్‌లో బరిలో దిగుతుందో లేదో తెలియదు. ఇంకోవైపు ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓడిన దక్షిణాఫ్రికా.. ఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే టీమ్‌ఇండియాపై నెగ్గక తప్పదు.

ఫైనల్లో అభయ్

నికోసియా (సైప్రస్): ఐఎస్ఎస్ఎఫ్ షాట్‌గన్ ప్రపంచకప్‌లో భారత షూటర్ అభయ్‌సింగ్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. క్వాలిఫికేషన్లో నాలుగు రౌండ్ల తర్వాత 98 పాయింట్లతో అయిదో స్థానంలో నిలిచాడు. మైరాజ్ అహ్మద్ (95 పాయింట్లు), రితురాజ్ బందేలా (90).. వరుసగా 36, 68 స్థానాల్లో నిలిచి పతక రౌండ్‌కు దూరమయ్యారు. మహిళల్లో మహేశ్వరి చౌహాన్ (93).. 16వ స్థానాన్ని దక్కించుకుంది. పరినాజ్ 19, యశస్వి రాథోడ్ 38వ స్థానాలు సాధించారు.

సాయి, కుల్‌దీప్‌ను ఎంపిక చేయాలి


ఎమ్మెస్కే ప్రసాద్

దిల్లీ: ఇంగ్లాండ్ పర్యటనలో పాల్గొనే భారత జట్టుకు సాయి సుదర్శన్, కుల్‌దీప్ యాదవ్‌ను ఎంపిక చేయాలని సెలెక్షన్ కమిటీ మాజీ ఛైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ అన్నాడు. జూన్ 20న ఇంగ్లాండ్‌తో అయిదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. "ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో సాయి సుదర్శన్ భాగమవ్వాలి. డబ్ల్యూటీసీ నూతన చక్రం ప్రారంభమవుతుంది కాబట్టి ఇదే సరైన సమయం. రోహిత్‌శర్మ జట్టులో ఉంటే అతనితో పాటు యశస్వి జైశ్వాల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తాడు. సాయి బ్యాకప్ ఓపెనర్‌గా ఉంటాడు. సిరీస్ సాగుతున్నకొద్దీ సాయికి అవకాశం లభించొచ్చు. కుల్‌దీప్ మ్యాచ్ విన్నర్. అతడిని కూడా ఎంపిక చేయాలి. ఇంగ్లిష్ పరిస్థితుల్లో అర్ష్‌దీప్ సింగ్ బాగా పనికొస్తాడు. అతను బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగలడు. ప్రస్తుతం అర్ష్‌దీప్ మంచి ఆత్మవిశ్వాసంతో ఉన్నాడు" అని ఎమ్మెస్కే పేర్కొన్నాడు.

జ్యోతికి ఆరో స్థానం

ఆర్చరీ ప్రపంచకప్ క్వాలిఫికేషన్స్


జ్యోతి సురేఖ

షాంఘై: ప్రపంచకప్ స్టేజ్-2 టోర్నమెంట్లో భారత ఆర్చర్లు సత్తా చాటారు. కాంపౌండ్ మహిళల సింగిల్స్ క్వాలిఫికేషన్లో వెన్నం జ్యోతి సురేఖ (705 పాయింట్లు) ఆరో స్థానంలో నిలిచింది. తొలిసారి ఈ కప్ బరిలో దిగిన తెలుగమ్మాయి తానిపర్తి చికిత (701) పదకొండో స్థానాన్ని సాధించింది. ఇదే విభాగంలో మధుర 708 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. మొత్తంగా 2114 పాయింట్లతో భారత మహిళల జట్టు మొదటి స్థానంలో దక్కించుకుంది. మెక్సికో (2109), కొరియా (2107) తర్వాతి స్థానాలు సాధించాయి. పురుషుల విభాగంలో అభిషేక్‌వర్మ (714), రిషబ్ యాదవ్ (713) రెండు, మూడో స్థానాల్లో నిలిచారు. ఓజస్ (707) పదో స్థానాన్ని దక్కించుకున్నాడు. టీమ్ విభాగంలో భారత్ (2134) అగ్రస్థానంలో నిలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్ (1422, అభిషేక్-మధుర) మొదటి స్థానాన్ని సొంతం చేసుకుంది.

మరుగుదొడ్లు పనిచేయక దారి మళ్లిన ఎయిరిండియా విమానం

దిల్లీ; ముంబయి: మరుగుదొడ్లు పనిచేయకపోవడంతో కెనడాలోని టొరంటో నుంచి దిల్లీకి వస్తున్న ఎయిరిండియా(ఏఐ188) విమానాన్ని ఫ్రాంక్‌ఫర్ట్‌కు మళ్లించారు. ఈ ఘటన ఈ నెల 2వ తేదీన చోటు చేసుకుంది. సాంకేతిక కారణాలతో విమానాన్ని దారిమళ్లించినట్లు విమానయాన సంస్థ అధికార ప్రతినిధి వెల్లడించారు. అనంతరం సమస్య పరిష్కారం కావడంతో ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి కొన్ని గంటల్లోనే ఆ విమానం దిల్లీకి బయలుదేరి గమ్యం చేరుకుంది. ఆ లోహవిహంగం దాదాపు 16 ఏళ్ల నుంచి సేవలందిస్తోంది. గడచిన రెండు నెలల్లో మరుగుదొడ్లకు సంబంధించిన సమస్యలతో ఎయిరిండియా విమానం దారిమళ్లడం ఇది రెండోసారి. షికాగో నుంచి దిల్లీకి రావలసిన ఏఐ126 విమానం కూడా మార్చి 6న ఇటువంటి సమస్యతోనే వెనక్కు మళ్లింది. ప్రయాణికుల అనుచిత ప్రవర్తన కారణంగా సంస్థ ఇటువంటి ఇబ్బందులనెదుర్కొంటోందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

ఇజ్రాయెల్ దాడిలో సనా విమానాశ్రయం ధ్వంసం

- ముగ్గురి మృతి

జెరూసలేం: యెమెన్‌లోని ఇరాన్ మద్దతు గల హూతీ తిరుగుబాటుదారులపై ఇజ్రాయెల్ వైమానిక దాడులను ముమ్మరంగా కొనసాగిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం యెమెన్ రాజధాని సనాలోని అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పూర్తిగా ధ్వంసం చేసింది. పలు విద్యుత్ కేంద్రాలను నాశనం చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. విమానాశ్రయం దాడికి గురైందని హూతీలకు చెందిన న్యూస్ చానల్ అల్-మసిరాహ్ ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడిలో ముగ్గురు మరణించగా, 38 మంది గాయపడ్డారని హూతీ వార్తా సంస్థ సాబా ప్రకటించింది.

దాడులు ఆపేస్తున్నాం : ట్రంప్

ఇదిలా ఉండగా హూతీలపై తదుపరి వైమానిక దాడులను నిలిపేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం ప్రకటించారు. తిరుగుబాటుదారులు లొంగిపోయారని చెప్పారు.

రిజర్వేషన్.. రైలుబోగీ లాంటిది

- లోపల ఉన్నవారు ఇతరులు రావడాన్ని ఇష్టపడరు: సుప్రీం

దిల్లీ: మన దేశంలో రిజర్వేషన్.. రైలు లాంటిదని, బోగీల్లో ఉన్నవారు.. బయటి నుంచి ఇతరులు రావడాన్ని ఇష్టపడరని మంగళవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జయంత్ కుమార్ బాంఠియా కమిషన్ సూచించడాన్ని సవాలు చేస్తూ మంగేష్ శంకర్ ససానె అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరఫున జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదనలు వినిపించారు. నిజంగా రాజకీయంగా వెనకబడి ఉన్నారా అని చూడకుండా ఓబీసీలకు 27శాతం కోటా ఇవ్వాలని బాంఠియా కమిషన్ సిఫారసు చేసిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిజర్వేషన్లను రైలుతో జస్టిస్ సూర్యకాంత్ పోల్చారు. శంకరనారాయణన్ వాదనలు కొనసాగిస్తూ.. బోగీలను రైలు వెనకవైపు అదనంగా కలపవచ్చని, అయితే సామాజిక, విద్యాపరమైన వెనకబాటు, రాజకీయ వెనకబాటు మధ్య చాలా తేడా ఉందని, ఓబీసీలు ఆటోమేటిక్‌గా రాజకీయ వెనకబాటు కింద రిజర్వేషన్లు పొందలేరని పేర్కొన్నారు. రిజర్వేషన్ అమలు కోసం ఓబీసీల్లో రాజకీయంగా, సామాజికంగా వెనకబడిన వారిని గుర్తించాల్సి ఉందని తెలిపారు. జస్టిస్ సూర్యకాంత్ జోక్యం చేసుకుంటూ.. 'సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాలున్నాయి. వారిని ఈ లబ్ధికి ఎందుకు దూరం చేయాలి. దీనిని ఏ ఒక్క కుటుంబానికో, వర్గానికో ఎందుకు పరిమితం చేయాలి' అని ప్రశ్నించారు. అనంతరం మహారాష్ట్ర ప్రభుత్వ స్పందనను కోరుతూ విచారణను న్యాయమూర్తులు వాయిదా వేశారు.

జర్మనీ ఛాన్స్‌లర్‌గా ఫ్రెడరిక్ మెర్జ్



బెర్లిన్: జర్మనీ ఛాన్స్‌లర్‌గా మితవాద నేత ఫ్రెడరిక్ మెర్జ్ ఎన్నికయ్యారు. దేశ దిగువ సభ బుండెస్టాగ్‌లో మంగళవారం జరిగిన ఎన్నికలో తొలుత ఆయన ఓటమి పాలైనా తరువాత కొన్ని గంటలకే మళ్లీ జరిగిన ఓటింగులో విజయం సాధించారు. ఆనవాయితీ ప్రకారం జర్మనీ దేశాధ్యక్షుడు బుండెస్టాగ్‌లోని పార్లమెంటరీ పార్టీలన్నింటినీ సంప్రదించాక ఛాన్స్‌లర్ పదవికి అభ్యర్థిని ప్రకటిస్తారు. ఇలా ప్రకటించిన అభ్యర్థి బుండెస్టాగ్‌లో మొత్తం 630 మంది సభ్యులకుగాను 316 మంది మద్దతు పొందాలి. ఈ ఎన్నిక రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరుగుతుంది. ఈసారి అధ్యక్షుడు ఛాన్స్‌లర్ అభ్యర్థిగా ప్రకటించిన ఫ్రెడరిక్ మెర్జ్ తొలుత 310 ఓట్లే పొందగలిగారు. రెండోసారి జరిగిన ఓటింగులో ఆయన 325 ఓట్లు పొందారు. మెర్జ్‌కు చెందిన కూటమిలో క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్, క్రిస్టియన్ సోషల్ యూనియన్ పార్టీలు ఉండగా ఈ కూటమికి సోషల్ డెమోక్రాట్లు మద్దతు ప్రకటించారు. ఈ మూడు పార్టీలకూ కలిపి సభలో మొత్తం 328 స్థానాలున్నాయి.

భద్రతామండలిలో పాక్ ఉక్కిరిబిక్కిరి

తీర్మానం లేదు.. ప్రకటనా వేయలేదు

న్యూయార్క్, దిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై ప్రపంచ దేశాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశంలో అమాయకత్వం నటించేందుకు ఆ దేశం చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. పైగా సభ్యదేశాలు కఠిన ప్రశ్నలు సంధించి ఉక్కిరిబిక్కిరి చేయడంతో తల దించుకోవాల్సిన పరిస్థితి పాక్‌కు ఎదురైంది. ఒక్క ప్రశ్నకూ సరైన సమాధానం చెప్పలేక దిక్కులు చూడాల్సి వచ్చింది. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తత పెరగడంపై సోమవారం న్యూయార్క్‌లో జరిగిన భద్రతామండలిలో అంతర్గత చర్చ జరిగింది. పహల్గాం ఉగ్రదాడి నుంచి దృష్టి మళ్లించేందుకు పాకిస్థాన్ ఎప్పటిలా కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించగా భారత్ గట్టిగా బదులిచ్చింది. ఉగ్రదాడిని సభ్యదేశాలు ఖండించాయి. ఈ దాడికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించాయి. భారత్ కుట్రపన్ని తనకు తానే పహల్గాం దాడి చేయించుకొని పాక్‌పై నిందలు మోపుతోందన్న దారుణ వాదనలను సభ్యదేశాలు విశ్వసించలేదు. ఉగ్రదాడికి పాల్పడినవారు జవాబుదారీగా ఉండాలంటూ తేల్చి చెప్పాయి. పహల్గాం దాడిలో లష్కరే తయ్యిబా పాత్రను కూడా సభ్య దేశాలు ప్రశ్నించాయి. మతం ఆధారంగా అమాయక ప్రజలను ఉగ్రవాదులు చంపడంపై ఆందోళన వ్యక్తం చేశాయి.

ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో పాకిస్థాన్ వరుసగా క్షిపణి పరీక్షలు నిర్వహించడంపైనా భద్రతా మండలి నిలదీసినట్లు సమాచారం. మండలిలోని శాశ్వత సభ్యత్వం లేని దేశాల్లో పాకిస్థాన్ ఒకటి. ఆ దేశం అభ్యర్థనపైనే ఈ సమావేశం జరిగింది. భారత్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేయించాలని పాక్ తొలుత భావించింది. ఈ అంశాన్ని అంతర్జాతీయం చేద్దామనుకొంది. అయినా ఏ దేశమూ దానితో చేయి కలపలేదు. ప్రయత్నాలు బెడిసికొట్టగా ఆ దేశానికి ఇతర దేశాలు తలంటాయి. దాదాపు గంటన్నర జరిగిన ఈ సమావేశం- ఎలాంటి నిర్ణయాలు, తీర్మానాలు లేకుండానే ముగిసింది. ప్రకటన విడుదలకూ ఐక్యరాజ్యసమితి నిరాకరించడంతో పాక్ ముఖం మీదే తలుపులు మూసినట్లయింది. బహిరంగంగా అణుబాంబు బెదిరింపులకు దిగుతున్న పాకిస్థాన్‌పై సభ్యదేశాలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఇటీవల క్షిపణి పరీక్షలు నిర్వహించడాన్ని కూడా ప్రశ్నించాయి. అది ఉద్రిక్తతలు పెంచి ప్రాంతీయ అస్థిరతకు దారి తీస్తుందని ఆక్షేపించాయి. భారత్‌తో ద్వైపాక్షిక చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చాయి.

మన జలాలను దేశం దాటనివ్వం

అవి ఇక్కడి వారి కోసమే: ప్రధాని



దిల్లీ: భారత జలాలు ఇక నుంచి దేశం దాటనివ్వబోమని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాల కోసమే వాటిని వినియోగిస్తామని తేల్చి చెప్పారు. పాక్‌తో అమల్లో ఉన్న సింధూ నదీజలాల ఒప్పందాన్ని నిలిపేస్తున్నామని ఇటీవల కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తమ ప్రభుత్వం నదుల అనుసంధానంపై దృష్టి పెట్టిందని, రాష్ట్రాల మధ్య వివాదాలకు జలాలు కారణమవుతున్నాయని మంగళవారం ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించిన 'ఇండియా ఎట్ 2047' సదస్సులో మోదీ అభిప్రాయపడ్డారు. 'ఇంతకుముందు భారత్‌కు హక్కున్న జలాలు దేశం బయటకు వెళ్లేవి. ఇక నుంచి భారత్ జలాలు భారత్‌లోనే వినియోగించుకుంటాం' అని పేర్కొన్నారు.

దక్షిణ అండమాన్ సముద్రంలోకి 13 నాటికి నైరుతి పవనాలు

దిల్లీ: నైరుతి రుతు పవనాలు ఈనెల 13 నాటికి బంగాళాఖాతంలోని అండమాన్ నికోబార్ దీవుల్లోకి ప్రవేశించే అవకాశమున్నట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం వెల్లడించింది. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించడం ద్వారా దేశమంతటా వర్షాలు మొదలవుతాయి. జులై 8 నాటికి ఇవి దేశమంతా విస్తరిస్తాయి. మళ్లీ వాయవ్య భారతం నుంచి సెప్టెంబరు 17తో రుతుపవనాల ఉపసంహరణ మొదలై అక్టోబరు 15 నాటికి ముగుస్తుంది. ఈ ఏడాది రుతుపవన కాలంలో సాధారణం కంటే అధిక వర్షాలు కురుస్తాయని ఐఎండీ గత నెలలో తెలిపింది. భారత ఉపఖండంలో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే ఎల్‌నినో పరిస్థితుల అవకాశాన్ని సైతం తోసిపుచ్చింది. ఐఎండీ లెక్కల ప్రకారం.. 50 సంవత్సరాల సగటు వర్షపాతం 87 సెం.మీ.లలో 96 నుంచి 104 శాతం కురిస్తే సాధారణంగా పరిగణిస్తారు. భారత వ్యవసాయరంగానికి ఎంతో కీలకమైన రుతుపవనాలు దేశంలో 42.3 శాతం జనాభాకు జీవనాధారం. దేశ జీడీపీకి 18.2 శాతం తోడ్పాటు సైతం వీటిదే.

పోప్ ఎన్నికకు రంగం సిద్ధం



రోమ్‌లో మీడియాతో మాట్లాడుతున్న హైదరాబాద్ ఆర్చిబిషప్, కార్డినల్ పూల ఆంథోనీ



ఓటింగుకు సిద్ధమైన సిస్టీన్ చాపెల్

వాటికన్: కేథలిక్ ప్రపంచ ఆధ్యాత్మిక అధినేత, వాటికన్ దేశాధినేతగా బాధ్యతలు చేపట్టే తదుపరి పోప్‌ను ఎన్నుకునే ప్రక్రియ బుధవారం ప్రారంభం కానుంది. ఇందుకోసం 70 దేశాలకు చెందిన 133 మంది క్యాథలిక్ మతగురువులైన కార్డినళ్లు వాటికన్‌లోని సిస్టీన్ చాపెల్ చర్చిలో సమావేశం కానున్నారు. "ప్రిన్సెస్ ఆఫ్ చర్చ్"గా ప్రసిద్ధులైన అత్యున్నత స్థాయి కార్డినళ్లు ముందుగా లిటనీ ఆఫ్ సెయింట్స్ గీతాలాపనల మధ్య చాపెల్‌లోకి ప్రవేశిస్తారు. వారు గోప్యతా ప్రమాణం స్వీకరించిన అనంతరం రహస్య బ్యాలెట్ ద్వారా ఓటు వేస్తారు. ఈ ఓటింగులో మూడింట రెండొంతుల ఓట్లు, అంటే 89 ఓట్లు సాధించిన వ్యక్తి పోప్‌గా ఎన్నికైనట్టు ప్రకటిస్తారు. నిర్దిష్ట సంఖ్యలో ఓట్లు సాధించిన వ్యక్తి ఎంపికయ్యే వరకూ ఉదయం రెండుసార్లు, సాయంత్రం రెండుసార్లు ఓటింగ్ నిర్వహిస్తారు.



మానసిక ఆరోగ్యం మెరుగుపడాలంటే..

మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. అందుకోసం ప్రధానంగా-

- ★ రోజూ నడకకు వెళ్లండి
- ★ తరచూ వ్యాయామం చేయండి
- ★ రాత్రి 7-8 గంటలు నిద్రించండి
- ★ రోజూ ధ్యానం చేయండి
- ★ పోషకాహారం తీసుకోండి
- ★ అర్థవంతమైన లక్ష్యాల కోసం కృషి చేయండి

– షనా మెడలూలి, లైఫ్ కోచ్

ఉగ్రదాడికి 3 రోజుల ముందే నిఘా నివేదికతో..

కశ్మీర్ పర్యటన రద్దు చేసుకొన్న మోదీ

- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే



రాంచీ, దిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు చేశారు. ఆ దాడికి మూడు రోజులు ముందే ఉగ్రదాడి అవకాశాలపై ఇంటెలిజెన్సు నివేదిక అందడంతో ప్రధాని మోదీ తన కశ్మీర్ పర్యటన రద్దు చేసుకొన్నట్లు ఖర్గే వెల్లడించారు. మంగళవారం ఝార్ఖండ్ రాజధాని రాంచీలో 'సంవిధాన్ బచావో' సభలో ఆయన మాట్లాడారు. "ఈ సమయంలో కశ్మీర్ పర్యటనకు వెళ్లడం మీ భద్రత దృష్ట్యా మంచిది కాదని ఇంటెలిజెన్సు చెప్పినపుడు.. ప్రధాని ఇదే విషయాన్ని పర్యాటకుల రక్షణకు ఆయా విభాగాలకు చేరవేసి ఎందువల్ల అప్రమత్తం చేయలేదు? కశ్మీర్‌కు అదనపు బలగాలను ఎందుకు పంపలేదు?" అని ప్రశ్నించారు. పహల్గాం ఘటన తర్వాత జరిగిన అఖిల పక్ష సమావేశంలో ఇంటెలిజెన్సు వైఫల్యమని ప్రభుత్వం అంగీకరించిందన్నారు. కీలక సమాచారం ముందే అందినా భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేయకపోవడంతో 26 మంది అమాయకులు బలయ్యారని, దీనికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పాకిస్థాన్‌పై ఎటువంటి చర్య తీసుకున్నా ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందని ఖర్గే పునరుద్ఘాటించారు. ఖర్గే ఆరోపణలను భాజపా ఖండించింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడు ఇంత బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు.

2 లక్షల పుస్తకాలు.. రూ.7.25 కోట్లు

- కొనుగోలు వివాదంలో యూనియన్ బ్యాంక్

దిల్లీ: ప్రభుత్వరంగానికి చెందిన యూనియన్ బ్యాంక్ ఒక పుస్తక కొనుగోలు వివాదంలో చిక్కుకుంది. భారత ప్రభుత్వానికి గతంలో ముఖ్య ఆర్థిక సలహాదారుగా వ్యవహరించిన కేవీ సుబ్రమణియన్ రచించిన పుస్తకం 2 లక్షల ప్రతులను రూ.7.25 కోట్లకు బ్యాంకు కొనుగోలు చేసిందని ప్రముఖ ఆంగ్లపత్రిక 'ఎకనామిక్ టైమ్స్' వెల్లడించింది. కేంద్రం ఇటీవలే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పదవి నుంచి కేవీ సుబ్రమణియన్‌ను తప్పించింది. భారత ప్రభుత్వానికి ముఖ్య ఆర్థిక సలహాదారుగా వ్యవహరించిన సుబ్రమణియన్ గతేడాది తాను రచించిన 'ఇండియా ఎట్ 100' పుస్తకాన్ని వెలువరించారు. ఈ పుస్తకాన్ని బ్యాంకు వినియోగదారులకు, కార్పొరేట్లకు, పాఠశాలలకు, లైబ్రరీలకు పంపిణీ చేయాలని యూనియన్ బ్యాంక్ సెంట్రల్ ఆఫీసు నిర్ణయించింది. ఇందులో భాగంగా 1,89,450 పేపర్ బ్యాక్ పుస్తకాలను ఒక్కొక్కటి రూ.350 చొప్పున, 10,422 హార్డ్‌కవర్ ప్రతులను రూ.597 చొప్పున కొనుగోలు చేసేందుకు ఆర్డర్ చేసింది. ఇందుకోసం రూ.7 కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. బ్యాంకుకు చెందిన 18 జోనల్ కార్యాలయాల నుంచి పది వేల ప్రతుల చొప్పున ఈ ఆర్డర్ రావడం అనుమానాలకు తావిస్తోంది.

ఎయిర్‌బ్యాగ్ లోపానికి రూ.25.3 కోట్ల పరిహారం

- అమెరికా కోర్టు తీర్పు

మయామీ: ఎయిర్‌బ్యాగ్‌లో లోపం కారణంగా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తికి రూ.25.3 కోట్ల (30 లక్షల డాలర్లు) పరిహారం ఇవ్వాలని అమెరికాలోని ఓ కోర్టు తీర్పు చెప్పింది. దక్షిణ ఫ్లోరిడాలోని మయామీ-డేడ్ న్యాయమూర్తులు ఈ తీర్పు ఇచ్చారు.

పిటిషనరు తరఫు న్యాయవాది తెలిపిన వివరాల ప్రకారం..జోస్ హెర్నాండెజ్ అనే వ్యక్తి 2020 డిసెంబరులో తన 2005 తయారీ హోండా సివిక్ కారులో వెళ్తున్నారు. ఎడమవైపునకు మలుపు తిరుగుతుండగా మరో వాహనం ఢీకొంది. వాస్తవానికి ఈ ప్రమాదం కారణంగా స్వల్ప గాయాలే కావాల్సింది. కానీ టకాటా కంపెనీకి చెందిన లోపభూయిష్ఠ ఎయిర్‌బ్యాగ్ కారణంగా ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఎయిర్‌బ్యాగ్ ఇన్‌ఫ్లేటర్ అవసరానికి మించి పేలింది. దీంతో పదునుగా ఉండే లోహ భాగం ఒకటి దూసుకొచ్చి హెర్నాండెజ్ కుడి చేతిలో కొన్ని అంగుళాల వరకూ దిగిపోయింది. దీనిపై 2022లో హెర్నాండెజ్ కోర్టులో కేసు వేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం గత గురువారం తీర్పు చెప్పింది. టకాటా కంపెనీ దివాలా తీయడంతో ఏర్పాటు చేసిన టకాటా ఎయిర్‌బ్యాగ్ టార్ట్ పరిహార ట్రస్టు ఫండ్ నుంచి ఈ పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

■ టకాటా ఎయిర్‌బ్యాగ్ ఇన్‌ఫ్లేటర్లలో లోపాల కారణంగా అమెరికాలో 28 మంది మరణించారు. ప్రపంచవ్యాప్తంగా 36 మంది చనిపోయారు. అమెరికాలో 400 మంది గాయపడ్డారు. దీంతో 2013 నుంచే ఈ ఎయిర్‌బ్యాగ్‌లను రీకాల్ చేయడం ప్రారంభించారు.

■ ప్రమాదం జరిగినప్పుడు ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడానికి జరిగే స్వల్ప పేలుడు కోసం టకాటా.. అమోనియం నైట్రేట్‌ను వినియోగిస్తుంది. కానీ అది అధిక ఉష్ణోగ్రత, తేమల కారణంగా భారీ పేలుడుకు కారణమవుతోంది. లోహ కానిస్టర్‌లోని ముక్కలు పదునుగా ప్యాసింజర్‌వైపు దూసుకువెళ్తున్నాయి.




జమ్మూలోని ఓ గ్రామంలో బంకర్‌ను శుభ్రం చేసుకుంటున్న మహిళలు

సరిహద్దు గ్రామాల్లో శరవేగంగా బంకర్ల నిర్మాణం

ఈటీవీ భారత్: జమ్మూలోని అంతర్జాతీయ సరిహద్దును ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో భూగర్భ బంకర్ల నిర్మాణాన్ని భారత ప్రభుత్వం వేగవంతం చేసింది. పహల్గాం ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి పాకిస్థాన్ సైన్యం ప్రతిరోజూ కాల్పులు జరుపుతోంది. వీటి నుంచి సరిహద్దు ప్రాంత ప్రజలను రక్షించడానికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన బంకర్ల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు రక్షణ శాఖ వర్గాలు చెబుతున్నాయి. అధిక జనసాంద్రత కలిగిన చాలా గ్రామాల్లో డజన్లకొద్దీ బంకర్లను నిర్మిస్తున్నారు. ఒక్కో బంకర్‌ను 15 రోజుల్లోనే పూర్తి చేస్తున్నారు. ఇవి పాకిస్థాన్ కాల్పులను తట్టుకోగలవు. ఆర్‌సీసీ సామగ్రితో గోడలు, పైకప్పులు ఒక అడుగు మందంగా ఉండేలా వీటిని నిర్మిస్తున్నారు. ఎలాంటి భారీ దాడులనైనా తట్టుకునేలా దృఢమైన ఉక్కును ఉపయోగిస్తున్నారు. ప్రతి బంకర్‌లో రెండు గదులు, ఒక మరుగుదొడ్డి, భోజనాల గది ఉంటాయి. ఒక్కో బంకర్‌లో దాదాపు 50 మంది కూర్చోవచ్చని హీరాలాల్ అనే గుత్తేదారు తెలిపారు. గతంలో భారత్-పాక్ యుద్ధాలు జరిగినప్పుడు వందల కుటుంబాలు బంకర్లను నిర్మించుకున్నాయి. తాజాగా మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఇప్పుడు మరిన్ని సిద్ధమవుతున్నాయి.

దేశ రాజధాని ప్రాంత రాష్ట్రాల్లో బాణసంచాపై సంపూర్ణ నిషేధం

- అమలులో విఫలమైతే కోర్టు ధిక్కరణ చర్యలు
- యూపీ, రాజస్థాన్, హరియాణాలకు సుప్రీం హెచ్చరిక



దిల్లీ: జాతీయ రాజధాని ప్రాంత (ఎన్సీఆర్) రాష్ట్రాల్లో బాణసంచా తయారీ, విక్రయాలు, నిల్వలపై సంపూర్ణ నిషేధాన్ని విధించిన సర్వోన్నత న్యాయస్థానం...ఈ ఆదేశాలను కచ్చితంగా అమలుచేయాల్సిందేనని ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, హరియాణా రాష్ట్రాలకు స్పష్టం చేసింది. అమలులో విఫలమైతే కోర్టు ధిక్కరణ చర్యలను తీసుకుంటామని మంగళవారం హెచ్చరించింది. పర్యావరణ పరిరక్షణ చట్టం (ఈపీఏ)లోని నిబంధనల ప్రకారం మార్గదర్శకాలను జారీ చేయాలని ఆయా రాష్ట్రాలకు జస్టిస్ అభయ్ ఎస్.ఓక్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం సూచించింది. ఈపీఏ ప్రకారం... ఎన్సీఆర్ పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో అన్ని రకాల బాణసంచా తయారీ, విక్రయాలు, నిల్వలతో పాటు ఆన్‌లైన్ సరఫరాపైనా నిషేధం విధించాల్సి ఉంటుంది. అన్ని ప్రభుత్వ యంత్రాంగాల ద్వారా ఈ నిషేధాన్ని అమలు చేయాల్సి ఉంటుందని (ఈపీఏ సెక్షన్ 5) ధర్మాసనం పేర్కొంది. తమ ఆదేశాల అమలు తీరును వివరిస్తూ ఎన్సీఆర్ పరిధి రాష్ట్రాలన్నీ అఫిడవిట్ సమర్పించాలనీ తెలిపింది. నిషేధం గురించి, ఉల్లంఘిస్తే విధించే జరిమానాల గురించీ విస్తృతంగా ప్రచారం చేయాలని కూడా సూచించింది. దిల్లీ-ఎన్సీఆర్ పరిధిలో వాయుకాలుష్యం ప్రమాదకర స్థాయిలోనే ఉన్నందున బాణసంచాపై నిషేధాన్ని సడలించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 3న నిరాకరించింది. దీపావళి ముందు మాత్రమే బాణసంచాపై నిషేధం అమలు చేయడాన్నీ తోసిపుచ్చింది. ఈ పండగకు చాలా ముందుగానే బాణసంచా కొని నిల్వ చేస్తారు కాబట్టి అటువంటి నిషేధం వల్ల ఉపయోగం ఉండదని ధర్మాసనం అభిప్రాయపడింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ యూపీ, హరియాణా రాష్ట్రాలు బాణసంచాపై సంపూర్ణ నిషేధాన్ని అమలు చేయాలంటూ 2024 డిసెంబరులో సుప్రీంకోర్టు ఆదేశించింది. దానిని ఇప్పుడు కొనసాగించింది.



ఈసీ నిర్వహించిన సమావేశానికి హాజరైన సతీష్‌చంద్ర మిశ్ర, మాయావతి, శ్రీధర్

మాయావతితో ఈసీ సమావేశం

దిల్లీ: బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతితో మంగళవారం ఎన్నికల కమిషన్(ఈసీ) సమావేశం నిర్వహించింది. ఆయా సమస్యలపై వివిధ భాగస్వాములతో క్రమంతప్పకుండా చర్చించాలనే నిర్ణయంలో భాగంగా ఈసీ మొదటిసారి ఓ రాజకీయ పార్టీతో భేటీ అయ్యింది. బీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శి సతీష్‌చంద్ర మిశ్ర, పార్టీ కోశాధికారి శ్రీధర్ సైతం ఇందులో పాల్గొన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఇక్కడి నిర్వాచన్ సదన్‌లో బీఎస్పీ నాయకత్వంతో చర్చించారు. ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేసేందుకు నిర్మాణాత్మక చర్చల కోసం ఎన్నికల అధికారులు జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలతో సంభాషణలను ప్రారంభించారు. దీని ద్వారా పార్టీ అధిపతులు తమ సూచనలు, సలహాలను కమిషన్‌తో నేరుగా పంచుకోవచ్చు.

62 ఏళ్ల కిందట అదృశ్యమైన మహిళ క్షేమం

వాషింగ్టన్: అమెరికాలోని విస్కాన్సిన్‌లో 62 ఏళ్ల కిందట అదృశ్యమైన మహిళ క్షేమంగా ఉన్నట్లు తేలింది. సెంట్రల్ విస్కాన్సిన్‌లోని ఓ చిన్న పట్టణంలో ఆడ్రీ బ్యాక్‌బర్గ్.. తన కుటుంబానికి చెందిన శిశు సంరక్షకురాలితో కలిసి పొరపాటున ఆరోజు ఇండియానా పొలిస్ వెళ్లే బస్సులో ఎక్కింది. అప్పటి నుంచి ఆచూకీ దొరకలేదు.

బస్‌స్టాప్ వద్ద అప్పట్లో అదృశ్యమైన 20 ఏళ్ల యువతి (ఇప్పుడు ఆమెకు 82 ఏళ్లు) మరో రాష్ట్రంలో క్షేమంగా ఉందని గతవారం సాక్ కౌంటీ పోలీస్ కమిషనర్ ప్రకటించారు. అప్పట్లో ఆమె.. భర్త వేధింపుల కారణంగా రీడ్స్‌బర్గ్‌ను వీడిందని ఈ కేసును పరిశోధించిన ఇసాక్ హన్సన్ తెలిపారు. గత ఫిబ్రవరిలో ఈ కేసును ఆయన చేపట్టారు. వేరే రాష్ట్ర వ్యక్తుల అరెస్టు రికార్డులను పరిశీలించగా బ్యాక్‌బర్గ్ లక్షణాలతో సరిపోలాయి. దీంతో హన్సన్ బృందం ఆమె కుటుంబ సభ్యులను సంప్రదించింది. ఆ ప్రాంతంలో ఎవరైనా బంధువులు ఉన్నారా అని ఆరా తీసింది. మరోవైపు యాన్సెస్ట్రీ డాట్ కామ్‌లోని బ్యాక్‌బర్గ్ సోదరి ఖాతా ద్వారా కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. ఆ ప్రాంతంలోని జనాభా రికార్డులను, మరణించిన వారి జాబితాను, వివాహ లైసెన్సులను పరిశీలించారు. వారికి రెండు నెలల్లో బ్యాక్‌బర్గ్‌కు సరిపోలే వివరాలతో ఒక మహిళ ఉన్నట్లు తెలిసింది. పుట్టిన తేదీ, సోషల్ సెక్యూరిటీ నంబరు వంటివి సరిపోలాయి. దీంతో హన్సన్ బృందం స్థానిక అధికారిని అక్కడికి పంపింది. ఆయన ఇంటికి వెళ్లి కలవాలని అడగ్గా తొలుత బ్యాక్‌బర్గ్ తలుపు తెరవలేదు. 10 నిమిషాల తర్వాత స్పందించారు. అక్కడి నుంచే ఆమెతో ఫోన్‌లో హన్సన్‌తో మాట్లాడించారు. 62 ఏళ్ల కిందట ఊరు వదిలి వెళ్లిన బ్యాక్‌బర్గ్‌గా నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆమె 80లలో ఉన్నారు. అయితే ఇల్లు వదిలి వెళ్లడానికి ఆమె కారణాలు.. ఆమెకు ఉన్నాయని హన్సన్ తెలిపారు. 45 నిమిషాలపాటు ఆమెతో మాట్లాడానని, అయితే వివరాలను చెప్పలేనని ఆయన పేర్కొన్నారు.

రక్షణశాఖకు 18% నిధులు పెంచనున్న పాక్

ఇస్లామాబాద్: భారత్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్‌లోని సంకీర్ణ ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో రక్షణశాఖ వ్యయాన్ని 18 శాతం పెంచేందుకు ఆమోదం తెలిపిందని మంగళవారం స్థానిక మీడియా పేర్కొంది. జులై 1న ప్రారంభం కానున్న 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను వచ్చే నెల మొదటి వారంలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలోని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) ప్రతినిధి బృందం ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో బడ్జెట్‌పై చర్చించేందుకు సోమవారం సమావేశమైంది. ఇందులో రూ.17.5 లక్షల కోట్ల బడ్జెట్‌కు రూపకల్పన చేస్తూ రక్షణ వ్యయాన్ని 18 శాతం పెంచేందుకు అంగీకరించారు. 2024-25లో రక్షణశాఖకు రూ.2.1 లక్షల కోట్లు కేటాయించగా ఈసారి అది రూ.2.5 లక్షల కోట్లు దాటనుంది. పాకిస్థాన్ కేటాయింపుల్లో రక్షణశాఖ బడ్జెట్ రెండో అతి పెద్ద వ్యయం. అప్పులు తిరిగి చెల్లించేందుకు చేస్తున్న వ్యయం తొలి స్థానంలో ఉంది. ప్రస్తుత సంవత్సరంలో రుణ చెల్లింపులకు రూ.9.7 లక్షల కోట్లు కేటాయించింది.

అమెరికాలో బోటు మునక

- ముగ్గురి మృతి
- గల్లంతైన ఏడుగురిలో ఇద్దరు భారతీయ చిన్నారులు

న్యూయార్క్: అమెరికాలోని శాండియాగో తీరంలో సోమవారం చిన్న పడవ మునిగి ముగ్గురు మరణించారు. ఏడుగురు గల్లంతయ్యారు. వారిలో ఇద్దరు భారతీయ చిన్నారులున్నారు. మరో నలుగురు గాయపడ్డారు. వారిలో ఆ చిన్నారుల తల్లిదండ్రులున్నట్లు సమాచారం. 16 మంది వలసదారులతో కూడిన పడవ శాండియాగోకు సమీపంలో 15 నాటికల్ మైళ్ల దూరంలో పసిఫిక్ మహా సముద్రంలో ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగింది. ఉదయం 6.30 గంటల సమయంలో కోస్టుగార్డులకు ప్రమాదంపై సమాచారం అందింది. వారు వెళ్లి చూడగా ముగ్గురు మరణించి నలుగురు గాయపడి ఉన్నారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఏడుగురు గల్లంతైన విషయాన్ని గాయపడిన వారు తెలిపారు. దీంతో కోస్టుగార్డు బోట్లు, హెలికాప్టర్లతో గాలింపు జరుగుతోంది. ప్రమాదంలో భారతీయ కుటుంబం బాధితులు కావడంపై శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం విచారం వ్యక్తం చేసింది. ఇద్దరు చిన్నారులు గల్లంతయ్యారని, వారి తల్లిదండ్రులు చికిత్స పొందుతున్నారని తెలిపింది.



నర్వాల్ కుటుంబాన్ని పరామర్శించిన రాహుల్

చండీగఢ్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన నౌకాదళ యువ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కుటుంబ సభ్యులను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పరామర్శించారు. మంగళవారం ఆయన హరియాణాలోని కర్నాల్‌లో వినయ్ నర్వాల్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

ఖరీఫ్ సీజన్ నుంచే పాక్‌కు నీటి కటకట

ఇంటర్నెట్‌డెస్క్: సింధూ నదీజలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంతో పాకిస్థాన్‌కు నీటి కష్టాలు ఈ ఏడాది ఖరీఫ్ నుంచే మొదలుకానున్నాయి. సింధూ నది ప్రాధికార సంస్థ (ఐఎస్ఆర్ఏ) అంచనాల్లో ఈ విషయం వెల్లడైంది. పాక్‌కు వెళ్లే నీటిలో 21% మేరకు కోత పడొచ్చని పేర్కొంది. ముఖ్యంగా చీనాబ్‌లో నీటి లభ్యతలో తగ్గుదలే దీనికి కారణం అవుతుందని తేల్చింది. సలాల, బగలిహార్ జలాశయాల గేట్లు మూసేయడంతో పాక్‌కు వెళ్లే నీరు చాలావరకు తగ్గింది. దీని ప్రభావం ఖరీఫ్ సీజన్‌పై పడనుంది. మే నుంచి సెప్టెంబరు వరకు నీటి లభ్యతను అంచనా వేయడానికి ఐఎస్ఆర్ఏ సమావేశమైంది. చినాబ్, రావి నదుల్లో నీరు సాధారణంగా ప్రవహిస్తేనే మొత్తం పాకిస్థాన్‌కు సీజన్ ప్రారంభంలో 21 శాతం నీరు తగ్గినట్లు అంచనా వేసింది.

కేవలం చట్టాలతో జలవివాదాలు పరిష్కరించలేం

- క్షేత్ర స్థాయి వాస్తవాలనూ పరిగణనలోకి తీసుకోవాలి
- సట్లెజ్-యమున అనుసంధాన కాలువ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: జల వివాదాలను కేవలం చట్టాల ఆధారంగానే పరిష్కరించలేమని, క్షేత్రస్థాయి వాస్తవాలతో పాటు ఇతర అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు పేర్కొంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సట్లెజ్-యమున అనుసంధాన (ఎస్‌వైఎల్) కాలువ సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి కేంద్ర ప్రభుత్వానికి సహకరించాల్సిందిగా పంజాబ్, హరియాణా ప్రభుత్వాలకు సూచించింది. కాలువ నిర్మాణానికి ఇదివరకే సేకరించిన భూమిని పంజాబ్‌లో డీనోటిఫై చేయడాన్ని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం దుందుడుకు చర్యగా అభివర్ణించింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల సమర్పించిన అఫిడవిట్‌ను ప్రస్తావిస్తూ...సమస్య పరిష్కారానికి కొన్ని చర్యలను ప్రారంభించినట్లు అర్థమవుతోందని పేర్కొంది. పంజాబ్, హరియాణా రాష్ట్రాలు కేంద్రానికి సహకరించాలని తెలిపింది. ఈ కేసును ఆగస్టు 13న పరిశీలిస్తామని ధర్మాసనం వెల్లడించింది.

శ్రీలంకలో వంశీ ప్రధాన అనుచరుడు

● సత్యవర్ధన్ కేసులో 3 నెలలుగా పరారీలో కొమ్మా కోట్లు



నిందితుడు కొమ్మా కోట్లు

ఈనాడు, అమరావతి: సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో కీలక నిందితుడు, వంశీ ప్రధాన అనుచరుడైన కొమ్మా కోటేశ్వరరావు ఎలియాస్ కొమ్మా కోట్లు శ్రీలంకలో తలదాచుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో వంశీ ఆదేశాల మేరకు పథకం రచించి, దాన్ని అమలు చేసింది కోట్లుగా తేల్చి ఏ2గా చేర్చారు. నిందితుడికి తరచూ శ్రీలంక, నేపాల్, గోవా, తదితర ప్రాంతాలకు వెళ్లి జూదం ఆడే అలవాటు ఉండటంతో పోలీసులు ఆ కోణంలో అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వల్లభనేని వంశీ అరెస్టయినప్పటి నుంచి కోట్లు ఆచూకీ తెలియడం లేదు. కేసులో కీలకంగా వ్యవహరించిన తొమ్మిదో నిందితుడు ఎర్రంశెట్టి రామాంజనేయులు ఎలియాస్ రాము ఎలియాస్ పొట్టి రాము కూడా పరారీలో ఉన్నాడు. ఇంకా యతీంద్ర రామకృష్ణ ప్రసాద్ ఎలియాస్ రాము ఎలియాస్ తేలప్రోలు రాము, వజ్ర కుమార్, చేబ్రోలు శ్రీను, వేణు కూడా పరారీలో ఉన్నారు. మొత్తం 12 మంది నిందితులుంటే ఇప్పటి వరకు ఆరుగురు అరెస్టయ్యారు.

3 నెలలుగా దొరకని ఆచూకీ..

విజయవాడ శివారు ప్రసాదంపాడుకు చెందిన కొమ్మా కోట్లు.. వంశీ తరఫున విజయవాడ గ్రామీణ మండలంలో అక్రమ లేఔట్లు, నిర్మాణాల నుంచి వసూళ్ల వంటి వ్యవహారాలు చూస్తుండేవాడు. పొట్టి రాముతో కలసి సత్యవర్ధన్‌ను బెదిరించి తెదేపా కార్యాలయంపై దాడి కేసును ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెచ్చారు. సత్యవర్ధన్‌ను న్యాయాధికారి ఎదుట వాంగ్మూలం ఇప్పించడంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం హైదరాబాద్‌లోని వంశీ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి విశాఖపట్నం తరలించారు. కోట్లు ఆచూకీ కోసం పోలీసులు అన్ని మార్గాల్లో ప్రయత్నిస్తున్నారు. నిందితుడి ఇంటి వద్ద నిఘా పెట్టారు. కుటుంబ సభ్యుల ఫోన్ కాల్స్‌పై నిఘా పెట్టారు. వివరాలను న్యాట్‌గ్రిడ్‌లోకి అప్‌లోడ్ చేసి వడపోశారు. అయినా.. 3 నెలలుగా జాడ లేదు.

ట్రావెల్ హిస్టరీ వివరాలు రాబట్టే ప్రయత్నం..

కోట్లు దేశం దాటి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేయించారు. ఇమ్మిగ్రేషన్ అధికారులను అప్రమత్తం చేశారు. గత 3 నెలలుగా నిందితుడు విమానయానం చేస్తే.. ఆ వివరాలను ఐబీ (ఇంటెలిజెన్స్ బ్యూరో) నుంచి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. వివరాలు వస్తే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఎల్‌ఓసీ జారీ అయ్యేలోగా దేశం విడిచి వెళ్లిపోయాడా? అన్న అనుమానాలూ వ్యక్తం అవుతున్నాయి.

● మిగిలిన నిందితుల కోసం అన్వేషణ, ఛార్జిషీట్ దాఖలుకు కోర్టు అదనంగా ఇచ్చిన 30 రోజుల గడువు మరో వారం రోజుల్లో పూర్తి కానుంది. దీంతో పోలీసులు దర్యాప్తులో వేగాన్ని పెంచారు.

మాజీ సైనికోద్యోగులు ఎసైన్డ్ భూమిని పదేళ్ల తర్వాత అమ్ముకోవచ్చు

హైకోర్టు కీలక తీర్పు

ఈనాడు, అమరావతి: మాజీ సైనికోద్యోగులు తమకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని పదేళ్ల తర్వాత విక్రయించుకోవచ్చని హైకోర్టు తేల్చి చెప్పింది. రెవెన్యూ శాఖ 1993 నవంబరు 11న జారీ చేసిన జీవో 1117, సీసీఎల్ఏ 2022లో జారీ చేసిన సర్క్యులర్ ఇదే విషయాన్ని చెబుతున్నాయని గుర్తుచేసింది. పదేళ్ల అనంతరం ఎసైన్డ్ భూమిపై వారికి సంపూర్ణ హక్కు వస్తుందని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీసీడీ శేఖర్ ఇటీవల కీలక తీర్పు ఇచ్చారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పూలతోట గ్రామంలో మాజీ సైనికోద్యోగుల కోటా కింద తనకు ఇచ్చిన 3.50 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలోంచి తొలగించడం లేదంటూ తమ్మిశెట్టి బోడయ్య హైకోర్టులో వ్యాజ్యం వేశారు. తనకు డీ-ఫారం పట్టా, పట్టాదారు పాసు పుస్తకం కూడా ఉన్నాయని ఆ భూమిని విక్రయించేందుకు యత్నించి, 22ఏ నిషేధిత జాబితాలో ఉందని తెలిసి అధికారులకు దరఖాస్తు చేసుకోగా, ఆ జాబితా నుంచి తొలగించడానికి కలెక్టర్ నిరాకరించారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై రెవెన్యూ అధికారులు కౌంటర్ దాఖలు చేస్తూ.. పిటిషనర్ సర్వీసు నుంచి 1988లో వైదొలగగా, ఆరేళ్ల తర్వాత భూమి కేటాయించారని, అది నిబంధనలకు విరుద్ధమని వివరించారు. ఈ వ్యాజ్యాన్ని కొట్టేయాలని కోరారు. ఇరువైపు వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్‌కు 1994లో పట్టా మంజూరు చేసినందున ఇప్పటికే పదేళ్ల కాలం పూర్తయిందని.. ఆ భూమిని విక్రయించుకునే హక్కు ఆయనకు ఉందని తేల్చారు. ఎసైన్ చేసిన భూములను నిర్దిష్ట గడువు ముగిశాక నిషేధిత జాబితా నుంచి తొలగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని న్యాయస్థానం స్పష్టం చేసింది. దేశసేవలో పాలు పంచుకునే సైనికోద్యోగులకు ఇచ్చే భూములను.. నిరుపేదలకు పంచే భూములతో సమానంగా చూడటానికి వీల్లేదంది. బోడయ్య భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు నిరాకరిస్తూ తిరుపతి కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది.

దుర్గ గుడి ఈవోగా సీనా నాయక్

● తొమ్మిది మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది మంది డిప్యూటీ కలెక్టర్లను మంగళవారం బదిలీ చేసింది. ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డులో మెంబర్ సెక్రటరీగా పనిచేస్తున్న వి.కె.సీనా నాయక్‌ను విజయవాడలోని దుర్గ గుడి ఈవోగా పంపించింది. పులివెందుల ఆర్డీవోగా జి.చిన్నయ్యను నియమించింది.

నేటి నుంచే బియ్యం కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

● పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



బియ్యం కార్డు చూపిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ఈనాడు, అమరావతి: కొత్త బియ్యం కార్డుల జారీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. బుధవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందులో అర్హులతోపాటు.. రాష్ట్రంలో ఇప్పటికే బియ్యం కార్డులున్న వారందరికీ జూన్‌లో క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త కార్డులు ఇస్తారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో బియ్యం కార్డులకు సంబంధించిన సేవలు పొందవచ్చని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వచ్చే సోమవారం నుంచి వాట్సప్ ద్వారా కూడా ఈ సేవలు అందుబాటులోకి తెస్తున్నామని వివరించారు. మంగళవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త బియ్యం కార్డులు, మార్పులు, చేర్పులకు సంబంధించి ఇప్పటి వరకు 3,27,809 దరఖాస్తులు అందాయని వెల్లడించారు.

ఒంటరి మహిళలు, ఆశ్రమాల్లో ఉండేవారికీ కార్డులిస్తాం

ఒంటరి మహిళలు, ఆశ్రమాల్లో ఉండేవారికి కూడా బియ్యం కార్డులు ఇస్తామని మంత్రి మనోహర్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరవ్‌గౌర్ తెలిపారు. ఒంటరి మహిళల నుంచి విడాకుల ధ్రువపత్రం కోరుతున్నారని చెప్పగా.. అలాంటిదేమీ ఉండదని, అర్హులైతే బియ్యం కార్డు ఇస్తామన్నారు. కందిపప్పు పంపిణీకి కూడా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి మనోహర్ తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బియ్యం కార్డు ఇచ్చే విషయాన్ని సీఎం చంద్రబాబు పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు.

బుధవారం నుంచి స్వీకరించే దరఖాస్తులు

- కొత్త రేషన్‌కార్డు
- కుటుంబ సభ్యుల విభజన
- కొత్త సభ్యుల చేర్పు
- చిరునామా మార్పు
- చనిపోయిన వారి పేర్ల తొలగింపు
- బియ్యం కార్డును స్వచ్ఛందంగా వదులుకోవడం (సరెండర్)

క్యూఆర్ కార్డులో ఏముంటాయి?

ఇప్పుడున్న బియ్యం కార్డు స్థానంలో ప్రభుత్వం కొత్తగా క్యూఆర్ కోడ్ ఉన్న స్మార్ట్‌కార్డు ఇస్తుంది. గతంలో ముఖ్యమంత్రి జగన్ ఫొటోతో కార్డు ఇచ్చారు. ఇప్పుడు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల ఫొటోలేవీ ఉండవు. కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి.. చిరునామాలు మార్చుకోవచ్చు. ఆధార్‌లో నమోదైన చిరునామాకు కొరియర్ ద్వారా స్మార్ట్‌కార్డులు పంపే యోచన చేస్తున్నామని మంత్రి మనోహర్ తెలిపారు.

- కార్డు ముఖభాగంలో పెద్దగా బియ్యం కార్డు నంబరు
- కుటుంబ యజమాని పేరు, ఫొటో
- కుటుంబ సభ్యుల సంఖ్య
- దుకాణం ఐడీ, చిరునామా, క్యూఆర్ కోడ్
- కార్డు వెనుక భాగంలో కుటుంబ సభ్యుల పేర్లు
- వారు పుట్టిన తేదీ, వయసు, బంధుత్వం
- శాశ్వత చిరునామా
- తహసీల్దారు కార్యాలయం (మండలం)
- 1967 టోల్‌ఫ్రీ నంబరు

బెయిల్ పిటిషన్.. మూడోసారి!

● దాఖలు చేసిన వంశీ, మరో నలుగురు నిందితులు

● సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో 13 వరకు రిమాండ్ పొడిగించిన ఎస్సీ, ఎస్టీ కోర్టు



కోర్టుకు వస్తున్న వంశీ

ఈనాడు, అమరావతి: సత్యవర్ధన్‌ను అపహరించిన కేసులో వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మూడోసారి ఎస్సీ, ఎస్టీ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. కేసులో తనను అన్యాయంగా ఇరికించారని, తన పాత్రేమీ లేదని, బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఇప్పటికే రెండు సార్లు బెయిల్ పిటిషన్లను కోర్టు కొట్టేసిన సంగతి తెలిసిందే. వంశీతో పాటు గంటా వీర్రాజు, లక్ష్మీపతి, వేల్పూరి వంశీ, ఓలుపల్లి రంగా బెయిల్ ఇవ్వాలని పిటిషన్లు వేశారు. వీటిని అనుమతించిన న్యాయస్థానం.. 8న కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు నోటీసులు ఇచ్చింది.

13 వరకు రిమాండ్ పొడిగింపు: సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో వంశీకి మరోసారి ఎస్సీ, ఎస్టీ కోర్టు రిమాండ్ పొడిగించింది. 6వ తేదీతో రిమాండ్ పూర్తి అవుతుండడంతో పోలీసులు వంశీ, ఓలుపల్లి రంగాతో పాటు మిగిలిన నిందితులను మంగళవారం కోర్టులో న్యాయాధికారి ఎదుట ప్రవేశపెట్టారు. నిందితులకు ఈనెల 13 వరకూ రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు.

మాజీ ఎంపీ, తెదేపా నేత పాలకొండ్రాయుడు కన్నుమూత



రాయచోటి, న్యూస్‌టుడే: ఉమ్మడి కడప జిల్లా రాజంపేట మాజీ ఎంపీ, తెదేపా సీనియర్ నేత సుగవాసి పాలకొండ్రాయుడు (81) కన్నుమూశారు. కొన్నాళ్లుగా శ్వాసకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి దాటాక ఉదయం 2 గంటలకు తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన ఈయన 35 ఏళ్లుగా తెదేపాలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీకి సేవలు అందించారు. రాయచోటిలో గురువారం అంత్యక్రియలు జరగనున్నాయి.

EENADU Vol: 51, Issue: 267 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

మాక్‌డ్రిల్ ఎందుకు.. ఎలా?

● 50 సంవత్సరాల తర్వాత దేశవ్యాప్తంగా తొలిసారి.. ● పౌరులకు అవగాహనే లక్ష్యం
● కార్గిల్ యుద్ధ సమయంలో జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్‌కే పరిమితం



ఇంటర్నెట్ డెస్క్: భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరడంతో కేంద్ర హోం శాఖ సంక్షోభ సమయంలో పౌరులు ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో భాగంగా బుధవారం దేశవ్యాప్తంగా 259 ప్రదేశాల్లో మాక్‌డ్రిల్ కార్యక్రమాలు జరగనున్నాయి. దాదాపు 50 సంవత్సరాల తర్వాత దేశ వ్యాప్తంగా మాక్‌డ్రిల్ చేపడుతున్నారు. కార్గిల్ యుద్ధ సమయంలో ఇవి జరిగినా.. దేశ సరిహద్దుల్లోని జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాలకే పరిమితం అయ్యాయి. ఈసారి మాత్రం దేశవ్యాప్తంగా కీలక ప్రదేశాల్లో నిర్వహిస్తున్నారు.

లైట్లు ఆర్పేసి.. సురక్షిత స్థానాల్లో దాక్కొని..

1971లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ నేతృత్వంలో మనదేశం తూర్పు పాకిస్థాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్)కు అండగా నిలిచి పశ్చిమ పాకిస్థాన్‌తో పోరాటానికి సిద్ధపడింది. నాడు భారత్ యుద్ధం కారణంగానే బంగ్లాదేశ్ ఏర్పడింది. నాటి యుద్ధ సమయంలోనూ దేశవ్యాప్తంగా ప్రజలను అప్రమత్తం చేశారు. అంతకు ముందు 1962, 65 యుద్ధాల సమయంలో కూడా మాక్‌డ్రిల్ నిర్వహించారు. 1971లో మాక్‌డ్రిల్ అనుభవాన్ని సీనియర్ జర్నలిస్టు మధురేంద్ర ప్రసాద్ సిన్హా ఓ మీడియా సంస్థతో పంచుకొన్నారు. యుద్ధానికి సరిగ్గా రెండు నుంచి నాలుగు రోజుల ముందు ఈ డ్రిల్ మొదలుపెట్టారని.. తూర్పు పాకిస్థాన్‌లో లెఫ్టినెంట్ జనరల్ ఏఏకే నియాజీ ఢాకాలో లొంగుబాటు పత్రంపై సంతకం చేసే వరకు వీటిని కొనసాగించారని ఆయన అన్నారు. నాడు సాయంత్రం 6.30 కల్లా ప్రతి ఒక్కరూ ఇళ్లకు చేరుకునేవారన్నారు. సైరన్ వినిపించగానే ప్రతి ఒక్కరూ లైట్లు ఆర్పేసి.. ఇంట్లో సురక్షిత స్థానాల్లో దాక్కొనేవారమని పేర్కొన్నారు. ఆ సమయాల్లో పెద్దగా మాట్లాడేవారు కూడా కాదు. నాడు సైరన్ వినిపించగానే నేలపై పడుకొని.. చెవులు గట్టిగా మూసుకొనేవారమన్నారు.

ఏమార్చేందుకు 'కామోఫ్లాజ్' ఎత్తుగడ

1971 యుద్ధ సమయంలో శత్రువును ఏమార్చేందుకు తాజ్‌మహల్‌ను కూడా పరిసరాలతో మమేకమయ్యేలా ఉండేటటువంటి (కామోఫ్లాజ్) వస్త్రంతో కప్పి ఉంచారు. నాడు ఆగ్రాలోని ఖేరియా ఎయిర్ బేస్ కూడా పాక్ లక్ష్యాల్లో ఒకటి. ఆ దేశ విమానాలు డిసెంబరు 3న తొలిసారి అక్కడ బాంబులు జారవిడిచాయి. దీంతో వైమానిక స్థావరం స్వల్పంగా దెబ్బతింది. యుద్ధంలో ప్రజల నైతిక స్థైర్యం దెబ్బతీయడం కోసం సాంస్కృతిక చిహ్నమైన తాజ్‌మహల్‌పై పాక్ దాడి చేయొచ్చని భావించారు. దీంతో ఆ మర్నాడే దానిని శత్రువు కంటపడకుండా పరిసరాల్లో కలిసిపోయేలా చేసేందుకు ఒక ఆకుపచ్చటి జనపనార వస్త్రంతో కప్పిపెట్టారు. దాని సమీపంలోని లైట్లన్నీ ఆర్పేశారు. ఇలాంటి జాగ్రత్తలే ఎర్రకోట, కుతుబ్‌మినార్, జైసల్మేర్ కోట వద్ద కూడా తీసుకున్నారు. 2వ ప్రపంచ యుద్ధ సమయంలో కూడా బ్రిటిష్ సైన్యం జర్మనీ, జపాన్ విమానాలను తప్పుదోవ పట్టించేందుకు ఇలాంటి వలలను ఏర్పాటు చేశారు.

ప్రజలంతా పాలు పంచుకోవాలి: భాజపా

దిల్లీ: దేశవ్యాప్తంగా బుధవారం నిర్వహించనున్న మాక్‌డ్రిల్‌లో ప్రజలంతా పాలు పంచుకోవాలని భాజపా పిలుపునిచ్చింది. పార్టీకి చెందిన వివిధ రాష్ట్రాల విభాగాలన్నింటినీ అప్రమత్తం చేసినట్టు భాజపా తన అధికారిక సోషల్ మీడియా పోస్టులో పేర్కొంది. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలంతా భాగస్వాములు కానున్నట్టు తెలిసింది.

అత్యంత కీలకం సైరన్

ఇప్పటికే ఈ మాక్‌డ్రిల్‌లో పాల్గొవాలని ఆయా జిల్లా అధికార యంత్రాంగాలు, సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వాలంటీర్లు, హోమ్‌గార్డులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, కాలేజీలు, స్కూల్ విద్యార్థులకు కేంద్రం పిలుపునిచ్చింది. శత్రు యుద్ధ విమానాలు, క్షిపణులు, డ్రోన్లు దూసుకొస్తున్న వేళ ప్రజల సన్నద్ధత కోసం వీటిని నిర్వహిస్తున్నారు. ఇందులో సైరన్ అత్యంత కీలకమైంది.

హెచ్చరికల వ్యవస్థల అంచనాకే..

- గగనతల దాడుల హెచ్చరిక వ్యవస్థల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు.
- వాయుసేనతో హాట్‌లైన్, రేడియో కమ్యూనికేషన్ వినియోగంలోకి తెచ్చేందుకు.
- కంట్రోల్ రూమ్‌లు, షాడో కంట్రోల్ రూమ్‌ల పనితీరును పరీక్షించేందుకు.
- పౌరులు, విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి, సంక్షోభ సమయంలో పౌరులు ఆత్మరక్షణ చేసుకోవడం కోసం వీటిని నిర్వహిస్తారు.
- బ్లాకౌట్ సమయంలో తీసుకోవాల్సిన చర్యలను నేర్పించడం. వాటి ప్రభావాన్ని అంచనావేయడం కోసం.
- సివిల్ డిఫెన్స్ సర్వీసులను క్రియాశీలం (యాక్టివేట్) చేయడం, వాటి స్పందనను పరీక్షించడం. వీటిల్లో వార్డెన్ సర్వీసులు, అగ్నిమాపక, సహాయక, తరలింపు ఆపరేషన్లు వంటివి ఉంటాయి.
- ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించే ప్రణాళికల పనితీరును అంచనావేసుకోవడానికి.
- డ్రిల్‌లో కీలక పరిశ్రమలు, ప్రభుత్వ భవనాలు, సైనిక కార్యాలయాలు, విద్యుత్ స్టేషన్లు, కమ్యూనికేషన్ హబ్‌లను కామోఫ్లాజ్ చేయడాన్ని కూడా సాధన చేయనున్నారు. ఉపగ్రహాలు, శత్రు గగనతల నిఘా నుంచి తప్పించడానికి ఇలా చేస్తారు.
- ఇలాంటి మాక్‌డ్రిల్‌ను ఇటీవలి కాలంలో కొన్ని దేశాలు నిర్వహించాయి. 2025 మార్చిలో తైవాన్‌లో నిర్వహించారు. జపాన్‌లో 2023 నుంచి ఇలాంటివి జరుగుతున్నాయి. ఫిన్లాండ్‌లో కూడా రష్యా ఆక్రమణ భయంతో మాక్‌డ్రిల్స్ నిర్వహించారు.

కులగణనపై అఖిలపక్ష భేటీ పెట్టండి

● తెలంగాణ నమూనా అనుసరిస్తే ఉత్తమం
● ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడి లేఖ



దిల్లీ: కేంద్ర ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన కులగణనపై సత్వరం అఖిలపక్ష సమావేశం జరపాలని, ఈ ప్రక్రియను ఇప్పటికే పూర్తిచేసిన తెలంగాణ రాష్ట్ర నమూనాను అనుసరించడం ఉత్తమమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీకి లేఖ రాశారు. అలాగే రాజ్యాంగ సవరణ ద్వారా రిజర్వేషన్లపై 50 శాతం నియంత్రణను తొలగించి, ప్రయివేటు విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించే ఆర్టికల్ 15 (5)ను తక్షణం అమలుచేయాలని కోరారు. రాజ్యాంగ ప్రవేశికలో హామీ ఇచ్చినట్లుగా అణగారిన వర్గాలకు సామాజిక, ఆర్థిక న్యాయం జరగాలంటే.. సమాన హోదా, అవకాశాలు లభించాలంటే సమగ్ర విధానంలో కులగణన జరపడం ఎంతో అవసరమని కాంగ్రెస్ పార్టీ విశ్వసిస్తుంది. కులగణనకు కాంగ్రెస్ డిమాండు గురించి తెలియజేస్తూ 2023 ఏప్రిల్ 16న కూడా తాను ప్రధానికి లేఖ రాసిన విషయాన్ని ఖర్గే గుర్తు చేశారు. తన లేఖకు ఇప్పటికీ సమాధానం అందలేదన్నారు. ఇన్నాళ్లూ కాంగ్రెస్ పార్టీని విమర్శించిన ప్రధాని ఎట్టకేలకు కులగణన ప్రాధాన్యాన్ని గుర్తించారన్నారు. ఖర్గే రాసిన ఈ లేఖను 'ఎక్స్' ద్వారా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పోస్ట్ చేశారు. పహల్గాం దాడిపై దేశమంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వేళ ప్రధాని మోదీ కులగణనపై ఆకస్మికంగా యూటర్న్ తీసుకున్నారంటూ విస్మయం వ్యక్తం చేశారు.

హార్వర్డ్‌కు నిధుల నిలిపివేత

తల్లడిల్లుతున్న వర్సిటీ

ఇంటర్నెట్ డెస్క్: హార్వర్డ్ యూనివర్సిటీ విషయంలో ట్రంప్ యంత్రాంగం అన్నంత పనీ చేసింది. ఆ విశ్వవిద్యాలయానికి అందించే ఫెడరల్ నిధులను నిలిపివేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి లిండా మెక్‌మన్ ప్రకటించారు. విశ్వవిద్యాలయంపై నియంత్రణ ఆశిస్తూ కొన్ని విధానపరమైన మార్పులు తీసుకురావాలని సూచించినప్పటికీ.. దానికి ససేమిరా అనడంతో వర్సిటీ బడ్జెట్, పన్ను మినహాయింపుల్లో కోతలు విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ డిమాండ్లను నెరవేర్చే వరకూ హార్వర్డ్‌కు ఎటువంటి కొత్త గ్రాంట్లు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. ఫెడరల్ పరిశోధన గ్రాంట్లకు ఈ నిషేధం వర్తిస్తుందని.. యూనివర్సిటీ ట్యూషన్ ఫీజులను చెల్లించడానికి విద్యార్థులకు సహాయపడే ఫెడరల్ ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుందని విద్యాశాఖ పేర్కొంది. కొత్త గ్రాంట్లకు అర్హత పొందడానికి హార్వర్డ్.. ఫెడరల్ ప్రభుత్వంతో చర్చలు జరపాల్సి ఉంటుందని మెక్‌మాన్ తెలిపారు. అమెరికా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపడుతున్న విదేశీ విద్యార్థులకు హార్వర్డ్‌లో ప్రవేశం కల్పిస్తూ.. దేశ అత్యున్నత విద్యా వ్యవస్థను అపహాస్యం చేసిందని ఆరోపించారు. మరోవైపు విశ్వవిద్యాలయంలో జాతి వివక్షపై ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు.

చట్ట విరుద్ధ చర్యలను వ్యతిరేకిస్తూనే ఉంటాం: హార్వర్డ్

ప్రభుత్వం ఫెడరల్ నిధులను నిలిపివేయడాన్ని హార్వర్డ్ విశ్వవిద్యాలయం తప్పుబట్టింది. ప్రభుత్వ చట్ట విరుద్ధ డిమాండ్లను పాటించడానికి నిరాకరించడంతో సమాఖ్య ప్రభుత్వం విశ్వవిద్యాలయంపై ఇటువంటి చర్యలు తీసుకుంటోందని హార్వర్డ్ అధ్యక్షుడు అలాన్ గార్బర్ పేర్కొన్నారు. ప్రభుత్వం తమను ఎన్ని రకాలుగా అణచివేయడానికి ప్రయత్నించినా పోరాడుతూనే ఉంటామని స్పష్టంచేశారు.



పాక్‌ను ఓడించాల్సిన సమయం వచ్చింది: ఒవైసీ

శ్రీనగర్: పహల్గాంలో పర్యాటకులను మతం తెలుసుకుని మరీ దారుణంగా ఉగ్రవాదులు హతమార్చడం పిరికి పందల చర్య అని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ మంగళవారం పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో పర్యటించిన ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఈ ఉగ్ర చర్యకు భారత్ గట్టిగా బదులివ్వాలని కోరారు. అఖిలపక్ష సమావేశంలో కూడా తాను ఇదే మాట చెప్పానన్నారు. పాకిస్థాన్‌నూ, దాని మద్దతుగల ఉగ్రమూకలను ఓడించాల్సిన సమయం వచ్చిందన్నారు. భారతీయుల మధ్య మతపరమైన విభేదాలు సృష్టించాలన్నదే పాకిస్థాన్, ఉగ్రమూకల లక్ష్యమని, దాన్ని మనం సాగనివ్వకూడదని పిలుపు ఇచ్చారు. ఉగ్రవాదులకు సహకరించాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంతియాజ్ అహ్మద్ మాగ్రే వాగులోకి దూకి మరణించిన ఘటనపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఓఐసీ ప్రకటనను ఖండించిన భారత్

దిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి ఉన్న సీమాంతర సంబంధాలను గుర్తించడానికి నిరాకరిస్తూ 'ఇస్లామిక్ సహకార సంస్థ' (ఓఐసీ) చేసిన ప్రకటనను భారత్ ఖండించింది. ఇది అర్థరహితమని, పాకిస్థాన్ ప్రోద్బలంతోనే దీనిని జారీ చేసిందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ ఈ విషయంలో ఓఐసీని తప్పుదోవ పట్టించి ఇలాంటి ప్రకటన చేయించిందని ఆరోపించారు. భారత అంతర్గత వ్యవహారాల్లో ఓఐసీ జోక్యాన్ని భారత్ తిరస్కరిస్తోందని చెప్పారు.

బంగ్లాకు చేరుకున్న ఖలీదా జియా

లండన్‌లో నాలుగు నెలలు సాగిన వైద్య చికిత్స



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి ఖలీదా జియా (79) లండన్‌లో నాలుగు నెలలపాటు వైద్య చికిత్స చేయించుకుని మంగళవారం స్వదేశానికి తిరిగి వచ్చారు. ఆమె పునరాగమనం తాత్కాలిక ప్రభుత్వ ఏలుబడిలో ఉన్న దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు దారితీస్తుందని ఖలీదా పార్టీ ఆశిస్తోంది. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బి.ఎన్.పి) అధ్యక్షురాలైన ఖలీదా గతంలో మూడుసార్లు ప్రధానమంత్రిగా వ్యవహరించారు. ఆమె మధుమేహం, కీళ్లవాతం, హృద్రోగం, మూత్ర పిండ సమస్యలతో బాధపడుతున్నారు. జనవరి 8న వైద్యచికిత్స కోసం లండన్ వెళ్లిన ఖలీదాను చికిత్స పూర్తయిన తరవాత అక్కడి నుంచి ఖతార్ రాయల్ ఎయిర్ అంబులెన్స్ విమానంలో ఢాకా తీసుకొచ్చారు. విమానాశ్రయం నుంచి నివాసానికి వెళ్లేదారికి ఇరు పక్కలా వేలమంది పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు.

తొక్కిసలాట నివారణకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధమవ్వండి

రైల్వే డివిజన్లకు కేంద్ర ప్రభుత్వం సూచన

దిల్లీ: రైళ్లలో, రైల్వే స్టేషన్లలో తొక్కిసలాట ఘటనలు జరగకుండా నివారించడానికి ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకొని, సమన్వయంతో చర్యలు తీసుకోవాలని దేశంలోని అన్ని రైల్వే డివిజన్లకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. దీనిలో భాగంగా స్థానిక పండగలు, సంతలు, నియామక పరీక్షలు, క్రీడల పోటీలు, ఇతరత్రా ముఖ్యమైన కార్యక్రమాలు జరిగే సందర్భాలను ముందుగానే గుర్తించి సమగ్ర జాబితా రూపొందించుకోవాలని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. వీటిలో అధిక సంఖ్యలో ప్రజలు రైల్వే స్టేషన్లకు తరలివచ్చేందుకు అవకాశమున్న కార్యక్రమాలను గుర్తించి తొక్కిసలాట వంటి ఘటనల నివారణకు సమన్వయంతో చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 16న న్యూదిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది మృతి చెందిన నేపథ్యంలో ఈ సూచనలను జారీ చేసింది.

వీసా దుర్వినియోగంపై కొరడా

● సమాచార సేకరణకు సిద్ధమవుతున్న బ్రిటన్
● 'వలసదారులపై శ్వేతపత్రం' విడుదలకు యత్నాలు

లండన్: తమ దేశంలో ఆశ్రయం పొందేందుకు విద్యా, ఉద్యోగ వీసాలను దుర్వినియోగం చేస్తున్న వారిపై కొరడా ఝుళిపిస్తామని బ్రిటన్ ప్రభుత్వం హెచ్చరించింది. వీలైనంత త్వరగా అలాంటి వాళ్లను గుర్తించేందుకు సమాచార సేకరణ చేస్తున్నామని వెల్లడించింది. ఈ మేరకు చేపట్టనున్న చర్యల వివరాలతో మే నెలాఖరులోగా 'వలసదారులపై శ్వేతపత్రం'ను యూకే హోంశాఖ విడుదల చేయనుంది. విద్యా, ఉద్యోగ వీసాలతో యూకేకు వస్తున్న పాకిస్థాన్ జాతీయుల్లో అత్యధికులు ఆశ్రయం కల్పించాలంటూ యూకే హోంశాఖకు దరఖాస్తులు సమర్పిస్తున్నారు. ఈ విధంగా పాకిస్థానీయుల నుంచి వెల్లువెత్తుతున్న దరఖాస్తులు గత సంవత్సరం 79 శాతం మేర పెరిగి 10,542కు చేరడం గమనార్హం. ఈ క్రమంలో ఈ అంశంపై యూకే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. "మా దేశ వీసా వ్యవస్థను ఎప్పటికప్పుడు సమీక్షిస్తాం. దాని తీరుతెన్నులను నిశితంగా పర్యవేక్షిస్తాం. మా దేశ వలస నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడం. దారితప్పిన యూకే వలస విధానాన్ని గాడిన పెట్టే సమగ్ర ప్రణాళికతో కూడిన వలస విధానపు శ్వేతపత్రాన్ని (ఇమ్మిగ్రేషన్ వైట్ పేపర్) త్వరలోనే విడుదల చేస్తాం" అని యూకే హోంశాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు.

భారతీయుల దరఖాస్తుల్లో 1 శాతానికే ఆమోదం

బ్రిటన్ హోంశాఖ అధికార వర్గాల సమాచారం ప్రకారం యూకేలో ఆశ్రయం పొందేందుకు 2024లో అత్యధిక దరఖాస్తులు సమర్పించిన మొదటి 10 విదేశీయుల జాబితాలో భారతీయులు ఆరో స్థానంలో నిలిచారు. వారి దరఖాస్తుల్లో కేవలం 1 శాతమే ఆమోదం పొందాయి.

40వేల మందిలో 16వేల మంది విద్యార్థులే

వివిధ వీసాలతో యూకేకు వచ్చిన వారిలో దాదాపు 40వేల మంది ఆశ్రయం కల్పించాలని కోరుతూ 2024 సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 16వేల మంది విద్యార్థి వీసాపై, 11,500 మంది వర్క్ వీసాపై, 9,500 మంది విజిటర్ వీసాపై యూకేకు వచ్చారు. ప్రస్తుతం యూకేకు సంబంధించిన నికర వలస సంఖ్య 7.28 లక్షలుగా ఉంది. దీంతో రాబోయే కొన్నేళ్లలో వారి సంఖ్యను తగ్గించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మరోవైపు బ్రిటన్ వలసదారులను వ్యతిరేకిస్తూ గతవారం జరిగిన ఉప ఎన్నికలో పోటీ చేసిన నైజెల్ ఫారేజ్ సారథ్యంలోని విపక్ష పార్టీ ఘన విజయం సాధించడం గమనార్హం.

శాంతిని కోరుకుంటే పిడికిలి విప్పాలి

● రెండు దేశాలు కలిసి పని చేయాలి
● బిలావల్ భుట్టో సూచన

ఇస్లామాబాద్: భారత్.. శాంతిని కోరుకుంటే పిడికిలి విప్పి రావాలని, బిగించి కాదని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) అధ్యక్షుడు బిలావల్ భుట్టో జర్దారీ పేర్కొన్నారు. పహల్గాం ఉగ్ర దాడి విచారణపై భారత్, పాకిస్థాన్ కలిసి పని చేయాలని, నిష్పాక్షిక దర్యాప్తుపై తమ ప్రధాని షెహబాజ్ షరీఫ్ విసిరిన సవాలు దీనికి ప్రారంభమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సవాలను భారత్ అంగీకరించాలని కోరారు. భారత్ శాంతిని కోరుకుంటే రెండు పొరుగు దేశాలుగా కూర్చుని మాట్లాడుకుందామని సూచించారు. ప్రాంతీయ భద్రతపై మంగళవారం జాతీయ అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. 'వారు శాంతిని వద్దనుకుంటే పాకిస్థాన్ మోకరిల్లదని గుర్తుంచుకోవాలి. పాక్ ప్రజలు సమస్య పరిష్కారానికి పోరాడతారు. ఎందుకుంటే మాకు ఘర్షణపై ప్రేమ లేదు. మేం స్వాతంత్ర్యాన్నే ప్రేమిస్తాం. ముందు భారత్‌ను నిర్ణయించుకోనివ్వండి.. చర్చలా.. విధ్వంసమా, సహకారమా.. ఘర్షణా అనేది తేల్చుకోనివ్వండి' అని బిలావల్ వ్యాఖ్యానించారు. 'ఒక్క ఆయుధాలతోనే ఉగ్రవాదాన్ని ఓడించలేం. చట్టంతో ఓడించగలం. బుల్లెట్లతో తుద ముట్టించలేం. ఆశావహ దృక్పథంతో తగ్గించగలం. దేశాలపై దుష్ప్రచారంతో అంతం చేయలేం. ఉగ్రవాద పుట్టుకకు గల కారణాలను గుర్తించి మట్టుబెట్టగలం' అని ఆయన పేర్కొన్నారు.

రష్యాపై 100 డ్రోన్లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్

మాస్కో: యుద్ధం ముగించేందుకు ఓ వైపు అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ రష్యా- ఉక్రెయిన్‌లు పరస్పర దాడులు కొనసాగిస్తున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా భారీ స్థాయిలో విరుచుకుపడడంతో.. కీవ్ సైతం పెద్దఎత్తున ప్రతీకార దాడులు చేస్తోంది. తాజాగా రష్యాలోని దాదాపు 12 ప్రదేశాలపై ఉక్రెయిన్ 100 డ్రోన్లతో విరుచుకుపడింది. డ్రోన్ దాడుల కారణంగా దేశంలోని మొత్తం నాలుగు అంతర్జాతీయ, తొమ్మిది ప్రాంతీయ విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. పలు డ్రోన్లను తాము కూల్చేసినట్లు తెలిపింది. రెండో ప్రపంచ యుద్ధ విజయోత్సవం సందర్భంగా 72 గంటల పాటు ఏకపక్షంగా కాల్పుల విరమణ పాటించాలన్న రష్యా యోచనకు డ్రోన్ దాడి శరాఘాతమైంది. 1945లో నాజీ జర్మనీపై మాస్కో సాధించిన విజయాన్ని ఉత్సవంగా జరుపుకోవడం రష్యాలో ఆనవాయితీ. మాస్కోలో గురువారం జరగనున్న 80వ విజయోత్సవ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, బ్రెజిల్ అధినేత లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా తదితరులు హాజరుకానున్నారు. గతవారం రష్యా అధ్యక్షుడు పుతిన్ మానవీయ కారణాల రీత్యా స్వల్పకాలిక కాల్పుల విరమణ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో మాస్కోపై ఉక్రెయిన్ దాడులు చేయడం గమనార్హం.



రష్యా దాడి కారణంగా ఉక్రెయిన్‌లోని ఖర్కివ్‌లో కాలిపోతున్న మార్కెట్

ఖర్కివ్‌పై రష్యా దాడి

మరోవైపు.. ఉక్రెయిన్‌లోని ఖర్కివ్ నగరంపై రష్యా దళాలు 20కి పైగా డ్రోన్లను ప్రయోగించాయి. ఈ దాడిలో నలుగురు గాయపడగా.. దాదాపు 100 మార్కెట్ స్టాళ్లు ధ్వంసమయ్యాయి. మరో ప్రాంతంలో మాస్కో బాంబులు ప్రయోగించిన ఘటనలో ఏడుగురు పౌరులు గాయపడినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు.

ఐఐటీ విద్యార్థి, నీట్ అభ్యర్థి ఆత్మహత్యలపై కేసులు నమోదయ్యాయా?

● రెండు ఘటనలపై నివేదికకు సుప్రీంకోర్టు ఆదేశం
● విద్యా సంస్థలు, శిక్షణ కేంద్రాల్లో బలవన్మరణాలపై తీవ్ర ఆవేదన

దిల్లీ: దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, రాజస్థాన్‌లోని కోటా కోచింగ్ కేంద్రాల్లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు తరచూ ఆత్మహత్యలకు పాల్పడుతుండడంపై సుప్రీంకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై జాతీయ కార్యదళం (ఎన్టీఎఫ్)ను ఏర్పాటు చేయడం, సంబంధిత పని కొనసాగుతున్న నేపథ్యంలోనే మరో ఇద్దరు బలవన్మరణాలకు పాల్పడడంపై జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం మంగళవారం స్పందించింది. పశ్చిమబెంగాల్లోని ఖరగ్‌పుర్ ఐఐటీలో ఈ నెల 4న ఇంజినీరింగ్ (తృతీయ సంవత్సరం) విద్యార్థి మహమ్మద్ ఆసిఫ్ ఖమర్ (22)హాస్టల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజస్థాన్‌లోని కోటాలో నీట్‌కు సన్నద్ధమవుతున్న 18 ఏళ్ల విద్యార్థిని కూడా ఇటీవల తన నివాసంలో బలవన్మరణానికి పాల్పడింది. ఈ రెండు ఘటనలపై ఆయా ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు దాఖలయ్యాయో లేదో తెలుసుకుని నివేదించాలని కోర్టు రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది. సర్వోన్నత న్యాయస్థానం గతంలో సూచించిన మార్గదర్శకాల ప్రకారం ఆ కేసులను నమోదు చేశారో లేదో కూడా నివేదికలో పొందుపరచాలని స్పష్టం చేసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు కోటాలో 14 మంది విద్యార్థులు మృతి చెందిన విషయాన్ని ప్రస్తావిస్తూ... ఇటువంటి ఘటనలన్నీ తీవ్రకలతకు గురిచేస్తున్నాయని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది. ఎన్టీఎఫ్ కార్యకలాపాల నిర్వహణకు గాను కోర్టు రిజిస్ట్రీ వద్ద రెండు వారాల్లోగా రూ.20లక్షలు డిపాజిట్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

భారత్‌కు అండగా ఉంటాం: ఖతార్

ప్రధాని మోదీకి ఆ దేశ పాలకుడి ఫోన్

దిల్లీ: భారత్- పాక్ మధ్య ద్వైపాక్షిక ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఖతార్ పాలకుడు షేక్ తమీమ్ బిన్ హమద్ అల్‌థానీ ప్రధాని మోదీకి మంగళవారం ఫోన్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి తమీమ్ సంతాపం తెలియజేశారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా ఉంటామని ప్రకటించారు. నేరస్థులకు బుద్ధి చెప్పే చర్యల విషయంలో భారత్‌కు సహకారం అందిస్తామని ఖతార్ పాలకుడు హామీ ఇచ్చినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రంధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అల్‌థానీకి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

బంగ్లాదేశ్‌తో పాక్ చర్చలు

ఇస్లామాబాద్: బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల సలహాదారు తౌహిద్ హుసేన్‌తో పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ టెలిఫోన్ చర్చలు జరిపారు. భారత్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో తమ పరిస్థితిని దార్ వివరించారు. భారత్ ఆరోపణలను ఖండించారు. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలపై బంగ్లాదేశ్ నేత ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్రిక్తతలను తగ్గించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. అఫ్గాన్ విదేశాంగ మంత్రితోనూ దార్ మాట్లాడారు. పరిస్థితిని వివరించారు.

ఐఎస్ఐ ప్రధాన కార్యాలయానికి పాక్ ప్రధాని

ఇస్లామాబాద్: పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ ప్రధాన కార్యాలయాన్ని మంగళవారం ప్రధాని షెహబాజ్ షరీఫ్ సందర్శించారు. ఆయనకు అధికారులు ప్రస్తుత పరిస్థితి గురించి వివరించారు. ఘర్షణకు గల అవకాశాలను, సైనిక ఆప్షన్లను, హైబ్రిడ్ వార్‌ఫేర్ వ్యూహాలను ఆయనకు తెలిపారు. షరీఫ్ వెంట విదేశాంగ, రక్షణ మంత్రులు ఇషాక్ దార్, ఖవాజా ఆసిఫ్ ఉన్నారు.

సుప్రీంకోర్టులో గవర్నర్‌పై పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటామన్న కేరళ

వ్యతిరేకించిన కేంద్రం

దిల్లీ: రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలుపకుండా గవర్నర్ జాప్యం చేస్తుండడంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేరళ ప్రభుత్వం... ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు సిద్ధమైంది. అయితే, ఆ పిటిషన్‌ను వెనక్కి తీసుకోవడాన్ని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. దీనిని పురస్కరించుకుని మంగళవారం జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ధర్మాసనం ముందు ఇరుపక్షాలు వాదనలు వినిపించాయి. 'కేరళ పిటిషన్లో రాజ్యాంగపరమైన అంశాలు ఉన్నాయి. పిటిషన్ వేయడాన్ని, వెనక్కి తీసుకోవడాన్ని తేలికగా తీసుకోరాదు' అని కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. ఇది వింతగా ఉందంటూ కేరళ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది కె.కె.వేణుగోపాల్ పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉంచిన బిల్లులను గవర్నర్ ప్రస్తుతం రాష్ట్రపతికి పంపించినందున జాప్యంపై దాఖలైన పిటిషన్ వ్యర్థమని తెలిపారు. పిటిషన్ ఉపసంహరించుకునే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది. తమిళనాడు బిల్లులకు గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు నిర్ణీత గడువును విధించిన నేపథ్యంలో ఆ తీర్పును కేరళకూ వర్తింపజేసే విషయమై వ్యాజ్యం దాఖలైంది.

మానవాభివృద్ధి సూచీలో భారత్ పురోగతి

దిల్లీ: మానవాభివృద్ధి సూచీలో భారత్ స్థానం మెరుగుపడింది. 193 దేశాలున్న ఈ సూచీలో 2022లో 133వ స్థానంలో ఉన్న భారత్ 2023లో 130వ స్థానానికి ఎగబాకిందని ఐరాస అభివృద్ధి కార్యక్రమ (యూఎన్‌డీపీ) మానవాభివృద్ధి నివేదిక మంగళవారం వెల్లడించింది. 2022లో అసమానతల కారణంగా భారత్‌లో మానవాభివృద్ధి 30.7 శాతం తగ్గినట్లు గుర్తించారు. దేశంలో వైద్య, విద్య రంగాల్లో అసమానతలు మెరుగుపడినా ఆదాయ అసమానతలు, లింగ వివక్ష గణనీయంగా ఉన్నాయని నివేదిక తెలిపింది. శ్రామిక వర్గంలో మహిళల భాగస్వామ్యం, మహిళల రాజకీయ ప్రాతినిధ్యం వంటి విషయాల్లో దేశం వెనుకబడి ఉంది. చట్టసభల్లో మహిళలకు మూడోవంతు రిజర్వేషన్లు కల్పిస్తూ ఇటీవల రాజ్యాంగాన్ని సవరించడాన్ని నివేదిక ప్రస్తావించింది. దేశంలో ప్రజల సగటు ఆయుర్దాయం 71.7 సంవత్సరాల నుంచి 72.0 ఏళ్లకు పెరిగింది. పాఠశాల విద్యారంగంలో భారత్ 1990 నుంచి ప్రగతి సాధించిందని మానవాభివృద్ధి నివేదిక కొనియాడింది. విద్యా హక్కు చట్టం, సమగ్ర శిక్షా అభియాన్, 2020 జాతీయ విద్యా విధానం ఇందుకు దోహద పడ్డాయని పేర్కొంది. కొనుగోలు శక్తి ఆధారంగా నిర్ధరించిన దేశ తలసరి స్థూల దేశీయ ఆదాయం 8,475.68 డాలర్ల నుంచి 9,046.76 డాలర్లకు పెరిగిందని పేర్కొంది.

లోయలో పడిన బస్సు: నలుగురి మృతి

● మృతుల్లో ఓ జవాన్
● జమ్మూకశ్మీర్‌లోని పుంఛ్ జిల్లాలో ఘటన



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

జమ్మూ, మెంధార్: జమ్మూకశ్మీర్‌లోని పుంఛ్ జిల్లాలో ఓ ప్రైవేట్ బస్సు లోయలో పడి నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 44 మంది గాయపడ్డారు. మృతుల్లో ఓ సైనికుడు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం ఘనీ గ్రామం నుంచి మెంధార్ వెళ్తున్న క్రమంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు లోయలో పడిపోయింది. మృతులంతా ఘనీ గ్రామానికి చెందిన వారని అధికారులు పేర్కొన్నారు. అస్సాంలో విధులు నిర్వర్తిస్తున్న మజీద్ అనే సైనికుడు సెలవుపై గ్రామానికి వచ్చి ప్రమాదంలో మృతి చెందినట్లు వెల్లడించారు.

విమానంలో ప్లాస్టిక్ కరిగిన వాసన

దిల్లీలో అత్యవసర ల్యాండింగ్

దిల్లీ: బ్యాంకాక్ నుంచి మాస్కో వెళ్తున్న ఏరోఫ్లోట్ విమానంలో ప్లాస్టిక్ కరిగిన వాసన రావడంతో దిల్లీ విమానాశ్రయంలో మంగళవారం అత్యవసరంగా దించారు. ఆ సమయంలో విమానంలో 400 మంది ప్రయాణికులున్నారు. ప్లాస్టిక్ కరిగిన వాసన రావడంతో బ్యాంకాక్ నుంచి మాస్కో వెళ్తున్న ఎస్‌యూ273 విమానాన్ని దిల్లీలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయాల్సి వచ్చిందని రష్యాకు చెందిన ఏరోఫ్లోట్ వైమానిక సంస్థ పేర్కొంది. "ప్రామాణిక పద్ధతుల మేరకే విమానాన్ని అత్యవసరంగా దించాం. అయితే క్యాబిన్‌లో ఎలాంటి పొగ గమనించలేదు" అని వైమానిక సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

సరిహద్దు ప్రాంతాల ప్రజలకు పాక్ నుంచి స్పై కాల్స్

ఇంటర్నెట్ డెస్క్: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ.. సరిహద్దు ప్రాంతాల్లో అనుమానిత స్పై (గూఢచార) కాల్స్ గణనీయంగా పెరుగుతున్నట్లు భద్రతా సంస్థలు గుర్తించాయి. పాక్ నుంచి వస్తున్న ఈ ఫోన్ కాల్స్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాయి. 'పాక్ నుంచి వస్తున్న ఈ ఫోన్ కాల్స్ ద్వారా సున్నితమైన సమాచారాన్ని సేకరించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు గుర్తించాం. స్పై కాల్స్ చేస్తున్న వ్యక్తులు తమను తాము ఆర్మీ, సీనియర్ ప్రభుత్వ అధికారులుగా చెబుతున్నారు. సైనిక దళాలకు చెందిన కీలకమైన స్థావరాలు, మౌలిక సదుపాయాలు గురించి, భద్రతా దళాల కదలికల గురించి వివరాలు సేకరించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేము అంతర్గత సమావేశాలు నిర్వహించాం. అందరు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించాం. అలాగే రక్షణ సంస్థలు, ముఖ్యమైన సైనిక స్థావరాలకు సమీపంలో నివసించే పౌరులు, తమకు తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి సున్నితమైన సమాచారాన్ని వారికి చెప్పవద్దని హెచ్చరిస్తున్నాం. ఒకవేళ ఎవరికైనా ఇలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు నివేదించాలి' అని జైసల్మేర్ ఎస్పీ సుధీర్ చౌదరి పేర్కొన్నారు.

పాకిస్థాన్‌కు చెందిన ఏజెంట్లు హనీట్రాప్ (వలపు వల) ద్వారా సామాన్య ప్రజలను తమ బుట్టలో వేసుకుని, సున్నితమైన సమాచారాన్ని సేకరించే ప్రయత్నాలు చేస్తున్నారని, పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈనాడు బిజినెస్

పీఎస్‌యూల స్వచ్ఛంద డీలిస్టింగ్‌కు ప్రత్యేక విధానం: సెబీ

దిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి స్వచ్ఛందంగా తొలగించుకునేందుకు (డీలిస్టింగ్) ప్రత్యేక విధానం తీసుకు రావాలని సెబీ ప్రతిపాదించింది. దీని ప్రకారం.. ప్రభుత్వం లేదా ప్రమోటరు గ్రూపు వాటా 90%, అంతకుమించి ఉన్న పీఎస్‌యూల్లో ఈ ప్రత్యేక విధానం ద్వారా డీలిస్టింగ్‌కు అర్హత సాధిస్తాయి. కనీస ప్రజల వాటా పరిమితి నిబంధనలను పాటించకున్నా, ఈ పీఎస్‌యూ షేర్లను డీలిస్ట్ చేయొచ్చు. షేరు కనీస ధరకు కనీసం 15% అధిక ధర వద్ద ఈ సంస్థ ఆఫర్ చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. ప్రమోటర్ల వాటా పరిమితి 90 శాతానికి చేరితే డీలిస్టింగ్ విజయవంతం అవుతుంది. అయితే డీలిస్టింగ్‌కు షేరు కనీస ధరను 60 రోజుల సగటు, గత 26 వారాల్లో అధిక ధర లాంటి పలు అంశాల ఆధారంగా గణిస్తారు. అధిక మార్కెట్ ధరల కార ణంగా, ఈ నిబంధనల పీఎస్‌యూల డీలిస్టింగ్ ప్రక్రియను వ్యయభరితంగా మార్చాయి. చాలా పీఎస్‌యూల్లో ప్రజల వాటా పరిమితి తక్కువగా ఉండటం, పాత వ్యాపార పద్ధతులు లేదా భవిష్యత్ అంచనాల బలహీనంగా ఉండటం, సంస్థల వాస్తవ విలువ కంటే అధిక మార్కెట్ ధరను కలిగి ఉండటాన్ని గుర్తించడంతో ఈ దర్యాప్తులతో సెబీ తెలిపింది. దీనివల్ల ఈ తరహా కంపెనీల షేర్ల డీలిస్టింగ్ ప్రభుత్వానికి ఆర్థికంగా భారంగా మారింది. అందుకే ఈ తరహా సంస్థల షేర్ల స్వచ్ఛంద డీలిస్టింగ్ ప్రక్రియకు ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని సెబీ ప్రతిపాదించింది.



భారత్, బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారు

- బ్రిటిష్ విస్కీ, కార్లు, వైద్య పరికరాల ధరలు ఇక్కడ తగ్గుతాయ్
- మన దుస్తులు, తోలు వస్తువుల ఎగుమతులకు ఊతం
- ఇదొక చరిత్రాత్మక మైలురాయి: మోదీ

దిల్లీ: భారత్, బ్రిటన్.. మైలురాయి లాంటి వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. దీంతో భారత్ నుంచి కార్మికుల అధికంగా పనిచేసే తోలు వస్తువులు, పాదరక్షలు, దుస్తులు, ప్రాసెస్ ఆహారోత్పత్తుల వంటి ఎగుమతులకు ఊతం లభించనుంది. బ్రిటన్ నుంచి విస్కీ, కార్లు, వైద్య పరికరాల దిగుమతి చౌకగా మారనుంది. తాజా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కారణంగా ద్వైపాక్షిక వాణిజ్యం 2030 కల్లా 120 బి. డాలర్లకు చేరొచ్చన్న అంచనాలున్నాయి. 2022 జనవరి నుంచి 14 దఫాలుగా జరిగిన చర్చల అనంతరం ఈ ఒప్పందం కుదిరింది.

ప్రపంచంలోని అయిదో (భారత్)- ఆరో (బ్రిటన్) అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)తో పాటు డబుల్ కాంట్రిబ్యూషన్ కన్వెన్షన్ (డీసీసీ)/ సామాజిక భద్రతా ఒప్పందం కుదిరినట్లు ఇరు దేశాలు మంగళవారం ప్రకటించాయి. ఇదొక 'చరిత్రాత్మక మైలురాయి' అని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఈ ఒప్పందాలతో ఇరు దేశాల వాణిజ్యం, పెట్టుబడులు, వృద్ధి, ఉద్యోగ సృష్టి మెరుగవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో మోదీ ఫోన్‌లో సంభాషించారు, ఈ ఒప్పంద ప్రకటన వెలువడింది. ఆంతర్జాతీయ మార్కెట్లకు ఇరు దేశాలు కలిసి ఉత్పత్తులు, సేవలను సంయుక్తంగా అభివృద్ధి చేయగలవని భారత్ పేర్కొంది. వాణిజ్య అడ్డంకులను తగ్గించుకోవడం ద్వారా మరింత భద్రమైన, బలమైన ఆర్థిక వ్యవస్థగా మార్చొచ్చని బ్రిటన్ ప్రధాని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం వల్ల బ్రిటన్ ఆర్థిక వ్యవస్థలోకి ఏటా 480 కోట్ల యూరోల నిధులు వస్తాయని బ్రిటిష్ ప్రధాని కార్యాలయం అంచనా వేసింది. 'బ్రిటన్ వ్యాపారాలకు, సిబ్బందికి, బ్రిటన్‌కు ఇదొక ఆర్థిక విజయమ'ని వ్యాఖ్యానించింది.

డబుల్ కాంట్రిబ్యూషన్ కన్వెన్షన్(డీసీసీ) ఒప్పందం కింద బ్రిటన్‌లో పనిచేసే భారతీయ ఉద్యోగులు, వారి సంస్థలు సామాజిక భద్రత చెల్లింపుల నుంచి మూడేళ్ల పాటు మినహాయింపు లభించడం వల్ల బ్రిటన్‌లో భారత్ సాధించిన అతిపెద్ద విజయం అని చెప్పొచ్చు. భారత సర్వీస్‌ప్రొవైడర్లకు

రూ.4000 కోట్ల ప్రయోజనాలు

దక్కు ఇది ఆర్థిక ప్రయోజనాన్ని అందించే అంశం. డీసీసీ వల్ల బ్రిటన్‌లో తాత్కాలికంగా ఉన్న దేశీయ సిబ్బంది, వారి కంపెనీలకు సామాజిక భద్రతా చెల్లింపుల నుంచి మినహాయింపు లభించడంతో వేతనంలో 20% మేర సిబ్బందికి ఆదా కానుంది. ఒక్క ఐటీ రంగంలోనే 60,000 మంది ఉద్యోగులకు ఈ ప్రయోజనం దక్కనుంది. మొత్తం మీద భారతీయ కంపెనీలు, ఉద్యోగులకు రూ.4,000 కోట్ల ప్రయోజనాలు అందనున్నాయి.

ఎఫ్‌టీఏ, డీసీసీ వల్ల ఏం జరుగుతుంది?

✦ 99% భారత ఎగుమతులకు బ్రిటన్ మార్కెట్లో సున్నా సుంకం వర్తిస్తుంది. ఇందులో లవణాలు, రసాయనాలు, రత్నాభరణాలు, ప్లాస్టిక్, రబ్బరు, కలప, పేపరు, జౌళి, దుస్తులు, గ్లాస్, సెరామిక్, ప్రాథమిక లోహాలు, మెకానికల్-విద్యుత్ సామగ్రి, ఆయుధాలు/మందుగుండు సామగ్రి, రవాణా/వాహన, ఫర్నీచర్, ప్రాసెస్ ఫుడ్, జంతు ఉత్పత్తులు, స్పోర్ట్స్ వస్తువులు ఉన్నాయి. వీటిపై 2-18% సుంకం పడుతోంది.

✦ కార్మికులపై ఆధారపడే రంగాలైన సముద్ర ఉత్పత్తులు, తోలు వస్తువులు, పాదరక్షలు, బొమ్మలు, ఇంజినీరింగ్ వస్తువులు, వాహన విడిభాగాలు-ఇంజిన్లు, ఆర్గానిక్ కెమికల్స్ వంటి వాటిలో భారత్‌కు ఎగుమతి అవకాశాలు పెరుగుతాయి.

✦ ఐటీ, ఐటీఈఎస్, ఆర్థిక సేవలు, ప్రొఫెషనల్ సేవలు, ఇతర వ్యాపార సేవలు, విద్యా సేవలకు వాణిజ్య పరంగా మద్దతు లభిస్తుంది. డిజిటల్‌గా డెలివరీ చేసే ఆర్కిటెక్చర్, ఇంజినీరింగ్, కంప్యూటర్ ఆధారిత, టెలికాం సేవలకు భారత్ ఎంచదగ్గరిలో బ్రిటన్ నుంచి హామీ పొందింది.

✦ మనదేశం విధిస్తున్న దిగుమతి సుంకాలు తగ్గుతాయి. 90% టారిఫ్ లైన్లన్నీ తగ్గుతాయి. దశాబ్దంలో వీటిలో 85% పూర్తిగా టారిఫ్ రహితంగా మారతాయి. విస్కీ, జిన్‌పై టారిఫ్‌లు 150% నుంచి 75 శాతానికి చేరతాయి. పదేళ్లకు 40 శాతానికి తగ్గుతాయని. వాహన టారిఫ్‌లు 100% నుంచి 10 శాతానికి చేరతాయి. టాటా-జేఎల్ఆర్ వంటి కంపెనీలకు ప్రయోజనకరం.

భారత వినియోగదార్లకు

కాస్మెటిక్స్ ✦ ఏరోస్పేస్ ✦ వైద్య పరికరాలు ✦ సాల్మన్ చేపలు ✦ విద్యుత్ యంత్రాలు ✦ సాఫ్ట్ డ్రింక్స్ ✦ చాకొలెట్లు, బిస్కెట్లు ✦ కార్లు ✦ విస్కీ ధరలు తగ్గుతాయి.

బ్రిటన్ వినియోగదార్లకు

✦ దుస్తులు ✦ పాదరక్షలు ✦ ఆహార ఉత్పత్తులు (ఫ్రోజెన్ రొయ్యలు) చౌక అవుతాయి.

✦ భారతీయ వృత్తి నిపుణులు సులభతరంగా బ్రిటన్‌లో పనిచేయడానికి వీలు చిక్కుతుంది.

✦ ఎఫ్‌టీఏకు బ్రిటిష్ పార్లమెంటు ఆమోదం అవసరం. అందువల్ల అమలుకు ఏడాది పట్టొచ్చు.



బంగారం మళ్లీ రూ.లక్షపైకి

అంతర్జాతీయంగా పెరగడం వల్లే



ఈనాడు వాణిజ్య విభాగం: బంగారం ధర మళ్లీ బాగా పెరిగింది. దేశీయ విపణిలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర మంగళవారం రూ.1,00,900 పైకి చేరింది. కిలో వెండి ధర కూడా రూ.98,800గా ఉంది. అంతర్జాతీయ విపణిలో అనిశ్చితి, డాలర్ బలహీనం అవుతుండటం, భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరగడం వల్ల ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర మంగళవారం 98 డాలర్లకు పైగా పెరిగి 3412 డాలర్లకు చేరడం వల్ల, దేశీయంగానూ ధర భగ్గుమంది. గత నెలలో అంతర్జాతీయంగా ఔన్సు ధర 3407 డాలర్ల గరిష్ఠానికి చేరగా, దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1 లక్షను మించిన సంగతి విదితమే. అనంతరం క్రమేణ ధరలు దిగివచ్చాయి. ఔన్సు బంగారం ధర 3225 డాలర్లకు, దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.96,000 స్థాయికి దిగి వచ్చినా, మళ్లీ పెరిగింది.

విజయవాడలో మహీంద్రా అతిపెద్ద డీలర్‌షిప్

విజయవాడ (రామవరప్పాడు), న్యూస్‌టుడే: దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దదైన మహీంద్రా డీలర్‌షిప్‌ను విజయవాడ (ఎనికేపాడు)లో ప్రారంభించినట్లు ఆటోమోటివ్ మ్యానుఫ్యాక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎంపీఎల్) తెలిపింది. రూ.15 కోట్ల పెట్టుబడితో, 1.03 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని మహీంద్రా వైస్ ప్రెసిడెంట్ పవన్ కుమార్, నేషనల్ సేల్స్ హెడ్ బనేశ్వర్ బెనర్జీ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. మహీంద్రా గ్రూప్ ఉత్పత్తి చేసే అన్ని రకాల వాహనాలు ఇక్కడ లభిస్తాయని తెలిపారు. విడిభాగాలూ విక్రయిస్తామని, విక్రయానంతర సేవలు లభిస్తాయని తెలిపారు. ఏఎంపీఎల్‌కు ఇది 135వ మహీంద్రా కేంద్రంగా వివరించారు.

హెచ్‌పీసీఎల్ లాభంలో 26% వృద్ధి

తుది డివిడెండు రూ.10.50

దిల్లీ: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), జనవరి- మార్చి త్రైమాసికంలో రూ.3,415.44 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24 ఇదే కాల లాభం రూ.2,709.31 కోట్లతో పోలిస్తే, ఇది 26% అధికం. రిఫైనింగ్ మార్జిన్లు పెరగడం ఇందుకు నేపథ్యం. 2024 అక్టోబరు- డిసెంబరు లాభం రూ.2,543.65 కోట్లతో పోల్చినా.. సమీక్షా త్రైమాసికంలో మెరుగైంది. బ్యారెల్ ముడి చమురును ఇంధనంగా మార్చడం ద్వారా మార్చి త్రైమాసికంలో 8.44 డాలర్లను హెచ్‌పీసీఎల్ ఆర్జించింది. ఏడాదిక్రితం ఇదే సమయంలో ఇది 6.96 డాలర్లే. వంట గ్యాస్‌ను ఉత్పత్తి ధర కంటే తక్కువకు విక్రయించడం వల్ల హెచ్‌పీసీఎల్‌కు వచ్చిన నష్టాలను ప్రభుత్వం భర్తీ చేయనప్పటికీ, ఈ సంస్థ లాభం పెరగడం గమనార్హం. కార్యకలాపాల ద్వారా ఆదాయం రూ.1.18 లక్షల కోట్లకు తగ్గింది. ఏడాది క్రితం ఇదేకాలంలో ఆదాయం రూ.1.21 లక్షల కోట్లుగా ఉంది.

విశాఖ రిఫైనరీలో 15 మి.ట. శుద్ధి: విస్తరణ అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ రిఫైనరీ పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేస్తోందని, 15 మిలియన్ టన్నుల ముడి చమురును ప్రాసెసింగ్ చేసిందని వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తంమీద హెచ్‌పీసీఎల్ నికర లాభం సగానికి తగ్గి రూ.7,365 కోట్లకు పరిమితమైంది. రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ.10.50 (105%) తుది డివిడెండు ప్రకటించింది.

రీ సస్టెయినబిలిటీలో వాటా విక్రయానికి కేకేఆర్ కసరత్తు

ఈనాడు, హైదరాబాద్: వ్యర్థాల నిర్వహణ కార్యకలాపాల్లో నిమగ్నమైన రీ సస్టెయినబిలిటీ (గతంలో రాంకీ ఎన్విరో ఇంజినీర్స్) సంస్థలో మెజార్టీ వాటా విక్రయానికి అమెరికాకు చెందిన ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) పెట్టుబడుల సంస్థ, కేకేఆర్ మరోసారి కసరత్తు ప్రారంభించింది. ఈ సంస్థలో 60% వాటాను రాంకీ గ్రూపు వ్యవస్థాపకుడైన ఎ.అయోధ్య రామిరెడ్డి నుంచి కొన్నేళ్ల క్రితం కేకేఆర్ కొనుగోలు చేశాక, రీ సస్టెయినబులిటీ గా పేరు మార్చారు. సంస్థలో మిగిలిన వాటా అయోధ్య రామిరెడ్డి వద్దే ఉంది. మున్సిపల్ - భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు ఈ సంస్థ మనదేశంతో పాటు, గల్ఫ్‌లో ప్లాంట్లు ఏర్పాటు చేసి నిర్వహిస్తోంది. ఈ కంపెనీలో వాటా విక్రయించడానికి ఏడాది క్రితం కేకేఆర్ పెద్దఎత్తున కసరత్తు చేసింది. ఇతర పీఈ సంస్థలకు తన వాటా విక్రయించడం/ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) కు వెళ్లే అవకాశాలనూ పరిశీలించింది. కానీ వీలుకాలేదు. మళ్లీ ఇప్పుడు వాటా విక్రయానికి పావులు కదుపుతున్నట్లు సమాచారం. దీని కోసం జేపీ మోర్గాన్, బార్క్లేస్ సంస్థలను ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లుగా నియమించారు. ఈ సంస్థలు ఇప్పటికే ఇతర అగ్రశ్రేణి పీఈ సంస్థలైన బ్లాక్‌స్టోన్, కార్లైల్, సీవీసీ, మెక్వారీ, స్టోన్‌పీక్ కేపిటల్‌లను సంప్రదించినట్లు తెలుస్తోంది. అన్నీ కుదిరితే త్వరలోనే వాటా విక్రయం పూర్తవుతుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

ఏడాదికి 70 లక్షల టన్నుల వ్యర్థాల నిర్వహణ: రీ సస్టెయినబిలిటీ ప్రస్తుతం ఏడాదికి 70 లక్షల టన్నుల వ్యర్థాలను నిర్వహిస్తోంది. పారిశ్రామిక/ బయో మెడికల్/మున్సిపల్ వ్యర్థాలు ఇందులో ఉంటాయి. దీంతోపాటు రీసైక్లింగ్ యూనిట్లూ ఉన్నాయి. భవన ప్రాంగణాల నిర్వహణ, కార్ పార్క్ మేనేజ్‌మెంట్ విభాగాలూ ఈ సంస్థకు ఉన్నాయి. కేకేఆర్ వాటా విక్రయం ఖరారైతే, తనకు ఉన్న 40% వాటా విషయంలో రాంకీ గ్రూపు వ్యవస్థాపకుడైన అయోధ్య రామిరెడ్డి ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి వస్తుంది.

కోడి గుడ్లు

7న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	480
వరంగల్	482
విజయవాడ	500
గోదావరి	495
విశాఖపట్నం	500
చిత్తూరు	553

భారత వృద్ధి 6.3 శాతమే: మూడీస్

దిల్లీ: ఈ ఏడాదిలో భారత జీడీపీ వృద్ధి అంచనాలను 6.5% నుంచి 6.3 శాతానికి మూడీస్ రేటింగ్స్ తగ్గించింది. అమెరికా వాణిజ్య విధానాల్లో అనిశ్చితి, టారిఫ్‌ల వల్ల ప్రపంచ దేశాల వృద్ధి నెమ్మదించే అవకాశం ఉందని తెలిపింది. భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల వల్లా భారత వృద్ధిపై ప్రభావం చూపుతుందని తెలిపింది. 2026 వృద్ధి అంచనాలను 6.5 శాతంగా సంస్థ కొనసాగించింది. వృద్ధికి తోడ్పాటు అందించేందుకు ఆర్‌బీఐ మరిన్ని రేట్ల కోతలు విధించొచ్చని అభిప్రాయపడింది. అమెరికా వృద్ధి అంచనాలను 2025లో 1 శాతానికి, 2026లో 1.5 శాతానికి మూడీస్ తగ్గించింది. చైనా వృద్ధి 3.8 శాతానికి చేరొచ్చని తెలిపింది.

కనీస పెట్టుబడి రూ.కోటి

డెట్ ఇన్‌స్ట్రుమెంట్లకు సెబీ నిబంధన

దిల్లీ: సెక్యూరిటీ కార్యకలాపాల్లో ఉన్న ఆర్‌బీఐ నియంత్రిత ఆరిజినేటర్లు, నియంత్రణ లేని సంస్థలు తప్పనిసరిగా రూ.కోటి పెట్టుబడుల పరిమితిని పాటించాలని మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ పేర్కొంది. తనఖా వంటి వివిధ రకాల రుణాలను కలిపి అందించే ఆర్థిక ఉత్పత్తులనే సెక్యూరిటైజ్డ్ డెట్ ఇన్‌స్ట్రుమెంట్స్ (ఎస్‌డీఐ) అంటారు. వీటిని మదుపర్లకు సెక్యూరిటీల రూపంలో జారీ చేస్తారు. దీనినే సెక్యూరిటైజేషన్ అంటారు. బ్యాంకుల వంటి ఆరిజినేటర్లు ఈ ఇల్లిక్విడ్ అసెట్స్‌ను లిక్విడ్ అసెట్స్‌గా మార్చడానికి వీలుంటుంది. సంబంధిత డెట్ పూల్ పనితీరు ఆధారంగా ఇందులో పెట్టుబడులు పెట్టినవారికి ప్రతిఫలాలు అందుతాయి. పలు రకాల పెట్టుబడి సాధనాల్లో పెట్టుబడులు పెట్టడం వల్ల ఆకర్షణీయ ప్రతిఫలాలు వస్తాయి. ఒక సెక్యూరిటైజ్డ్ డెట్ ఇన్‌స్ట్రుమెంట్ జారీకి కనీస టికెట్ పరిమాణాన్ని రూ.కోటిగా నిర్ణయిస్తూ సెబీ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

టీసీఎస్ ఉద్యోగులకు 100% వేరియబుల్ భత్యం చెల్లింపు

దిల్లీ: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), జనవరి- మార్చి త్రైమాసికానికి గాను 70 శాతానికి పైగా తన ఉద్యోగులకు 100 శాతం త్రైమాసిక వేరియబుల్ భత్యాన్ని (క్యూవీఏ) చెల్లించినట్లు తెలిపింది. ఇతర గ్రేడ్‌లలోని ఉద్యోగులకు వారి విభాగాల పనితీరు ఆధారంగా క్యూవీఏ ఉంటుందని టీసీఎస్ తెలిపింది. ఇది కంపెనీ నిర్దేశించుకున్న ప్రామాణిక విధానానికి లోబడి ఉంటుందని పేర్కొంది. టారిఫ్ సవాళ్లు సృష్టించిన వ్యాపార అనిశ్చితుల కారణంగా 6.07 లక్షల మంది ఉద్యోగులకు వార్షిక వేతన పెంపును వాయిదా వేస్తున్నట్లు టీసీఎస్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

భవిష్యత్తులో యాపిల్ ఫోన్లన్నీ భారత్‌లోనే తయారీ

కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా



దిల్లీ: భారత్‌లో పెట్టుబడులు పెట్టడమనేది ప్రతి తయారీసంస్థకూ ఆర్థికంగా మేలు చేసే అంశంగా మారిందని కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. యాపిల్ కూడా అమెరికాలో విక్రయమయ్యే ఐఫోన్లలో ఎక్కువ శాతం భారత్‌లోనే తయారు చేయాలని నిర్ణయించుకుందని గుర్తు చేశారు. మంగళవారమిక్కడ 'భారత్ టెలికాం' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'యాపిల్ భవిష్యత్తులో ఐఫోన్లను ఇక్కడే తయారు చేసి, ఇతర దేశాలకూ ఎగుమతి చేయనుంది. భారత్‌ను ఎంచుకున్నారంటే.. అందుబాటు ధర, విశ్వాసం, ఒరిజినాలిటీని ఎంచుకున్నట్లే'నని అన్నారు. జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయమయ్యే దాదాపు అన్ని ఐఫోన్లు భారత్‌లో తయారైనవే ఉంటాయని యాపిల్ సీఈఓ టిమ్ కుక్ ఇటీవల పేర్కొన్న సంగతి తెలిసిందే.

రూ.4,000 కోట్ల పెట్టుబడులతో రూ.80,000 కోట్ల విక్రయాలు..: టెలికాం సామగ్రి మార్కెట్‌కు, ప్రభుత్వ ఉత్పత్తి అనుసంధానిత పథకం మద్దతుగా ఉండడంతో వృద్ధి భారీగా నమోదవుతోందని అన్నారు. 'రూ.4,000 కోట్ల పెట్టుబడులతోనే రూ.80,000 కోట్ల విలువైన పరికరాల తయారీ- అమ్మకాలు, రూ.16,000 కోట్ల ఎగుమతులతో పాటు 25,000 ఉద్యోగాల సృష్టి జరుగుతోంద'ని వివరించారు.

దిగుమతి దేశం నుంచి ఎగుమతి దేశంగా: పెమ్మసాని: '2014లో మొబైల్ ఫోన్లకు భారత్ అతిపెద్ద దిగుమతిదారుగా ఉండేది. ఇపుడు అతిపెద్ద తయారీదారు, ఎగుమతిదారుగా మారింద'ని టెలికాం సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. '2014లో 60 లక్షల సెల్ ఫోన్లు ఇక్కడ తయారు చేస్తే, 21 కోట్ల ఫోన్లు దిగుమతి చేసుకున్నాం. 2024 కల్లా 33 కోట్ల మొబైల్ ఫోన్లు తయారు చేయడంతో పాటు, 5 కోట్ల ఫోన్ల ఎగుమతులకు చేరాం. ప్రపంచ వ్యాప్త ఐఫోన్ల తయారీలో భారత్ వాటా 15 శాతంగా ఉందని పెమ్మసాని పేర్కొన్నారు. భారత్‌ను ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్, తయారీలో అంతర్జాతీయ కేంద్రంగా 'సెమీకండక్టర్ మిషన్' మార్చగలదని వివరించారు.

1 నుంచి కొత్త రుసుములు: ఫెడరల్ బ్యాంక్

హైదరాబాద్: ఒక పక్క ఏటీఎంల నుంచి నగదు లావాదేవీలు పెరుగుతుండగా ఫెడరల్ బ్యాంక్, జూన్ 1 నుంచి వివిధ సేవలపై రుసుములు, ఛార్జీలను సవరిస్తున్నట్లు వెల్లడించింది. పొదుపు ఖాతాదారులు నెలకు 5 ఉచిత నగదు లావాదేవీలు (జమ, ఉపసంహరణ) లేదా రూ.5 లక్షల వరకు లావాదేవీలు చేసుకోవచ్చు. ఈ పరిమితి తర్వాత ప్రతి రూ.1,000కి రూ.4 చొప్పున లేదా కనీసం రూ.100 వరకు రుసుము చెల్లించాలి. పొదుపు ఖాతాల్లో నెలవారీ సగటు నిల్వ లేకపోతే రూ.75-375 అపరాధ రుసుము వర్తిస్తుంది. లాకర్లను బట్టి అద్దె రూ.2,000 - 3,300 ఉంటుంది. మెట్రో - పెద్ద నగరాల్లో ఈ అద్దె రూ.2,950 - 7,400 అవుతుంది. పొదుపు ఖాతాను 6 నెలల్లోపు రద్దు చేసుకుంటే రూ.100 ఫీజు చెల్లించాలి. ఇతర బ్యాంకు ఏటీఎం లావాదేవీల పరిమితి దాటితే నగదు లావాదేవీలకు రూ.23, ఇతర సేవలకు రూ.12 చొప్పున వసూలు చేస్తారు.

జెన్సోల్‌పై కార్పొరేట్ వ్యవహారాల శాఖ దర్యాప్తు

దిల్లీ: కంపెనీల చట్టాన్ని ఉల్లంఘించిందన్న ఆరోపణలతో జెన్సోల్ ఇంజినీరింగ్, బ్లూస్మార్ట్ మొబిలిటీలపై దర్యాప్తునకు కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఆదేశించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. అక్రమంగా నిధుల తరలింపు, కార్పొరేట్ పరిపాలనా లోపాలతో జెన్సోల్ సెబీ విచారణను ఎదుర్కొంటోంది. ఇప్పటికే కంపెనీ ప్రమోటర్లు అన్మోల్, పునీత్ సింగ్ జగ్గీలపై నిషేధం విధించడం గమనార్హం. తాజా పరిణామాల నేపథ్యంలో వరుసగా 18వ రోజూ జెన్సోల్ షేర్లు క్షీణించాయి. మంగళవారం 4.99% తగ్గిన షేరు రూ.66.97 వద్ద లోయర్ సర్క్యూట్‌కు పడిపోయింది. షేరు 52 వారాల గరిష్ఠమైన రూ.1,125.75 దగ్గర నుంచి 94% కుదేలైంది.

యుద్ధ భయాలతో రూ.6 లక్షల కోట్లు ఆవిరి

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.3,795 కోట్లు

డీఐఐ విక్రయాలు: రూ.1,398 కోట్లు

సమీక్ష



భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమై, యుద్ధం వస్తుందనే ఆందోళనల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తమయ్యారు. బ్యాంకింగ్, చమురు షేర్లలో లాభాలు స్వీకరించడంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. యుద్ధం వచ్చినప్పుడు ఎలా మెలగాలనే అంశంపై ప్రజలకు సూచనలు ఇచ్చేందుకు మాక్ డ్రిల్స్ నిర్వహించాల్సిందిగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర హోం శాఖ ఆదేశించడం సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 5 పైసలు తగ్గి 84.35 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 2.76% లాభంతో 61.85 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ మంగళవారం రూ.6.17 లక్షల కోట్లు తగ్గి రూ.421.31 లక్షల కోట్లు (4.98 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 111 పాయింట్ల (క్రితం ముగింపు 80,796.84) లాభంతో 80,907.24 వద్ద ప్రారంభమైంది. వెంటనే నష్టాల్లోకి జారుకున్న సూచీ, ఇంట్రాడేలో 315.81 పాయింట్లు తగ్గి 80,481.03 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 155.77 పాయింట్ల నష్టంతో 80,641.07 వద్ద ముగిసింది. నిఫ్టీ 81.55 పాయింట్లు కోల్పోయి 24,379.60 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,331.80-24,509.65 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 16 డీలాపడ్డాయి. ఎటెర్నల్ 3.08%, టాటా మోటార్స్ 2.09%, ఎస్‌బీఐ 2.01%, అదానీ పోర్ట్స్ 1.96%, ఎన్‌టీపీసీ 1.95%, ఇండస్ఇండ్ బ్యాంక్ 1.78%, బజాజ్ ఫైనాన్స్ 1.52%, యాక్సిస్ బ్యాంక్ 1.06%, సన్ ఫార్మా 0.89% నష్టపోయాయి. భారతీ ఎయిర్‌టెల్ 1.91%, టాటా స్టీల్ 1.62%, ఎం అండ్ ఎం 1.59%, హెచ్‌యూఎల్ 1.40%, నెస్లే 1.06% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో ఫోకస్డ్ స్థిరాస్తి 3.49%, విద్యుత్ 2,64%, సేవలు 2.53%, యుటిలిటీస్ 2.36%, పరిశ్రమలు 2%, యంత్ర పరికరాలు 1.71%, మన్నికైన వినిమయ వస్తువులు 1.59% పడ్డాయి. వాహన, టెక్ మెరిశాయి. బీఎస్ఈలో 3209 షేర్లు నష్టాల్లో ముగియగా, 742 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 121 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

✦ త్రైమాసిక ఫలితాలు మెప్పించకపోవడంతో బ్యాంక్ ఆఫ్ బరోడా షేరు 10.27% తగ్గి రూ.223.65 దగ్గర స్థిరపడింది. సంస్థ మార్కెట్ విలువ రూ.13,238.68 కోట్లు తగ్గి రూ.1.15 లక్షల కోట్లకు చేరింది.

నేటి బోర్డు సమావేశాలు: **కోల్ ఇండియా, డాబర్, పీఎన్‌బీ, ఎంఆర్ఎఫ్, బ్లూస్టార్, వోల్టాస్, యునైటెడ్ బ్రూవరీస్, టాటా కెమికల్స్, సింఫనీ, సొనాటా**

సెన్సెక్స్ ▼ 156 80641

నిఫ్టీ ▼ 82 24380

నిరాశపరిచిన ఏథర్ ఎనర్జీ

విద్యుత్ ద్విచక్ర వాహన సంస్థ ఏథర్ ఎనర్జీ షేరు అరంగేట్రం నిరాశపరిచింది. ఇష్యూ ధర రూ.321తో పోలిస్తే బీఎస్ఈలో షేరు ట్రేడింగ్1.57% నష్టంతో రూ.326.05 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.300 వద్ద కనిష్ఠాన్ని తాకి, చివరకు 5.76% కోల్పోయి రూ.302.50 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.11,266.90 కోట్లుగా నమోదైంది.

బ్యాంక్ ఆఫ్ బరోడా లాభం రూ.5,415 కోట్లు

రూ.8.35 డివిడెండు

దిల్లీ: బ్యాంక్ ఆఫ్ బరోడా 2024-25 మార్చి త్రైమాసికంలో రూ.5,415 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2023-24 ఇదే కాల లాభం రూ.5,048 కోట్లతో పోలిస్తే ఇది 3.3% అధికం. మొత్తం ఆదాయం రూ.33,775 కోట్ల నుంచి రూ.35,852 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం రూ.29,583 కోట్ల నుంచి రూ.30,642 కోట్లకు పెరిగినా, నికర వడ్డీ ఆదాయం రూ.11,793 కోట్ల నుంచి రూ.11,020 కోట్లకు తగ్గింది. ఒక్కో షేరుపై రూ.8.35 డివిడెండ్‌ను ప్రకటించారు.

పేటీఎం నష్టాలు తగ్గాయ్



దిల్లీ: పేటీఎం బ్రాండుపై కార్యకలాపాలు నిర్వహిస్తున్న వన్97 కమ్యూనికేషన్స్, జనవరి- మార్చి త్రైమాసికంలో రూ.545 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. 2023-24 ఇదే సమయ నష్టాలు రూ.551 కోట్లతో పోలిస్తే ఈసారి స్వల్పంగా తగ్గింది. గత త్రైమాసికంలో ఎంప్లాయ్ స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్ (ఎసాప్) కింద రూ.492 కోట్లను కంపెనీ వెచ్చించింది. ఎసాప్ రూపంలో పేటీఎం సీఈఓ విజయ్ శేఖర్ శర్మకు ఇచ్చిన 2.1 కోట్ల షేర్లను ఆయన స్వచ్ఛందంగా సరెండర్ చేయడంతో, ఇంపెయిర్‌మెంట్ వ్యయాల కింద రూ.30 కోట్ల వరకు కంపెనీపై భారం పడింది. ఈ అనుకోని వ్యయాలే రూ.522 కోట్ల వరకు ఉన్నాయి.

కేపీఐటీ చేతికి కేర్‌సాఫ్ట్ గ్లోబల్ విభాగం

దిల్లీ: కేర్‌సాఫ్ట్ గ్లోబల్‌కు చెందిన ఇంజినీరింగ్ సొల్యూషన్స్ వ్యాపారాన్ని 191 మి.డాలర్ల (దాదాపు రూ.1620 కోట్లు) వరకు విలువకు కొనుగోలు చేసినట్లు కేపీఐటీ టెక్నాలజీస్ ప్రకటించింది. తద్వారా కేపీఐటీ వాణిజ్య వాహన విభాగం బలోపేతం కానుంది. చైనాలో కేపీఐటీ ప్రవేశం కూడా వేగవంతం కానుంది.

దిల్లీ విమానాశ్రయంలో రన్‌వే పునరుద్ధరణ

దిల్లీ: దిల్లీ విమానాశ్రయంలో రన్‌వే ఆర్‌డబ్ల్యూ 28/10 కార్యకలాపాలను మంగళవారం పునరుద్ధరించారు. ఏప్రిల్ 8న నిర్వహణ పనుల నిమిత్తం దీన్ని మూసివేశారు. మళ్లీ పునరుద్ధరించడంతో విమానాల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది.

5 ఐపీఓలకు సెబీ అనుమతి

దిల్లీ: అయిదు కంపెనీల తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రతిపాదనలకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి ఇచ్చింది. ఐపీఓకు రానున్న సంస్థల్లో వెరిటాస్ ఫైనాన్స్, లక్ష్మీ ఇండియా ఫైనాన్స్, అజయ్ పాలీ, జాజు రష్మీ రీఫ్రాక్టరీస్, రీగల్ రీసోర్సెస్ ఉన్నాయి. ఈ కంపెనీలు గత డిసెంబరు, జనవరిల్లో ముసాయిదా పత్రాలు దాఖలు చేశాయి. ఐపీఓ ద్వారా రూ.2,800 కోట్లు సమీకరించేందుకు వెరిటాస్ సన్నాహాలు చేస్తోంది.

జనవరి- మార్చి త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2024-25	2023-24	2024-25	2023-24
గోద్రేజ్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్1	411.9	(1893.21)	3597.95	3,385.61
ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్	245	202	834	692
రాడికో ఖైతాన్	92.07	53.91	4,485.42	3,894.63
సుందరం హోమ్ ఫైనాన్స్	71.57	56.80	----	----
సీజీ పవర్	275.49	240.59	2,632.10	2,139.31
జేబీఎం ఆటో	66	54.90	1,645.70	1,485.95
ఎన్ఎస్ఈ2	2,650	2,488	4,397	5,080
పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్	102	137	2,854	2,473

1) మధ్యంతర డివిడెండ్ రూ.5 2) 35% డివిడెండు

ఈనాడు సినిమా

చిరు చిత్రంలో రెండోసారి!



కథానాయకుడు చిరంజీవి కొత్త సినిమా పూర్వ నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వెంకటేష్ ప్రత్యేక పాత్రలో కనువిందు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఇద్దరు కథానాయికలకు అవకాశం ఉండగా.. ఓ పాత్ర కోసం నయనతారను ఎంపిక చేసినట్లు తెలిసింది. అయితే ఇప్పుడిందులోని మరో ఓ కీలక పాత్ర కోసం కేథరిన్‌ను ఎంచుకున్నట్లు సమాచారం. ఆమె ఇది వరకు చిరుతో 'వాల్తేరు వీరయ్య'లో కలిసి నటించిన సంగతి తెలిసిందే. అందులో తను రవితేజ భార్య పాత్రను పోషించింది. కాగా, ఇప్పుడామె మళ్లీ అనిల్ సినిమాతో రెండోసారి చిరుతో కలిసి తెర పంచుకునే అవకాశం అందుకున్నట్లైంది. ఈ కథలో కేథరిన్ పాత్రకు చాలా ప్రాధాన్యత ఉందని.. సినిమా ఆద్యంతం తను కనిపిస్తుందని తెలిసింది. ఈ చిత్రంలో కేథరిన్, నయన్‌లతో పాటు మరో యువ నాయిక కూడా కనిపించే అవకాశముందని వార్తలొస్తున్నాయి. ప్రస్తుతం ఆ పాత్ర కోసం వేట కొనసాగుతోంది. వినోదం నిండిన యాక్షన్ కథతో రూపొందనున్న ఈ చిత్రంలో చిరంజీవి తన అసలు పేరైన శివ శంకర వరప్రసాద్ అనే పాత్రలో కనువిందు చేయనున్నారు. జూన్ నుంచి చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశముంది. ఈ సినిమాకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: సమీర్



సమంత

నా మనసు చెప్పిందే చేస్తుంటా!

"ఏదైనా ఓ పెద్ద ప్రయత్నం చేయాలన్నప్పుడు సాహసాలకి సిద్ధం కావల్సిందే. నటిగా కొనసాగితే నాకు సురక్షితమైన ప్రయాణం ఉంటుంది. కానీ కొత్త కథలు చెప్పాలి... చెప్పేందుకు అందరికీ అవకాశం ఇవ్వాలనే ఆలోచన ఎప్పట్నుంచో ఉంది. అందుకోసమే సాహసమైన నిర్ణయం తీసుకుని నిర్మాతగా మారాను" అన్నారు అగ్ర కథానాయిక సమంత. నటిగా తనదైన ముద్ర వేసిన ఆమె... నిర్మాణంలోకీ అడుగుపెట్టారు. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై తొలి ప్రయత్నంగా 'శుభం' చిత్రాన్ని నిర్మించారు. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సమంత మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

? నిర్మాణంలోకి అడుగు పెట్టాలనే ఆలోచన ఎప్పుడొచ్చింది?

నటిగా ప్రయాణం చేస్తున్నప్పుడే.. ఈ రంగంలో ఇది కాకుండా ఇంకా ఏదో చేయాలని నా మనసు చెబుతూ ఉండేది. కానీ వరుస సినిమాలతో సమయం దొరికేది కాదు. ఉన్నట్టుండి నేను అనారోగ్యానికి గురయ్యాక ఓ పెద్ద విరామం వచ్చింది. ఇక సినిమాల్లో నటిస్తానో లేదో కూడా అర్థం కాలేదు. అప్పుడే ఒకవేళ నేను నటించకపోతే, సినిమాలు నిర్మించవచ్చు కదా అనిపించింది. పదిహేనేళ్లగా ఈ రంగంలో నాకు అనుభవం ఉంది. అందుకే ఎలాంటి హడావుడి లేకుండా సినిమాని ప్రారంభించా. పూర్తి చేశాకే ఈ విషయం అందరికీ చెప్పాను.

? అసలు 'శుభం' కథేమిటి? మీ నిర్మాణ సంస్థకి ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అని నామకరణం చేయడానికి కారణం?

నా చిన్నప్పుడు 'బ్రౌన్ గర్ల్ ఇన్ ది రెయిన్... ట్రాలాలా' అంటూ ఓ పద్యం పాడుకునేవాళ్లం. అది గుర్తొచ్చే నిర్మాణ సంస్థకి ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ అని పెట్టా. ఇక ఇందులో నిర్మించిన తొలి సినిమా 'శుభం' కథ విషయానికొస్తే... ఈ కథంతా కూడా ధారావాహికతో ముడిపడి ఉంటుంది. ధారావాహికలకి శుభం కార్డు ఎప్పుడు పడుతుందా అని మనమంతా ఎదురు చూస్తుంటాం. ఈ సినిమా కథకీ, ధారావాహికకీ సంబంధం ఏమిటన్నది సినిమా చూస్తే అర్థం అవుతుంది.

? మీరు అనుకుంటే పేరున్న తారలతో సినిమాలు చేయొచ్చు. కానీ తొలి సినిమాని కొత్తవాళ్లతోనే చేయడానికి కారణం

నటిగా నాకు తొలి అవకాశాన్ని దర్శకుడు గౌతమ్ మేనన్ ఇచ్చారు. ఆయన అనుకుంటే ఆ సమయంలో టాప్ హీరోయిన్లు ఎవరైనా నటించేవారు. కానీ కొత్త అమ్మాయినైన నాకు అవకాశం ఇచ్చారు. అలా కొత్తవాళ్లని ప్రోత్సహించాలనేదే నా లక్ష్యం. ఇందులో నటించినవాళ్లని చూస్తున్నప్పుడు నాకు నా పాత రోజులు గుర్తొచ్చాయి. శ్రియ, శ్రావణి, షాలిని... ఇలా ప్రతి ఒక్కరూ ఈ సినిమా కోసం కష్టపడ్డారు. సామాజిక మాధ్యమాలు చూస్తే ఎంతోమంది ప్రతిభావంతులు ఉన్నారని అర్థమవుతోంది. వాళ్లకు తగిన అవకాశం దొరికితే అద్భుతాలు జరుగుతాయని నా నమ్మకం. నటిగా కొనసాగుతున్నప్పుడు నేను నిర్మాతల కథానాయికని అనుకునేదాన్ని. ఈ సినిమా ప్రయాణం తర్వాత నిర్మాతల కష్టాలు నాకు కొన్నే అర్థమైనట్టు అనిపించింది. ఒక్క రోజు ఒక్క సన్నివేశం అనుకున్నట్టుగా జరగకపోతే ఎంత సమయం, డబ్బు వృథా అవుతుందో ఇప్పుడు ఇంకా బాగా అర్థమైంది.

? ఇందులో మీరు అతిథి పాత్రలో సందడి చేయబోతున్నారు కదా.. ఆ పాత్ర సంగతులేమిటి

కొంచెం కీలకమైన పాత్రే. మొదట ఆ పాత్రని నేను చేయాలనుకోలేదు. కానీ ఓ నిర్మాతగా నేను వేరొకరి దగ్గరకు వెళ్లి సాయం కోరాలనిపించలేదు. అందుకే ఆ పాత్రని నేనే చేశా. మే 9 విడుదలకు మంచి రోజు. వేసవి కావడంతో కుటుంబమంతా కలిసి థియేటర్‌కి వచ్చేందుకు వీలుంటుంది. అనుకోకుండానే మంచి సమయానికి మా సినిమా విడుదలవుతోంది. నటిగా ఓ శుక్రవారం ఎలా ఉంటుందో నాకు అనుభవమే. నిర్మాతగా ఇప్పుడు నా సినిమా కోసం ఎదురు చూస్తుంటే ఇదివరకటికంటే భయంగా, ఆత్రుతగా ఉంది. కానీ 'శుభం'పై నాకు పూర్తి నమ్మకం ఉంది.

? పెద్ద నిర్మాణ సంస్థలు కూడా ఆచి తూచి అడుగులేస్తున్నాయి. ఈ దశలో మీరు నిర్మాణంలోకి అడుగు పెట్టడంపై సరైన నిర్ణయమే అనిపించిందా

చిత్ర పరిశ్రమలో చాలామంది 'ఇప్పుడు నిర్మాణంలోకి ఎందుకమ్మా..' అన్నారు (నవ్వుతూ). ప్రేక్షకుల్ని థియేటర్‌కి తీసుకురావడం ఇప్పుడు నిజంగా చాలా కష్టమైన పని. కానీ నేను కంటెంట్‌ని బలంగా నమ్ముతాను. స్టార్‌ల తరహాలోనే మంచి కంటెంట్ కూడా ప్రేక్షకుడిని థియేటర్‌కి తీసుకొస్తుందని నమ్ముతాను. ఆ నమ్మకమే నన్ను ముందుకు నడిపించింది. నేను ఓ నటిగా తీసుకునే నిర్ణయాల్లోనూ, వ్యాపారం పరంగా తీసుకునే నిర్ణయాల్లోనూ నా హృదయాన్నే అనుసరిస్తాను. అది ఏం చెబితే అదే చేస్తాను. నిర్మాతగా నాకు భవిష్యత్తు ఉంటుందో లేదో నా తొలి సినిమా తర్వాత తెలుస్తుంది (నవ్వుతూ). మంచి కథలు చెప్పాలన్నదే నా ప్రయత్నం.

? నటిగా మీరు తీసుకున్న ఈ విరామంలో మీకు కొత్తగా అర్థమైన విషయాలు ఏమైనా ఉన్నాయా? మీరు చేయనున్న కొత్త సినిమాల సంగతులేమిటి?

మళ్లీ నా వ్యక్తిగతం గురించి జీవితంలో మాట్లాడను. అదొక్కటి మాత్రం బాగా అర్థమైంది (నవ్వుతూ). ఇక నా సినిమాల విషయానికొస్తే 'శుభం' విడుదలైన తర్వాత నా నిర్మాణ సంస్థలోనే రూపొందుతున్న 'మా ఇంటి బంగారం' సినిమాని సెట్స్‌పైకి తీసుకెళుతున్నా. అట్లీ దర్శకత్వంలో నేను నటిస్తున్నట్టు ప్రచారం సాగుతోంది కానీ, అందులో నిజం లేదు. అట్లీ నాకు మంచి స్నేహితుడు. మేం భవిష్యత్తులో ఏదైనా చేస్తాం కానీ, ప్రస్తుతానికైతే లేదు.

చివరి ఆటకు సమయం!



స్క్విడ్ గేమ్ సీజన్ 3

ఓటీటీ బొమ్మ

ప్రపంచవ్యాప్తంగా విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్న కొరియన్ సిరీస్ 'స్క్విడ్ గేమ్'. థ్రిల్లర్ కథా నేపథ్యంలో హ్వాంగ్ జాంగ్ హ్యూక్ రూపొందించిన ఈ సిరీస్‌లో లీ జంగ్ జే, లీ బయంగ్ హన్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇప్పటికే రెండు సీజన్లుగా విడుదలై విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్న ఈ ఫ్రాంఛైజీల్లో మూడో సీజన్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. తాజాగా 'స్క్విడ్ గేమ్ సీజన్ 3' జూన్ 27 రానుందని ప్రకటిస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను విడుదల చేసింది సిరీస్‌బృందం. "ఆట ముగిసింది.. చివరి ఆట ఆడేందుకు సమయం" అనే వ్యాఖ్యను జోడించింది. 'స్క్విడ్ గేమ్'లో అన్ని దశలు పూర్తి చేసి 45.6 బిలియన్ల కొరియన్ వన్‌లు గెలుచుకుంటాడు షియోంజి జి హన్. కానీ మనుషుల ప్రాణాలు తీసే ఈ ఆటకు ఎలాగైనా ముగింపు పలకాలనుకుంటాడు ఆయన. మరి ఈ ప్రయాణంలో షియాంగ్‌కు ఎదురైన సవాళ్లు ఏమిటి? ముసుగులో ఉండి ఈ ఆట ఆడిస్తున్న ఫ్రంట్‌మ్యాన్‌ను షియాంగ్ ఏం చేశాడు? అనే ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే 'స్క్విడ్ గేమ్ సీజన్ 3' చూడాల్సిందే. ఈ సిరీస్ ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానుంది.

తెరపై 'షష్టి పూర్తి' ఆ రోజే



అర్చన, ఆకాంక్ష, రాజేంద్ర ప్రసాద్, రూపేశ్

రాజేంద్ర ప్రసాద్, అర్చన ప్రధాన పాత్రధారులుగా పవన్ ప్రభ తెరకెక్కించిన చిత్రం 'షష్టి పూర్తి'. రూపేశ్ హీరోగా నటిస్తూ.. స్వయంగా నిర్మించారు. ఆకాంక్ష సింగ్ కథానాయిక. ఈ సినిమా ఈ నెల 30న విడుదల కానున్నట్లు చిత్ర బృందం మంగళవారం ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శక నిర్మాతలు పవన్ ప్రభ, రూపేశ్ మాట్లాడుతూ.. "తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు పట్టం కడుతూ.. మంచి కుటుంబ విలువలున్న కథతో రూపొందించిన చిత్రమిది. ఈ వేసవికి అందరూ కలిసి చూడగలిగే ఆహ్లాదభరితమైన సినిమాగా నిలుస్తుంది. ఇళయరాజా పాటల వల్ల ప్రేక్షకుల దృష్టి మా చిత్రంపై పడింది. ఇప్పటికే విడుదల చేసిన రెండు గీతాలకు మంచి ఆదరణ దక్కింది. మిగిలిన మూడు పాటల్ని, ట్రైలర్‌ను త్వరలో విడుదల చేస్తాం" అన్నారు. ఈ సినిమాకి కూర్పు: కార్తీక శ్రీనివాస్, ఛాయాగ్రహణం: రామ్.

సొగసు కాంత



భాగ్యశ్రీ బోర్సే

వరుస అవకాశాలతో తన జోరుని కొనసాగిస్తున్న కథానాయిక భాగ్యశ్రీ బోర్సే. ఆమె పలు చిత్రాల్లో నటిస్తూ బిజీ బిజీగా గడుపుతోంది. అందులో ఓ చిత్రం 'కాంత'. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న పీరియాడిక్ చిత్రమిది. ఆయనతోపాటు, రానా దగ్గుబాటి, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ కలిసి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల దశలో ఉంది. భాగ్యశ్రీ పుట్టినరోజుని పురస్కరించుకుని మంగళవారం 'కాంత'లోని ఆమె లుక్‌ని విడుదల చేశారు. సంప్రదాయం ఉట్టిపడే ఆహార్యం, ఆకట్టుకునే అందంతో ఆమె ఆ లుక్‌లో దర్శనమిచ్చింది.

"ఆద్యంతం వినోదంతో నిండిన సినిమా '#సింగిల్'. ఈ చిత్రం చూస్తున్నంత సేపు మన స్ఫూర్తిగా నవ్వుకుంటూనే ఉంటారు" అంది నటి కేతిక శర్మ. ఆమె.. శ్రీవిష్ణు జంటగా నటించిన ఈ చిత్రాన్ని కార్తీక్ రాజు తెరకెక్కించారు. ఇవానా మరో కథానాయిక. ఈ సినిమా ఈనెల 9న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే కేతిక మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది.

ఆ పాట వివాదం నుంచి నేర్చుకున్నది అదే!



కేతిక శర్మ

"గీతా ఆర్ట్స్ సంస్థలో చేయాలని ఎప్పట్నుంచో నా కోరిక. అది ఈ సినిమాతో నెరవేరినందుకు ఆనందంగా ఉంది. నేను ఈ కథ వింటున్నంత సేపు నవ్వుతూనే ఉన్నా. ఇది పూర్తిగా రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబైంది. దీంట్లో ప్రేమకథ కూడా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇందులో నేను పూర్వా అనే పాత్రలో కనిపిస్తాను. తను చాలా ప్రాక్టికల్‌గా ఉండే అమ్మాయి. ఈ కథలో ఎమోషన్ తన పాత్ర ద్వారానే వస్తుంది. ఈ పాత్ర అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది".

- "ఈ చిత్ర విషయంలో కామెడీ నాకు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే వినోదం పండించడం అంత తేలికేం కాదు. అందులోనూ కామెడీ టైమింగ్ విషయంలో శ్రీవిష్ణును మ్యాచ్ చేయడం మరింత కష్టం. నాకైతే ఈ సినిమాలో ఇంటర్వెల్ ఎపిసోడ్ చాలా సవాల్‌గా అనిపించింది. ప్రేక్షకులు పొట్టచెక్కలయ్యేలా నవ్వుకునేలా కార్తీక్ ఈ చిత్రాన్ని రూపొందించారు".

- "రాబిన్‌హుడ్'లోని నా ప్రత్యేక గీతం 'అదిదా సర్‌ప్రైజ్'కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడం సంతోషాన్నిచ్చింది. అయితే ఆ పాట విషయంలో తలెత్తిన వివాదం నుంచి ఓ విషయం నేర్చుకున్నా. భవిష్యత్తుల్లో అలాంటి పాటలు చేసేటప్పుడు స్టెప్పుల విషయంలో మరింత జాగ్రత్త వహించాలని నిర్ణయించుకున్నా. ప్రస్తుతం నేను హిందీలో ఓ సినిమా చేస్తున్నా. అలాగే తమిళ తెలుగు ద్విభాషా చిత్రం ఒకటి చేస్తున్నా. మరికొన్ని సినిమాలు లైనప్‌లో ఉన్నాయి. వాటి వివరాల్ని త్వరలో ప్రకటిస్తారు".



వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి

జీవితంలో అందమైన పాత్రలోకి..

కథానాయకుడు వరుణ్ తేజ్.. నటి లావణ్య త్రిపాఠి దంపతులు శుభవార్త వినిపించారు. తల్లిదండ్రులు కానున్నట్లు తెలియజేస్తూ ఓ ముచ్చటైన ఫొటోని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. "త్వరలో.. జీవితంలో అత్యంత అందమైన పాత్రలోకి" అంటూ ఆ ఫొటోకి వరుణ్, లావణ్య ఓ వ్యాఖ్యను జత చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఈ జంటకు సినీప్రముఖులతో పాటు అభిమానులు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. వరుణ్ - లావణ్య 'మిస్టర్', 'అంతరిక్షం' చిత్రాల్లో జంటగా నటించగా.. 2023 నవంబరు 1న ప్రేమ వివాహంతో ఒక్కటయ్యారు. వరుణ్ తేజ్ ప్రస్తుతం మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఓ కామెడీ హారర్ థ్రిల్లర్ చిత్రం చేస్తున్నారు. లావణ్య త్రిపాఠి 'సతీ లీలావతి' అనే నాయికా ప్రాధాన్య సినిమాలో నటిస్తోంది



ప్రియాంక చోప్రా



కియారా అడ్వాణీ



షారుక్ ఖాన్



దిల్జీత్ దొసాంజ్, ప్రబల్ గురుంగ్



రిహానా

మెట్ గాలా మెరుపులు... వావ్ అనేలా వయ్యారాలు

అందమైన తారలు మరింత ప్రత్యేకంగా, ట్రెండీగా ముస్తాబై మెరిపిస్తే ఆ దృశ్యమే వేరుగా ఉంటుంది. అలాంటి సొగసుల సందడి కొన్ని ఫ్యాషన్ వేడుకల్లోనే కనిపిస్తుంటుంది. అలాంటి క్రేజీ వేడుకల్లో ఒకటి 'మెట్ గాలా'. ఈసారి ఈ కార్యక్రమం మరింత సందడిగా సాగింది. హాలీవుడ్ తారలతో పాటు మన భారతీయ నటులు కూడా విభిన్నమైన గెటప్పుల్లో కనిపించి అందరి దృష్టినీ ఆకర్షించారు. వివిధ రకాల ఫ్యాషన్ దుస్తుల్లో, అబ్బురపరిచే అందాలతో నాయికలు వయ్యారాలు ఒలికించి వావ్ అనిపించారు. న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్స్‌లో 'సూపర్ ఫైన్ టైలరింగ్ బ్లాక్ స్టైల్' అనే థీమ్‌తో ఈ ఏడాది మెట్ గాలాని ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ వేడుకలో బాలీవుడ్ నటీనటులు షారుక్ ఖాన్, ప్రియాంక చోప్రా, కియారా అడ్వాణీ, దిల్జీత్ దొసాంజ్, రిహానా తదితర తారలు విభిన్నమైన ఫ్యాషన్ దుస్తుల్లో కనిపించి సినీ ప్రియులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కథానాయకుడు షారుక్ సబ్యసాచి డిజైన్ చేసిన దుస్తులు ధరించి 'కె' లెటర్ లాకెట్ చైన్‌తో స్టైలిష్ గెటప్‌లో కనిపించగా, గాయకుడు దిల్జీత్ దొసాంజ్ సిక్కు మహారాజ్ గెటప్‌లో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ వేడుకలో దిల్జీత్ ప్రముఖ అమెరికన్ ఫ్యాషన్ డిజైనర్ ప్రబల్ గురుంగ్‌తో కలిసి సందడి చేశారు. కథానాయిక ప్రియాంక చోప్రా, నిక్ జోనస్‌లు బాల్మెయిన్ ఒలివియర్ రౌస్టింగ్ కస్టమ్ సీస్ కాస్ట్యూమ్‌ను వేసుకొని వింటేజ్ హాలీవుడ్ గ్లామర్ లుక్‌లో మెరిశారు. కథానాయిక కియారా అడ్వాణీ, పాప్ గాయని రిహానాలు బేబీ బంప్‌తో కనిపించి సినీ ప్రియులను ఆకట్టుకున్నారు.

ప్రజల్లో మార్పు తెచ్చే చిత్రమిది



అజయ్

అజయ్, ఇంద్రజ ప్రధాన పాత్రల్లో రమణారెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సీఎం పెళ్లాం'. బీఆర్‌కే నిర్మించారు. సుమన్, జయసుధ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 9న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నటుడు అజయ్ మాట్లాడుతూ.. "మహిళా సాధికారత మీద సాగే చిత్రమిది" అన్నారు. "దీంట్లో పలు రాజకీయ అంశాలపై లోతుగా చర్చించనున్నాం. వినోదం అందిస్తూనే మంచి సందేశం చెప్పనున్నాం" అన్నారు దర్శకుడు రమణారెడ్డి. నిర్మాత రామకృష్ణ మాట్లాడుతూ.. "ఇది చూశాక జనాల్లో మార్పు వస్తుందని ఆశిస్తున్నా" అన్నారు.

రెహమాన్‌కు తాత్కాలిక ఊరట

కాపీరైట్ యాక్ట్ ఉల్లంఘన వ్యాజ్యంలో ప్రముఖ సంగీత దిగ్గజం ఏ.ఆర్. రెహమాన్‌కు దిల్లీ హైకోర్టు తాత్కాలిక ఊరట కల్పించింది. 'పొన్నియిన్ సెల్వన్ 2' చిత్రంలోని 'వీరా రాజ వీరా' పాటపై కాపీరైట్ యాక్ట్ ఉల్లంఘన కింద వ్యాజ్యం దాఖలు కాగా రూ.2 కోట్లను దిల్లీ హైకోర్టు రిజిస్ట్రార్ కార్యాలయంలో చెల్లించాలంటూ ఏప్రిల్ 26న రెహమాన్, మద్రాస్ టాకీస్ నిర్మాణ సంస్థను సింగిల్ జడ్జి ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని సవాల్ చేస్తూ రెహమాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను దిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హరిశంకర్, జస్టిస్ అజయ్ దిగ్పాల్ సమక్షంలోని ధర్మాసనం మంగళవారం విచారణకు స్వీకరించి సింగిల్ జడ్జి తీర్పుకు మధ్యంతర స్టే విధించింది. తదుపరి విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది.

– న్యూస్‌టుడే, చెన్నై

జీపే ఫీచర్లు తెలుసా?

బాగా ఆదరణ పొందిన డిజిటల్ పేమెంట్ యాప్స్‌లో జీపే ఒకటి. డబ్బులు పంపటం, అందుకోవటం, బిల్లుల చెల్లింపు, మొబైల్ రీఛార్జ్ వంటి వాటికి చాలామంది వాడుతున్నారు. దీని బేసిక్ ఫీచర్ల గురించి తెలుసు గానీ అంతగా తెలియని కొన్ని ఫీచర్లూ ఉన్నాయి.

స్ప్లిట్ బిల్స్ కోసం

స్నేహితులు, కుటుంబసభ్యులతో బిల్లులను షేర్ చేసుకోవటానికి గూగుల్ పేలో బిల్టిన్ ఫీచర్ ఉంది. ఈ యాప్‌లో గ్రూప్‌ను క్రియేట్ చేసి, ఇతరులను యాడ్ చేయొచ్చు. స్ప్లిట్ చేసిన బిల్లును ఎవరు బిల్లు చెల్లించారో, ఎవరు చేయలేదో కూడా ఇది పసిగడుతుంది. ఎక్కడికైనా బృందంగా వెళ్లినప్పుడు ఖర్చులను పర్యవేక్షించటానికిది బాగా తోడ్పడుతుంది.

- న్యూ పేమెంట్ మీద తాకి, న్యూ గ్రూప్‌ను క్రియేట్ చేయొచ్చు. ఇందులో చేర్చాల్సిన వారి కాంటాక్ట్ జాబితాను యాడ్ చేయొచ్చు. ఎవరెవరు ఎంత చెల్లించాలో ఆ మొత్తాన్ని ఎంటర్ చేస్తే చాలు.

రివార్డు స్క్రాచ్ కార్డులు

జీపేతో చేసిన అన్ని చెల్లింపులకూ రివార్డులు లభించవు. కానీ కొన్ని లావాదేవీలు ప్రత్యేకమైన స్క్రాచ్ కార్డుల సౌకర్యాన్ని కల్పిస్తాయి. ముఖ్యంగా ఫోన్ రీఛార్జ్ లేదా కరెంట్ బిల్లు వంటి యుటిలిటీ చెల్లింపులను చేసినప్పుడు ఇలాంటి అదనపు లాభాలు అందుతుంటాయి. ఇవి కార్డును స్క్రాచ్ చేస్తే క్యాష్‌బ్యాక్ లేదా భాగస్వామ్య బ్రాండ్స్ నుంచి ప్రొడక్ట్ డిస్కౌంట్ కూపన్లు ఇస్తుంటాయి.

- యాప్‌లో రివార్డ్స్ విభాగంలోకి వెళ్లి వీటిని చూడొచ్చు.

సబ్‌స్క్రిప్షన్లకు ఆటో పే

ఇష్టమైన చందాల చెల్లింపు తేదీలను మరచిపోతున్నారా? గూగుల్ పేతో సబ్‌స్క్రయిబ్ చేసి చూడండి. రెన్యువల్ తేదీలను మరచిపోయినా ఆటో పే చేస్తుంది. జియోసినిమా, నెట్‌ఫ్లిక్స్, స్పోటిఫై, యూట్యూబ్ ప్రీమియం, గూగుల్ వన్ క్లౌడ్ వంటి యాప్స్ అన్నింటినీ ఇది సపోర్టు చేస్తుంది.

- పైన కుడిమూలన గల ప్రొఫైల్ పిక్చర్ మీద తాకి, ఆయా సబ్‌స్క్రిప్షన్లకు ఆటో పే ఆప్షన్‌ను ఎంచుకుంటే సరి. వద్దనుకుంటే ఇలాగే ఈ ఆటో పే ఫీచర్‌ను డిసేబుల్ చేసుకోవచ్చు.

మాట్లాడే చెట్టు!



చెట్లు సైతం ప్రేరణలకు స్పందించగలవని, వాటికి పరిసరాల అవగాహన కూడా ఉంటుందని అప్పుడెప్పుడో సర్ జగదీశ్ చంద్రబోస్ నిరూపిస్తే ప్రపంచమంతా నివ్వెరపోయింది. మరి చెట్లు మన భాషలో, మనతో మాట్లాడితే? తమ భావాలను వెలిబుచ్చితే? ఇంకెంత విస్మయం కలుగుతుందో! ఇదేమీ ఇంద్రజాలమో, సైన్స్ ఫిక్షన్ కథో కాదు. కృత్రిమ మేధ (ఏఐ) విచిత్రం. యాక్సెంచర్ సాంగ్ సంస్థకు చెందిన డ్రోగా5 డబ్లిన్ పరిశోధకులు అదే చేసి చూపించారు. ద టాకింగ్ ట్రీ ప్రాజెక్టులో భాగంగా నిజంగానే చెట్లు 'మాట్లాడేలా' చేసి ఔరా అనిపించారు.

అది ఐర్లాండ్ దేశంలోని ట్రినిటీ కాలేజ్ డబ్లిన్. పచ్చటి వాతావరణంతో నిండిన అక్కడ ఓ 200 సంవత్సరాల లండన్ ప్లేన్ చెట్టు.. దానికి జత చేసిన పరికరంలోని ఏఐ, పర్యావరణ సెన్సర్ల సాయంతో మనుషులతో మాట్లాడుతూ ఆశ్చర్యపరుస్తోంది. ఇంతకీ ఈ పరిజ్ఞానం ఎలా పనిచేస్తుంది? చెట్టు జీవవిద్యుత్ సంకేతాలను మనుషుల మాటల్లోకి మార్చటం ద్వారా. జీవ విద్యుత్ సంకేతాలతో పాటు ప్రత్యక్ష పర్యావరణ సమాచారం, గాలి వేగం, మట్టి తేమ, ఆమ్ల స్థాయిలు, గాలి నాణ్యత, చుట్టుపక్కల ఉష్ణోగ్రత, కాంతి తీరుతెన్నుల వంటి వాటి సమాచారాన్నీ సెన్సర్లు నిరంతరం పసిగడతాయి. వీటిని పరికరంలోని ఏఐ గ్రహించి, లార్జ్ లాంగ్వేజ్ మోడల్ సాయంతో మాటల్లోకి మారుస్తుంది. దీని మూలంగానే సందర్శకులతో అర్థవంతంగా మాట్లాడటం సాధ్యమవుతోంది. మనం అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇవ్వటమే కాదు.. చెట్టు తన బాధలను, భావాలను వెలిబుచ్చటానికీ ఉపయోగపడుతోంది. అందుకే దాన్ని టాకింగ్ ట్రీ అని అభివర్ణిస్తున్నారు. ఇది మనిషికీ ప్రకృతికీ మధ్య ప్రత్యక్ష సంభాషణలకు వీలు కల్పించటంతో పాటు ప్రకృతితో మన సంబంధాన్ని పునరాలోచించుకునేలానూ చేస్తోంది.

అన్ని ప్రక్రియలూ పరికరంలోనే

టాకింగ్ ట్రీ ప్రాజెక్టు ప్రత్యేకతల్లో ఒకటి సేకరించిన సమాచారం ప్రాసెస్ విధానం. ఎక్కువ ఇంధనం అవసరమయ్యే క్లౌడ్ కంప్యూటింగ్‌కు బదులు చెట్టుకు అమర్చిన చిన్న పరికరంలోనే అన్ని గణనలూ జరుగుతాయి. ఇది చెట్టు పంపించే జీవవిద్యుత్ సంకేతాలను అనువాదం చేసి, అప్పటికప్పుడు మాటలుగా మారుస్తుంది. దీని కన్వర్జేషన్ ఇంటర్ఫేస్‌తో సందర్శకులు చెట్టును ప్రశ్నలు అడగొచ్చు. అప్పటి పరిస్థితిని బట్టి అది జవాబులు ఇస్తుంది. చెట్టుకు అమర్చిన ఏఐ పరికరంతో వ్యర్థాలు పెద్దగా ఉత్పత్తి కావు కూడా. అందువల్ల దీన్ని హరిత టెక్నాలజీకీ మంచి ఉదాహరణగా భావిస్తున్నారు. కృత్రిమ మేధతో సుస్థిరతకు ముప్పు వాటిల్లుతుందని చాలామంది భావిస్తుంటారు. కానీ దీంతో ముప్పేమీ లేదని, పైగా ఇది సుస్థిరతను కాపాడుతుందనీ ఈ ప్రాజెక్టు నిరూపిస్తోంది.

పుదీనా మొక్క మీద ప్రయోగంతో..

ట్రినిటీ కాలేజ్‌లో కన్నా ముందు ఈ పరిజ్ఞానాన్ని మోడర్న్ హాల్ పార్క్‌లో ఓ 150 ఏళ్ల చెస్ట్‌నట్ చెట్టుకూ అమర్చి పరీక్షించారు. దీనికి బీజం వేసింది పుదీనా మొక్క మీద చేసిన చిన్న ప్రయోగమే కావటం గమనార్హం. మొదట్లో పుదీనా మొక్కకు తీగలు జోడించి దాన్నుంచి అందిన జీవవిద్యుత్ సంకేతాలను పరికరంలోని మోడల్‌కు అందజేశారు. ఆశ్చర్యకరంగా అది మాట్లాడటం మొదలెట్టింది. ఆ చిన్న ప్రయోగం ప్రకృతి గురించి విభిన్నంగా ఆలోచించేలా చేసింది. దీన్నే మరింత విస్తరించి పెద్ద చెట్లకు వర్తింపజేశారు.

సందర్శకుల భావోద్వేగం

ట్రినిటీ కాలేజ్ డబ్లిన్‌లో టాకింగ్ ట్రీ ఇప్పుడొక యాత్రా స్థలంగా మారింది. దీంతో మాట్లాడిన సందర్శకులు కొత్త అనుభవాలను పొందుతున్నారు. ఇది అర్థవంతమైంది, భావోద్వేగపూరితమైందని చెబుతున్నారు. ప్రకృతితో అసాధారణ రీతిలో చర్చించటానికిది తోడ్పడుతోందని వివరిస్తున్నారు. ఈ ప్రయోగాత్మక కార్యక్రమం ముగిసిన తర్వాతా ఈ చెట్టును చూడటానికి వస్తానని ఒక ప్రపంచ పర్యాటకురాలు అంటున్నారు. దాని మాటలు తన చెవుల్లో ఇంకా మారుమోగుతున్నాయని ఆశ్చర్యపోయారు. ప్రకృతితో భావోద్వేగ సంబంధానికి వీలు కల్పించటం ఈ ప్రాజెక్టు సాధించిన గొప్ప విజయాల్లో ఒకటి. ఇది ప్రకృతిని మనిషిలా మార్చేసింది. దానికి మనుషుల గుణాలు కల్పించటమే కాకుండా, దాని నిజమైన, శారీరక అనుభవాలను వినగలిగేలా చేయటం నిజంగా గొప్ప విషయమే. ప్రకృతితో మన సంబంధం అత్యంత కీలకంగా మారిన ప్రస్తుత తరుణంలో ఇది సానుభూతిని, చేతనత్వాన్ని సృష్టించిందనటంలో ఎలాంటి సందేహం లేదు.

చెట్టుకో వ్యక్తిత్వం

పరికరంలోని ఏఐ డేటాను ప్రసారం చేయటమే కాదు, మొత్తంగా చెట్టుకు ఓ వ్యక్తిత్వాన్నీ కట్టబెడుతుంది. మనుషుల భాషను మాట్లాడేలా చెట్టుకు నేర్పించటం దీని ఉద్దేశమని డ్రోగా5 టెక్నాలజీ, ఇన్నోవేషన్ విభాగాధిపతి గ్రేలీ చెబుతున్నారు. అడిగిన ప్రశ్నలకు చెట్టు ఇస్తున్న జవాబులకు ఓ ఉదాహరణ ఇదీ..

సందర్శకులు: ఈరోజు నువ్వెలా ఉన్నావు?

చెట్టు: లేత ఎండలో సంతోషంగా ఉన్నాను.

సందర్శకులు: వేసవి వడగాలులు ఎలా ఇబ్బంది పెడుతున్నాయి?

చెట్టు: పొడి వాతావరణంలో దాహంతో పరితపిస్తున్నాను.

- ఇలా శాస్త్రీయ సమాచారాన్ని అనుభవాల రూపంలో వెలిబుచ్చటమంటే ఆశ్చర్యకరమే కదా. ఇందులో మధ్యవర్తులెవరూ ఉండరు. చెట్టు ఎదుర్కొంటున్న పరిస్థితులు, చుట్టుపక్కల నుంచి అందే సమాచారం మీదే దాని భావాలు ఆధారపడి ఉంటాయి. కాబట్టే సందర్శకులు ప్రకృతితో మమేకం కావటం సాధ్యమవుతుంది. వాతావరణ సమాచారం అంకెలుగా కాకుండా అనుభూతులుగా మారతాయి మరి.

శాస్త్రీయ, పర్యావరణ పనులూ

మాట్లాడే చెట్టు కేవలం భావోద్వేగ పూరిత మాటలకే పరిమితం కావటం లేదు. గణనీయమైన శాస్త్రీయ, పర్యావరణ పనులకూ ఉపయోగపడుతుంది. ప్రకృతి ఆరోగ్యాన్ని కొత్త కోణంలో, సమగ్రంగా పర్యవేక్షించటంలో సాయం చేస్తుంది. ఇది కార్చిచ్చుల వంటి ప్రకృతి విపత్తులను అంచనా వేయటానికి తోడ్పడగలదని గ్రేలీ చెబుతున్నారు. పర్యావరణ వ్యవస్థల్లో ఒత్తిడికి సంబంధించిన లక్షణాలు బయటపడటానికి చాలా ఏళ్ల ముందే దాన్ని గుర్తించటానికీ దోహదం చేయగలదని వివరిస్తున్నారు. చెట్టు మాటల రూపంలో శాస్త్రవేత్తలు విపత్తులకు సంబంధించి తొలి హెచ్చరిక వ్యవస్థలను రూపొందించే అవకాశముందని, పర్యావరణ వ్యవస్థలతో పాటు మానవ ఆవాసాలను కాపాడటానికి వీటిని వాడుకోవచ్చని అంటున్నారు. అంటే ప్రకృతిని మాట్లాడేలా చేయటం ద్వారా పర్యావరణ పరిస్థితులనూ పర్యవేక్షించొచ్చు.

రియల్‌మీ కొత్త బడ్జెట్ ఫోన్



బడ్జెట్ ధరలో మంచి ఫీచర్ల కోసం చూస్తున్నవారిని దృష్టిలో పెట్టుకొని రియల్‌మీ సంస్థ కొత్త స్మార్ట్‌ఫోన్‌ను పరిచయం చేసింది. పేరు రియల్‌మీ సీ75 5జీ. హెచ్‌డీ ప్లస్ రెజల్యూషన్‌తో కూడిన 6.67 అంగుళాల ఐపీఎస్ ఎల్‌సీడీ డిస్‌ప్లే, 625 నిట్స్ గరిష్ఠ ప్రకాశం, మీడియాటెక్ డైమెన్సిటీ 6300 చిప్‌సెట్, 6జీబీ వరకూ ర్యామ్, 128 జీబీ వరకూ అంతర్గత స్టోరేజీ, ఎల్‌ఈడీ ఫ్లాష్ లైట్‌తో కూడిన 32ఎంపీ మెయిన్ కెమెరా, సెల్ఫీలు.. వీడియో కాల్స్ కోసం 8ఎంపీ కెమెరా వంటి ఫీచర్లతో అలరిస్తోంది. మైక్రోఎస్‌డీ స్లాట్‌తో అదనంగా 1టీబీ వరకూ స్టోరేజీ పెంచుకోవచ్చు. భారీ 6,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 45డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్టు కలిగుంది. ఆండ్రాయిడ్ 15 ఆధారిత రియల్‌మీ యూఐ 6.0తో పనిచేసే ఇది దుమ్మును తట్టుకోవటంలో ఐపీ64 రేటింగ్‌తో వస్తోంది. అదనపు భద్రత కోసం పక్కలకు ఫింగర్‌ప్రింట్ స్కానర్ కూడా ఉంటుంది. 6జీబీ, 128 జీబీ రకం ధర రూ.12,999.

రేజర్ 60 అల్ట్రా మనదేశానికీ



తమ తాజా ఫోల్డబుల్ ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ మోటరోలా రేజర్ 60 అల్ట్రాను మనదేశంలో పరిచయం చేయనున్నట్టు కంపెనీ అధికారికంగా ధ్రువీకరించింది. గత నెలలో ఇతర దేశాల్లో ఆవిష్కృతమైన ఈ ఫ్లిప్ ఫోన్ మే చివరి వరకు మనదగ్గరా అందుబాటులోకి రావొచ్చని అనుకుంటున్నారు. స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ఎస్ఓసీ, రెండు 50ఎంపీ కెమెరాల వ్యవస్థ, పలు ఏఐ ఫీచర్లతో కూడిన రేజర్ అల్ట్రా ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన ఏఐ ఫ్లిప్ ఫోన్‌గా పేరొందింది. 165హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగంతో కూడిన 7 అంగుళాల 1.5కే పీఓఎల్‌ఈడీ ఎల్‌టీపీఓ ఇన్నర్ డిస్‌ప్లే, 4 అంగుళాల పీఓఎల్‌ఈడీ ఎల్‌టీపీఓ కవర్ స్క్రీన్, 50ఎంపీ ప్రైమరీ కెమెరా, 50ఎంపీ అల్ట్రావైడ్ సెన్సర్, 50 ఎంపీ సెల్ఫీ కెమెరా, 16జీబీ ర్యామ్, 512జీబీ స్టోరేజ్, 4,700ఎంఏహెచ్ బ్యాటరీ, 68డబ్ల్యూ వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్, 30డబ్ల్యూ వైర్‌లెస్ ఛార్జింగ్ వంటి ఫీచర్లు కలిగుంటుందని అనుకుంటున్నారు. దీని ధర రూ.లక్ష లోపు ఉండొచ్చని అంచనా.

గెలాక్సీ ఏ26 చవక రకం



సామ్‌సంగ్ గెలాక్సీ ఏ26 ఫోన్ కాస్త చవక ధరలో లభిస్తే బాగుండేదని అనుకుంటున్నారా? అయితే కొత్తగా తీసుకొచ్చిన 6జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీ రకం ఫోన్‌ను ప్రయత్నించి చూడండి. సామ్‌సంగ్ ఇటీవలే దీన్ని తీసుకొచ్చింది. రెండు నెలల క్రితం గెలాక్సీ ఏ26 ఫోన్ 8జీబీ+128జీబీ.. 8జీబీ+256జీబీ రకాల్లో పరిచయమైంది. ఇప్పుడు వీటి కన్నా రూ.1,500 తక్కువకు లభించేలా కొత్త రకాన్ని సామ్‌సంగ్ తీసుకొచ్చింది. 6.7 అంగుళాల సూపర్ ఎమోలెడ్ డిస్‌ప్లే, ఎఫ్‌హెచ్‌డీ+ రెజల్యూషన్, 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, ఎక్సినోస్ 1380 చిప్‌సెట్, ఐపీ67 రేటింగ్ వంటి ఫీచర్లతో ఆకర్షిస్తోంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్+ ప్రొటెక్షన్ కలిగుంది. ఆండ్రాయిడ్ 15 ఆధారిత వన్ యూఐ7తో పనిచేస్తుంది. ఆరేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్లు, సెక్యూరిటీ ప్యాచ్‌లు అందుతాయి.

మీట్ భలే భలే!

ఆత్మీయులతో వీడియో కాల్స్, సహోద్యోగులతో ఆన్‌లైన్ సమావేశాలు.. ఏవైనా గూగుల్ మీట్‌తో సులభంగా చేసుకోవచ్చు. వీటిని మరింత సౌకర్యవంతంగా మార్చుకోవటానికి ఇందులో చాలా ఫీచర్లే ఉన్నాయి. త్వరగా పనులు చేసుకోవటానికి తోడ్పడేవి కొన్నయితే లేఅవుట్, బ్యాక్‌గ్రౌండ్‌ను ఆకర్షణీయంగా మార్చుకోవటానికి ఉపయోగపడేవి మరికొన్ని. అలాంటి వినూత్న ఫీచర్లు ఇవిగో..

దగ్గరి దారులు

వేగంగా పనులు చేసుకోవటానికి, ఉత్పాదకత పెంచుకోవటానికి గూగుల్ మీట్‌లో కొన్ని కీబోర్డు షార్ట్‌కట్‌లూ ఉన్నాయి.

- కంట్రోల్+డి: మైక్‌ను మ్యూట్ లేదా అన్‌మ్యూట్.
- కంట్రోల్+ఇ: కెమెరా ఆన్ లేదా ఆఫ్.
- కంట్రోల్+ఆల్ట్+సి: చాట్ ప్యానెల్ క్లోజ్ లేదా ఓపెన్.
- కంట్రోల్+ఆల్ట్+పి: పీపుల్ ప్యానెల్ క్లోజ్/ఓపెన్.
- కంట్రోల్+ఆల్ట్+హెచ్: చేయి లేపటం లేదా దించటం.

- గూగుల్ మీట్ సమావేశంలో పాల్గొంటున్నప్పుడు అందుబాటులో ఉన్న అన్ని కీబోర్డు షార్ట్‌కట్స్‌ను చూడాలనుకుంటే షిఫ్ట్, ప్రశ్నార్థక మీటలు కలిపి (షిఫ్ట్+?) నొక్కితే సరి.

లేఅవుట్ మార్చుకోవటానికి

అందరికీ ఒకటే లేఅవుట్ సరిపోకపోవచ్చు. సమావేశంలో పాల్గొనేవారి సంఖ్యను బట్టి వేర్వేరు లేఅవుట్లకు మారాల్సిన అవసరముండొచ్చు. అప్పుడే అతిథులను వేర్వేరుగా చూడటం సాధ్యమవుతుంది. ఇందుకోసం గూగుల్ మీట్ పలురకాల లేఅవుట్ల అవకాశాన్ని కల్పిస్తోంది. వీటిని చూడాలంటే గూగుల్ మీట్ కింది బార్‌లో మూడు చుక్కల మీద క్లిక్ చేయాలి. మెనూలో 'ఛేంజ్ లేఅవుట్' ఎంచుకోవాలి. అప్పుడు చాలా ఆప్షన్లు కనిపిస్తాయి.

- **ఆటో (డైనమిక్):** ఇది డిఫాల్ట్ ఆప్షన్. గూగుల్ మీట్ దానంతటదే లేఅవుట్‌ను నిర్ణయించుకుంటుంది.
- **టైల్డ్ (లెగసీ):** బృంద సమావేశాలకు ఇది చక్కని ఎంపిక.
- **స్పాట్‌లైట్:** ఇది ఒక స్పీకర్ మీదే ఫోకస్ అవుతుంది.
- **సైడ్‌బార్:** ఇది చిన్న థంబ్‌నెయిల్‌తో మాట్లాడుతున్న స్పీకర్‌ను చూపిస్తుంది.

స్పీకర్‌ను పిన్ చేసుకోవటం

ఒకవేళ సమావేశంలో ఒక్క అతిథి మీదే దృష్టి సారించాలనుకుంటే వారి వీడియో ఫీడ్‌ను పిన్ చేసుకోవచ్చు. అప్పుడు ఎవరు మాట్లాడుతున్నారనే దాంతో సంబంధం లేకుండా వారి వీడియో ఫీడే తెర మీద నిరంతరం కనిపిస్తుంది. ఇందుకోసం ఆ వ్యక్తి వీడియో ఫీడ్ మీదికి కర్సర్‌ను తెచ్చి, పిన్ గుర్తు మీద క్లిక్ చేయాలి. అన్‌పిన్ చేయాలనుకుంటే తిరిగి వారి వీడియో ఫీడ్ మీదికి కర్సర్‌ను తెచ్చి, అన్‌పిన్ చేసుకోవచ్చు.

పెద్ద తెర మీదికి

క్రోమ్‌కాస్ట్ ఎనేబుల్డ్ టీవీ వంటి స్మార్ట్‌టీవీ ఉన్నట్టయితే గూగుల్ మీట్ మీటింగ్‌ను దాని మీదా నిర్వహించుకోవచ్చు. దీంతో అతిథులు పెద్ద తెర మీద స్పష్టంగా కనిపిస్తారు. ఇందుకోసం గూగుల్ మీట్ కింది బార్‌లో మూడు చుక్కల మీద క్లిక్ చేయాలి. మెనూ జాబితాల్లోంచి 'క్యాస్ట్ దిస్ మీటింగ్'ను ఎంచుకోవాలి. తర్వాత ఏ పరికరం మీద సమావేశం ప్రసారం కావాలనుకుంటున్నారో దాన్ని సెలెక్ట్ చేసుకోవాలి.

క్యాప్షన్స్ టర్న్ ఆన్

స్పీకర్ మాట్లాడుతున్నది కొన్నిసార్లు సరిగా వినిపించకపోవచ్చు, ఉచ్చారణ అర్థం కాకపోవచ్చు. ఇక్కడే ప్రత్యక్ష క్యాప్షన్స్ బాగా ఉపయోగపడతాయి. గూగుల్ మీట్‌లో ఈ అవకాశమూ ఉంటుంది. సమావేశాల్లో ముఖ్యమైన విషయాలను సులభంగా గ్రహించటానికిది తోడ్పడుతుంది. ఈ ఆప్షన్‌ను ఎనేబుల్ చేసుకోవటానికి- గూగుల్ మీట్ కింది బార్ మీద క్లిక్ చేసి 'టర్న్ ఆన్ క్యాప్షన్స్' (సీసీ గుర్తు) ఎంచుకోవాలి. అదే గుర్తు మీద క్లిక్ చేసి ఆఫ్ చేసుకోవచ్చు.

బ్యాక్‌గ్రౌండ్ బ్లర్

అతిథులకు మన ఇంట్లో వెనకాల దృశ్యాలు కనిపించటం ఇబ్బంది కలిగించొచ్చని అనుకుంటే బ్యాక్‌గ్రౌండ్‌ను బ్లర్ చేసుకోవచ్చు. లేదూ బ్యాక్‌గ్రౌండ్‌ను వేరే దృశ్యంతో మార్చుకోవచ్చు. ఇందుకోసం గూగుల్ మీట్ కింది బార్‌లో మూడు చుక్కల మీద క్లిక్ చేసి మెనూబార్‌లోకి వెళ్లాలి. అందులో 'బ్యాక్‌గ్రౌండ్స్ అండ్ ఎఫెక్ట్స్'ను ఎంచుకోవాలి. మసకగా చేసుకోవటానికి బ్లర్ విభాగంలో పర్సనల్ బ్యాక్‌గ్రౌండ్ సెక్షన్‌లో మొదటి గుర్తు మీద క్లిక్ చేయాలి. మరింత మసకగా మార్చుకోవాలనుకుంటే రెండో గుర్తును క్లిక్ చేయాలి. ఒకవేళ ఇష్టమైన ఇమేజ్‌ను బ్యాక్‌గ్రౌండ్‌గా పెట్టుకోవాలనుకుంటే మూడో గుర్తును క్లిక్ చేసి కంప్యూటర్‌లోంచి ఇమేజ్‌ను అప్‌లోడ్ చేయాలి. మీట్‌లో అందుబాటులో ఉన్న ఇమేజ్‌లనైనా వాడుకోవచ్చు. ఆ వెంటనే బ్యాక్‌గ్రౌండ్ మారిపోతుంది.

మీటింగ్ రికార్డు

ఒకవేళ ఆ తర్వాత సమావేశాన్ని సమీక్షించుకోవాలనుకుంటే దాన్ని రికార్డు చేసుకునే వెసులుబాటూ ఉంది. అయితే గూగుల్ వర్క్‌స్పేస్ ఖాతా ఉంటేనే ఇది సాధ్యమని గుర్తించాలి. ఉచిత గూగుల్ ఖాతాతో దీన్ని చేసుకోలేం. మీటింగ్‌ను రికార్డు చేసుకోవటానికి మూడు చుక్కల మెనూ మీద క్లిక్ చేసి 'రికార్డ్ మీటింగ్'ను ఎంచుకోవాలి. అది గూగుల్ డ్రైవ్‌లో సేవ్ అవుతుంది. ఎప్పుడైనా దాన్ని తిరిగి చూసుకోవచ్చు.

నాయిస్ క్యాన్సెలేషన్

మీటింగులో అనవసర శబ్దాలను తొలగించటానికి గూగుల్ మీట్‌లో ఏఐ ఆధారిత నాయిస్ క్యాన్సెలేషన్ ఫీచర్ కూడా ఉంది. ఇది టైపింగ్, ఫ్యాన్లు, వీధి శబ్దాల వంటి చప్పుళ్ల ప్రభావాన్ని తగ్గిస్తుంది. ఇదీ గూగుల్ వర్క్‌స్పేస్ ఖాతా ఉంటేనే యాక్సెస్ అవుతుంది. మూడు చుక్కల మెనూ మీద తాకి, సెటింగ్స్‌ను ఎంచుకోవాలి. తర్వాత ఎడమవైపు బార్‌లో 'ఆడియో' మీద క్లిక్ చేయాలి. కుడివైపున కనిపించే 'నాయిస్ క్యాన్సెలేషన్'ను ఆన్ చేసుకోవాలి.

లావా యువ స్టార్ 2



లావా కంపెనీ తమ బడ్జెట్ యువ సిరీస్‌లో తాజాగా 4జీ స్మార్ట్‌ఫోన్‌ను తీసుకొచ్చింది. దీని పేరు యువ స్టార్ 2. ఆండ్రాయిడ్ 14 గో ఎడిషన్‌తో పనిచేసే ఇది ఆక్టాకోర్ యునిసాక్ ప్రాసెసర్, 13ఎంపీ ఏఐ, 6.75 అంగుళాల హెచ్‌డీ+ ఎల్‌సీడీ తెర, 13ఎంపీ ప్రైమరీ కెమెరా, 5ఎంపీ ఫ్రంట్ కెమెరా, 5,000ఎంఏహెచ్ బ్యాటరీ కలిగుంది. ప్రి-ఇన్‌స్టాల్డ్ యాప్స్ ఏవీ ఉండకపోవటం వల్ల యూజర్ ఇంటర్ఫేస్ శుభ్రంగా కనిపిస్తుంది. సురక్షితం కూడా. 4జీబీ ర్యామ్, 64జీబీ ఇంటర్నల్ స్టోరేజీతో కూడిన ఇది రేడియెంట్ బ్లాక్, స్పార్క్లింగ్ ఐవరీ రంగుల్లో లభిస్తుంది. పక్కలకు ఫింగర్‌ప్రింట్ సెన్సర్, ఫేస్ అన్‌లాక్ కూడా ఉన్నాయి. ఇప్పటికే ఆఫ్‌లైన్ దుకాణాల్లో దొరుకుతోంది.

హెడ్‌ఫోన్స్‌తో జర భద్రం!



స్మార్ట్‌ఫోన్ల పుణ్యమాని హెడ్‌ఫోన్లు, ఇయర్‌బడ్స్ రోజువారీ జీవితంలో ఒక భాగంగా మారాయి. కాల్స్ మాట్లాడటం, సంగీతం వినటం, వెబ్ సిరీస్‌లు చూడటం, గేమ్స్ ఆడటం, విశ్రాంతి పొందటం వంటి వాటికివి ఎంతగానో తోడ్పడుతున్నాయి. వ్యాయామాలు చేసేటప్పుడు ఏకాగ్రత కోసం, వర్చువల్ మీటింగుల్లోనూ వాడుతున్నవారు ఎందరో. అయితే వీటి వాడకంలో జాగ్రత్త అవసరం. వాల్యూమ్ శ్రుతి మించినా, గంటల కొద్దీ వాడుతున్నా వినికిడి దెబ్బతినొచ్చు. కాబట్టి జాగ్రత్త అవసరం.

స్మార్ట్‌ఫోన్లు, గేమింగ్ కన్సోళ్లతో హెడ్‌ఫోన్లు, ఇయర్‌బడ్స్ వాడేటప్పుడు వాల్యూమ్ కొన్నిసార్లు 100 డెసిబెల్స్ దాటిపోవచ్చు. ఈ స్థాయి శబ్దానికి కేవలం 15 నిమిషాల సేపు గురైనా వినికిడి శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదముంది. దీన్ని గుర్తించే సరికే జరగాల్సిన నష్టం జరగొచ్చు. అలాగని హెడ్‌ఫోన్స్‌ను పూర్తిగా పక్కన పెట్టేయాల్సిన అవసరమేమీ లేదు. కొన్ని తెలివైన సవరణలతో వినికిడికి ముప్పు వాటిల్లకుండానే ఇష్టమైన సంగీతాన్ని ఆస్వాదించొచ్చు.

మధ్య మధ్యలో విరామం

అదేపనిగా గంటల కొద్దీ హెడ్‌ఫోన్ వాడితే తాత్కాలికంగా శబ్దాలను గ్రహించే సామర్థ్యం తగ్గుతుంది (హియరింగ్ ఫెటీగ్). మానసికంగా, శారీరకంగా, భావోద్వేగ పరంగా తీవ్రమైన అలసట తలెత్తుతుంది. కాబట్టి ప్రతి గంటకూ 10-15 నిమిషాల విరామం ఇవ్వటం మేలు. రోజుకు 8 గంటల కన్నా ఎక్కువ సేపు హెడ్‌ఫోన్ వాడకుండా చూసుకుంటే ఇంకా ఉత్తమం. చెవిలో ఒదిగిపోయే ఇయర్‌బడ్స్ వంటి వాటి విషయంలో ఇది మరింత ముఖ్యం. ఎందుకంటే ఇవి కర్ణభేరికి చాలా దగ్గరలో ఉంటాయి. విమానాలు, మార్కెట్ల వంటి రణగొణధ్వనులతో కూడిన వాతావరణాల్లో నాయిస్ క్యాన్సెలింగ్ హెడ్‌ఫోన్స్ వాడుకోవాలి. ఇవి చుట్టుపక్కల శబ్దాలను రద్దు చేయటం ద్వారా తక్కువ వాల్యూమ్‌లోనూ స్పష్టంగా వినపడేలా చేస్తాయి.

పిల్లల కోసం పరిమితులు

పిల్లల చెవులు చాలా సున్నితం. వీరికి మితిమీరిన శబ్దాలతో వినికిడి తగ్గే ముప్పు ఎక్కువ. కాబట్టి తల్లిదండ్రులు పేరెంట్ కంట్రోల్స్ సాయంతో వాల్యూమ్ పరిమితులను సెట్ చేయాలి. పెద్ద శబ్దాలతో వినికిడి ఎలా దెబ్బతింటుందో పిల్లలకు అర్థమయ్యేలా వివరించాలి. బిల్టిన్‌గా వాల్యూమ్ పరిమితులతో వచ్చే కిడ్ ఫ్రెండ్లీ హెడ్‌ఫోన్స్ ఎంచుకుంటే ఇంకా మంచిది.

వాల్యూమ్ తక్కువగా

పరికరం వాల్యూమ్‌ను దాని గరిష్ఠ స్థాయిలో 50-60 శాతం దాటకుండా చూసుకోవాలి. ఇప్పుడు చాలా స్మార్ట్‌ఫోన్లలో బిల్టిన్‌గా సేఫ్టీ ఫీచర్లు ఉంటున్నాయి. ఇవి వాల్యూమ్ మరీ ఎక్కువైతే వెంటనే హెచ్చరిస్తాయి. అప్పుడు వెంటనే తగ్గించుకోవాలి. కొన్ని పరికరాలు మాన్యువల్‌గా వాల్యూమ్‌ను సెట్ చేసుకోవటానికి అవకాశం కల్పిస్తున్నాయి. ఒకవేళ ఫోన్‌లో ఈ ఫీచర్ లేనట్టయితే వాల్యూమ్ మానిటరింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మీరు హెడ్‌ఫోన్స్‌తో వింటున్నది మీకు సమీపంలో ఉన్నవారికి కూడా వినిపిస్తున్నట్టయితే వాల్యూమ్ మరీ ఎక్కువగా ఉందనే అర్థం.

చెవులను కప్పే పరికరాలు

ఇయర్‌బడ్స్ చెవుల లోపల కుదురుగా ఉంటాయి. అందువల్ల వీటితో వినికిడి దెబ్బతినే ప్రమాదం ఎక్కువ. .. ముఖ్యంగా గంటలకొద్దీ వింటుంటే ముప్పు ఎక్కువ. కాబట్టి చెవుల చుట్టూ కప్పుకొని ఉండే హెడ్‌ఫోన్స్ వాడుకోవటం మంచిది. ఇవి చెవి వెలుపల ఉండటం వల్ల ఎక్కువసేపు విన్నా అంత ప్రమాదకరం కావు. తక్కువ వాల్యూమ్‌లోనూ స్పష్టంగా సంగీతం, మాటలను వినిపిస్తాయి.

వాల్యూమ్ పరిమిత పరికరాలు

వినికిడిని కాపాడటానికి కొన్ని హెడ్‌ఫోన్లు బిల్టిన్‌గా వాల్యూమ్ పరిమితులతోనూ వస్తున్నాయి. వీటిల్లో సాధారణంగా సుమారు 85 డెసిబెల్స్ వాల్యూమ్ పరిమితి విధించి ఉంటుంది. పిల్లలకు, దీర్ఘకాలం వినికిడిని కాపాడుకోవాలనుకునేవారికివి బాగా ఉపయోగపడతాయి.

కరెంట్ అఫైర్స్

■ ప్రపంచ ఎన్‌జీఓ (నాన్ గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్) దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు?
(ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రభుత్వేతర సంస్థల కీలక సహకారాన్ని గుర్తించడమే లక్ష్యంగా ఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 2025లో 'ఎంపవరింగ్ గ్రాస్ రూట్స్ మూవ్‌మెంట్స్ ఫర్ ఏ సస్టెయినబుల్ ఫ్యూచర్' థీమ్‌తో ఈ దినోత్సవాన్ని నిర్వహించారు.) జ: ఫిబ్రవరి 27



మాదిరి ప్రశ్నలు

■ 2025 సంవత్సరానికి ఎస్ అండ్ పీ గ్లోబల్ సస్టెయినబిలిటీ ర్యాంకింగ్స్‌లో భారతదేశంలో అత్యధిక రేటింగ్ పొందిన బ్యాంకు ఏది? (వరుసగా మూడో ఏడాది దేశంలో సుస్థిరతలో అత్యధిక రేటింగ్ పొందిన బ్యాంకుగా ఇది నిలిచింది.) జ: యెస్ బ్యాంకు

మరింత సమాచారం

■ తెలంగాణ ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరం నుంచి అన్ని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, ఇతర బోర్డు అనుబంధ పాఠశాలల్లో ఎన్నో తరగతి విద్యార్థులకు తెలుగును తప్పనిసరి సబ్జెక్ట్‌గా చేసింది?
(2026-27 నుంచి ఇది 10వ తరగతి విద్యార్థులకు వర్తిస్తుంది.) జ: 9వ

అనంత విశ్వశోధనకు ఆధార జ్ఞానం!

విజ్ఞాన శాస్త్రం - స్వభావం, పరిధి

అర్థం: సైన్స్ అనే ఆంగ్లపదం సైన్షియా, సిరే అనే లాటిన్ పదాల నుంచి వచ్చింది. దీని అర్థం జ్ఞానం. జ్ఞానానికి సంబంధించిన ఏ అంశాన్నైనా శాస్త్రమే అని చెప్పాలి. ☛ ప్రపంచంలో జ్ఞానానికి సంబంధించి వివిధ పదాలు అమల్లో ఉన్నాయి.

ఉదా: ఇల్మ్ అనే అరబిక్, హిందీ పదానికి అర్థం జ్ఞానం. ☛ విద్ అనే సంస్కృత పదానికి అర్థం జ్ఞానం. ☛ భారతదేశంలో వేద అంటే జ్ఞానం అని అర్థం.

భావన: విజ్ఞాన శాస్త్రాన్ని సాధారణ దృక్పథంతో చూస్తే ఇది ప్రయోగాలు, పరిశీలనలకు పరిమితమైంది. ☛ విశాల దృక్పథంతో చూస్తే ఇది నిత్యజీవితంతో సంబంధం కలిగి ఉంది. ☛ విజ్ఞాన శాస్త్రం అనేది క్రమబద్ధం చేసి, వ్యవస్థీకరించిన జ్ఞానం. ☛ ఇదొక జీవన విధానం. ☛ ఇదొక వ్యవస్థీకృతమైన జ్ఞానం. ☛ ఇందులో సత్యాన్వేషణ, యధార్థాల ఆధారంగా జరిగే విషయ విపులీకరణం.

విజ్ఞాన శాస్త్రం నిర్వచనాలు:

కార్ల్‌పియర్ సన్: విజ్ఞానశాస్త్ర అన్వేషణకు యావత్ భౌతిక విశ్వం ముడి పదార్థం. **అర్హీనియస్:** విజ్ఞాన శాస్త్రం ఒక మాపనం. దీనివల్ల గణనలు, ఫలితాలు వస్తాయి

మెథడాలజీ
బయాలజీ

జేమ్స్ రాండీ: అతి జాగ్రత్త, క్రమశిక్షణతో తార్కికంగా ఈ అనంత విశ్వం గురించి ఏ ఒక్క జ్ఞానాన్ని పరీక్షల ద్వారా లభించిన ముఖ్య ఆధారాలతో జ్ఞానం తదుపరి సాక్ష్యాలతో అవసరమైతే ముందు ఏర్పడిన జ్ఞానరాశిలో మార్పులు తెచ్చి మరింత మెరుగుపరిచే విధానమే శాస్త్రం.

ఎ.డబ్ల్యూ. గ్రీన్: విజ్ఞాన శాస్త్రం ఒక పరిశోధన విధానం.

లెక్సికన్ వెబ్‌స్టర్ డిక్షనరీ: శాస్త్రం అనేది స్పష్టమైన పరిశీలనల ద్వారా, మార్పులు, స్థితులను నియంత్రించే నియమాల నిగమనం. దీన్ని నిగమన పద్ధతిలో పరీక్షించడం ద్వారా ఏర్పడే జ్ఞానమే విజ్ఞాన శాస్త్రం. **జేమ్స్ బి.కోనాంట్:** ప్రయోగాలు, పరిశీలన నుంచి వృద్ధి పొందిన తర్వాత ప్రయోగాత్మక పరీక్షలు, పరిశీలనకు ఫలితాన్నిస్తూ తమ మధ్య పరస్పర సంబంధాలున్న భావనల, భావనా పథకాల శ్రేణులే విజ్ఞాన శాస్త్రం.

పరిధి: విజ్ఞానశాస్త్రం సాపేక్ష సత్యం, మూర్త విషయాల గురించి మాత్రమే మాట్లాడుతుంది.

విజ్ఞాన శాస్త్రం - నిర్మాణం: హెన్రీ పాయింకర్, ఆర్.సి . శర్మ: ☛ వీరిద్దరూ విజ్ఞాన శాస్త్రాన్ని నిర్మాణ భవనంతో పోల్చారు. ☛ భవనానికి పునాది, భూమికి సమాంతరంగా ఉండే అడ్డుబీములు, భూమికి నిలువుగా స్తంభాలు ఉంటాయి. ☛ భవనానికి ప్రాథమిక ఆధారాలైన రాళ్లు, ఇసుక సిమెంట్ కంకరలతో శాస్త్ర భావనలను పోల్చారు. ☛ ఇంటి చట్రాన్ని శాస్త్ర సామాన్యీకరణాలు, సూత్రాలతో పోల్చారు. ☛ నిలువు స్తంభాలను సిద్ధాంతాలతో, అడ్డు స్తంభాలను పద్ధతులతో పోల్చారు.

మరిన్ని వివరాలు

జేమ్స్ బి. కోనాంట్: జ్ఞానశాస్త్ర భావనలు, భావనా పథకాల శ్రేణుల్లో నిర్మితమై ఉంటాయి. ☛ ప్రారంభంలో యథార్థాలు పోగు చేసి ఉంటాయి. ☛ ఆ యథార్థాల నుంచి అనేక భావనలు రూపొందుతాయి.

కాలాల గతులు మార్చే గమనాలు!

భూమి-చలనాలు

భూమికి రెండు రకాల చలనాలు ఉంటాయి. 1) భూభ్రమణం 2) భూపరిభ్రమణం.

1) భూభ్రమణం: భూమి తన అక్షాన్ని ఆధారంగా చేసుకుని పశ్చిమం నుంచి తూర్పునకు గంటకు సగటున 1610కి.మీ. వేగంతో తిరగడాన్ని 'భూభ్రమణం' అంటారు. భూమి ఒకసారి పూర్తి భ్రమణం చేసేందుకు పట్టే సమయం 23 గంటల 56 నిమిషాల 4.09 సెకన్లు. అంటే సరాసరిగా ఒక రోజు (24 గం.) సమయం పడుతుంది. భూమి భ్రమణ వేగం భూమధ్యరేఖ వద్ద గరిష్ఠంగా ఉంటుంది. భూభ్రమణ వేగం భూమధ్య రేఖ నుంచి ధ్రువాల వైపు వెళ్లేకొద్దీ శూన్యమవుతుంది. భూమి భ్రమణ సమయంలో స్థిరంగా ఉండే రెండు బిందువులను ఉత్తర ధ్రువం, దక్షిణ ధ్రువంగా గుర్తించారు.


భూపరిభ్రమణ ఫలితాలు
- పగలు, రాత్రి సమయాల్లో మార్పులు రావడానికి కారణమవుతుంది.
- సూర్యకిరణాల ప్రభావంలో హెచ్చుతగ్గులు.
- రుతువులు ఏర్పడతాయి.

అక్షం: భూమిపై ఉత్తర ధ్రువం, దక్షిణ ధ్రువాలను కలుపుతూ భూనాభి లేదా భూమి కేంద్రం మీదుగా గీసిన ఊహారేఖను 'అక్షం' అంటారు. భూమి అక్షం దాదాపుగా 23 1/2 డిగ్రీలు తూర్పు వైపు వంగి ఉంటుంది.

అక్ష ధ్రువత్వం: ఉత్తరాన స్థిరబిందువు అయిన ఉత్తర ధ్రువం పైభాగం ఎప్పుడూ ధ్రువనక్షత్రాన్ని సూచిస్తుంది. దాన్నే 'అక్ష ధ్రువత్వం' అంటారు.

సౌరదినం: ఏదైనా ఒక రేఖాంశాన్ని సూర్యుడు దాటిన సమయం నుంచి తిరిగి అదే రేఖాంశాన్ని సూర్యుడు దాటిన సమయం వరకు పట్టిన కాలాన్ని 'సౌర దినం' అంటారు.

ప్రకాశవృత్తం: భూమిలో సగభాగాన్ని సూర్యుడు ప్రకాశవంతంగా చేసే అంచును ప్రకాశ వృత్తం అంటారు. ఈ మహా వృత్తం భూమిపై సగభాగంలో వెలుతురు, సగభాగంలో చీకటి ఉండేలా విభజిస్తుంది.



విశ్వంలోని సౌరకుటుంబంలో జీవ సహిత గ్రహమైన భూమి స్థిరంగా ఉండదు. తన చుట్టూ తాను తిరుగుతూ, నిర్ణీత కక్ష్యలో సూర్యుడి చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఈ చలనాల కారణంగానే పగలు, రాత్రి, కాలాలు, రుతువులు మొదలైన సహజ మార్పులన్నీ సంభవిస్తుంటాయి. నిర్ణీత అవధుల్లో ఏర్పడే విషవత్తులు, పరిహేళి, అపహేళి, ఉత్తరాయణం, దక్షిణాయణం లాంటివన్నీ ఇందులో భాగమే. జీవజాలం పుట్టుక, మనుగడతోపాటు సకల ప్రకృతి నియమాలు, భూమిపై రకరకాల వాతావరణాలన్నీ వాటి ఫలితమే. భూమి చలనాల వల్ల సంభవించే ఈ నిరంతర, నిర్ణీత కాలావధి మార్పుల గురించి అభ్యర్థులకు అవగాహన ఉండాలి. భూ చలన వేగంలో వ్యత్యాసాలు, సూర్యచంద్రులతో ఒకే కక్ష్యలోకి భూమి వచ్చినప్పుడు ఏర్పడే గ్రహణాలు, వాటి ప్రభావాల గురించి తెలుసుకోవాలి.

2025 మెగా డీఎస్సీ
కంటెంట్ - సోషల్ స్టడీస్ - జాగ్రఫీ

2) భూపరిభ్రమణం: భూమి తన అక్షంపై తాను భ్రమిస్తూ నిర్దిష్ట కక్ష్యా మార్గంలో సూర్యుడి చుట్టూ తిరిగి రావడమే 'భూపరిభ్రమణం'. భూపరిభ్రమణానికి సరాసరిగా 365 రోజుల 6 గంటల 10 సెకన్లు పడుతుంది. దాన్ని సరాసరి 365 రోజులు లేదా ఒక ఏడాది గా లెక్కిస్తారు. దీన్నే 'సౌర సంవత్సరం' అంటారు. 365 రోజులు పోగా మిగిలిన 6 గంటలను నాలుగేళ్లకు ఒకసారి కలిపి 366 రోజులున్న లీపు సంవత్సరంగా పిలుస్తారు. లీపు సంవత్సరంలో వచ్చే అదనపు రోజును ఫిబ్రవరి నెలలో కలుపుతారు. భూమి సెకనుకు దాదాపుగా 30 కి.మీ.ల వేగంతో పరిభ్రమిస్తుంది. అంటే గంటకు 1,08,000 కి.మీ.

భూకక్ష్య: భూమి సూర్యుడి చుట్టూ తిరిగే ఒక నిర్దిష్ట మార్గాన్ని భూకక్ష్య అంటారు. ఇది కొంచెం దీర్ఘవృత్తాకారంలో ఉంటుంది. భూకక్ష్యపొడవు 965 మిలియన్ కి.మీ.లు.

పరిహేళి: భూమి, సూర్యుడికి మధ్య కనిష్ఠ దూరం ఏర్పడే సందర్భాన్ని 'పరిహేళి' అంటారు. ఆ సమయంలో భూమికి, సూర్యుడికి మధ్య కనిష్ఠ దూరం 147 మిలియన్ కి.మీ. ఉంటుంది. ఇది జనవరి 3న సంభవిస్తుంది. ఆ రోజు భూమి అత్యధిక సౌరపుటాన్ని గ్రహిస్తుంది. ఈ నెలలో భూగోళ సగటు ఉష్ణోగ్రతలు కూడా ఎక్కువగా ఉంటాయి.

మరిన్ని వివరాలు

✦ Pere అంటే దగ్గర, Helios అంటే సూర్యుడు అని అర్థం.

అపహేళి: భూమి, సూర్యుడికి మధ్య గరిష్ఠ దూరం ఏర్పడే సందర్భాన్ని 'అపహేళి' అంటారు. ఆ సమయంలో భూమి, సూర్యుడికి మధ్య గరిష్ఠ దూరం 152 మిలియన్ కి.మీ.లు. ఇది జులై 4న సంభవిస్తుంది. ఆరోజు భూమి అత్యల్ప సౌరపుటాన్ని గ్రహిస్తుంది. ఈ సందర్భంలో భూగోళ సగటు ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. ✦ Ape అంటే దూరం, Helios అంటే సూర్యుడు అని అర్థం.

విషవత్తులు: మార్చి 21, సెప్టెంబరు 23 తేదీల్లో సూర్యకిరణాలు భూమధ్యరేఖ వద్ద నిటారుగా పడతాయి. ఆ రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా పగలు, రాత్రి సమానంగా ఉంటాయి. ఈ రెండు తేదీలను 'విషవత్తులు' అంటారు. మార్చి 21న సంభవించే విషవత్తును 'వసంతకాల విషవత్తు', సెప్టెంబరు 23న సంభవించే విషవత్తును 'శరత్కాల విషవత్తు' అని అంటారు.

ఉత్తరాయణం: సూర్యుడు డిసెంబరు 22న, మకరరేఖ నుంచి జూన్ 21 నాటికి కర్కటరేఖకు ఉత్తరాభిముఖంగా ప్రయాణించి చేరతాడు. ఇలా సూర్యుడి ఉత్తరార్ధ గోళం ప్రయాణాన్ని 'ఉత్తరాయణం' అంటారు. ఇది 6 నెలలు ఉంటుంది.

> భూ పరిభ్రమణం, భూ భ్రమణం, భూమి అక్షం $23\ 1/2^{\circ}$ వంగి ఉండటం, భూమి వంపు వల్ల రుతువులు ఏర్పడుతున్నాయి.


దక్షిణాయణం: సూర్యుడు జూన్ 21 నాటికి కర్కటరేఖ నుంచి దక్షిణాభిముఖంగా ప్రయాణిస్తూ డిసెంబరు 22 నాటికి మకరరేఖకు చేరడాన్ని దక్షిణాయాణం అంటారు. ఇది 6 నెలలుఉంటుంది.

అయనాంతాలు: జూన్ 21: ఈ తేదీ నాటికి ఉత్తర ధ్రువం సూర్యుడి వైపు వాలి ఉంటుంది. సూర్యకిరణాలు ఉత్తరార్ధ గోళంలోని కర్కటరేఖపై నిటారుగా పడతాయి. ఇదే సమయంలో సూర్యకిరణాలు ఏటవాలుగా ధ్రువప్రాంతాలపై ప్రసరిస్తాయి. ఈ కారణంతో ఆర్కిటిక్ వలయం నుంచి ఉత్తర ధ్రువం వరకు పగటి కాలం నిరంతరంగా ఆరు నెలలు ఉంటుంది. అందువల్ల ఉత్తరార్ధ గోళంలో వేసవికాలం ఏర్పడుతుంది. దీనికి భిన్నంగా దక్షిణార్ధ గోళంలో చలి అధికంగా ఉంటూ పగటి సమయంగా కంటే రాత్రి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి దక్షిణార్ధ గోళంలో శీతాకాలం ఏర్పడుతుంది. భూమిపై ఉన్న ఈ స్థితినే 'వేసవి అయనాంతం' అంటారు.

డిసెంబరు 22: ఈ తేదీ నాటికి దక్షిణ ధ్రువం భూమి వైపు వంగి ఉంటుంది. ఈ సమయంలో సూర్యకిరణాలు దక్షిణార్ధ గోళంలోని మకర రేఖపై నిటారుగా పడుతూ దక్షిణ ధ్రువం వైపు ఏటవాలుగా ప్రసరిస్తాయి. అందువల్ల దక్షిణార్ధ గోళం ఎక్కువ భాగం కాంతిని పొందుతుంది. కాబట్టి దక్షిణార్ధ గోళంలో వేసవి కాలం ఏర్పడుతుంది. దీనికి భిన్నంగా ఉత్తరార్ధ గోళంలో పగటి సమయం తక్కువగా, రాత్రి అధికంగా ఏర్పడుతూ శీతాకాలం ఏర్పడుతుంది. భూమిపై ఈ స్థితిని 'శీతాకాల అయనాంతం' అంటారు.

భూభ్రమణ ఫలితాలు

★ పగలు, రాత్రి ఏర్పడతాయి. ★ సముద్రంలో పోటు, పాటులకు కారణం అవుతుంది. ★ దిక్కులు అనే భావనకు కూడా కారణమవుతుంది. ★ కొరియాలిస్ ప్రభావం ఏర్పడుతుంది. అంటే పవనాలు, సముద్ర ప్రవాహాలు ఉత్తరార్ధ గోళంలో కుడివైపు, దక్షిణార్ధ గోళంలో ఎడమవైపు వంగి ప్రయాణించడం. ★ కొరియాలిస్ ప్రభావాన్ని ఫెరల్స్ సూత్రం అంటారు. ★ కొరియాలిస్ ప్రభావం



భూమధ్య రేఖ నుంచి ధ్రువాల వైపు వెళ్లేకొద్దీ పెరుగుతుంది. ★ సమయం అనే భావనకు కూడా కారణమవుతుంది. ★ సూర్యుడు తూర్పున ఉదయించి, పడమర అస్తమించే భావనకు కూడా భూభ్రమణమే కారణం.



రచయిత: బండ్ల శ్రీధర్

ఓజోన్ రక్షణకు ప్రత్యేక ప్రోటోకాల్!



భూగోళంపై ఉండే సహజ గ్రీన్‌హౌస్ ప్రభావమే జీవరాశి ఉనికికి, పర్యావరణ వ్యవస్థల మనుగడకు కారణం. అయితే పారిశ్రామికీకరణ మొదలవడంతో ఈ సహజ కారక స్థితి గతి తప్పింది. భూ వాతావరణంలోని సగటు ఉష్ణోగ్రతలు పెరిగి శీతోష్ణస్థితి మార్పులతో పాటు సముద్ర మట్టాలు అధికమై దేశాలకు దేశాలే మునిగిపోయేంతగా ఊహకు అందని ప్రకృతి విపత్తులు ఎక్కువవుతున్నాయి. భూమిపై ప్రతిజీవికి, అన్ని దేశాలకు సమస్యగా మారిన ఈ భూతాపంపై ప్రపంచమంతా కలిసికట్టుగా పోరాడుతోంది. భూతాపానికి ప్రధాన కారణాలు, దానిని నిర్ధారించే కొలమానాలు, నివారణకు అంతర్జాతీయంగా కుదిరిన ఒప్పందాలు, ఏర్పాటైన వ్యవస్థల గురించి పోటీ పరీక్షార్థులకు స్థూల, శాస్త్రీయ అవగాహన ఉండాలి. పర్యావరణ పరిరక్షణ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్న భారతదేశం, భూతాపం తగ్గింపు కోసం తన వంతుగా చేసుకున్న ఏర్పాట్లు, చేస్తున్న ప్రయత్నాలను తెలుసుకోవాలి.

భూతాపం (గ్లోబల్ వార్మింగ్)

1. కింది వాటిలో ఏ కారకాల వల్ల భారతదేశం వాతావరణ మార్పులకు ఎక్కువగా గురవుతోంది?
   ఎ) అధిక పేదరికం
   బి) సహజ వనరులపై అధికంగా ఆధారపడటం
   సి) ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న వాతావరణం
   డి) జనాభా సాంద్రత
   ఇచ్చిన కోడ్‌ను ఉపయోగించి సరైన సమాధానాన్ని ఎంచుకోండి.
   1) ఎ, బి   2) బి, సి, డి
   3) ఎ, బి, సి   4) ఎ, బి, సి, డి

2. కింది వాటిలో హరిత భవనాల లక్ష్యం ఏమిటి?
   1) పునర్వినియోగపరచలేని వనరులపై డిమాండు పెంచడం, ఉపయోగంలో ఉన్నప్పుడు ఈ వనరుల వినియోగ సామర్థ్యాన్ని తగ్గించడం.
   2) అందుబాటులో ఉన్న వనరుల పునర్వినియోగం, రీసైక్లింగ్‌ను పెంచడం.
   3) పునరుత్పాదక వనరుల వినియోగం.
   4) పైవన్నీ.

3. ఇండియన్ నెట్‌వర్క్ ఫర్ క్లైమేట్ ఛేంజ్ ఎసెస్‌మెంట్(ఐఎన్‌సీసీఏ) కు సంబంధించి కింది ప్రకటనల్ని పరిగణించండి.
   ఎ) దీన్ని పర్యావరణం, అటవీ మంత్రిత్వ శాఖ 2009, అక్టోబరులో ప్రారంభించింది.
   బి) ఐఎన్‌సీసీఏ అనేది సైన్స్ - ఆధారిత విధాన రూపకల్పనను తీసుకురావడానికి ఉద్దేశించిన నెట్‌వర్క్ ఆధారిత ప్రోగ్రామ్.
   ఇచ్చిన ప్రకటనల్లో ఏది సరైంది?
   1) ఎ   2) బి
   3) ఎ, బి   4) ఏదీకాదు

4. నేషనల్ ఎడాప్టేషన్ ఫండ్ ఫర్ క్లైమేట్ ఛేంజ్ (ఎన్ఏఎఫ్‌సీసీ)కు సంబంధించి సరైన ప్రకటనల్ని ఎంపిక చేయండి.
   ఎ) ఇది 2015-16లో ఏర్పాటైన కేంద్ర ప్రాయోజిత పథకం.
   బి) వాతావరణ మార్పుల ప్రతికూల ప్రభావాలను తగ్గించే కాంక్రీట్ అనుసరణ కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడం ఎన్ఏఎఫ్‌సీసీ లక్ష్యం.
   సి) 'అగ్రికల్చరల్, ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ' అనేది ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన జాతీయ అమలు సంస్థ.
   ఇచ్చిన ప్రకటనల్లో ఏది సరైంది?
   1) ఎ, బి   2) ఎ, సి
   3) ఎ, బి, సి   4) బి

5. హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి సంబంధించి ఇచ్చిన ప్రకటనల్ని పరిగణించి, సరైనవి ఎంపిక చేయండి.
   ఎ) 2015లో నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ద్వారా ఫేమ్ (ఎఫ్ఏఎంఈ) ఇండియా పథకం రూపొందించారు.
   బి) ఫేమ్ పథకం ఫేజ్-1లో డిమాండ్ సృష్టి, ఛార్జింగ్ వసతులు మాత్రమే ఏర్పాటు చేశారు.
   1) ఎ   2) బి
   3) ఎ, బి   4) ఏదీకాదు

6. వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయ ఆవిష్కరణల (ఎన్ఐసీఆర్ఏ- నిక్రా)కు సంబంధించిన కింది ప్రకటనల్ని పరిగణించండి.
   ఎ) దీన్ని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ప్రారంభించింది.
   బి) ఈ ప్రాజెక్ట్ వ్యూహాత్మక పరిశోధన, సాంకేతిక ప్రదర్శన, సామర్థ్యం పెంపుదల, ప్రాయోజిత పోటీ గ్రాంట్లు అనే నాలుగు భాగాలుగా ఉంటుంది.
   ఇచ్చిన ప్రకటనల్లో ఏది సరైంది?
   1) ఎ   2) బి
   3) ఎ, బి   4) ఏదీకాదు

7. 'బచత్ ల్యాంప్ యోజన' కార్యక్రమాన్ని ఎవరు ప్రవేశపెట్టారు?
   1) బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్
   2) కొత్త, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ
   3) బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ
   4) ఏదీకాదు

8. గ్రీన్ రేటింగ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హ్యాబిటాట్ అసెస్‌మెంట్ (GRIHA) కు సంబంధించి కింది ప్రకటనల్ని పరిగణించండి.
   ఎ) GRIHA ను 'ది ఎనర్జీ అండ్ రిసోర్స్ ఇన్‌స్టిట్యూట్ రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం, ఇంధన మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి.
   బి) దేశంలో హరిత భవనాలు నిర్వహించడం దీని లక్ష్యం.
   ఇచ్చిన ప్రకటనల్లో ఏది సరైంది?
   1) ఎ   2) బి
   3) ఎ, బి   4) ఏదీకాదు

పర్యావరణ అంశాలు



9. గ్రీన్ ఇండియా మిషన్ గురించి కింది ప్రకటనల్ని పరిశీలించండి.
   ఎ) ఇది జీవవైవిధ్యం, జలసంబంధ సేవలు, గృహాల అటవీ ఆధారిత జీవనోపాధి ఆదాయంతో సహా పర్యావరణ వ్యవస్థ సేవలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది.
   బి) గ్రామసభ, గ్రామసభ నిర్దేశించిన కమిటీలు గ్రామ స్థాయిలో అమలును పర్యవేక్షిస్తాయి.
   ఇచ్చిన ప్రకటనల్లో ఏది సరైంది?
   1) ఎ   2) బి
   3) ఎ, బి   4) ఏదీకాదు

10. 'పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ'కు సంబంధించి కింది ప్రకటనల్ని పరిగణించండి.
   ఎ) మంత్రిత్వ శాఖకు సంబంధించిన ప్రాథమిక ఆందోళనలు, దేశ సహజవనరుల పరిరక్షణకు సంబంధించిన విధానాలు, కార్యక్రమాల అమలు.
   బి) అటవీ నిర్మూలన, క్షీణించిన అటవీ ప్రాంతాల పునరుత్పత్తి ఈ మంత్రిత్వ శాఖ విస్తృత లక్ష్యం.
   సి) 'దక్షిణాసియా సహకార పర్యావరణ కార్యక్రమం' కోసం మంత్రిత్వ శాఖ దేశంలో నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది.
   ఇచ్చిన ప్రకటనల్లో ఏది సరైంది?
   1) ఎ, బి   2) బి, సి
   3) ఎ   4) ఎ, బి, సి

11. ప్రపంచ ఓజోన్ దినోత్సవానికి సంబంధించి, కింది ప్రకటనల్ని పరిగణించండి.
   ఎ) మాంట్రియల్ ప్రోటోకాల్ ఓజోన్ పొరను క్షీణింపజేసే పదార్థాలతో సంబంధం కలిగి ఉంటుంది.
   బి) ఓజోన్ పొర రక్షణ కోసం జరిగిన మొదటి సమావేశం 'వియన్నా కన్వెన్షన్'.
   1) ఎ   2) బి
   3) ఎ, బి   4) ఏదీకాదు

12. శాస్త్రవేత్తలు గతంలో ఉన్న భూతాపం, శీతోష్ణస్థితి మార్పు సంఘటనల్ని నిర్ణయించడంలో కింది వాటిలో సహాయపడేవి?
   ఎ) మంచు కేంద్ర భాగ విశ్లేషణ
   బి) వృక్షాల వార్షిక వలయాలు
   సి) అవక్షేప విశ్లేషణ   డి) కార్బన్ డేటింగ్
   ఇ) పరాగరేణువుల విశ్లేషణ
   1) ఎ, బి   2) ఎ, సి   3) సి   4) పైవన్నీ

13. కింది వాటిలో ఏ పరిస్థితులు భూతాపం ప్రభావాన్ని సూచిస్తాయి?
   ఎ) హిమానీనదాలు కరగడం
   బి) సముద్ర మట్టం పెరగడం
   సి) వాతావరణ పరిస్థితుల్లో మార్పులు
   డి) ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుదల
   1) ఎ, బి   2) ఎ, బి, సి
   3) బి, సి, డి   4) పైవన్నీ

14. గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ గురించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) దీన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. సహజ గ్రీన్‌హౌస్ ప్రభావం, వృద్ధి చెందిన గ్రీన్‌హౌస్ ప్రభావం.
   బి) సహజ గ్రీన్‌హౌస్ ప్రభావం భూమిపై జీవానికి ప్రాణాధారం.
   సి) బ్రిటిష్ జియోలాజికల్ సర్వే ప్రకారం సహజ గ్రీన్ హౌస్ ప్రభావం లేనప్పుడు భూమి ఉపరితలం సగటు ఉష్ణోగ్రత దాదాపు -20 డిగ్రీల సెంటీగ్రేడ్ చల్లగా ఉంటుంది.
   ఇచ్చిన ప్రకటనల్లో ఏది సరైంది?
   1) ఎ, బి   2) ఎ, సి
   3) సి   4) పైవన్నీ

15. కార్బన్ ఫుట్‌ప్రింట్ అనేది ఒక వ్యక్తి, ఒక సంస్థ, ఒక ఉత్పత్తి లేదా దేశం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా విడుదల చేసిన మొత్తం గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను కొలుస్తుంది. అయితే ప్రపంచంలో అత్యధిక - కార్బన్ పాదముద్ర ఉన్న మొదటి నాలుగు దేశాలు వరుసగా?
   ఎ) అమెరికా   బి) చైనా
   సి) ఇండియా   డి) రష్యా
   1) ఎ, బి, సి, డి   2) బి, ఎ, సి, డి
   3) డి, బి, ఎ, సి   4) సి, ఎ, బి, డి

16. కింది వాటిలో సరైన జతలను గుర్తించండి.
   ఎ) క్యోటో ప్రోటోకాల్ (1997) - కార్బన్ ఉద్గారాల తగ్గింపునకు సంబంధించింది.
   బి) మాంట్రియల్ ప్రోటోకాల్ (1987) - ఓజోన్ క్షీణతకు సంబంధించింది.
   సి) హెల్సింకి ప్రోటోకాల్ (1985) - సల్ఫర్ ఉద్గారాల తగ్గింపు కోసం.
   డి) గోథెన్‌బర్గ్ ప్రోటోకాల్ - ఎసిడిఫికేషన్, యుట్రోఫికేషన్ గ్రౌండ్ లెవెల్ ఓజోన్ తగ్గింపునకు సంబంధించింది.
   ఇచ్చిన జతల్లో ఏది సరైంది?
   1) ఎ, బి   2) బి, సి
   3) సి, డి   4) పైవన్నీ

17. గ్రీన్‌హౌస్ ఉద్గారాలను తగ్గించి ప్రపంచ ఉష్ణోగ్రతను పరిమితం చేసే లక్ష్యంతో UNFCCC ఏర్పాటైంది. దీని కాలక్రమానికి సంబంధించి సరైన వాటిని గుర్తించండి.
   ఎ) **1992:** రియోలో జరిగిన ఎర్త్ సమ్మిట్‌లో ఆమోదం పొందింది.
   బి) **1994:** UNFCCC మార్చి 21న అమల్లోకి వచ్చింది.
   సి) **1995:** COP మొదటి సమావేశం బెర్లిన్‌లో జరిగింది.
   డి) **1997:** క్యోటో ప్రోటోకాల్ జపాన్‌లోని కాప్-3వ సమావేశంలో ఆమోదం పొంది 2005, ఫిబ్రవరిలో అమల్లోకి వచ్చింది.
   కోడ్ సాయంతో సరైన సమాధానాన్ని ఎంచుకోండి.
   1) ఎ, బి   2) ఎ, బి, సి
   3) ఎ, బి, డి   4) ఎ, బి, సి, డి

18. ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఇటీవలి నివేదిక ప్రకారం ప్యారిస్ ఒప్పంద కట్టుబాటుకు లోబడి తన అభివృద్ధిని కొనసాగిస్తోన్న ఏకైక జీ20 దేశం?
   1) ఇండియా   2) బ్రెజిల్
   3) ఆస్ట్రేలియా   4) దక్షిణాఫ్రికా

19. క్యోటో ప్రోటోకాల్ బైండింగ్ కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలను అంతర్జాతీయంగా ఏర్పాటు చేసింది. అయితే ఈ ప్రోటోకాల్‌కు సంబంధించి మొదటి నిబద్ధత కాలం ఏది?
   1) 2005 - 10   2) 2008 - 12
   3) 2013 - 20   4) 2010 - 15

సమాధానాలు

1-4; 2-2; 3-3; 4-1; 5-4; 6-3; 7-3; 8-2; 9-3; 10-4; 11-3; 12-4; 13-4; 14-4; 15-2; 16-4; 17-4; 18-1; 19-2.

బీఆర్‌ఓ వ్యవస్థాపక దినోత్సవం

మే 7 | చరిత్రలో ఈనాడు

బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌ఓ) స్థాపనకు గుర్తుగా ఏటా మన దేశంలో మే 7న బీఆర్‌ఓ వ్యవస్థాపక దినోత్సవాన్ని (BRO Raising Day) నిర్వహిస్తారు. ఇది భారతదేశ సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, అనుసంధానానికి కృషి చేసే ప్రభుత్వ రంగ సంస్థ. దేశ రక్షణలో బీఆర్‌ఓ పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

- అత్యంత సవాళ్లతో కూడిన ప్రాంతాలకు సైతం సాయుధ దళాలు చేరుకునేలా రోడ్లు, వంతెనలు, సొరంగాలు, ఎయిర్ ఫీల్డ్స్, మెరైన్ వర్క్‌లను నిర్మించడంతోపాటు, నిర్వహించడం బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ ప్రత్యేకత.
- బీఆర్‌ఓ 19 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలతో సహా పొరుగు దేశాలైన అఫ్గనిస్థాన్, భూటాన్, మయన్మార్, తజికిస్థాన్, శ్రీలంకలో మౌలిక సదుపాయాల కార్యక్రమాలను చేపట్టింది. ఇది ఇప్పటివరకు 62,906 కి.మీ. పైగా రోడ్లు, 1056 వంతెనలు, 6 సొరంగాలు, 21 ఎయిర్‌ఫీల్డ్స్‌ను నిర్మించింది.
- బీఆర్‌ఓ రక్షణ మంత్రిత్వ శాఖ అధీనంలో ఉంటుంది. ప్రస్తుతం లెఫ్టినెంట్ జనరల్ రఘుశ్రీనివాసన్ డైరెక్టర్ జనరల్‌గా (2023, సెప్టెంబరు 30 నుంచి) వ్యవహరిస్తున్నారు.

బీఆర్‌ఓ నిర్మించిన ముఖ్య ప్రాజెక్టులు:

ఉమ్లింగ్ లా: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన హైవేగా గుర్తింపు పొందింది (19,024 అడుగులు). తూర్పు లద్దాఖ్‌లో ఉంది.

అటల్ సొరంగం: ప్రపంచంలోనే అతి పొడవైన (9.02 కి.మీ.), ఎత్తయిన (3,100 మీ.) సొరంగం. హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలీ - లాహౌల్, స్పితి లోయను కలుపుతుంది.

సేలా సొరంగం: సముద్రమట్టానికి 13,000 అడుగుల ఎత్తులో నిర్మించారు. అసోంలోని తేజ్‌పూర్, అరుణాచల్ ప్రదేశ్‌లోని కమెంగ్ జిల్లాను కలుపుతూ నిర్మించారు.

☛ భారతసైన్య వ్యూహాత్మక అవసరాలను తీర్చడంలో ఇది ముందుంటుంది. అంతేకాక 2004 తమిళనాడు సునామీ, 2005లో కశ్మీర్ భూకంపం, 2010లో లద్దాఖ్‌లో ఆకస్మిక వరదలు లాంటి విపత్తుల తర్వాత పునర్నిర్మాణ సమయంలో బీఆర్‌ఓ కీలకంగా వ్యవహరించింది.

చారిత్రక నేపథ్యం:

దేశంలోని ఉత్తర, ఈశాన్య సరిహద్దు ప్రాంతాల్లో రోడ్ల నెట్‌వర్క్‌ను వేగంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో నాటి జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం 1960, మే 7న బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌ఓ)ను ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఏటా ఆ తేదీన బీఆర్‌ఓ వ్యవస్థాపక దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

దీని నినాదం: 'శ్రమేణ సర్వం సాధ్యం' (కష్టపడి పనిచేస్తే దేన్నైనా సాధించొచ్చు)

श्रमेण सर्वम् साध्यम्

సమాధాన సాధనకు దత్తాంశ విశ్లేషణే కీలకం

ఒక డేటాను సులభరీతిలో అర్థం చేసుకోవడానికి, దాని నుంచి మనకు అవసరమైన సమాచారాన్ని గ్రహించడంలో దత్తాంశ విశ్లేషణ ఉపయోగపడుతుంది. దత్తాంశంలోని అన్ని విషయాలను అందరికీ అర్థమయ్యేలా సంక్షిప్త పరిచి, దాన్ని అధ్యయనం చేసి, కావాల్సిన సమాచారాన్ని తెలుసుకోవడమే దత్తాంశ విశ్లేషణ. పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగం నుంచి దత్తాంశ విశ్లేషణలో భాగంగా బార్‌గ్రాఫ్, లైన్ గ్రాఫ్, టేబుల్ ఛార్ట్, పై ఛార్ట్ లాంటివి ఇచ్చి, ఆ సమాచారం ఆధారంగా సమాధానాలు కనుక్కోమంటారు. గణిత పరిజ్ఞానం, దత్తాంశాన్ని విశ్లేషించగల సామర్థ్యం ఉంటే ఈ రకమైన ప్రశ్నలకు జవాబులు కనిపెట్టడం సులువే.




దత్తాంశ విశ్లేషణ

పోటీ పరీక్షల ప్రత్యేకం | రీజనింగ్

సూచన (ప్ర. 1 – 3): కింద ఇచ్చిన బార్‌గ్రాఫ్‌ను అధ్యయనం చేసి ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

2024లో ఒక కంపెనీ చేసిన మొత్తం వ్యయాల శాతాన్ని బార్‌గ్రాఫ్ చూపుతుంది.



1. రవాణా ఖర్చు కంటే రుణాలపై వడ్డీలు ఎంత శాతం ఎక్కువ?
1) 10 శాతం 2) 30 శాతం
3) 20 శాతం 4) 40 శాతం

సాధన: మొత్తం వ్యయం రూ. x అనుకుందాం

రుణాలపై వడ్డీ ఖర్చు = రూ. (17.5% of x)

$= \frac{17.5}{100} \times x$

రవాణా ఖర్చు = రూ. (12.5% of x)

$= రూ. \left(\frac{12.5}{100} x\right)$

రెండు ఖర్చుల మధ్య వ్యత్యాసం

$= రూ. \left(\frac{17.5x}{100} - \frac{12.5x}{100}\right) = \left(\frac{5x}{100}\right)$

$శాతం = \left[\frac{\frac{5x}{100}}{\frac{12.5x}{100}} \times 100\right] = 40\%$

సమాధానం: 4

2. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రవాణాల మొత్తం ఖర్చు, పన్నులు, రుణాలపై వడ్డీల మొత్తం ఖర్చులు ఏ నిష్పత్తిలో ఉంటాయి?
1) 13 : 11 2) 9 : 7 3) 5 : 4 4) 8 : 7

సాధన: మొత్తం ఖర్చు రూ. x అనుకుందాం.

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రవాణాపై మొత్తం ఖర్చు

= రూ. [(20 + 12.5)% of x] = రూ. [32.5% of x]

$= రూ. \left[\frac{32.5}{100} x\right]$

పన్నులు, రుణాల వడ్డీలపై మొత్తం ఖర్చు

= రూ. [(10 + 17.5))% of x]

$= రూ. (27.5\% \text{ of } x) = \frac{27.5}{100} x$

$నిష్పత్తి = \frac{\frac{32.5x}{100}}{\frac{27.5x}{100}} = 13 : 11$

సమాధానం: 1

3. ప్రకటనలపై ఖర్చు రూ. 2.10 కోట్లు. అయితే రవాణా, పన్నుల ఖర్చుల్లో తేడా ఎంత? (రూ. లలో)
1) 92 లక్షలు 2) 65 లక్షలు 3) 35 లక్షలు 4) ఏదీకాదు

సాధన: మొత్తం ఖర్చు x కోట్లు అనుకుందాం.

$15\% \text{ of } x = 2.10 \Rightarrow \frac{15}{100} \times x = 2.10$

$x = \frac{2.10 \times 100}{15} \Rightarrow x = 14$

మొత్తం వ్యయం = రూ. 14 కోట్లు

రవాణా ఖర్చు, పన్నుల మధ్య వ్యత్యాసం


రూ. (12.5 – 10) of x 14] కోట్లు

రూ. (2.5% of 14) = రూ. 0.35 కోట్లు = రూ. 35 లక్షలు

సమాధానం: 3

సూచన (ప్ర. 4 – 6): కింది గ్రాఫ్‌ను అధ్యయనం చేసి, దిగువ ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

MBA ప్రవేశపరీక్ష కోసం వివిధ సంస్థల నుంచి నమోదు చేసుకున్న అభ్యర్థుల శాతాలను ఇచ్చారు.



4. T సంస్థలో నమోదు చేసుకున్న విద్యార్థుల్లో ఎంత శాతం మంది ఆ సంస్థ నుంచి ఉత్తీర్ణులయ్యారు?
1) 80 శాతం 2) 75 శాతం
3) 62.5 శాతం 4) 50 శాతం

సాధన: $శాతం = \left(\frac{9\% \text{ of } 5700}{8\% \text{ of } 8550} \times 100\right)\%$

$= \frac{9 \times 5700}{8 \times 8550} \times 100 = 75\%$

సమాధానం: 2

5. P సంస్థలో నమోదైన విద్యార్థులు ఏ నిష్పత్తిలో ఉత్తీర్ణులయ్యారు?
1) 6 : 11 2) 14 : 17
3) 9 : 17 4) 9 : 11

సాధన: $శాతం = \left(\frac{18\% \text{ of } 5700}{22\% \text{ of } 8550}\right)$

$= \left(\frac{18 \times 5700}{22 \times 8550}\right) = \frac{6}{11}$

సమాధానం: 1

6. Q, R సంస్థల నుంచి నమోదు చేసుకున్న మొత్తం విద్యార్థుల్లో ఎంత శాతం మంది పాసయ్యారు?
1) 65 శాతం 2) 80 శాతం
3) 74 శాతం 4) 68 శాతం

సాధన: Q, R సంస్థల్లో కలిపి పాసైన వారి సంఖ్య

= (13% + 17%) of 5700

Q, R సంస్థల్లో కలిపి నమోదు చేసుకున్న వారి సంఖ్య

= (15% + 10%) of 8550)

= (25% of 8550)

$శాతం = \left(\frac{30\% \text{ of } 5700}{25\% \text{ of } 8550} \times 100\right)\%$

$= \frac{30 \times 5700}{25 \times 8550} \times 100 = 80\%$

సమాధానం: 2



రచయిత
బూసర గణేష్, విషయ నిపుణులు

Word of the Day

642

Thwart

Telugu meaning: అడ్డుకొను, నిరోధించు

English meaning: The word thwart (థ్వార్ట్) is a verb that describes preventing someone from accomplishing something or opposing successfully.

Synonyms: Hinder, Obstruct

Antonyms: Assist, Support

Usage: **1.** The security team managed to thwart the planned cyber-attack on the company's database.

2. The efforts to move the project further were thwarted by constant delays and budget issues.

కరెంట్ అఫైర్స్



ఐడబ్ల్యూఎఫ్ ప్రపంచ యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత కుర్రాడు పర్వ్ చౌదరి కాంస్యం నెగ్గాడు. 2025, మే 5న లిమా (పెరూ)లో జరిగిన యూత్ బాలుర 96 కేజీల విభాగంలో అతడు స్నాచ్‌లో 140 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 175 కేజీలు ఎత్తాడు. మొత్తంగా 315 కేజీలు లిఫ్ట్ చేసి మూడో స్థానంలో నిలిచాడు.

పాత్రికేయ రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే పులిట్జర్ పురస్కారాలను 2025, మే 5న ప్రకటించారు. న్యూయార్క్ టైమ్స్‌కు నాలుగు, న్యూయార్కర్‌కు మూడు పురస్కారాలు లభించాయి. పులిట్జర్ ప్రతిష్ఠాత్మక పబ్లిక్ సర్వీస్ మెడల్ వరుసగా రెండోసారి 'ప్రో పబ్లికా'కు దక్కింది.

- పులిట్జర్ సాహిత్య పురస్కారాన్ని పెర్సీవల్ ఎవరెట్ రాసిన 'జేమ్స్' పుస్తకానికి ప్రకటించారు.



అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) బోర్డులో భారత్ తరపున తాత్కాలిక నామినీ డైరెక్టర్‌గా పరమేశ్వరన్ అయ్యర్‌ను ప్రభుత్వం 2025, మే 5న నియమించింది. ప్రస్తుతం ఆయన ప్రపంచ బ్యాంక్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు.

అమెరికాలోని దక్షిణ టెక్సాస్‌లో ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ కంపెనీ ఉన్న ప్రాంతాన్ని అధికారికంగా ఒక నగరంగా ప్రకటించారు. దీనికి స్టార్‌బేస్ అని పేరు పెట్టారు. దీన్ని లాంఛనంగా నగరంగా గుర్తించడానికి తాజాగా స్థానికంగా ఓటింగ్ నిర్వహించారు. దీనికి అనుకూలంగా 212 ఓట్లు, వ్యతిరేకంగా 6 ఓట్లు వచ్చాయి.


మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - జాగ్రఫీ

తుపానులు

బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో ఏర్పడే ఉష్ణమండల తుపానులు చుట్టచుట్టుకుని ఉన్న పాములా ఉంటాయి.

- హెన్రీ పెడింగ్టన్ అనే శాస్త్రవేత్త సైక్లోన్ అనే పదాన్ని మొదటిసారిగా ఉపయోగించాడు.
- సైక్లోన్ అనే పదం 'కైక్లోస్' అనే గ్రీకు పదం నుంచి ఉద్భవించింది. ఈ పదానికి అర్థం 'చుట్టలు చుట్టుకొని ఉన్న పాము'.
- అల్పపీడనం గల ప్రదేశాల్లో సుడిగాలి వల్ల వాతావరణంలో కలిగే మార్పులనే తుపాను అంటారు.



చక్రవాతాలు – రకాలు

ప్రాంతాన్ని బట్టి చక్రవాతాలు రెండు రకాలు. అవి:
1. సమశీతోష్ణ మండల చక్రవాతాలు 2. ఆయనరేఖా మండల చక్రవాతాలు

హరికేన్ లక్షణాలు, ఆయనరేఖా అలజడులు - రకాలు, వివిధ ప్రాంతాలు - తుపానుల పేర్లు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Posts In NLC

Neyveli Lignite Corporation Limited (NLC), Tamil Nadu, is inviting applications from eligible candidates to recruit Junior Overman and Mining Sirdar posts. The total no. of posts is 171. The application fee is Rs.595. Eligible candidates can apply online before 14 May 2025.

PGIMER, Chandigarh

Punjab State, Post Graduate Institute of Medical Education and Research (PGIMER), Chandigarh, invites applications for the recruitment of Senior Residents, Officer posts on a contractual basis. The total no. of posts is 160. The application fee is Rs.800. The last date for online applications is 18 May 2025.

Did You Apply..?

Today (May 7) is the last date for the following jobs/ Admissions

☛ 15 Executive posts in NTPC. ***Qualification:*** Master's degree.

☛ 16 Technician posts in HAL, Hyderabad. ***Qualification:*** Diploma.

☛ Assistant Professor posts in AIIMS-Bhubaneswar. ***Eligibility:*** MD/MS.

☛ National Eligibility cum Entrance Test (NEET)-PG 2025

For more information and other notifications - scan QR code

మెగా డీఎస్సీ 2025 ప్రత్యేకం

సోషల్ స్టడీస్ - హిస్టరీ

సింధూ నాగరికత

1. సింధూ నాగరికత తవ్వకాల్లో మొట్టమొదట బయటపడిన నగరం ఏది?
1) హరప్పా 2) ధోలవీర
3) మొహెంజొదారో 4) చన్హుదారో

2. సింధూ నాగరికతకు హరప్పా నాగరికత అని పేరు పెట్టినవారెవరు?
1) దయారాం సాహ్ని 2) సర్ జాన్ మార్షల్
3) ఆర్.డి.బెనర్జీ 4) ఎస్.ఆర్.రావు

3. కింది వాటిలో దక్షిణ భారతదేశానికి దగ్గరగా ఉన్న సింధూ నాగరికత పట్టణం ఏది?
1) దైమాబాద్ 2) అలంగీర్‌పూర్
3) రోపార్ 4) భగత్రావ్

4. ఇళ్ల నిర్మాణంలో ఇటుకల పేర్పివేత (ఇంగ్లిష్ బాండింగ్) విధానాన్ని తొలిసారిగా ఏ నాగరికత ప్రజలు ప్రవేశపెట్టారు?
1) మెసపటోమియా 2) హరప్పా
3) ఈజిప్ట్ 4) గ్రీకు

5. సింధూ నాగరికత నగరాల్లో కోటగోడ లేని నగరం?
1) లోథాల్ 2) బన్వాలీ
3) చన్హుదారో 4) కాళీభంగన్

6. కింది వాటిలో సింధూ ప్రజలకు తెలియని జంతువు ఏది?
1) గుర్రం 2) మేక
3) ఏనుగు 4) గేదె

7. హరప్పా నాగరికత ప్రజలు ఏ ప్రాంతం నుంచి వెండిని దిగుమతి చేసుకునేవారు?
1) ఇరాన్ 2) అఫ్గనిస్థాన్
3) బహ్రెయిన్ 4) రోమ్

8. సింధూ ప్రజల భాష - సంస్కృతం అని పేర్కొన్న చరిత్రకారుడు ఎవరు?
1) ఐరావతం మహదేవన్
2) మధుసూదన్ మిశ్రా 3) నట్వర్ ఝా
4) ఆర్.సి.మజుందార్

9. హరప్పా నాగరికతకు చెందిన లోథాల్ పట్టణం ఎక్కడ ఉంది?
1) రాజస్థాన్ 2) గుజరాత్
3) పంజాబ్ 4) హరియాణా

10. ఏ సింధూ నాగరికత ప్రాంతానికి నల్లని గాజులు (Black Bangles) అని పేరు?
1) రంగపూర్ 2) అలంగీర్‌పూర్
3) కాళీభంగన్ 4) బన్వాలీ

11. 2021లో యునెస్కో ఏ హరప్పా పట్టణాన్ని హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది?
1) మాండా 2) ధోలవీర
3) కోట్‌డిజి 4) రోపార్

12. కింది ఏ హరప్పా పట్టణంలో మొదటి ఖగోళ పరిశోధనశాల (Astronomical Observatory)ను కనుక్కున్నారు?
1) రోపార్ 2) లోథాల్
3) ధోలవీర 4) ఏదీకాదు

13. కింది వాటిని జతపరచండి.

a. మొహెంజొదారో	i. ధాన్యాగారాలు
b. హరప్పా	ii. రేవు పట్టణం
c. కాళీభంగన్	iii. నాగలి గుర్తులు
d. లోథాల్	iv. మహా స్నానవాటిక

1) a-iv, b-i, c-iii, d-ii
2) a-iii, b-ii, c-iv, d-i
3) a-ii, b-iii, c-i, d-iv
4) a-i, b-iv, c-ii, d-iii

14. సింధూ ప్రజలు ఎవరిని పూజించేవారు?
1) విష్ణు 2) పశుపతి 3) ఇంద్ర 4) బ్రహ్మ

15. కింది వారిలో సింధూ నాగరికతతో సంబంధం ఉన్న పరిశోధకులు ఎవరు?
1) లార్డ్ మాలీ 2) దయారాం సాహ్నీ
3) వి.ఎస్.అగర్వాల్ 4) ఎ.ఎల్.బాషమ్

16. నాట్యం చేస్తున్న స్త్రీ కాంస్య ప్రతిమ లభించిన ప్రాంతం ఏది?
1) హరప్పా 2) రోపార్
3) మొహెంజొదారో 4) రంగపూర్

17. సింధూ నాగరికత ఏ యుగానికి చెందింది?
1) ప్రాచీన శిలాయుగం 2) మధ్య శిలాయుగం
3) నవీన శిలాయుగం 4) తామ్ర శిలాయుగం

18. లోథాల్ ఓడరేవు ఏ రెండు నదుల మధ్య కేంద్రీకృతమై ఉంది?
1) రావి - బియాస్ 2) సింధు - జీలం
3) యమున - గోగ్ర 4) బొగావో - సబర్మతి

19. సింధూ నాగరికత తవ్వకాల్లో ఏ పంట అవశేషాలు లభించలేదు?
1) వరి 2) గోధుమ
3) చెరకు 4) బార్లీ

20. సింధూ నాగరికత కాలంలో కొలతలు ఏ పద్ధతిలో ఉండేవి?
1) దశాంశ పద్ధతి 2) ఏకాంశ పద్ధతి
3) ద్వి దశాంశ పద్ధతి 4) పైవేవీ కావు

21. సింధూ ప్రజలకు తెలియని లోహం?
1) రాగి 2) కంచు
3) ఇనుము 4) ఏదీ కాదు

22. సింధూ నాగరికత పట్టణాల్లోని ధోలవీర కింది వాటిలో దేనికి ప్రసిద్ధి?
1) పశుపతి ముద్ర 2) సముద్రతీర ఓడరేవు
3) నీటి సంరక్షణ
4) కుండల తయారీ

సమాధానాల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

రచయిత: పుట్టా ఓబులేసు